వాహిని (గత వారంరోజుల్లో విశేషాలు)
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
శ్రీకాకుళం
: fb.com/vaartha Digital
Published from Srikakulam ,Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem
4-8-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 185 పేజీలు: 16 వెల: 6.50

అమెరికా, ఇరాన్ మధ్య నేటి నుంచి చర్చలు

కోర్టుల్లో 5.64 కోట్ల కేసులు పెండింగ్

5లో

నీటి ఎద్దడి రానివ్వకండి

రిజర్వాయర్లలో నీటి లభ్యత ఎప్పటికప్పుడు అంచనా వేయండి

రవాణాశాఖలో అనవసర నిబంధనలు తొలగించండి

పశుగ్రాసం కొరత రాకుండా చర్యలు

ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు

సోమవారం అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

విజయవాడ, ఆగస్టు 3,ప్రభాతవార్తప్రతినిధి: ఎల్ నినో పరిస్థితుల కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మంచినీటి ఎద్దడి సమస్యపై దృష్టిపెట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులను, రిజర్వాయర్లలో, నీటి వనరుల్లో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు అంచనా వేసుకుంటూ మంచినీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్లో సోమవారం వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఎగువన వర్షాలు కురుస్తున్నందున్న కృష్ణాబేసిన్‌లో నీటి లభ్యత పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయని అధికారులు వివరించారు. కృష్ణానదిలో కొద్ది రోజులుగా ప్రవాహాలు మొదలైనట్లు వివరించారు. అలాగే గోదావరిలో వరద పరిస్థితిని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. కృష్ణా బేసిన్లో ఎగువ నుంచి వచ్చే వరదను సద్వినియోగం చేసుకునేలా నీటి నిర్వహణ చేపట్టాలని సీఎం ఆదేశించారు. వర్షాభావం వల్ల రానున్న రోజుల్లో పశుగ్రాసం కొరత వచ్చే అవకాశం ఉందని, దీనికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో తరుచూ మంచినీటి పరీక్షలు జరపాలని... ల్యాబ్ టెస్టుల నివేదికలను విడుదల చేయాలని సూచించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి అంగన్వాడీ కేంద్రాలను తనిఖీలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రవాణ శాఖలో పూర్తి స్థాయి టెక్నాలజీ వినియోగం, అనవసర నిబంధనల తొలగింపు వంటి అంశాలకు తీసుకుంటున్న చర్యలను సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. 24 గంటల్లో డీమ్డ్ రిజిస్ట్రేషన్ విధానం, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్, ఫారం5తీ వంటి పరీక్షలను తొలగించడం వంటి చర్యల ద్వారా అవినీతిని తగ్గించడం, సులభతర సేవలను అందించే అవకాశం కలుగుతుందని అధికారులు చెప్పారు. దశలవారీగా రవాణా శాఖలో ఈ సంస్కరణలు చేపట్టేలా తాము ప్రణాళికను సిద్ధం చేశామని తెలిపారు. వీలైనంత మేరకు అనవసర నిబంధనలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. భోగాపురం విమానాశ్రయం కోసం భూములు ఇచ్చిన రైతులే ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు శ్రీకారం చుటారని ఈ సమావేశంలోను సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారమని, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరును విమానాశ్రయానికి పెట్టడం గర్వకారణమన్నారు. ఉత్తరాంధ్రకు చెందిన జీఎంఆర్ సంస్థ నిర్మించిన ఈ విమానాశ్రయం ప్రాంత సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటుతోందన్నారు. ఈ ప్రాజెక్టుకు పునాది వేసిన మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు, ప్రస్తుతం కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఇద్దరూ ఉత్తరాంధ్రవారేనని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. సముద్రం, కొండల నడుమ నిర్మితమైన భోగాపురం విమానాశ్రయం దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందుతుందని చెప్పారు. విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్‌నిర్మిస్తున్నామని, శంషాబాద్ విమానాశ్రయం తెలంగాణ రూపురేఖలు మార్చినట్లే భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర దశ, దిశను మార్చబోతోందని ముఖ్యమంత్రి

>>2

తీరప్రాంతంలో మడ అడవులు(ఎయిర్ వ్యూ) ఇన్‌సెట్‌లో డి.సిఎం పవన్

'గ్రేట్ గ్రీన్‌వాల్'
వేగం పెంచండి

2026-27లక్ష్యాలు రెండు నెలల్లో పూర్తికావాలి

మరింత బాధ్యతగా మడ అడవుల పెంపకం

రాష్ట్ర వ్యాప్తంగా 8,888 హెక్టార్లలో గ్రీన్‌వాల్ విస్తరణకు ప్రణాళిక: డి.సిఎం పవన్

విజయవాడ,ఆగస్టు3,ప్రభాతవార్తప్రతినిధి: తీర ప్రాంత పర్యావరణ పరిరక్షణ, కోతల నివారణ చర్యల్లో భాగంగా కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టు గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పనుల్లో వేగం మరింత పెరగాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఈ ఏడాది నిర్దేశిత లక్ష్యాలను వాతావరణ అనుకూలతల అనుగుణంగా వచ్చే రెండునెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని స్పష్టం చేశారు. గ్రేట్ గ్రీన్ వాల్ లక్ష్యసాధనలో భాగంగా గడచిన రెండేళ్ల కాలం లో సాధించిన పురోగతికి జాతీయ స్థాయి గుర్తిం పు లభించిన అంశాన్ని గుర్తుచేశారు. మడ అడ వుల విస్తరణలో దేశంలో రెండో స్థానం సాధిం చేందుకు కృషిచేసిన అధికారులకు అభినందనలు తెలియజేశారు. సోమవారం మధ్యాహ్నం గ్రేట్ గ్రీన్‌వాల్ పనుల పురోగతిపై అటవీ శాఖ ఉన్న తాధికారులతో సమీక్షించారు. డివిజన్లవారీగా నిర్దే శించిన లక్ష్యాలు ఎంత వరకు పూర్తి చేశారు? ఇప్పటి వరకు ఎన్ని మొక్కలు నాటారు? ఈ ఏడాది మడ అడవులు ఎంత విస్తీర్ణంలో నాట నున్నారు? తదితర వివరాలను అంశాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీబీ జీ రాంజీ పథకంలో భాగంగా తీర ప్రాంత జిల్లా లకు అదనంగా మరో 70లక్షల మొక్కలు కేటా యించిన విషయాన్ని గుర్తు చేసారు. ఇవి గ్రేట్ గ్రీన్ వాల్ లక్ష్య సాధనకు అదనపు బలం కాను న్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ వాతావరణ మార్పుల నేపథ్యంలో దేశవ్యాప్తంగా అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు తలెత్తాయి.

>>2

నీట్ ఆందోళనలు విద్యార్థుల కేసు విత్‌డ్రాపై నిర్ణయం రాష్ట్రాలకే

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

వారిపై కేసులుండవు: కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 3: చట్ట ప్రకారం అనుమతించబడిన చోట, విద్యార్థి నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల నుండి ఉత్పన్నమయ్యే విచారణలను మూసివేయడానికి లేదా ఉపసంహరించుకోవడానికి ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సిటి) లేదా మరే ఇతర రాష్ట్రానికైనా తన జులై 28 నాటి ఉత్తర్వు అడ్డుకాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నీట్ పరీక్ష పేపర్ లీక్‌పై జరిగిన ప్రదర్శనలలో, ఢిల్లీలో జులై 20న జరిగిన పార్లమెంట్ మార్చ్, తదనంతరం పలు రాష్ట్రాల్లో జరిగిన నిరసనలతో సహా, పాల్గొన్న విద్యార్థులకు క్షమాభిక్ష ప్రసాదిస్తామన్న తన హామీ విషయంలో తాము "గట్టిగా ఉన్నామని కేంద్రం సమర్పించిన తర్వాత ఈ స్పష్టత వచ్చింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, నేర చరిత్ర లేని పక్షంలో నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు బలవంతపు చర్యలు తీసుకోకుండా నిరోధిస్తూ గతంలో ఇచ్చిన తన ఆదేశం పరిధిని కూడా స్పష్టం చేసింది.

>>2

చేనేతలకు యేటా రూ.25వేలు

అర్హులందరికీ 'నేతన్న సేవలో' వర్తింపు

7వ తేదీ నుంచి పథకం అమలు: మంత్రి సవిత

సోమవారం అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి సవిత

విజయవాడ.ఆగస్టు3.ప్రభాతవార్తప్రతినిధి: ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా నేతన్న సేవలోపథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేయబోతోందని ఆంధ్రప్రదేశ్ చేనేత,జౌళిశాఖ మంత్రి సవిత తెలిపారు. మంత్రి అధికారులతో సోమవారం మధ్యాహ్నం సమీక్షా సమావేశం నిర్వహించారు. నేతన్న సేవలో పథకం అమలు, కార్యాచరణపై అధికారులతో చర్చించి వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులకు మంత్రి సవిత కీలక సూచనలు చేశారు. నేతన్న సేవలో పథకానికి అర్హులు ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గడువులోపు చేనేత కార్మికులందరూ దరఖాస్తులు చేసుకుని ప్రభుత్వం ఇచ్చే సాయాన్ని అందుకోవాలని మంత్రి సవిత విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ నెల 7న గుంటూరుజిల్లా చీరాలలో సీఎం చంద్రబాబు ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. దీని ద్వారా ఏటా రూ.25 వేల ఆర్థికసాయాన్ని చేనేత కార్మికులకు అందించనున్నట్లు తెలిపారు. చేనేత కార్మికుల గౌరవప్రదమైన జీవనమే సీఎం లక్ష్యమని ఈ సందర్భంగా సవిత తెలిపారు. ఈ పథకం అమలులో ఆరోపణలు, విమర్శలకు తావు లేకుండా పని చేయాలని అధికారులకు మంత్రి సవిత సూచించారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. అన్ని జిల్లాలకు చెందిన చేనేత, జౌళిశాఖ ఏడీలు నేతన్న సేవలో పథకంపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. మీడియాలోనూ సమాచారమివ్వాలని, వీలైనంత ఎక్కువ మంది నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి నేతన్నకూ నేతన్న సేవలో పథకం లబ్ధి కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. విమర్శలకు, ఆరోపణలకు తావులేకుండా నేతన్న సేవలో సథకం అమలయ్యేలా అధికారులు పనిచేయాలని మంత్రి దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్పీ సోసిడియా మాట్లాడుతూ, ఈ నెల ఆరో తేదీ ఉదయానికి అన్ని జిల్లాల నుంచి లబ్ధిదారుల వివరాలు అందజేయాలన్నారు.

7న చీరాలలో జాతీయ చేనేత దినోత్సవం

ఈ నెల ఏడో తేదీన చీరాలలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఆనాటి వేడుకలకు సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నా రన్నారు. అదేరోజు నేతన్న సేవలో పథకానికి ఆయన శ్రీకారం చుడతారన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లోనూ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. ర్యాలీలు, చేనేత ప్రదర్శనలు,ప్లకార్డులు ప్రదర్శించాలని మంత్రి సవిత స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, అన్ని జిల్లాల ఏడీలు , ఆప్కో అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్

సుప్రీం జడ్జిలు 38కి పెంపు

బిల్లుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ, ఆగస్టు 3: సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య సవరణ బిల్లు2026కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. సీజేఐ సహా జడ్జీల సంఖ్యను 34నుంచి 38కి పెంచేందుకు ఈ బిల్లును రూపొందించారు. బిల్లుపై కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా విపక్ష సభ్యులు పదేపదే నినాదాలు చేశారు. కీలకమైన బిల్లుపై చర్చలో పాల్గొనాలని సభ్యులను స్పీకర్ కోరారు. విపక్షాల నిరసనలతో బిల్లుపై చర్చించ

>>2

వినియోగదారులకు తక్కువ ధరకు బియ్యం అందచేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

సరసమైన ధరలకే
నాణ్యమైన సరకులు

సూపర్‌ఫైన్ బియ్యం రూ.52కే: మంత్రి కొల్లు రవీంద్ర

విజయవాడ.ఆగస్టు3.ప్రభాతవార్తప్రతినిధి: ప్రజలకు నాణ్యమైన వస్తువుల్ని అత్యంత సరసమైన ధరలకు అందించడం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మచిలీపట్నం 45వ డివిజన్ పరిధిలోని రైతు బజార్ వద్ద సబ్సిడీ ధరకు బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మార్కెట్లో బియ్యం ధరల నుండి పేదలకు ఉపసమనం కల్పించే లక్ష్యంతో రైస్ మిల్లులు, 130 రైతు బజార్ల వద్ద, 500 రైస్ మిల్లుల వద్ద సబ్సిడీ ధరలకు అందించడం జరుగుతోంది. బహిరంగ మార్కెట్లో బియ్యం సగటు రూ.6065 మధ్య ఉన్నాయి. ఆ భారాన్ని తగ్గించే లక్ష్యంతో బీపీటీ సూపర్ ఫైన్ రకం బియ్యాన్ని

>>2

తగ్గిన వరద ఉధృతి

ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు3, ప్రభాతవార్త: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో ఉధృతంగా ప్రవహించిన గోదావరి నది క్రమంగా శాంతిస్తున్నప్పటికీ, ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో బ్యారేజీ వద్ద నీటిమట్టం 12.40 అడుగులకు నమోదైంది. ప్రస్తుతం బ్యారేజీ ద్వారా 10,80,443 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు, సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. గోదావరి పరీవాహక ప్రాంతాల నుంచి వస్తున్న నీటి

>>2

ఎయిర్‌పోర్టు నిబంధనల మేరకే వైజాగ్ పేరు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం, ఆగస్టు 3, ప్రభాతవార్త: అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి ఎయిర్‌పోర్టు నిబంధనలు మేరకే వైజాగ్ పేరు పేర్కొనడం జరుగుతుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన మీడియా సమావేశంలో పలు విషయాలను మంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి మాట్లాడుతూ సివిల్ ఏవియేషన్ అథారిటీ సూచనల మేరకు భోగాపురం అని కాకుండా వైజాగ్ పేరు పలకటం జరుగుతుందనీ, పేరుపై అపోహాలను మీడియా మిత్రులు తొలగించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. మనకు సమీపంలో ఉన్న శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ విషయానికి వస్తే రంగారెడ్డి జిల్లాలో ఉన్నప్పటికీ హైదరాబాద్ లేదా శంషాబాద్ విమా నాశ్రయం అని పేర్కొనడాన్ని ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. రెవెన్యూ పరంగా విజయ

>>2

ప్రభుత్వాసుపత్రుల్లో ఆక్సిజన్ లెక్కలు తేల్చాలి

కోవిడ్ తర్వాత భారీగా పెరిగిన కొనుగోళ్లు

నిరుపయోగంగా 161 పిఎస్ఏ ప్లాంట్లు: మంత్రి సత్యకుమార్ యాదవ్


సోమవారం అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

విజయవాడ.ఆగస్టు3,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో కోవిడ్19 నేపథ్యంలోఆక్సిజన్ సరఫరా కోసం దాదాపు రూ.105 కోట్లతో నిర్మితమై నిరుపయోగంగా మారిన పీఎస్ఏ (ప్రెషర్ స్వింగ్ అడ్సార్పషన్) ప్లాంట్లు, అధిక మోతాదులో ఎల్ఎంఓ (లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్) కొనుగోళ్ల విషయాలపై రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ లెక్కలు తేల్చాలన్నారు. సోమవారం ఎపిఐఐసి టవర్స్‌లోని వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఉన్నతాధికారులతో రెండు గంటలపాటు లోతుగా సమీక్షించారు. ఎల్ఎంఓ కొనుగోళ్లకు సంబంధించి, వాస్తవ డిమాండ్, సరఫరా విషయాలపై రెండు వారాల్లో సమగ్రంగా ఆడిట్ నిర్వహించి, లోపాల గుర్తింపు, సవరణ చర్యలను చేపట్టి, ఆమేరకు ఎనిమిది ప్రభుత్వాసుపత్రుల్లో రెండు నెలలపాటు అమలుపరిచి అక్టోబరు 15 లోగా సమగ్ర నివేదికను సమర్పించాలని మంత్రి ఆదేశించారు. తద్వారా ఎల్ఎంఓ డిమాండ్ మరియు సరఫరాలోని వ్యత్యాసాన్ని గుర్తించి ఆక్సిజన్ కొనుగోలు ఖర్చును వీలైనంత వరకు కోవిడ్19 పూర్వ స్థితికి తీసుకురావాలని మంత్రి స్పష్టంచేశారు. కోవిడ్19తీవ్రంగా ఉన్న 2020-21, 2021- 22 సంవత్సరాల్లో రూ.95.43 కోట్ల మేరకు బోధనాసుపత్రుల్లో ఏల్ఎంఓ కొనుగోలు చేశారు. కోవిడ్19కు ముందు 2016-20 మధ్య కాలంలో (నాలు గేళ్లు)రూ.60.51కోట్ల మేరకు వ్యయం చేశారు.

>>2

4-8pg2exHMNWJQE.qxd:4-8pg2exHMNWJQE.qxd 1/1/02 6:45 AM Page 1

డికె కేబినెట్ విస్త'రణం'

ఇటు 20 మంది ప్రమాణం..అటు అసమ్మతి రాగం

మొదలైన సీనియర్ ఎమ్మెల్యేల రాజీనామాలు

బెంగళూరు, ఆగస్టు 3: కర్ణాటక ముఖ్యమంత్రి డీ.కే. శివకుమార్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మంత్రివర్గ విస్తరణ కొందరిలో విపరీతమైన ఆనందోత్సాహానికి, మరికొందరిలో తీవ్ర ఆగ్రహావేశాలకు కారణమైంది. ఏకంగా 20 మంది కొత్త మంత్రుల ప్రమాణస్వీకారంతో ఒకవైపు పండుగ వాతావరణం సంతరించుకోగా, మరోవైపు తీవ్ర అసమ్మతి, ధర్నాలు, ఆందోళనలకు దారితీసింది. కేబినెట్‌లో చోటు దక్కకపోవడంతో అసమ్మతి నేతలు బహిరంగంగానే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి పదవి దక్కకపోవడంపై తీవ్ర మనస్థాపానికి గురైన ఎమ్మెల్యే యశ్వంతరాయ గౌడ పాటిల్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ నాయకత్వం నన్ను తీవ్రంగా గాయపరిచింది. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను అని ఆయన పేర్కొన్నారు. అలాగే బేలూరు ఎమ్మెల్యే గోపాలకృష్ణ కూడా రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, మైసూర్ నాయకుడు తన్వీర్ సేట్‌కు మంత్రివర్గంలో చోటు నిరాకరించడంతో, ఆయన మద్దతుదారుడొకరు మైసూరులో విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అతన్ని ప్రస్తుతం ఆసుపత్రికి తరలించగా, తన్వీర్ సేట్ నేరుగా వెళ్లి పరామర్శించారు. ధార్వాడ్‌లో ప్రసాద్ అబ్బయ్య మద్దతుదారులు రహదారిపై టైర్లు కాల్చి, ప్రభుత్వ బస్సుపై రాళ్ళు రువ్వి ఆందోళన చేపట్టారు. హెచ్‌కే పాటిల్, దినేష్ గుండూరావుతో సహా పదవులు దక్కని సీనియర్ నాయకులు బెంగళూరులోని పీ.వీ. జయచంద్ర నివాసంలో అత్యవసర రహస్య సమావేశం ఏర్పాటు చేసి తదుపరి కార్యాచరణపై చర్చిస్తున్నారు. మరోవైపు సీనియర్ నేత, కేబినెట్ మంత్రి కె.హెచ్. మునియప్ప కూడా తన శాఖ కేటాయింపుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, శాఖను మార్చాలని కోరుతున్నట్లు సమాచారం. ప్రమాణస్వీకారానికి కొన్ని గంటల ముందు కేబినెట్ జాబితాలో నాటకీయ మార్పులు చోటుచేసుకున్నాయి. తొలుత ప్రకటించిన ముసాయిదా నుంచి మంకాల్ వైద్య, గాయత్రి చంద్రశేఖర్‌లను తొలగించి, ఆఖరి నిమిషంలో సీనియర్ నేత ఎస్.ఎస్. మల్లికార్జున్‌కు కేబినెట్‌లో స్థానం కల్పించారు. కర్ణాటక కాంగ్రెస్ విస్తరణపై బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయా తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ చెబుతున్న సామాజిక న్యాయం, మహిళా సాధికారత మాటలకే పరిమితమని ఎద్దేవా చేశారు. కేబినెట్‌లో ఏకైక మహిళకే చోటు ఇవ్వడం, బ్రాహ్మణ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం లేకపోవడం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న బి. నాగేంద్ర, జమీర్ అహ్మద్ ఖాన్‌లను తిరిగి కేబినెట్‌లోకి తీసుకోవడం కాంగ్రెస్ డొల్లతనాన్ని బయటపెడుతోందని ఆరోపించారు.

ఇరాన్‌పై ట్రంప్ తీవ్ర విమర్శలు

ఒప్పందం లేదా పూర్తి లొంగుబాటే శరణ్యం

వాషింగ్టన్,ఆగస్టు 3: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ నాయకత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెరవెనుక అమెరికాతో చర్చలు జరపాలని కోరుకుంటూనే, బహిరంగంగా మాత్రం ఎలాంటి చర్చలు లేవని చెబుతున్నారని ఇరాన్‌పై ఆరోపించారు. ఒప్పందం కుదుర్చుకోవడం లేదా పూర్తిగా లొంగిపోవడం తప్ప ఇరాన్‌కు మరో మార్గం లేదని హెచ్చరించారు. ట్రూత్ సోషల్‌మీడియా వేదికలో చేసిన పోస్టులో ట్రంప్ ఇరాన్ వైఖరిపై తీవ్ర ఆగ్రహం ప్రకటించారు. ఇరాన్ నాయకులు అమెరికాతో సమావేశం కావాలని స్వయంగా కోరుకున్నప్పటికీ, బహిరంగంగా మాత్రం తాము ఒమాన్‌తో మాత్రమే చర్చలు జరుపుతున్నామని చెబుతున్నారని విమర్శించారు. ఈ వైఖరిని "అత్యంత ద్వంద్వ వైఖరి"గా అభివర్ణించారు. అణు కార్యక్రమంపై ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇలాంటి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయ్.ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హార్ముజ్ జలసంధిపై ఇరాన్ చేస్తున్న వ్యాఖ్యలను కూడా ట్రంప్ తోసిపుచ్చారు. ఆ జలసంధి ఇప్పటికే అమెరికా నౌకాదళ నియంత్రణలోనే ఉందని, అమెరికా అనుమతి లేకుండా ఇరాన్‌కు ఏ సరఫరాలు కూడా చేరవని పేర్కొన్నారు. ఒప్పందం కుదిరే వరకు లేదా ఇరాన్ పూర్తిగా లొంగిపోయే వరకు ఈ పరిస్థితి కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఇరాన్‌కు అణ్వాయుధం ఎప్పటికీ ఉండదుఇరాన్ అణు కార్యక్రమంపై తన వైఖరిని మరోసారి పునరుద్ఘాటించిన ట్రంప్, "ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని సొంతం చేసుకోలేదని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న సమస్యకు పరిష్కారం కోసం అమెరికా ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు.ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ నుంచి వెంటనే ఎలాంటి అధికారిక స్పందన వెలువడలేదు. అమెరికాతో ప్రస్తుతం ఎలాంటి చర్చలు జరగడం లేదని ఇరాన్ ఇప్పటికే బహిరంగంగా ప్రకటించిన విషయం తెలిసిందే.

మాస్కోలోని వైల్డ్‌బెర్రీస్ వేర్‌హౌస్‌పై ఉక్రెయిన్ దాడి

మాస్కో,ఆగస్టు 3: రష్యాపై భీకర స్థాయిలో డ్రోన్లతో అటాక్ చేసింది ఉక్రెయిన్. రష్యా చేసిన దాడికి ప్రతీకారంగా ఉక్రెయిన్ విరుచకుపడింది. అయితే వ్లాదిమిర్ ప్రాంతంలో ఉన్న వేర్‌హౌజ్‌ను టార్గెట్ చేసింది. రష్యాన్‌లో ఆన్‌లైన్ రిటేలర్‌గా ఉన్న వైల్డ్‌బెర్రీస్ వేర్‌హౌజ్‌పై దాడి చేసింది. దీన్ని రష్యా అమెజాన్‌గా కీర్తిస్తుంటారు. మాస్కోకు సుమారు 180 కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్లాదిమిర్ ప్రాంతంలో ఉన్న వేర్‌హౌజ్‌ను డ్రోన్‌తో అటాక్ చేసినట్లు వీడియోలు రిలీజ్ అయ్యాయి. వైల్డ్ బెర్రీస్ వేర్‌హౌజ్ రష్యాలో కీలకమైన లాజిస్టిక్ హబ్. అయితే ఆ కేంద్రాలను ఉక్రెయిన్ టార్గెట్ చేస్తున్నది. రష్యా మిలిటరీకి డ్రోన్ కాంపోనెంట్లు, నావిగేషన్ ఎక్విప్మెంట్, ఇతర సామాగ్రిని ఈ వేర్‌హౌజ్‌ల నుంచి సరఫరా చేస్తుంటారు.వైల్డ్‌బెర్రీస్ సైట్లపై ఇటీవల ఉక్రెయిన్ వరుసగా దాడి చేస్తున్న విషయం తెలిసిందే. శనివారం రష్యా బాలిస్టిక్ క్షిపణులతో కీవ్‌పై దాడి చేసింది. ఆ ఘటనలో 9 మంది మృతిచెందగా, డజన్ల సంఖ్యలో గాయపడ్డారు. ఉక్రెయిన్‌లోని పలు నగరాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.

మధ్యప్రదేశ్ దాతియా ఉపఎన్నికలో కాంగ్రెస్ విజయం

భోపాల్, ఆగస్టు 3: మధ్యప్రదేశ్‌లోని దాతియా అసెంబ్లీ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి ఘనశ్యామ్ సింగ్ విజయం సాధించారు. ఆయన బీజేపీ అభ్యర్థి అశుతోష్ తివారీపై 6,016 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ ఫలితంతో రాష్ట్రంలో రానున్న రాజకీయ పోరాటాలకు ముందు కాంగ్రెస్‌కు గణనీయమైన ఊతం లభించినట్లుగా రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఘనశ్యామ్ సింగ్‌కు మొత్తం 66,757 ఓట్లు లభించగా, అశుతోష్ తివారీ 60,741 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు.ఉపఎన్నికకు కారణంకాంగ్రెస్ ఎమ్మెల్యే రాజేంద్ర భారతి ఢిల్లీ కోర్టులో బ్యాంకు మోసం, మోసపూరిత కేసులో దోషిగా తేలి శిక్ష పడడంతో ఆయనను ఏప్రిల్‌లో ఎమ్మెల్యే పదవి నుంచి అనర్హుడిగా ప్రకటించారు. దీంతో దాతియా అసెంబ్లీ స్థానానికి ఉపఎన్నిక నిర్వహించారు.ఈ ఎన్నికను బీజేపీ, కాంగ్రెస్ రెండూ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని రాష్ట్రంలో తమ రాజకీయ బలాన్ని నిరూపించుకునేందుకు తీవ్రంగా పోటీ పడ్డాయి. ఫలితాలు వెలువడిన వెంటనే భోపాల్‌లోని రాష్ట్ర కాంగ్రెస్ కార్యాలయంలో కార్యకర్తలు డప్పులు మోగిస్తూ సంబరాలు నిర్వహించారు.

ఈ విజయం బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన గట్టి సమాధానమని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు జితేంద్ర పట్వారీ మాట్లాడుతూ, దాతియా ప్రజలు బీజేపీ ప్రభుత్వంలోని "అహంకారం, అవినీతిని" తిరస్కరించారని అన్నారు. విజేత ఘనశ్యామ్ సింగ్ ఈ విజయాన్ని ఓటర్లకు, పార్టీ కార్యకర్తలకు అంకితం చేశారు. ఓటమిపై స్పందించిన బీజేపీ అభ్యర్థి అశుతోష్ తివారీ, ఎన్నికల్లో తనకు అండగా నిలిచిన ఓటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చేందుకు పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేశాయని పేర్కొంటూ, దాతియాప్రజలు ఇచ్చిన తీర్పును వినయంగా స్వీకరిస్తామని అన్నారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కూడా ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని తెలిపారు.

నీట్ ఆందోళనలు

>> అత్యాచారం, ఇతర ఘోరమైన నేరాలతో సహా తీవ్రమైన నేరాలకు పాల్పడిన నిందితులకు ఈ రక్షణ వర్తించదని ధర్మాసనం పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా నమోదైన ఎఫ్ఐఆర్‌లను మొదట గుర్తించి, వర్గీకరించవచ్చని, ఆ తర్వాత అధికారులు ప్రతి కేసులోనూ తగిన చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించవచ్చని కూడా ధర్మాసనం సూచించింది. "ఇతర రాష్ట్రాల్లో ఎన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయనే దానిపై మీరు సమాచారాన్ని సేకరించగలిగితే ఈ వర్గీకరణ తర్వాత, మీరు చట్టాన్ని అనుసరించవచ్చు అని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. మూసివేత లేదా ఉపసంహారణకు పరిగణించదగిన కేసులపై ఇరుపక్షాలు ఒక ఒప్పందానికి వచ్చిన తర్వాత, న్యాయస్థానం ఈ ప్రక్రియను "సాధ్యం చేయగలదని జస్టిస్ జయమాల్య బాగ్చి తెలిపారు. దర్యాప్తు సంస్థలు భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, 2023 (బిఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 193 కింద కేసు ముగింపు నివేదికలను దాఖలు చేయవచ్చని, అదే సమయంలో సంబంధిత పబ్లిక్ ప్రాసిక్యూటర్లు చట్టబద్ధమైన ప్రక్రియకు అనుగుణంగా విచారణ నుండి ఉపసంహారణ కోరవచ్చని ఆయన సూచించారు. తదుపరి విచారణ కోసం ఆగస్టు 18కి వాయిదా వేసింది.

ప్రభుత్వాసుపత్రుల్లో ఆక్సిజన్ లెక్కలు తేల్చాలి

>> కొవిడ్ అనంతరం 2022- 26 మధ్య నాలుగేళ్ల కాలంలో ఎల్ఎంఒ కొనుగోలు వ్యయం రూ.180.82 కోట్లకు చేరిందని మంత్రి సమీక్షా సమావేశంలో గుర్తించారు. గత నాలుగేళ్లలో కొత్త బోధనాసుపత్రులు, కొత్త ఆసుపత్రులు ఉనికిలోకి రావడం, పడకలు పెరగడం పెరుగుదలకు కొంతమేరకు కారణమైనప్పటికీ అధికారులు వివరించిన ఆక్సిజన్ డిమాండ్, వాస్తవ సరఫరాకు మధ్య భారీ అంతరం కనిపిస్తోందని, దీనిపై లోతుగా పరిశీలించి కొనుగోలు వ్యయాన్ని తగ్గించే దిశగా అవకాశాలను పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. ఈ పరిశీలనకు అనంతపురం బోధనాసుపత్రి (సూపర్ స్పెషాలిటీతో సహా), గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం బోధనాసుపత్రులతోపాటు రెండు జిల్లా, రెండు ఏరియా ఆసుపత్రులను ఎంపిక చేశారు. ఆరోగ్య పథకాల అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకున్న పాత్ సంస్థ ఈ అధ్యయనాన్ని చేపడుతుంది.

పిఎస్ఎ ప్లాంట్లు ఉపయోగమా..నిరర్థకమా: కోవిడ్19 నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సాయంతో డీఎంఈ పరిధిలో 62 ఆసుపత్రుల్లో, సెకండరీ హెల్త్ పరిధిలో 100 (మొత్తం 162) పీఎస్ఏ ప్లాంట్లను ఏర్పాటుచేశారు. అయితే ఈ ప్లాంట్ల ద్వారా తయారయ్యే ఆక్సిజన్ ప్యూరిటీ (నాణ్యత), నిర్వహణా నియంత్రణకు సంబంధించి తగిన సాంకేతి సిబ్బందని నియమించకపోవడం, ఐసీయూ మరియు సాధారణ వార్డులకు ఆక్సిజన్ సరఫరాకు సంబంధించిన నాణ్యతతో నిమిత్తం లేకుండా ఒకే పైపులైన్ వ్యవస్థ ఉండడంవంటి వివిధ కారణాలవల్ల 162 కు 161 పీఎస్ ఎ ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి. ఈ ప్లాంట్ల మరమ్మతులకు డిఎంఈ పరిధిలో రూ.6.20 కోట్లు, నిర్వహణకు ఏటా రూ. 2.60 కోట్లు, డియస్‌హెచ్ పరిధిలో మరమ్మతులకు రూ.4.76 కోట్లు, నిర్వహణ కోసం ఏటా రూ 6.7 కోట్లు అవసరమవుతుందని, మంత్రికి వివరించారు. ఈ మేరకు నిధులు ఖర్చుచేసిన ఈ పీఎస్ఏ ప్లాంట్లను పూర్తిస్థాయిలో వినియోగించవచ్చా? ఆర్థికంగా ఈ ఖర్చు సమర్థనీయమా? కాకుంటే ఈ నిర్థక ప్లాంట్లను ఏంచేయాలన్న విషయాలపై కూడా నివేదిక తెప్పించాలని మంత్రి ఆదేశించారు. రాజస్థాన్ ర్నాష్ట్రలో శీతి ప్లాంట్ల పనితీరును కూడా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

తగ్గిన వరద ఉధృతి

>> ప్రవాహాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షి స్తూ, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షి స్తున్నారు. వరద ప్రభావం పూర్తిగా తగ్గే వరకు గోదావరి నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా, ప్రజలు నదిలో స్నానా లు చేయకుండా, బ్యారేజీపైకి లేదా నది ఒడ్డుకు వినోదం కోసం వెళ్లవద్దని హెచ్చరించారు. తక్కువ ప్రాంతాల్లో నివసించే ప్రజలు అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని, అత్యవసర పరిస్థి తుల్లో రెవెన్యూ, పోలీసు, విపత్తు నిర్వహణ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. వరద పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రభుత్వ శాఖలు అప్రమత్తంగా పనిచేస్తున్నాయని అధి కారులు తెలిపారు. వరద ప్రవాహం తగ్గుతున్నప్పటికీ పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి చేరుకోలేదని, అందువల్ల మొదటి ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రజలు ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా జాగ్రత్తలు పాటించాలని మరోసారి విజ్ఞప్తి చేశారు.

సరసమైన ధరలకే నాణ్యమైన సరకులు

>> కిలో రూ. 52,బీపీటీ రారైస్‌ను కిలో రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. గుర్తింపు కార్డును చూపించి ప్రతిఒక్కరూ గరిష్టంగా 10కిలోల వరకు బియ్యం కొనుగోలు చేసే వెసులుబాటు కల్పించామన్నారు. మంత్రి కొల్లు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ మిర్చి, పొగాకు, మామిడి రైతులు సమస్య ఉందని చెప్పగానే అండగా నిలిచాం. ఆక్వా రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పిన వెంటనే ఫీడ్ ధరలు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నాం. రైతుల నుండి పంట కొనుగోలు చేసిన 24 గంట్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నాం. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర ఉద్యోగులకు డిఎ పెంపు

న్యూఢిల్లీ, ఆగస్టు 3: దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సోమవారం ఓ శుభవార్త అందింది. ఈసారి కరవు భత్యం పెంపుపై స్పష్టత వచ్చింది. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొనేందుకు వీలుగా ఈసారి కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డిఎ పెరిగే అవకాశం ఉందని ఆర్థిక శాఖ తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో లక్షలాది మంది ఉద్యోగుల జీతాలు పెరగనున్నాయి. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం జులై 1 నుంచి ఈ డిఎ పెంపు అమలులోకి రానుంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్న డిఎ మూల వేతనంలో 60 శాతంగా ఉంది. తాజాగా పెంపుతో ఇది 63 శాతానికి చేరబోతోంది. కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన పారిశ్రామిక కార్మికుల వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా ఈ డిఎ శాతాన్ని ప్రభుత్వం ఖరారు చేస్తుంది. కేంద్రం సాధారంగా ప్రతి యేటా జనవరి 1, జులై 1 తేదీల నుంచి అమలులోకి వచ్చేలా రెండుసార్లు డిఎను సవరిస్తుంది. గతేడాది జులై నుంచి ఈ యేడాది జూన్ వరకు 12 నెలల కాలంలోని వినియోగదారుల ధరల సూచీ సగటు ఆధారంగా ఈ లెక్కింపు చేస్తారు.

అత్యాచార కేసు:

పదేళ్ల జైలు

అభియోగాలు రుజువు చేసిన అవనిగడ్డ పోలీసులు

విజయవాడ.ఆగస్టు 3,ప్రభాతవార్తప్రతినిధి: అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 206/2023 గా నమోదున అత్యాచార కేసు 376(2), 406, 420)లో నిందితుడు దాసరి రవితేజ, రేగులంక, పులిగడ్డ గ్రామం, అవనిగడ్డ మండలానికి చెందిన వ్యక్తిపై న్యాయస్థానం నేరం రుజువైనట్లు నిర్ధారిస్తూ 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.5,000 జరిమానా విధించింది.ఎస్.సి. నెం. 174/2025లో విచారణ జరిపిన మచిలీపట్నం 9వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి టి. రాజా వెంకటాద్రి గారు ఈ మేరకు తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా ఎస్పి వి .విద్యాసాగర్ నాయుడు, మాట్లాడుతూ, మహిళలపై జరిగే లైంగిక నేరాల విషయంలో జిల్లా పోలీసులు ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోరని స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం జరిగేలా ప్రతి కేసును శాస్త్రీయ ఆధారాలతో దర్యాప్తు చేసి, నేరస్థులకు చట్టప్రకారం కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు. మహిళల భద్రతకు జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ అత్యున్నత ప్రాధాన్యత ఇస్తారని, మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.

మద్యం స్కాంలో నిందితుల రిమాండ్ పొడిగింపు

విజయవాడ,ఆగస్టు3,ప్రభాతవార్తప్రతినిధి: మద్యం రవాణా టెండర్ల స్కాంలో నిందితులకు రిమాండ్ పొడిగించారు. ఈ నెల 17 వరకు రిమాండ్‌ను విజయవాడ కోర్టు పొడిగించింది. రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డి, సునీల్‌ను అధికారులు వర్చువల్‌గా హాజరుపరిచారు. హైదరాబాద్ చంచల్‌గూడ జైలులో నిందితులు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు.

'గ్రేట్ గ్రీన్‌వాల్' వేగం పెంచండి

>> ప్రస్తుతం తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న తీర ప్రాంత జిల్లాలకు విపత్తుల ముప్పు పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి అసాధారణ వాతావరణ పరిస్థితుల నుంచి మన తీరాన్ని రక్షించుకోవడంలో గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కీలక భూమిక పోషించనుంది. అందుకే కూటమి ప్రభుత్వం గ్రేట్ గ్రీన్ వాల్‌ను ప్రతిష్ఠాత్మకంగా ముందుకు తీసుకువెళ్తోంది. రాష్ట్రంలో విస్తరించి ఉన్న 1,053 కి.మీ. తీర ప్రాంతం వెంబడి 5 కిలోమీటర్ల వెడల్పున పచ్చదనంతో కూడిన గోడను ఏర్పాటు చేస్తున్నాం. అందులో ఈ ఏడాది 8,888 హెక్టార్లలో గ్రీన్ వాల్ విస్తరణకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశాం. మొదటి అర్ధభాగంలో వాతావరణ అనుకూలతల ఆధారంగా కొంత మేర మొక్కలు నాటే ప్రక్రియ పూర్తయ్యింది. ద్వితీయార్థంలో తాటి విత్తనాలు అందుబాటులోకి రానున్నాయి. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వీటి సేకరణ, నాటే ప్రక్రియను పూర్తి చేయాలి.దాదాపు 5,000హెక్టార్లలో తాటి వనాలఏర్పాటును ఈ ఏడాది లక్ష్యంగా పెట్టుకున్నాం. కాలువ గట్లు, చెరువులు, తీర ప్రాంతాల్లో తాటి చెట్లు గాలి నిరోధక వ్యవస్థగా నిలుస్తాయి. తాటివనాలు, సామాజికవనాల ఏర్పాటు పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలి.

మడ అడవుల విస్తరణలో పురోగతి..

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గడచిన రెండేళ్లలో మడ అడవుల పెంపకంలో చక్కటి పురోగతి సాధించాం. 202425 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 740 హెక్టార్లు, 2025 26లో 1,930 హెక్టార్ల మేర మడ అడవుల విస్తరణ చేపట్టాం. తద్వారా మడ ఫారెస్టింగ్‌లో దేశంలోనే రెండో స్థానంలో నిలిచాం.ఈ అద్భుత ఘనత సాధనకు కృషి చేసిన సిబ్బందికి, సహాయ సహకారాలు అందించిన పర్యావరణ నిపుణులకు హృదయపూర్వక అభినందనలు. సాధారణంగా మడ అడవుల స్థాపనకు అక్టోబర్ నుంచి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. ఈ ఏడాది మరింత బాధ్యతాయుతంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లాలి. నవంబర్, డిసెంబర్ మాసాల్లో మిష్టి-2 కింద 305 హెక్టార్లలో మడ అడవుల పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించాం. తీర ప్రాంత రక్షణ కవచం అయిన మడ అడవుల ప్రాధాన్యతను గ్రహించి, నిర్ణీత సమయంలో విస్తరణ కార్యక్రమాలు పూర్తి చేయాలి.

జిల్లాలవారీగా నిర్దేశిత లక్ష్యాలు..

గ్రేట్ గ్రీన్ వాల్ కార్యాచరణ ప్రణాళికల్లో భాగంగా ఈ ఏడాది 48 హెక్టార్లలో పరిహార అటవీకరణ చేపట్టాం. ఇదిచాలా వరకు పూర్తి కావచ్చింది. అత్యధికంగా 5 వేల హెక్టార్లలో తాటి వనాలు నాటుతున్నాం. గ్రీన్ క్లైమేట్ ఫండ్ కింద మరో 1,993హెక్టార్లను దేశీయ మొక్కలతో నింపేయనున్నాం.727 హెక్టార్లలో షెల్టర్ బెల్ట్ ప్లాంటేషన్లు లక్ష్యాలుగా నిర్దేశించాం. వీటిలో మడ అడవులు, తాటి వనాలు మినహా మిగిలిన అటవీకరణ అంచెల వారీగా చేపట్టాలి. తీర ప్రాంత పర్యావరణ వ్యవస్థలు, క్షీణించిన భూభాగాల పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇవ్వాలి. వీబీ జీ రాం జీ ద్వారా తీర ప్రాంతం వెంబడి నాటేందుకు వీలుగా మరో 70 లక్షల మొక్కలు సిద్ధం చేస్తున్నాం. సుమారు 2,500 హెక్టార్లలో ఈ మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూ పొందించాం. అందులో ఒక్క రాజమహేంద్రవ రం సర్కిల్‌లోనే 3,243 హెక్టార్లలో కలప ఉత్పత్తి, దేశీయ మొక్కలు నాటనున్నాం. గుం టూరు సర్కిల్‌లో 1,832 హెక్టార్లు, విశాఖ సర్కి ల్‌లో 1,764 హెక్టార్లు లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు.

నీటి ఎద్దడి రానివ్వకండి

>> అన్నారు.ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని ఆర్టీజీఎస్ పరిధిలో అవసరమైన చర్యలు ఉండాలన్నారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కీలక నిర్ణయం

విజయవాడ,ఆగస్టు3,ప్రభాతవార్తప్రతినిధి: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం. ఈ నెల 10వ తేదీ తర్వాత ఉద్యోగ సంఘాలతో సీఎం చంద్రబాబు భేటీ అవుతారు. ఇప్పటికే పలు దఫాలుగా ఉద్యోగ సంఘాలతో కేబినెట్ సబ్‌కమిటీ చర్చలు జరిపింది.తాజాగా ఉద్యోగుల సంఘం ఐక్య కార్యచరణ సమితి నాయకులు మంత్రి వర్గ ఉపసంఘంతో సుమారు ఆరుగంటలపై చర్చలు జరిపారు.ఉద్యోగులు సీపీఎస్ పెన్షన్ విధానం రద్దు, దీర్ఘకాలిక బకాయిలు తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

వర్షాకాల సమావేశాలు జరుగుతున్న పార్లమెంట్ వద్ద సోమవారం అమిత్‌షా

ఎమ్మెల్సీ అనంత బాబు కేసు విచారణ

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు3,ప్రభాతవార్త: అనంతబాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో బెయిల్ పై విచారణ కొనసాగింది. ఎమ్మెల్సీ అనంతబాబు సాక్షులను బెదిరించిన కేసులు బెయిల్ పిటిషన్ పై తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునేద్ అహ్మద్ మోలానా విచారణ చేపట్టి ఈనెల ఐదున ఆదేశాలు ఇవ్వనున్నట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముప్పాళ్ళ సుబ్బారావు తెలిపారు.65బి సర్టిఫికేషన్ లో ప్రాసిక్యూషన్ తరపున పిటిషన్ వేసినట్లు పేర్కొన్నారు.

ఈనెల 6 ,7 తేదీల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాక్షులను విచారిస్తారని వెల్లడించారు.

వైజాగ్ పేరు

>> నగరం జిల్లాలో భోగాపురం విమానాశ్రయం ఉన్నప్పటికీ వైజాగ్ అని పిలవడంలో తప్పులేదని నిబంధనల మేరకే వైజాగ్ పేరు ప్రస్తావించడం జరుగుతుందని గమనించాలన్నారు. భోగాపురం విమానాశ్రయంలో ఇప్పటికే 70 స్థానికులకే బ్లూ కాలర్ జాబులు ఇవ్వటం జరిగిందని, వైట్ కాలర్ జాబులకు కావలసిన అర్హత, అనుభవంతో పాటు నేర్పరితనం కోసం వేరే వారిని నియమించడం జరుగుతుందనీ, ఉద్యోగ విషయాలలో కూడా అపోహలు వద్దని మరొక్కసారి జిఎంఆర్ సంస్థతో మాట్లాడటం జరుగుతుందన్నారు. అలాగే ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన సూపర్ సక్సెస్ కావడంలో భాగస్వాములు అయిన ప్రతి ఒక్కరికి కూడా ప్రత్యేకించి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. జిల్లా అధికారి స్థాయి నుండి గ్రామస్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరు చాలా బాధ్యతతో పని చేయడంతో పాటు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు కూడా ప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగిందన్నారు. మన ప్రాంతానికి వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ అపూర్వ స్వాగతం పలకాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన పిలుపు మేరకు కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి, ముఖ్యంగా మీడియా మిత్రులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. అన్ని విభాగాలలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయడంతోనే ఎయిర్ పోర్ట్ ప్రారంభం కార్యక్రమంలో ఎటువంటి లోపాలు జరగకుండా ప్రధాని మోడీ సభ సక్సెస్ కావడం చాలా సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. భోగాపురం విమానాశ్రయం రానున్న రోజులలో ఉత్తరాంధ్ర భవిష్యత్తును మార్చే గ్రోత్ ఇంజిన్ కావటంఖాయమని మంత్రి పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతఅభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని, ప్రజల్లో ఉన్న అపోహలను మీడియా మిత్రులు తొలగించాలన్నారు.

12వ తేదీన సంపూర్ణ సూర్య గ్రహణం

భారత్‌లో కనిపించదు

హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త: ఈ నెల 12వ తేదీన ఆకాశంలో సంపూర్ణ సూర్య గ్రహణం రూపంలో మరో ఖగోళ అద్భుతం కనువిం దు చేయనుంది. రష్యా, యూరప్ దేశాలు, ఉత్తర అమెరికా, అట్లాంటిక్ మహా సముద్రం, గ్రీన్‌లాండ్ ప్రాంతాలలో ఈ సంపూర్ణ సూర్య గ్రహ ణం ఏర్పడనుంది. గ్రీన్‌లాండ్, స్పెయిన్, పోర్చుగల్‌లో గ్రహణాన్ని పూర్తిగా వీక్షించే అవకాశం వుండడంతో ఖగోళ శాస్త్రవేత్తలు ఆ దేశాలకు ము ందుగానే పయనమయ్యారు. భారత కాలమానం ప్రకారం రాత్రి 9.45 గంటలకు మొదలవనున్న ఈ గ్రహనం మరుసటి రోజు తెల్లవారుజా మున 2.15 గంటలకు ముగుస్తుంది. రాత్రి సమయం కావడంతో భారత్‌లో ఈ గ్రహణం వీక్షించే అవకాశం లేదు. భారత్‌లో గ్రహణం ఏర్పడనందున ఇక్కడ ఎలాంటి సూతకాలం లేదని ఆగమన పండితులు చెబుతున్నారు.

సుప్రీం జడ్జిలు 38కి పెంపు

>> కుందానే స్పీకర్ ఆమోదం తెలిపారు. అనంతరం సభను రేపటికి వాయిదా వేశారు. సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య పెంపు విషయంపై మే నెలలోనే కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. దానిని కార్యరూపంలోకి తీసుకొస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దిసుప్రీం కోర్టు (నంబర్ ఆఫ్ జడ్జెస్) అమెండ్‌మెంట్ ఆర్డినెన్స్ 2026ను జారీచేశారు. ఈ ఏడాది జారీ చేసిన తొలి ఆర్డినెన్స్ ఇదే. ఇప్పుడు పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఈ బిల్లు లోక్‌సభ ఆమోదం పొందింది. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 1950 జనవరి 26వ తేదీన 8 మంది న్యాయమూర్తులతో ప్రారంభమైన సర్వోన్నత న్యాయస్థానం 76ఏళ్లలో సంఖ్యాపరంగా 30కు, నిష్పత్తి ప్రకారం 375 శాతం పెరిగినట్లయింది.

వారం - వర్జ్యం

04-08-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేష కార్తె,
తి.షష్ఠి రా.10.00
న.రేవతి రా.9.50
వ.ఉ.9.54-ఉ.11.29
దు.1. ఉ.8.22-ఉ.9.13
దు.2. రా.11.46-రా.12.37
రాహు. మ.3.00-మ.4.30
శుభ లేదు

వార్తాఫలం

మేషం : ప్రజలతో సంబంధాలు మెరుగుపరచుకోవడానికి ఆవిరళ కృషి చేస్తారు. కీళ్ళ బాధలు ఇబ్బంది పెడతాయి.

వృషభం : స్త్రీల వలన చిక్కు సమస్యలు ఏర్పడతాయి. ఫలితాలు మాత్రం వెను వెంటనే రావు. క్రయ విక్రయాలకు దూరంగా ఉండండి.

మిథునం : శత్రువర్గంలోని అనైక్యతను గుర్తించి వారితో ముఖాముఖి పోరాడి లాభ పడతారు. ఆకస్మిక ప్రయాణాలు.

కర్కాటకం : ఎవ్వరినీ నమ్మకుండా మీ పనిని మీరే స్వయంగా చేసుకోవడం చెప్పదగినది. దైవానుగ్రహాన్ని ఎంతగానో నమ్ముకుంటారు.

సింహం : పని వత్తిడి అధికమవటం వలన క్షణం తీరిక లేకుండా శ్రమిస్తారు. స్త్రీలతో విభేదాలు కాకుండా జాగ్రత్తలు పాటించండి.

కన్య : పోటీ పరీక్షలలో అతికష్టం మీద విజయం సాధిస్తారు. ఉద్యోగంలో అదనపు బాధ్యతలు పెరుగుతాయి.

తుల : అప్పు చేయక పోవటమే నిజమైన పొదుపు అని గుర్తిస్తారు. ప్రతికూల వాతావరణాన్ని కూడా కృషితో అనుకూలంగా మలచుకుంటారు.

వృశ్చికం : బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. కళా రంగంలోని వారికి విదేశీ పర్యటనలు

ధనుస్సు : కుటుంబ సభ్యులతో కలిసి దేవాలయ సందర్శనం చేసుకుంటారు. సోదర, సోదరీ వర్గంతో కలిసి ఇష్టాగోష్టి సాగిస్తారు.

మకరం : సానుకూలంగా ఆలోచించి గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోండి. వాహన సౌఖ్యం.

కుంభం : మధ్యవర్తిత్వాలు, పంచాయితీలు లాభించవు. స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండటమే శ్రేయోదాయకం.

మీనం : సంఘంలో ఉన్నతమైన వారు మీకు అనుకూలంగా వ్యవహరించడం కొంత ఊరట కలిగించే అంశమవుతుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

దుర్గమ్మకి లక్ష్మీ కాసుల హారం కానుక

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 3 ప్రభాతవార్త: దుర్గమ్మకి సోమవారం విజయవాడకు చెందిన దొండేటి ఐశ్వర్య జ్యోతి మరియు కుటుంబ సభ్యులు 108 గ్రాముల బరువైన రు.17లక్షల విలువైన లక్ష్మికాసుల హారాన్ని కానుకగా డిప్యూటి ఇఓ కిషోర్ కుమార్‌కు అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

ఆగస్టు 15 కల్లా నూతన లడ్డూ పోటు, అన్నప్రసాద భవనాలు సిద్ధం: ఆగస్టు 15కల్లా నూతన లడ్డూపోటు, అన్న ప్రసాద భవనాలు భక్తులకు అందుబాటులోకి తెస్తామని రాష్ట్ర దేవదాయ శాఖ కమీషనర్ కె రామచంద్ర మోహన్ అన్నారు. ఈ మేరకు అధికారులకు ఆయన ఆదేశాలిచ్చారు. మంగళవారం ఆయన నూతన భవనాల నిర్మాణాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనూతన భవనాలకు సంబంధించిన అన్ని రకాల సివిల్, ఇంజినీరింగ్, తుది మెరుగుల (ఫినిషింగ్) పనులను శరవేగంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ విభాగ సిబ్బందిని, కాంట్రాక్టర్లను ఆదేశించామన్నారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశామని వివరించారు.

శ్రావణ మాసంలో భక్తులకు అందుబాటులోకి: కనకదుర్గమ్మ వారిని దర్శించుకునేందుకు పవిత్ర శ్రావణ మాసంలో రోజువారీ భక్తుల రద్దీ విపరీతంగా పెరుగుతుందని, దానిని దృష్టిలో ఉంచుకుని ఈ రెండు నూతన భవనాలను శ్రావణ మాసంలోనే వైభవంగా ప్రారంభించి భక్తులకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రణాళికా బద్ధంగా సిద్ధమవుతున్నామని కమిషనర్ వివరించారు. కార్యక్రమంలో ఇఓ వి.కె. శీనా నాయక్, దేవాదాయ శాఖ చీఫ్ ఇంజినీర్ జి.వి.ఆర్. శేఖర్, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్. రమాదేవిలతో పాటు దేవస్థాన ఇంజినీర్లు,ఇతర ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తుల నుండి ఆషాఢం సారె అందుకుని అనుగ్రహిస్తున్న దుర్గమ్మ

పాతపాడు సోలార్ ప్లాంట్ విద్యుదీకరణ విజయవంతం: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం (ఇంద్రకీలాద్రి) విద్యుత్ స్వయంసమృద్ధి లక్ష్యంగా పాతపాడు గ్రామంలోని దేవస్థాన భూమిలో నెలకొల్పిన శ్రీ కనకదుర్గమ్మ వారి సోలార్ విద్యుత్ కేంద్రంలో రెండు 500 కిలోవాట్ల (ఒక మెగావాట్) సామర్థం కలిగిన ప్లాంట్లు విజయవంతంగా విద్యుదీకరణ పూర్తయిందని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిసిపిడిసిఎల్) ఉన్నతాధికారులు పాతపాడు ప్లాంట్‌ను సందర్శించి, విద్యుత్ ఉత్పత్తి మరియు అనుసంధాన ప్రక్రియను సమగ్రంగా తనిఖీ చేసినట్లు ఈవో తెలిపారు. ఎపిసిపిడిసిఎల్ అధికారుల సమక్షంలో సోలార్ ఇన్వర్టర్లు, గ్రిడ్ అనుసంధాన వ్యవస్థను పరిశీలించి ప్లాంట్‌ను దిగ్విజయంగా విద్యుదీకరించారని, ప్లాంట్ నుండి ఉత్పత్తి అయ్యే మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు పంపించే ప్రక్రియలో భాగమైన అత్యంత కీలకమైన ఏబీటీ మీటర్ల అమరిక పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయని ఈవో తెలిపారు. ఈ మీటర్ల ఏర్పాటు పూర్తికాగానే, ఇంద్రకీలాద్రి వినియోగం పోను మిగిలిన సోలార్ విద్యుత్‌ను నెట్ మీటరింగ్ విధానం ద్వారా అధికారికంగా గ్రిడ్‌కు సరఫరా చేయడం ప్రారంభమవుతుందని, దీని ద్వారా దేవస్థానానికి గణనీయమైన విద్యుత్ బిల్లుల ఆదా, ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.

శాకంభరీ ఉత్సవాల దాతలకు శ్రీ అమ్మవారి ప్రత్యేక దర్శనం: దుర్గమ్మవారి ఆలయంలో జరిగిన శాకంబరి ఉత్సవాలకు కూరగాయలు, పండ్లు విరాళంగా అందించిన దాతలకు ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం ఆయా దాతలకు శ్రీఅమ్మవారి మూలవిరాట్‌తో పాటు ఆలయ ప్రాంగణ అలంకరణ నిమిత్తం భక్తిశ్రద్ధలతో విరాళంగా కూరగాయలు, ఆకుకూరలు మరియు పండ్లను అందించిన దాతలకు దేవస్థానం తరఫున ప్రత్యేక దర్శనం, వేదాశీర్వచనం కల్పించారు. దర్శనానంతరం ఆలయ వేద పండితులు దాతలకు, వారి కుటుంబ సభ్యులకు వేదాశీర్వచనం గావించారు. ఆలయ అధికారులు దాతలకు అమ్మవారి శేషవస్త్రం, పవిత్ర తీర్థప్రసాదాలు అందజేసి గౌరవించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు బడేటి ధర్మారావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఆషాఢ సారె 20వ రోజు సోమవారం శ్రీ కనకదుర్గమ్మ సన్నిధిలో మహిళల రద్దీ విశేషంగా పెరిగింది. సాయంత్రం 5 గంటల వరకు 48 సారె బృందాలు రాగా, సదరు బృందాలలో 18432 మంది భక్తులు సారె సమర్పణకు వచ్చారు. సారె బృందాలకు ఉచిత దర్శనం, ఆశీర్వచనం అందించారు.

మంత్రి నారా లోకేష్ చొరవ

- విశాఖ నగర రవాణా ఆధునీకరణ వైపు అడుగులు
- కుదిరిన మాస్కో- విశాఖ స్మార్ట్ సిటీ ఒప్పందం

విజయవాడ, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి: విశాఖపట్నం నగర రవాణా ఆధునీకరణకు ఎపి ప్రభుత్వం– మాస్కో ప్రభుత్వాల మధ్య కీలక అవగాహన ఒప్పందం కుదిరింది. మంత్రి నారా లోకేష్ చొరవతో మాస్కో– విశాఖ స్మార్ట్ సిటీ ఒప్పందం సాధ్యమైందని ప్రభుత్వం ప్రకటించింది. మాస్కోలో జరిగిన అంతర్జాతీయ రవాణా సదస్సులో జివిఎంసి, మాస్కో ప్రభుత్వాల మధ్య ఒప్పందంపై సంతకాలు చేసాయి. ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, ఎఐ ఆధారిత రవాణా, డిజిటల్ టికెటింగ్, స్మార్ట్ మొబిలిటీపై పరస్పర సహకారంతో ముందుకు సాగాలని నిర్ణయించారు. మంత్రి నారా లోకేష్ రష్యా పర్యటనలో జరిగిన చర్చల ఫలితంగానే ఈ ఒప్పందం కుదిరినట్లు తెలియజేశారు. ప్రపంచ స్థాయి రవాణా నమూనాలను విశాఖలో అమలు చేసే దిశగా సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాల మార్పిడితో విశాఖను ప్రపంచ స్థాయి స్మార్ట్ సిటీగా, భవిష్యత్‌కు అనుగుణమైన టెక్నాలజీ ఆధారిత నగరంగా తీర్చిదిద్దే దిశగా ఈ ఒప్పందం కీలక అడుగని ప్రభుత్వం పేర్కొంది.

ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి అరెస్టుపై శాసనసభ కార్యదర్శి కార్యాలయం బులెటిన్ విడుదల

విజయవాడ, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి: ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి అరెస్టు వ్యవహారంపై ఎపి శాసనసభ కార్యదర్శి జనరల్ కార్యాలయం బులెటిన్ విడుదల చేసింది. శాసనసభ సభ్యులందరికీ సమాచారం అందిస్తూ జారీ చేసిన ఈ బులెటిన్‌లో ఎమ్మెల్యే అరెస్టుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బులెటిన్ ప్రకారం.. ఆగస్టు 2వ తేదీ తెల్లవారు జామున 3 గంటలకు కర్నూలు జిల్లా చిప్పగిరిలోని ఎమ్మెల్యే నివాసంలో విరూపాక్షి పోలీసులు అరెస్టు చేశారు. ఎమ్మెల్యేను ఆలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అరెస్టు చేసినట్లు బులెటిన్‌లో వెల్లడించారు. చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 37/2026 కేసులో అరెస్టు అయినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అలాగే చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లోనే నమోదైన మరో క్రైమ్ నంబర్ 38/2026 కేసులోనూ ఎమ్మెల్యే ఏ1గా ఉన్నట్లు అసెంబ్లీ బులెటిన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో బిఎన్ఎస్ సెక్షన్లతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కూడా కేసులు నమోదు చేసినట్లు ఎమ్మెల్యేలకు సమాచారం ఇచ్చారు. శాసనసభ్యుడి అరెస్టు జరిగిన నేపథ్యంలో సభా నిబంధనల ప్రకారం సభ్యులందరికీ వివరాలు తెలియజేస్తూ అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ఈ బులెటిన్ జారీ చేశారు. చిప్పగిరి మండలం నేమకల్లు, సంగాల గ్రామాలకు చెందిన టిడిపి కార్యకర్తలపై వందలాది మంది అనుచరులతో ఎమ్మెల్యే విరూపాక్షి దాడి చేశారు. పలువురు టిడిపి కార్యకర్తల ఇళ్లపైకి వెళ్లి ఆడ, మగ అనే తేడా లేకుండా తీవ్రంగా గాయపరిచారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే విరూపాక్షి సహా 34 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిలో 16 మందిని అరెస్టు చేయగా.. ఆలూరు కోర్టు రిమాండ్ విధించింది.

కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ క్రీడాకారులు అద్భుతంగా రాణించారు: డి.సిఎం పవన్

విజయవాడ, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి: కామన్వెల్త్ గేమ్స్‌లో భారత క్రీడాకారులు అద్భుతంగా రాణించారని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రశంసించారు. '39 పతకాలు సాధించడం దేశానికి ఎంతో గర్వకారణం. ఈ విజయం మన అథ్లెట్ల పట్టుదల, పోరాట పటిమకు నిదర్శనం. ప్రతి పతకం వెనుక దేశం కోసం ఆడాలనే బలమైన కోరికలు ఉన్నాయ్ఞి అని పవన్ కల్యాణ్ అన్నారు. రాత్రింబవళ్లు శ్రమించిన కోచ్‌లు, సహాయక సిబ్బంది కృషికి అభినందనలు తెలిపారు. పోటీల ప్రారంభం నుంచి ముగింపు వరకు అద్భుత క్రీడాస్ఫూర్తి చూపారని అన్నారు. రికార్డులు సృష్టిస్తూ క్రీడారంగాన్ని కొత్తదిశ వైపు తీసుకెళ్తున్నారని పవన్ పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని పెద్ద విజయాలకు ఈ ప్రయాణం స్ఫూర్తినివ్వాలని పవన్ అన్నారు. పతకాల వేదికపై నిలిచిన ప్రతి విజయం వెనుక అంకితభావం గల కోచ్‌లు, అలుపెరుగని కుటుంబాలు, అవిశ్రాంత సహాయక సిబ్బంది, ఆకాంక్షలను విజయాలుగా మార్చిన లెక్కలేనన్ని అదృశ్య ప్రయత్నాలు ఉన్నాయని వివరించారు. ప్రారంభ ఈవెంట్ నుంచి ఫైనల్ పోటీ వరకు, టీమ్ ఇండియా అసాధారణమైన పట్టుదల, క్రీడాస్ఫూర్తి, శ్రేష్ఠతను ప్రదర్శించిందని తెలిపారు. ప్రపంచ వేదికపై త్రివర్ణ పతాకాన్ని మోసుకెళ్లిన ప్రతి క్రీడాకారుడు, 140 కోట్లకు పైగా భారతీయుల ఆశలు, ఆకాంక్షలకు ప్రతీకగా నిలిచారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

దళిత మహిళపై దాడి అమానుషం

- వైసిపి దౌర్జన్యాలను సాగనివ్వం
- ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

నేమకల్లులో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కాలవ శ్రీనివాసులు

అనంతపురం, ఆగస్టు 3 ప్రభాతవార్త బ్యూరో: ఆలూరు నియోజకవర్గంలో వైసిపి ఎమ్మెల్యే విరూపాక్షి, అతని అనుచరుల దాడిలో తీవ్రంగా గాయపడిన దళిత మహిళ సుచిత్రను కర్నూలు జిల్లా ఆలూరు మండలంలోని నేమకల్లు గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను అడిగి ఘటన వివరాలను తెలుసుకుని, వారికి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన వైసిపి నాయకుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దళిత మహిళపై జరిగిన దాడి అత్యంత అమానుషమని, సభ్య సమాజం తలదించుకునేలా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒంటరిగా ఇంట్లో ఉన్న మహిళపై గుంపుగా వెళ్లి దాడి చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఒక మహిళను కొట్టడం, కాళ్లతో తన్నడంతో పాటు సభ్యసమాజం తలదించుకునేలా వివస్త్రను చేయటానికి పాల్పడటం దారుణమన్నారు. వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి, ఆ పార్టీ నాయకులు రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నేరచరిత కలిగిన వ్యక్తులను ప్రోత్సహిస్తూ రాష్ట్రంలో ఒక రకమైన అస్థిరతను సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. 2019 నుంచి 2024 వరకు వైసిపి పాలనలో జరిగిన దౌర్జన్యాలు, అరాచకాలను ప్రజలు గమనించారని, అందుకే 2024 ఎన్నికల్లో వైసిపికి ఘోర పరాజయం ఎదురైందన్నారు. అయినప్పటికీ ఆ పార్టీ నేతల తీరులో మార్పు రాకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రజలను భయపెట్టే, దళితులపై దాడులు చేసే, మహిళలపై దౌర్జన్యాలకు పాల్పడే ఎలాంటి శక్తులనైనా ప్రభుత్వం కఠినంగా అణచివేస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో దౌర్జన్యాలకు, హింసకు తావులేదని హెచ్చరించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను భయపెట్టే సంస్కృతిని వైసిపి విడనాడాలని, లేదంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని కాలవ శ్రీనివాసులు హెచ్చరించారు.

స్వయం సహాయక సంఘాలకు శుభవార్త

- రుణాలపై సర్వీసు చార్జీలు, వడ్డీ రేట్లు తగ్గింపు

విజయవాడ, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి: ఎపిలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం తీపి కబురు తెలిపింది. డ్వాక్రా సంఘాల ద్వారా ప్రభుత్వం నుంచి సాయం పొందుతున్న మహిళలకు మరింత లబ్ధి కలిగే విధంగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యంగా గ్రామీణ బ్యాంకుల్లో భారంగా మారిన సర్వీస్ ఛార్జీలతో పాటు రుణాలపై వడ్డీ రేట్ల నుంచి ఊరట కల్పించింది. దీంతో డ్వాక్రా సంఘాల మహిళలు ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తంచేస్తున్నారు. గ్రామీణ బ్యాంకుల్లో స్వయం సహాయక సంఘాల రుణాలపై అన్ని సేవా ఛార్జీల్ని మాఫీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అలాగే రూ.5 లక్షలు పైబడిన స్వయం సహాయక సంఘాల రుణాలపై వడ్డీని 13శాతం నుంచి 12శాతానికి తగ్గించారు. సిఎం చంద్రబాబు చొరవ, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కృషితో ఈ నిర్ణయం అమల్లోకి వచ్చిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దీంతో గ్రామీణ బ్యాంకుల్లో ఇకపై రుణాలు మరింత సులభతరం కానున్నాయి.ప్రభుత్వం గ్రామీణ బ్యాంకుల్లో రద్దు చేసిన వాటిలో రుణాలపై ప్రాసెసింగ్ ఫీజు, డాక్యుమెంటేషన్, ఇన్‌స్పెక్షన్, పాస్ బుక్, లెడ్జర్, క్యాష్ హ్యాండ్లింగ్ వంటి ఛార్జలు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతీ స్వయం సహాయక సంఘానికీ ఏడాదికి రూ.25 వేల వరకూ లబ్ధి కలుగుతుందని అంచనా వేస్తున్నారు. అలాగే గ్రామీణ బ్యాంకుల్లోని సుమారు 2.75 లక్షల మహిళా సంఘాలకు భారీ ప్రయోజనం కలుగుతుందని అంచనా. ఇప్పటికే డ్వాక్రా సంఘాల్ని బలోపేతం చేయడంతో పాటు వారి ఉత్పత్తులకు అంతర్జాతీయంగా మార్కెటింగ్ కల్పించేందుకు ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. వీటికి కొనసాగింపుగా ఇప్పుడు ఈ నిర్ణయాలు వెలువడ్డాయి.

ప్రధాని మోడీతో ఎంపి శ్రీకృష్ణదేవరాయలు భేటీ

విజయవాడ, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో గుంటూరు ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు మర్యాదపూర్వక భేటీ అయ్యారు. పల్నాడులో నిర్వహించిన 'క్రెడిట్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్స్' విజయంపై సమగ్ర నివేదిక 'పల్నాడు: ఎ క్రానికల్ ఆఫ్ ఫైనాన్సియల్ ట్రాన్స్‌ఫర్మేషన్'ను ప్రధాని మోడీకి అందజేసారు. 1,03,246 మంది లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలు అందించినట్లు ప్రధాని మోడీకి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు వివరించారు. 83,365 మంది రైతులకు రూ.2,286 కోట్ల వ్యవసాయ రుణాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. మహిళలు, యువత, ఎంఎస్ఎంఇలు, చేతివృత్తిదారులు, స్వయం సహాయక సంఘాలకు విస్తృతంగా ఆర్థిక సాయం అందించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా పల్నాడు జిల్లా సాధించిన ఆర్థిక పురోగతిని, ప్రజలకు చేకూరిన ప్రయోజనాలను ప్రధాని మోడీకి ఎంపి వివరించారు. పల్నాడు గ్రామీణ ఆర్థికాభివృద్ధి నమూనాను ప్రధాని మోడీ అభినందించి, 'వికసిత్ భారత్' లక్ష్యానికి కేంద్రం సంపూర్ణ సహకారం అందిస్తుందని హామీ ఇచ్చినట్లు ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు.

ఎపిలో పిఎం పోషణకు ఐదేళ్లలో రూ.1,465.40 కోట్ల కేంద్ర నిధులు

- లోక్‌సభలో విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రశ్నకు కేంద్ర మంత్రి జయంత్ చౌధరి వెల్లడి

విజయవాడ, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో అమలవుతున్న ప్రధానమంత్రి పోషణ (పిఎం పిఒఎస్‌హెచ్ఎఎన్) పథకంపై విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర సమాధానం ఇచ్చింది. పథకం కింద ఉన్న పాఠశాలల సంఖ్య, జిల్లా స్థాయి స్టీరింగ్ అండ్ మానిటరింగ్ కమిటీల ఏర్పాటు, సమావేశాల నిర్వహణతో పాటు గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు విడుదల చేసిన నిధుల వివరాలను కేంద్ర విద్యాశాఖ సభలో వెల్లడించింది. రాష్ట్రంలో పిఎం పోషణ పథకం కింద ఎన్ని పాఠశాలలు ఉన్నాయి? జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీలు పనిచేస్తున్నాయా? ఏడాదిలో ఎన్ని సమావేశాలు నిర్వహిస్తున్నాయి? గత ఐదేళ్లలో కేంద్రం ఎంత నిధులు విడుదల చేసింది? అనే అంశాలపై ఎంపి కేశినేని శివనాథ్ లోక్‌సభలో ప్రశ్నించారు. దీనికి కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌధరి సమాధానమిస్తూ, బాలవాటిక నుంచి 8వ తరగతి వరకు ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో పిఎం పోషణ పథకం అమలవుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన సమాచారం మేరకు జిల్లాల వారీగా పాఠశాలల సంఖ్య, స్టీరింగ్ అండ్ మానిటరింగ్ కమిటీల సమావేశాల వివరాలను లోక్‌సభకు సమర్పించినట్లు పేర్కొన్నారు.

రూ.1,465.40 కోట్ల కేంద్ర సహాయం: కేంద్ర మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం, 2021- 22 నుంచి 2025- 26 వరకు ఆంధ్రప్రదేశ్‌లో పిఎం పోషణ పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వం మొత్తం రూ.1,465.40 కోట్లు విడుదల చేసింది. ఇందులో 2021-22లో రూ.357.31 కోట్లు, 2022-23లో రూ.365.32 కోట్లు, 2023-24లో రూ.253.43 కోట్లు, 2024-25లో రూ.239.07 కోట్లు, 2025-26లో రూ.250.27 కోట్లు విడుదల చేసినట్లు లోక్‌సభలో వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో పిఎం పోషణ పథకం అమలవుతున్న పాఠశాలల సంఖ్యతో పాటు జిల్లా స్టీరింగ్ అండ్ మానిటరింగ్ కమిటీల సమావేశాల వివరాలను కూడా కేంద్ర ప్రభుత్వం అధికారికంగా లోక్‌సభకు సమర్పించింది.

విజయవాడ ఇఎస్ఐ ఆసుపత్రిని 300 పడకల టెర్షియరీ కేర్ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలి

- ఇఎస్ఐసి వైద్య కళాశాల ఏర్పాటు చేయాలంటూ ప్రతిపాదన
- లోక్‌సభలో నియమం-377 కింద

విజయవాడ ఇఎస్ఐ ఆసుపత్రి అభివృద్ధి అంశాన్ని ప్రస్తావించిన ఎంపి కేశినేని శివనాథ్

విజయవాడ, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడ గుణదాలలో ఉన్న ఉద్యోగుల రాష్ట్ర బీమా (ఇఎస్ఐ) ఆసుపత్రిని 300 పడకల టెర్షియరీ కేర్ ఆసుపత్రిగా ఉన్నతీకరించడంతో పాటు అదే ప్రాంగణంలో ఇఎస్ఐసి వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం లోక్‌సభలో నియమం-377 కింద ప్రత్యేక అంశంగా ప్రతిపాదించారు ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ, విజయవాడ గుణదల ఇఎస్ఐ ఆసుపత్రి దాదాపు ఆరు దశాబ్దాలుగా పారిశ్రామిక కార్మికులు, ఉద్యోగుల రాష్ట్ర బీమా పథకం లబ్ధిదారులు, వారి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తోందన్నారు. ప్రస్తుతం ఈ ఆసుపత్రిలో 110 పడకలు మాత్రమే ఉండగా, మధ్య ఆంధ్రప్రదేశ్‌లోని ఎనిమిది జిల్లాలకు చెందిన సుమారు 2.88 లక్షల మంది బీమాదారులు, దాదాపు 10 లక్షల మంది ఆధారిత కుటుంబ సభ్యులు ఈ ఆసుపత్రి సేవలపై ఆధారపడుతున్నారని తెలిపారు. గత కొన్నేళ్లుగా ఇఎస్ఐ లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా పెరిగినప్పటికీ ఆసుపత్రి సామర్థ్యం మాత్రం అదే స్థాయిలో కొనసాగుతోందని ఎంపి పేర్కొన్నారు. అవసరమైన సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో లేకపోవడంతో అనేక మంది రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేయాల్సి వస్తోందని, దీనివల్ల కార్మిక కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడటంతో పాటు చికిత్సలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. ఇఎస్ఐ ఆసుపత్రి ప్రాంగణంలో దాదాపు 25 ఎకరాల ఖాళీ స్థలం అందుబాటులో ఉందని, అదనపు భూసేకరణ అవసరం లేకుండానే ఆసుపత్రిని విస్తరించే అవకాశం ఉందని ఎంపి శివనాథ్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆధునిక వైద్య సదుపాయాలతో కూడిన టెర్షియరీ కేర్ ఆసుపత్రిని నిర్మించాలని కేంద్రాన్ని కోరారు. ప్రస్తుతం ఉన్న 110 పడకల ఆసుపత్రిని 300 పడకల టెర్షియరీ కేర్ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు అదే క్యాంపస్‌లో ఇఎస్ఐసి వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం, ఉద్యోగుల రాష్ట్ర బీమా సంస్థ తక్షణ చర్యలు చేపట్టాలని ఎంపి లోక్‌సభ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదన అమలైతే దాదాపు 13లక్షల మంది ఇఎస్ఐ లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులకు అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని ఎంపి తెలిపారు. అలాగే అత్యవసర వైద్య సేవలు మరింత సమర్థవంతంగా అందుతాయని పేర్కొన్నారు. వైద్యకళాశాల ఏర్పాటుతో వైద్య విద్యార్థులకు కొత్త అవకాశాలు లభించడంతో పాటు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. పారిశ్రామిక కార్మికుల సంక్షేమం, నాణ్యమైన ఆరోగ్య సేవల విస్తరణ, వైద్య విద్య అభివృద్ధి లక్ష్యాలతో చేసిన ఈ ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వం, ఉద్యోగుల రాష్ట్ర బీమా సంస్థ సానుకూలంగా స్పందించి, విజయవాడ ఇఎస్ఐ ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని ఎంపి కోరారు.

ఆరోగ్య శాఖ పేరుతో ఉద్యోగాల మోసం!

- నకిలీ నియామక లేఖలపై సిఐడికి ఫిర్యాదు
- డబ్బులు అడిగితే నమ్మొద్దని అధికారుల హెచ్చరిక

విజయవాడ, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ పేరుతో నకిలీ నియామకాల మోసాలకు పాల్పడుతున్న వ్యక్తులపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రభుత్వ చిహ్నాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముద్రలు, నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) పేరు, మంగళగిరిలోని ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయ చిరునామాను అక్రమంగా ఉపయోగించి నకిలీ నియామక ప్రకటనలు, ఇంటర్వ్యూ కాల్ లెటర్లు, అపాయింట్‌మెంట్ ఆర్డర్లు రూపొందించి నిరుద్యోగులను మోసం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంపై ఆరోగ్య శాఖ కార్యదర్శి, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ వీరపాండియన్ ఆదేశాల మేరకు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డి. ప్రకాష్ రావు డిజిపి కార్యాలయంలోని సిఐడి డైరెక్టర్ జనరల్ రవిశంకర్ అయ్యన్నార్‌కు రాతపూర్వకంగా సోమవారం ఫిర్యాదు చేశారు.

అధికారిక వెబ్ సైట్ చూడాలి: వాట్సాప్, ఈమెయిల్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా నకిలీ ఉద్యోగ ప్రకటనలు పంపించి, ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. ఉద్యోగం కోసం ప్రాసెసింగ్ ఫీజు, రిజిస్ట్రేషన్ ఫీజు, సర్టిఫికెట్ ధ్రువీకరణ పేరుతో ఎలాంటి మొత్తాలు చెల్లించవద్దని అధికారులు స్పష్టంచేశారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలో నియామకాలు కేవలం ఆంధ్రప్రదేశ్ వైద్య సేవల నియామక మండలి (ఎపిఎంఎస్ఆర్‌బి), జిల్లాల్లో కలెక్టర్ నేతృత్వంలోని డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా నియామకాలు జరుగుతాయని తెలిపారు. ఉద్యోగాలకు సంబంధించిన నోటిఫికేషన్లు, దరఖాస్తులు, ఇంటర్వ్యూలు, ఫలితాల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో మాత్రమే పరిశీలించాలని సూచించారు. అనుమానాస్పద సందేశాలు, నకిలీ నియామక లేఖలు అందినట్లయితే వెంటనే పోలీసులకు లేదా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

పొగాకు రైతుల గురించి మాట్లాడే హక్కు జగన్‌కు లేదు

- జగన్ హయాంలో రైతులు కష్టాల్లో ఉంటే ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషించింది
- కూటమి ప్రభుత్వం రైతులకు భరోసాగా నిలిచింది: మంత్రి అచ్చెన్నాయుడు



విజయవాడ, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి: రైతుల సంక్షేమం విషయంలో గత వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇప్పుడు రైతులపై ప్రేమ ఉన్నట్టుగా మాట్లాడటం జగన్‌మోహన్ రెడ్డికి ఏమాత్రం తగదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. ఐదేళ్ల పాలనలో పొగాకు రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయినా వారికి అండగా నిలవడంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందని అన్నారు. ఎపి మార్క్‌ఫెడ్ ద్వారా కేవలం 12.93 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలుతో చేతులు దులుపుకుని రైతులను మార్కెట్ కరుణకే వదిలేసిందని మండిపడ్డారు. రైతులకు శాశ్వత ఉపశమనం కలిగించే చర్యలు తీసుకోవడంలో, మార్కెట్‌లో సమర్థవంతంగా జోక్యం చేసుకోవడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పొగాకు రైతుల సమస్యలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని కార్యాచరణ ప్రారంభించిందని మంత్రి తెలిపారు. గత ఏడాదిలోనే సుమారు 25 మిలియన్ కిలోల హెచ్‌డి బర్లీ పొగాకును రూ.270 కోట్ల విలువతో కొనుగోలు చేసి వేలాది మంది రైతులకు అండగా నిలిచామని చెప్పారు. ఎఫ్‌సివి (వర్జీనియా) పొగాకు రైతులను ఆదుకునేందుకు లో, ఆఫ్ స్టైల్ రకాల పొగాకుకు కిలోకు రూ.10ల ఎపి ప్రభుత్వ ప్రోత్సాహకం అందజేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సుమారు రూ.100 కోట్ల ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. సుమారు 100 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి పొగాకు రైతుకు రూ.50 వేల వరకు వడ్డీలేని రుణాలు అందించే కేంద్ర కార్యాచరణ కొనసాగుతోందన్నారు. రైతులకు మార్కెట్ భరోసాతో పాటు ఆర్థిక తోడ్పాటు కూడా అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వంతో నిరంతర సమన్వయంతో పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయాన్ని సాధించిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

ఖరీఫ్-2026 సీజన్‌కు సంబంధించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద అన్ని ఖరీఫ్ పంటలకు పంటల బీమా నమోదు, ప్రీమియం చెల్లింపు గడువును ఆగస్టు 15 వరకు పొడిగించేలా కేంద్ర వ్యవసాయ శాఖ, బీమా సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా చర్చలు జరిపిందన్నారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేయడంతో ఈ నిర్ణయం సాధ్యమైందని చెప్పారు.

ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావం, ఇతర అనివార్య పరిస్థితుల వల్ల కలిగే పంట నష్టాల నుంచి రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంలో పంటల బీమా కీలక రక్షణగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. అందువల్ల రుణగ్రహీతలు, రుణేతర రైతులు అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి ఒక్క రైతు కూడా ఇన్సూరెన్స్ కట్టుకోవాలని, అతి తక్కువ ప్రీమియం ధరను రైతులు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, వ్యవసాయ అధికారులు రైతులకు పూర్తి అవగాహన కల్పించి, ఇన్సూరెన్స్ కట్టించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతు ఆగస్టు 15లోపు పంటల బీమాలో నమోదు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతుల కష్టసుఖాలు తెలియని వారు ఇప్పుడు రైతు ప్రేమ గురించి మాట్లాడటం విడ్డూరమని, మాటలతో కాదు... చేతలతో రైతులకు అండగా నిలవడం కూటమి ప్రభుత్వ నిబద్ధత అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

వార్త

వివేకవంతులతో గడిపిన సమయం మెరుగైనదైనట్లే, మంచి పుస్తకాలతో గడిపిన వయసు మెరుగైనదవుతుంది.

- ఆర్థర్ మిల్లర్

కావేరి రావణకాష్ఠమేనా?

రెండు దక్షిణాది రాష్ట్రాల మధ్య కావేరి నదీ జలాల వినియోగ సమస్య మళ్లీ రాజుకుంటోంది. కర్ణాటక తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఇదే తరుణంలో తమిళనాడుకు రోజుకి 3,500 క్యూసెక్కుల చొప్పున 4.5 టిఎంసిల నీటిని విడుదల చేయాలని కావేరి జలాల యాజమాన్య ప్రాధికార సంస్థ (సిడబ్ల్యుఎంఎ), కావేరి జలాల నియంత్రణ కమిటీ (సిడబ్ల్యుఆర్‌సి)లు ఆదేశించడంతో మళ్లీ ఈ సమస్య వెలుగులోకి వచ్చింది. ఈ యేడాది సాధారణ వర్షపాతంలో కేవలం 35 శాతం మాత్రమే నమోదైన పరిస్థితులలో కావేరి జలాల విడుదల విషయంలో కర్ణాటక ప్రభుత్వం ససేమిరా అంటోంది. కాగా ఆదివారం కర్ణాటకలో ప్రభుత్వ పక్షాన నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో కావేరి విషయంలో తమ సొంత ప్రయోజనాలే ముఖ్యమని, వాటిని చట్టపరిధిలోనే నిలబెట్టుకుందామని కర్ణాటక ముఖ్యమంత్రి డికె శివకుమార్ విజ్ఞప్తి చేశారు. జల వివాద పరిష్కారానికి ఈనెల 13న కన్నడ సంఘాలు రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈనేపథ్యంలో ఎలాంటి బంద్‌లకు పిలుపునివ్వొద్దని రాజకీయ పార్టీలు కన్నడ సంఘాలను ఆయన కోరారు. తనతో భేటీ అప్పుడే కాదని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు కర్ణాటక సిఎం శివకుమార్ హితవు చెప్పారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి విధ్వంసరచన మంచిదికాదని ఉభయ రాష్ట్రాలు తలపోయడం మంచిదే. కావేరి నది కర్ణాటకలో పుట్టి తమిళనాడు పుదుచ్చేరి, కేరళ గుండా ప్రవహిస్తుంది. ఇది వందేళ్ల నాటి జగడం. ప్రతి వేసవికి, యేటా వచ్చే నైరుతి రుతుపవనాల వైఫల్యానికి ఈ చిచ్చు రగులుతుంటుంది. కర్ణాటక కావేరి నదిలో చెప్పుకోదగిన జలరాశులేమీలేవు. ఉన్న నీటినిసాగునీటికే కాకుండా కేవలం తాగునీటి చెరువులను నింపేందుకు కాలవల ద్వారా నీటిని పంపిస్తున్నామని ఆ రాష్ట్ర ప్రభుత్వం వివరిస్తోంది. గత యేడాది తమిళనాడుకు 31 టిఎంసిల నీటిని విడుదల చేసింది. ఈ యేడాది కావేరి జలాశయాల్లో తగినంత నీరు లేదు. ఈ కారణం చేత పొరుగు రాష్ట్ర ప్రయోజనాలను పూర్తి స్థాయిలో కాపాడే పరిస్థితి కర్ణాటకకు లేదు. గతంలో ఎప్పుడు కావేరి ఎండిపోయి నీటి సమస్య వచ్చినా బంద్‌లు, విధ్వంసాలు, రాస్తారోకోలు వంటి కార్యాచరణకు రైతులు పూనుకునేవారు. ఈసారి ఉభయ రాష్ట్రాల మధ్య చిచ్చు రగలకుండా ప్రభుత్వాలు కృషి చేయడం ఆహ్వానించదగిన పరిణామం. కర్ణాటకలోని అఖిల పక్షాలు ప్రధానిని కలవనున్నాయి. ఈ వివాదానికి శాశ్వత పరిష్కారంగా 'మేకెదాటు' ప్రాజెక్టును కర్ణాటక ప్రభుత్వం ముందుకు తెచ్చింది. తమిళనాడు ఇంకా రంగంలోకి దిగలేదు. కానీ గతంలోలా కాకుండా ఈసారి ఆయా ప్రభుత్వాల ఆలోచనావైఖరి మారి ఉభయ రాష్ట్ర ప్రయోజనాలకు ఉమ్మడి కార్యాచరణ, సామరస్య చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్న యోచన చేస్తుండడం మంచిదే. గతంలో ఉద్యమాల వైఖరిఎటూ తేల్చకుండా సమస్యను పెండింగ్‌లో ఉంచి చప్పున చల్లార్చే తతంగంలా జరిగింది. దానితో సమస్య పరిష్కారం కాదుకదా! ఉభయ రాష్ట్రాల ప్రజలు రైతాంగం మధ్య ఆవేశకావేశాలు మాత్రం చల్లారేవికాదు. అందుకనే అంతరాష్ట్ర నదీజలాల వివాదాల సుడిలో కర్ణాటక, తమిళనాడుల మధ్య భావోద్వేగాలు రేకెత్తడం పరిపాటిగా మారింది. అత్యంత సుదీర్ఘకాలంగా కావేరి జలజగడాలు రావణ కాష్ఠంలో కాలుతోంది. కావేరి బేసిన్‌లో వర్షాభావ పరిస్థితులు, రిజర్వాయర్లలో నీటి మట్టాల తగ్గుదల కారణంగా జలజగడాలు ప్రారంభమవుతున్నాయి. ఏ రాష్ట్ర సమస్య వారిది. ఎవరి ప్రయోజనాలు వారు కాపాడుకోవాలన్న ఆరాటం. ప్రతిసారీ రాజకీయ పార్టీలు, రైతుసంఘాల ఆందోళనలు, బంద్‌కు పిలుపునివ్వడం షరా మామూలే. మళ్లీ ఈసారీ అదే దారిలో ఘర్షణలు పెరిగే పరిస్థితి ఉంది. కావేరి నదిని 2018లో సుప్రీంకోర్టు జాతీయ ఆస్తిగా ప్రకటించి 2రాష్ట్రాలు వాడుకోదగిన వాటాలను ఖరారుచేసింది. ఆ ప్రకారంకర్ణాటకకు 284.75 టిఎంసిలు, తమిళనాడుకు 404.25 టిఎంసిల నీటి వాటాదక్కింది. ఇందులోనే బెంగళూరు తాగునీటి అవసరాల బాధ్యత కూడాచేపట్టింది. ఐదు రాష్ట్రాల రాజకీయ భావోద్వేగాలను అదుపులో పెట్టుకుని సంయమనం పాటించి ఒక అవగాహనకువస్తే ఉభయతారకంగా ఉంటుంది. రెండు రాష్ట్ర ప్రభుత్వాల్లోనూ కాంగ్రెస్ పార్టీ భాగస్వామ్యంతో ఉన్నందున ముందుగా ఒక అవగాహనకు రావాలి. రుతుపవనాల అనిశ్చితితోపాటు ఈసారి ఎల్‌నినో, సూపర్ ఎల్‌నినో పరిస్థితులు తారాట్లాడుతుండగా వర్షపాతంలోటు కనపడుతోంది. మళ్లీ పొరుగు రాష్ట్రాలు జలజగడాల దారి పడుతున్నాయి. దాదాపు రెండు రాష్ట్రాలు సాంప్రదాయ వరినే పండిస్తున్నాయి. ఇది వర్షాధార సాగు దాంతో నీటిమీద ఆధారపడితే తప్ప సాగు, సమృద్ధి కానేరదు. ఎప్పుడు కావేరి నదీజలాలపై ఆందోళనలు ప్రారంభమైనా ఆస్తినష్టం జరిగేది. వివాదం తారాస్థాయికి చేరేది. ఫలితంగా భారీ అల్లర్లు విధ్వంసం. కానీ ఎన్నడూ శాశ్వత పరిష్కారం దొరికిన దాఖలాలు లేవు. 1991లో కావేరి నీటి పంపకాల తీర్పుల సమయంలో గొడవలు జరిగి, భాషాప్ర యుక్తదాడులు జరిగాయి. 2016 సెప్టెంబరులో సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు తమిళనాడుకు నీటిని విడుదల చేయాల్సి వచ్చినప్పుడు కర్ణాటకలో రైతులు ఆందోళనకు దిగారు. తమిళనాడులో కరువై, సాంబ పంటలకు జులై నెలలో నీరుకావాలి. దాని కోసమే ఆ రాష్ట్రం ఆరాటం. ఈసారైనా ఉభయ రాష్ట్రాలుశాశ్వత పరిష్కారం కోసం ఆలోచించాలి. ఏ ఆందోళనలకు దారి తీస్తాయో తెలియకుండా ఉంది. ఈసారైనా ఉభయ రాష్ట్రాలు శాశ్వత పరిష్కారం కోసం ఆలోచించాలి.



ఒర్పు, నేర్పు, సహనం ఉన్నవారికి కార్యసిద్ధి నిశ్చయం. ఒర్పుగా ఆలోచించగలిగితేనే చేయగలిగిందేదో చేయగలరు.

కె. స్టాన్‌స్లావిస్కి

ధైర్యంతో అన్ని సమస్యల్ని పరిష్కరించుకోవచ్చు. కనుక ఎట్టి పరిస్థితుల్లోనూ ధైర్యాన్ని కోల్పోరాదు.

జి. ఇలియట్

ప్రజావాక్కు

రోడ్లపై ఉమ్మివేస్తే శిక్షించాలి

మనదేశంలో ఎంత చదువుకున్నా, ఎంత నాగరీకులము అనుకున్నా ఒక్కసారి అనాగరికమైన చేష్టలు చేస్తుంటారు. ఇతరదేశాలలో రోడ్లమీద చెత్తవేస్తే జరిమానా ఉంటుంది. కారులో పోతూ అరటికాయ తింటే తొక్క దాచిపెట్టి ఆగిన చోట చెత్త బుట్టలో వేస్తారు. మనం మాత్రం ఉదాహరణకు మన దేశంలో బస్సులోపోతూ నీళ్ల తగిన బాటిల్స్, అరటితొక్కలు విసిరి బయట పడేస్తారు. అవి వెనుక వచ్చే వారి ముఖాన పడతాయి. వీలైతే తగాదా, లేకపోతే తిట్టుకుంటూ పోవడం. ఇక చెత్త సంగతి సరి. ఇలాంటిదే నిన్న బొంబాయి హైకోర్టుకు ఒక కేసువస్తే, న్యాయమూర్తులు జి.ఎస్.కులకర్ణి, ఆర్తి సాధేలు సంయుక్తంగా ఇలాచెత్త వేయ్యటాన్ని, రోడ్లమీద ఉమ్మి వేయడాన్ని చాలా తీవ్రంగా పరిగణించి, ఇలా వేసేవారిపై తగు చర్యలు తీసుకోవాలని, శిక్షి ంచాలని తెలిపారు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

విమర్శల పర్వం

పోయిన అధికారాన్ని లాక్కోవాలని మళ్లీ అధికార పీఠంపై అధిష్టించాలని బి.ఆర్.ఎస్ వచ్చే శాసనసభ ఎన్నికల్లో ఎలాగోలా గెలిచి తొలిసారి తెలంగాణలో పాగా వేయాలని బిజెపి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రభుత్వంలో ఉన్న పార్టీ వారిని అనేక విధాలుగా ఇబ్బంది పెడుతూ వారికి మనశ్శాంతి లేకుండా చేస్తున్నాయి. తాము ఎంతో కష్టపడి సంపాదించుకున్న అధికారాన్ని నిలుపుకోవడానికి మరింతఎక్కువగా కష్టపడవలసిన పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ముఖ్యమంత్రి, ఇతర మంత్రులపై కుళ్లు, అసూయతో కూడిన విమర్శలు చేస్తూ ఈ రెండు పార్టీలో అధికారం కోసం పాకులాడుతున్నాయి. వీరి తీరు ఇలా ఉంటే ప్రజాభిమానానికి దూరం కావలసి వస్తుంది.

- ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

నిత్యావసర ధరలను తగ్గించాలి

ఇవాళ ప్రతి రోజూ నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతూనే ఉన్నాయి. అన్నింటిపై పన్నుల భారం పెంచుతూనే ఉన్నారు. ఇలా అన్నింటిపై ధరలు పెంచుకుంటూ పోతే సామాన్యుడుఎలా బతకాలో ఎవరూ ఆలోచించడం లేదు. పెరుగుతున్న ధరలను నిత్యం అదుపులో ఉంచడానికి ఏమార్గాలు లేవా? పాలకులు నాయకులు మేధావులు ఆలోచించాలి. సామాన్యుడిపై భారంగా మారుతున్న ఈ ధరలను అదుపు చేయలేకపోతే బతకడం కష్టం.

-సింగు. లక్ష్మీనారాయణ, కరీంనగర్

ఇ-గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు ఇ-గ్రంథాలయం ఏర్పాటు చేసేదిశగాచర్యలు తీసుకోవాలి. నేటియుగం ఇంటర్నెట్ కాలం. పూర్వం పుస్తకం హస్త భూషణం. ప్రస్తుతం అండ్రాయిడ్ ఫోన్ హస్త భూషణం. నేటి కాలంలో అండ్రాయిడ్ ఫోన్ లేని ఇల్లులేదు. ప్రతీపాఠశాలలో వాట్సాప్‌గ్రూపులున్నాయి. ఈగ్రూపులల్లో ప్రతీరోజు పిల్లల కథలు పోస్ట్‌చేసి వారిచే చదివించాలి. ఇలా పోస్ట్‌చేసిన కథలు విద్యార్థులు ఫోన్లో గ్రంథాలయంగా ఏర్పాటు చేసుకోవాలి. వారంలో వచ్చిన కథలు ప్రతీ శనివారం నోబాగ్‌డేగా ఉంచి తరగతిలో విద్యార్థులచే చెప్పించాలి. దసరా, పండుగ సెలవుల్లో విద్యార్థులు పాఠశాల వాట్సాప్ గ్రూపుల్లో పాతవి రాయడం చేయాలి. లేదా వాయిస్‌తో చదివి వినిపించాలి. ఇలా చేయడం వలన పిల్లల మానసిక వికాసం సాధ్యంఅవుతుంది. ఆదివారంవచ్చే సండే మ్యాగజైన్లు కూడా పోస్ట్ చేయొచ్చు. దిన పత్రికలు కూడా ప్రతీ రోజూ పోస్ట్ చేస్తే విద్యార్థుల్లో ప్రపంచ జ్ఞానం పెరుగుతుంది. పూర్వం విష్ణుశర్మ కథలు ద్వారా రాజకుమారుల్లో మానసిక పరిపక్వత సాధించిన తీరు మనకు తెలిసిందే.

- రాళ్లబండి సంగం నాయుడు, హైదరాబాద్

పెరుగుతున్న పేదరికం

భారత్ ఒక వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. అయితే గత రెండు దశబ్దాలలో పేదరిక నిర్మూలన జరిగిన మాట వాస్తవం. కానీ అంత కంటే ఎక్కువగా ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయి అన్నది కూడా వాస్తవం. ఇది పేదరికం కంటే ప్రమాదకరం. 2006 లో తెచ్చిన ఉపాధి హామీ పథకం లాంటివి ప్రజల జీవనప్రమాణ స్థాయినిగ్రామీణ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్నిఅందుకోవడానికి ఉపయోగపడ్డాయేమో కానీ, ఆర్థిక అసమానతలు తగ్గించడంలో విఫలమయ్యాయి. ఇక్కడ ప్రభుత్వం పోషించే పాత్రకూడా ముఖ్యమే. ఎందుకంటే కార్పొరేట్ వర్గాలకు పరిశ్రమల స్థాపన పేరుతో ఇచ్చే తాయిలాలు పునాది పైన అత్యంత ధనవంతులుగా పారిశ్రామిక వేత్తలు ఎదుగుతున్నారు. పేదలు పేదలుగానే ఉండిపోతున్నారు.

- భారత అవినాష్, జనగామ

అక్రమ వసూళ్లు ఆపాలి

రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు బడులు, కాలేజీలో నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రుల రక్తం పిలుస్తున్నాయి యాజమాన్యాలు. అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టి అధిక ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలలను సీజ్ చేయాలి. వారిపై చర్యలు తీసుకొని అమలు చేయాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

ఇంధన భద్రతకు 'సముద్ర మథనం'

దేశీయ ఇంధన వనరులను పెంచడం, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం, పెట్టుబడులను ఆకర్షించడం, దేశీయ పరిశ్రమలను బలోపేతం చేయడం, ఉపాధి అవకాశాలను పెంచడంవంటి అనేక లక్ష్యాలు ఇందులో ముడిపడి ఉన్నాయి. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణంలో కీలక రంగాల్లో విదేశీ ఆధారాన్ని తగ్గించి దేశీయ సామర్థ్యాన్ని పెంచుకోవడం నరేంద్ర మోడీ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమైన విధానాల్లో ఒకటి. ఆ క్రమంలో సముద్ర మంథన్ మరో ముఖ్యమైన అడుగు. సముద్ర గర్భంలో ఉన్న సంపదను వెలికితీయడం ఎంత ముఖ్యమో, దానిని శాస్త్రీయంగా, బాధ్యతాయుతంగా వినియోగించడం కూడా అంతే ముఖ్యం. ఈ రెండింటినీ సమన్వయం చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయగలిగితే, భారతదేశ ఇంధన భద్రత మరింత బలోపేతమై, స్వావలంబన దిశగా దేశ ప్రయాణానికి ఇది ఒక కీలక మలుపుగా నిలిచే అవకాశం ఉంది.

వనకల్ల వీరప్ప

భారత దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న కొద్దీ ఇంధన అవసరాలు కూడా పెరుగుతున్నాయి. పరిశ్రమలు, రవాణా, వ్యవసాయం, విద్యుత్ ఉత్పత్తి, పట్టణ జీవనం. ఇలా ప్రతి రంగానికీ ఇంధనం అవసరం. ఈ అవసరాలను తీర్చేందుకు ఇతర దేశాలపై ఎక్కువగా ఆధారపడటం దీర్ఘకాలంలో దేశ ఆర్థికవ్యవస్థకు భారంగా మారే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు మారడం, వివిధ దేశాల మధ్య ఉద్రిక్తతలు, యుద్ధాలు, సరఫరాలో అంతరాయాలు వంటి పరిణామాలు మన ఇంధన భద్రతను ప్రభావితం చేయగలవు. అందుకే దేశంలోనే లభించే వనరులను గుర్తించి వినియోగించుకోవడం అత్యవసరంగా మారింది. ఈ నేపథ్యంలో సముద్ర గర్భంలో దాగి ఉన్న చమురు, సహజవాయు నిల్వలను అన్వేషించేందుకు రూ.84,084 కోట్లతో సముద్ర మంథన్ కార్యక్రమానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాబోయే ఐదేళ్లలో లోతైనసముద్ర ప్రాంతాల్లో విస్తృతంగా తవ్వకాలు చేపట్టడం, సముద్ర గర్భంలోని వనరులపై సమగ్ర సమాచారం సేకరించడం, గుర్తించిన నిల్వల నుంచి ఉత్పత్తి ప్రారంభించేందుకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడం ఈ కార్యక్రమంలోని ప్రధాన లక్ష్యాలు. ఇది కేవలం చమురు, సహజవాయు కోసం చేసే అన్వేషణ కాదు. దేశ భవిష్యత్తు ఇంధన అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన దీర్ఘకాలిక ప్రణాళిక. సముద్రమంథనం మన పురాణాల్లో దాగిఉన్న అమృతాన్ని వెలికితీసినఘట్టం. అదే భావనను ఆధునిక కాలానికి అన్వయిస్తూ సముద్ర గర్భంలోని సహజ సంపదను వెలికితీసే కార్యక్రమానికి సముద్ర మంథన్ అనే పేరు పెట్టడం అర్థవంతంగా ఉంది. అయితే దీని లక్ష్యం కేవలం చమురు, సహజవాయు ఉత్పత్తిని పెంచడం మాత్రమే కాదు. విదేశీ పరిణామాల వల్ల ఇంధన సరఫరాకు ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించి, దేశ అవసరాలకు తగినంత ఇంధనాన్ని సాధ్యమైనంత వరకు దేశీయంగా సమకూర్చుకోవడం దీని ప్రధాన ఉద్దేశం. ఈ కార్యక్రమంలో లోతైన సముద్రాల్లో తవ్వకాలు, సముద్ర గర్భంపై సమాచార సేకరణ, ఉత్పత్తికి అవసరమైన మౌలిక వసతుల కల్పన, చమురు-సహజవాయు రంగానికి అవసరమైన పరికరాలు, సేవా కేంద్రాల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తున్నారు. ముఖ్యంగా సముద్ర గర్భానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించడంపై చూపుతున్న శ్రద్ధ ఎంతో కీలకం. ఎక్కడ చమురు లేదా సహజవాయు నిల్వలుండే అవకాశం ఉందో తెలుసుకోవడానికి సముద్ర గర్భంలోని భౌగోళిక నిర్మాణాన్ని ముందుగా అధ్యయనం చేయాలి. ఆధునిక శాస్త్ర సాంకేతిక పద్ధతులతో ఈ సమాచారాన్ని విశ్లేషించడం వల్ల అన్వేషణలో సమయం, ఖర్చు రెండింటినీ ఆదా చేయవచ్చు. లోతైన సముద్రాల్లో అన్వేషణ సాధారణ తవ్వకాలతో పోలిస్తే ఎంతో క్లిష్టమైనది. భారీ యంత్రాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నిపుణులైన సిబ్బంది అవసరం. పెట్టుబడి కూడా ఎక్కువే. ఈ కారణంగా ప్రారంభ దశలో ప్రభుత్వ సహకారం చాలా అవసరం. ప్రభుత్వం మద్దతు ఇస్తే ప్రైవేటు సంస్థలు, సాంకేతిక సంస్థలు కూడా ఈ రంగంలోకి రావడానికి ముందుకు వస్తాయి. దేశీయ సంస్థలతో పాటు ప్రపంచవ్యాప్తంగా అనుభవం ఉన్న సంస్థల భాగస్వామ్యంతో కొత్త సాంకేతికతమనకు అందుబాటులోకి వచ్చే అవకాశంఉంటుంది. ఈ కార్యక్రమం ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి కూడా బలాన్ని చేకూరుస్తుంది. ఆత్మనిర్భరత అంటే ప్రపంచంతో సంబంధాలు తెంచుకోవడం కాదు.

మనకు అవసరమైన కీలకరంగాల్లో మన సామర్థ్యాన్ని పెంచుకుని, ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితిని తగ్గించుకోవడం. దేశంలోనే చమురు, సహజవాయు ఉత్పత్తి పెరిగితే దిగుమతులపై ఒత్తిడి కొంత తగ్గుతుంది. విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేసుకునే అవకాశంఉంటుంది. అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు పెరిగినా వాటి ప్రభావాన్ని కొంతవరకు నియంత్రించగలుగుతాం. ఇక ఈ కార్యక్రమం వల్ల ప్రయోజనం కేవలం ఇంధన రంగానికే పరిమితంకాదు. లోతైనసముద్ర అన్వేషణకు అవసరమైన యంత్రాలు, పరికరాలు, నౌకలు, సాంకేతిక సేవలు, ఇంజినీరింగ్ పనులు, సమాచార విశ్లేషణ వంటి అనేక రంగాలుఅభివృద్ధి చెందుతాయి. దేశీయ సంస్థలకు కొత్త అవకాశాలులభిస్తాయి. కొత్త నైపుణ్యాలు అవసరమవడంతో యువతకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశంఉంది. ఈవిధంగా సముద్రమంథన్ దేశ పారిశ్రామిక రంగానికికూడా కొత్త ఊపునిచ్చే సామర్థ్యం కలిగి ఉంది. ఇంధనం విషయంలో స్వావలంబనకు ఆర్థిక ప్రాధాన్యంతో పాటు వ్యూహాత్మక ప్రాధాన్యమూ ఉంది. ఒక దేశ ఆర్థిక వ్యవస్థ సజావుగా సాగాలంటే ఇంధన సరఫరా నిరంతరంగా ఉండాలి. అంతర్జాతీయ సంక్షోభాలు, యుద్ధాలు లేదా సరఫరా మార్గాల్లో అంతరాయాలు ఏర్పడినప్పుడు దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే దేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటాయి. అందువల్ల దేశీయ వనరులను అభివృద్ధి చేసుకోవడం ఆర్థిక అవసరం మాత్రమే కాదు. జాతీయ భద్రతకు సంబంధించిన అంశం కూడా. అయితే సముద్ర సంపదను వినియోగించుకునే క్రమంలోపర్యావరణాన్ని విస్మరించకూడదు. సముద్రంలో అనేక రకాల జీవులు, చేపల సంపద, సున్నితమైన పర్యావరణ వ్యవస్థలున్నాయి. తీర ప్రాంత ప్రజలు, ముఖ్యంగా మత్స్యకారుల జీవనోపాధి కూడా సముద్రంపైనే ఆధారపడి ఉంది. కాబట్టి అన్వేషణ పనులు చేపట్టేటప్పుడు సముద్ర జీవవైవిధ్యానికి, మత్స్యకారుల ప్రయోజనాలకు నష్టంకలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆధునిక భద్రతా ప్రమాణాలు, పర్యావరణ నియమాలు కచ్చితంగా అమలు చేయాలి. అలాగే భారీగానిధులు కేటాయించడం మాత్రమే కార్యక్రమం విజయానికి హామీ కాదు. పనులు నిర్ణయించిన సమయంలో పూర్తికావాలి. వివిధ శాఖల మధ్య సమన్వయం ఉండాలి. నిపుణుల సేవలను సమర్థంగా వినియోగించుకోవాలి. అనుమతుల విషయంలో అనవసర జాప్యం లేకుండా చూడాలి. పెట్టుబడిదారులకు స్పష్టమైన విధానాలు, స్థిరమైన నిబంధనలు ఉండాలి. అప్పుడే ఈభారీ కార్యక్రమం ఆశించిన ఫలితాలను అందిస్తుంది. భారతదేశ భవిష్యత్తు ఇంధన అవసరాలను తీర్చుకోవడంలో చమురు, సహజవాయుతో పాటు సౌర, పవన, జల, అణు, హరిత ఇంధన వనరులకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. ఒకదానిని మరొకదానికి ప్రత్యామ్నాయంగా చూడకుండా, అన్నింటినీ సమన్వయం చేసుకున్న సమగ్ర ఇంధన విధానం అవసరం. దేశీయ చమురు, సహజవాయు అన్వేషణ ఆ విధానంలో ఒకముఖ్యమైన భాగంగా ఉండాలి. ఈదృష్టితో చూస్తే సముద్ర మంథన్ ఒక సాధారణ ప్రభుత్వ పథకం కాదు. భారతదేశం తన సముద్ర సంపదను కొత్త కోణంలో చూసే ప్రయత్నం. దేశీయ ఇంధన వనరులను పెంచడం, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం, పెట్టుబడులను ఆకర్షించడం, దేశీయ పరిశ్రమలను బలోపేతం చేయడం, ఉపాధి అవకాశాలను పెంచడంవంటి అనేక లక్ష్యాలు ఇందులో ముడిపడి ఉన్నాయి. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణంలో కీలక రంగాల్లో విదేశీ ఆధారాన్ని తగ్గించి దేశీయ సామర్థ్యాన్ని పెంచుకోవడం నరేంద్ర మోడీ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమైన విధానాల్లో ఒకటి. ఆ క్రమంలో సముద్ర మంథన్ మరో ముఖ్యమైన అడుగు. సముద్ర గర్భంలో ఉన్న సంపదను వెలికితీయడం ఎంత ముఖ్యమో, దానిని శాస్త్రీయంగా, బాధ్యతాయుతంగా వినియోగించడం కూడా అంతే ముఖ్యం. ఈ రెండింటినీ సమన్వయం చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయగలిగితే, భారతదేశ ఇంధన భద్రత మరింత బలోపేతమై, స్వావలంబన దిశగా దేశ ప్రయాణానికి ఇది ఒక కీలక మలుపుగా నిలిచే అవకాశం ఉంది. ●

యువతరం జోరుతో ఊపందుకున్న ఉద్యమాలు

ఐ.ప్రసాదరావు

నీట్ పేపర్ లీక్ అయిన తరువాత విద్యావ్యవస్థలో ప్రక్షాళన కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ మొదటిగా సామాజిక మాధ్యం ద్వారా చేపట్టిన నిరసన ఉద్యమం అనతికాలంలోనే ప్రత్యక్షరూపం ధరించి, చివరికి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా వరకూ దారితీసింది. ఇంకా వారి పలు డిమాండ్ల సాధన కోసం పలువిధాలుగా దేశ వ్యాప్తంగా గళం విప్పుతున్నారు. ఇటువంటి సమయంలో మరికొన్ని 'కాపీ క్యాట్' ఉద్యమాలు దేశవ్యాప్తంగా పలు అంశాలపై సామాజిక మాధ్యమాల ద్వారా పురుడు పోసుకుంటున్నాయి. ముఖ్యంగా కుల ఆధారంగా కాకుండా ప్రతిభ, సమాన అవకాశాలు ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలి అని 'రిజర్వేషన్ హటావో' సామాజిక ఉద్యమం ఊపందుకుంది. ఇంకా నాణ్యమైన పెట్రోల్ కావాలని 'ఈ 20జనతా పార్టీ' కబూతర్, జనరల్, జాతివాద్, భగ్వా జనతా పార్టీ వంటి అనేక సామాజిక మాధ్యమాల నిరసన ఉద్యమాలు దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు తమతమ సాంప్రదాయ పద్ధతిలో, వేచిచూసే ధోరణితో పనిచేస్తే, ప్రమాదాలు కొని తెచ్చుకోవడమే అవుతుంది. దీనికి ప్రధాన కారణం గత 30 సంవత్సరాలుగా వారు అధికారం నిలబెట్టుకోవడానికి ఓటు బ్యాంకు రాజకీయాలు చేసారు తప్ప, యువత ఆకాంక్షలను నెరవేర్చే దిశగా అడుగులు వేయలేదు. ముఖ్యంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం వల్లే నిరుద్యోగ యువత రోడ్డు ఎక్కే పరిస్థితి నెలకొంది. ముందుగా ఈ 'జెన్ జెడ్ యువత' అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో సెల్‌ఫోన్ ఇతర యాప్‌ల ద్వారా సామాజిక మాధ్యమాల్లో వారివారి అభిప్రాయాలను షేర్ చేసుకుంటూ ఉద్యమాలకు ఊపిరులు ఊదుతూ, పాలకులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. తదుపరి ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకుంటున్నారు. దీంతో అధికార పార్టీ ఆపసోపాలు పడే పరిస్థితి ఏర్పడుతుంది. అందుచేతనే నేటి ప్రభుత్వాలు ముఖ్యంగా యువత, విద్యార్థుల్లో పేరుకుపోయిన అసంతృప్తిని తొలగించి, వారి సమస్యలు పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. మరోవైపు వివిధ ఉద్యోగ, ఉన్నత విద్యా అర్హత పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు తరచూ లీక్ అవడంతో మనస్తాపం చెందిన యువత, విద్యార్థులు, సామాజిక మాధ్యమాల ద్వారా ఒకటై తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. దాదాపు ఇటీవల కాలంలో 152 పేపర్ లీక్‌లు అయినట్లు తెలుస్తోంది.. ముఖ్యంగా ఎంతో కష్టపడి, తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ వివిధ పోటీ పరీక్షలకు కోచింగ్ సెంటర్లో లక్షలు, వేల రూపాయలు ఖర్చు చేసి చదివిస్తున్నారు. తీరా ఈ లీక్‌లు వలన పిల్లలు భవితవ్యం, తల్లిదండ్రులు భవితవ్యం మృగ్యంఅవుతుంది. కొంతమంది విద్యార్థులు తీవ్రంగా మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. మరికొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దీనికంతటికీ కారణం అవినీతి, వ్యవస్థలో లోపాలు, విద్య ప్రైవేటీకరణ కార్పొరేటీకరణ అవడమే సరి కదా, జరుగుతున్న తప్పిదాలను ప్రభుత్వాలు సరిచేయకుండా, సమర్థించుకోవడం పరిపాటిగా మారింది. దీంతో విసుగు చెందిన యువత విద్యార్థులు సామాజిక మాధ్యమాల ద్వారా నిరసన ఉద్యమాలకు శ్రీకారం చుడుతున్నారు. ముఖ్యంగా ఎన్నికల వాగ్దానాలు పాలకులు మరవడం పెద్ద పొరపాటు అని ఇకనైనా గ్రహించాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా పలుచట్టాలు మార్చాలి. ముఖ్యంగా యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. ఎప్పుడూ కార్పొరేట్ ప్రపంచానికి రాయితీలు ప్రోత్సాహకాలు ఇవ్వడం మానాలి. సంపన్నులు అభివృద్ధే దేశాభివృద్ధి అనే భావన నుంచి నేటి ప్రభుత్వాలు బయటపడాలి. ●

మధ్యాహ్న భోజన ఏజెన్సీల వెతలు తీరేదెన్నడు?

కామిడి సతీష్ రెడ్డి

విద్యార్థుల కడుపు నింపేందుకు మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు ఇబ్బందిపడుతున్నారు. ప్రభుత్వం చెల్లించేబిల్లులు ఏమాత్రం పొంతన లేకపోవడంతో వంట చేయడం ఆర్థిక భారంగా మారుతోందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. విద్యార్థులకు వడ్డించే కోడిగుడ్డు బయట మార్కెట్‌లో రూ.8 నుంచి రూ.9 ఉండగా, ప్రభుత్వం రూ.6 మాత్రమే చెల్లిస్తుండడం ఎంతవరకు సమంజసమని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, మధ్య తరగతి విద్యార్థులకు పౌష్టికాహారం అందించడానికి అమలు చేస్తున్న మధ్యాహ్నభోజన పథకం వంటఏజెన్సీలకు భారంగా మారుతోంది. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడానికి రోజురోజుకూ పెరుగుతోన్న కూరగాయలు, నిత్యావసర సరుకులతోపాటు కోడిగుడ్ల ధరలు అడ్డంకిగా మారుతున్నాయి. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లిస్తున్న వంట ఖర్చులు ప్రస్తుత మార్కెట్ ధరలకు ఏమాత్రం సరిపోవడంలేదు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో పెట్రోల్, డీజిల్ ధరలతోపాటు రవాణా చార్జీలు పెరిగాయి. దీంతో నిత్యావసర సరుకుల ధరలు సైతం ఆకాశాన్నంటుతున్నాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా కూరగాయల దిగుబడి తగ్గిమార్కెట్‌లో ఒక్కసారిగా ధరలు పెరిగిపోతున్నాయి. ఇటీవలకాలంలో కోడిగుడ్ల ధరలు సైతం గణనీయంగా పెరిగిపోయాయి. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన మధ్యాహ్న భోజన మెనూను అమలు చేయడం కష్టసాధ్యంగా మారిపోతోందని నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు లక్షల సంఖ్యలో వున్నాయి. వీరికి పీఎం పోషణ్ మధ్యాహ్నభోజన పథకం కింద అమలుకు రాష్ట్ర ప్రభుత్వం 40శాతం, కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులను భరిస్తోంది. మధ్యాహ్న భోజనం అందించడానికి కుక్స్ కం హెల్పర్స్ ఏజెన్సీలుగా పనిచేస్తున్నారు. ప్రతీరోజు మెనూ ప్రకారం వంటలు చేసి వడ్డిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వం ప్రస్తుతం రోజువారి చార్జీల కింద ఏజెన్సీలకు 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదివే ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు రూ.6.78పైసలు, ప్రాథమికోన్నత (6 నుంచి 8వ తరగతి) విద్యార్థులకు రూ.10.17, ఉన్నత పాఠశాలల్లో 9,10 తరగతుల విద్యార్థులకు రూ.13.17 చెల్లిస్తున్నారు. కోడిగుడ్డుకు అదనంగా రూ.6 చెల్లిస్తారు. ప్రస్తుత మెనూ ప్రకారం వారంలో మూడు రోజులు ఒక్కో విద్యార్థికి ఒక్కో కోడిగుడ్డును అందించాల్సి ఉంటుంది. అదేవిధంగా పారితోషికంగా నెలకు రూ.3వేలు చెల్లించనున్నారు. ఒక్క కోడి గుడ్డుపై రూ.2భారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంకోసం ప్రభుత్వం అందిస్తున్న మెస్‌చార్జీ, వంట ఖర్చులు మార్కెట్‌ధరల ప్రకారం ఏ మాత్రం సరిపోని పరిస్థితులున్నాయి. విద్యార్థులకు వారంలో మూడు రోజులు అందించే ఒక్క కోడిగుడ్డుపైనే రూ.2

అదనపు భారం ఏజెన్సీలపై పడుతోంది. వంటగ్యాస్, కూరగాయలు ధరల పెరుగుదలతో ఏజెన్సీల నిర్వహణ మోయలేని భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ప్రభుత్వం నిర్ణయించిన ఛార్జీల్లో పౌరసరఫరాల శాఖ సరఫరా చేసే సన్న బియ్యం, మినహా మధ్యాహ్న భోజన, మెనూ ప్రకారం సిద్ధం చేయడానికి అవసరమైన నిత్యావసర సరుకులు ఏజెన్సీలే సమకూర్చాల్సి ఉంటుంది. దీంతో ప్రస్తుతం పెరుగుతున్న ధరల ప్రకారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య ఆధారంగా వారానికి మూడు కోడిగుడ్లు అందించడం ద్వారా సంబంధిత ఏజెన్సీల మీద ఆర్థిక భారం పడుతుంది. వారం రోజుల మెనూ అమలు సైతం సమస్య అవుతుంది. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించే లక్ష్యంతో సోమవారం నుంచి శనివారం వరకు మెనూ నిర్ణయించింది. ఈ మెనూ ప్రకారం కూరగాయలు, సాంబారు, పప్పు దినుసులు, ఆకు కూరలతోపాటు చిక్కి వంటి పోషకాహార పదార్థాలను అందించాల్సి ఉంటుంది. అయితే పెరిగిన నిత్యావసర సరకుల ధరలతో నాణ్యమైన భోజనం అందించడం కష్టసాధ్యమవుతుందని ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల ప్రభావం కూరగాయల దిగుబడిపై పడింది. దీంతో ఇతర ప్రాంతాల నుంచి తెప్పిస్తున్న టమాట, బీరకాయ, బెండకాయ, బీన్స్, క్యారెట్, ఆకుకూరల ధరలు సైతం గణనీయంగా పెరిగాయి. పప్పులు, వంట నూనె, పసుపు, కారం ఇతర మసాల దినుసుల ధరలు సైతం విపరీతంగా పెరిగాయి. వంటగ్యాస్ ధరలు పెరగడంతో ప్రభుత్వం నిర్ణయించిన వంటచార్జీలతో నాణ్యమైన సరుకులు అందించలేకపోతున్నామని నిర్వాహకులు అంటున్నారు. నాణ్యతలో రాజీపడినప్పటికీ ప్రతీనెల అప్పులుచేసి, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వారు చెబుతున్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన వంట చార్జీలను ప్రభుత్వం పునఃసమీక్షించాలని వంట ఏజెన్సీలు కోరుతున్నాయి. పెరిగిన ధరల ప్రకారం ప్రతీవిద్యార్థికి రూ.25 మెస్‌చార్జీగా నిర్ణయించాలని కోరుతున్నారు. అదేవిధంగా కోడిగుడ్లు, వంటగ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని సూచిస్తున్నారు. ఈమేరకు వంట ఏజెన్సీ సంఘాలు జిల్లా కలెక్టర్లకు, విద్యాశాఖాధికారులకు తమ సమస్యల పరిష్కారంకోసం వినతిపత్రాలు, ధర్నాలు, ఆందోళనలు సైతం చేపడుతున్నారు. మధ్యాహ్న భోజన వంట చార్జీలను పెంచాలి. నిత్యావసర వస్తువుల ధరలతోపాటు కోడిగుడ్ల ధరల పెరుగుదల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో వంట ఏజెన్సీలు ఆర్థికంగా నష్టపోవల్సివస్తోంది. ప్రస్తుతం మార్కెట్ రేట్లకు, ప్రభుత్వం అందిస్తున్న కుకింగ్ చార్జీలకు పొంతన లేదు. మార్కెట్‌లో ఒక్క కోడిగుడ్డు ధర రూ.8నుంచి రూ.9 ఉండగా, ప్రభుత్వం మాత్రం కేవలం రూ.6 చెల్లిస్తుంది. పిల్లలకు పెద్దసైజు కోడిగుడ్డు పెట్టడం ద్వారా ఏజెన్సీ ఒక్క కోడిగుడ్డుపై రూ.2 నుంచి రూ.3 నష్టపోవాల్సి వస్తోంది. ప్రభుత్వం కుకింగ్ చార్జీలను సమీక్షించి, తక్షణమే పెంచాలి. ప్రతీ విద్యార్థికి కనీసం రూ.25 చెల్లించాలి. వంటగ్యాస్, కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేసి విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి. ●

4-8Pg5.qxd:4-8Pg5.qxd 1/1/02 6:10 AM Page 1

కోర్టుల్లో 5.64కోట్ల కేసులు పెండింగ్

సుప్రీంకోర్టులో దశాబ్దకాలంగా 10వేల కేసులు

హైకోర్టుల్లో 30యేళ్లకు పైగా 80,660 కేసులు

అంతేస్థాయిలో పెరిగిపోతున్న కోర్టుల్లో ఖాళీలు

పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం వెల్లడి



న్యూఢిల్లీ, ఆగస్టు 3: దేశంలో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య పెరుగుతూనే ఉంది; సుప్రీంకోర్టులో 10,000కు పైగా కేసులు దశాబ్ద కాలంగా, హైకోర్టులలో 80,660 కేసులు మూడు దశాబ్దాలకు పైగా పరిష్కారం కోసం వేచి ఉన్నాయి. సుప్రీంకోర్టులో 96,000కు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని రాజ్యసభలో కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ లిఖితపూర్వక సమాధానం ద్వారా వెల్లడించారు. వీటిలో 10,000కు పైగా కేసులు 10యేళ్లకు పైగా పరిష్కారం కాకుండా ఉన్నాయి.

అలాగే, 558 కేసులు 20యేళ్లకు పైగా పెండింగ్‌లో ఉండగా, అత్యున్నత న్యాయస్థానంలో 26 కేసులు 30యేళ్లకు పైగా పరిష్కారం కాలేదని ఆయన వివరించారు. నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ (ఎన్‌జెడిజి)లో అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం, సుప్రీంకోర్టు, దేశంలోని 25 హైకోర్టులు, జిల్లా/అనుబంధ కోర్టులలో కలిపి మొత్తం 5.64 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. హైకోర్టులలో 80,660 కేసులు మూడు దశాబ్దాలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి మేఘ్వాల్ పేర్కొన్నారు. ఇది న్యాయవ్యవస్థలో పెండింగ్‌లో ఉన్న కేసుల తీవ్రతను తెలియజేస్తోంది.

న్యాయవ్యవస్థలో జాప్యంపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, కేసుల పరిష్కారం అనేది పూర్తిగా న్యాయవ్యవస్థ పరిధిలోని అంశమని మేఘ్వాల్ అన్నారు. అంటే, కేసులు పరిష్కరించడానికి కోర్టులకు కార్యనిర్వాహక శాఖ (ప్రభుత్వం) ఎటువంటి గడువులను నిర్దేశించదు.

రాష్ట్రాల వారీగా ఉన్న వివరాలు సుప్రీంకోర్టు, హైకోర్టులలోని పెండింగ్ కేసులను మాత్రమే కవర్ చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం నివేదించిన మొత్తం 5.64 కోట్ల పెండింగ్ కేసుల సంఖ్యలో జిల్లా, అనుబంధ కోర్టులలోని కేసులు కూడా ఉన్నాయని నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ (ఎన్‌జెడిజి) పేర్కొంది.

జాప్యానికి కారణాలేమిటంటే.. కేసుల సంక్లిష్టత, సాక్ష్యాధారాల స్వభావం, న్యాయవాదులు (బార్), దర్యాప్తు సంస్థలు, సాక్ష్యాలు, వ్యాజ్యదారులు వంటి సంబంధిత వర్గాల సహకారం వంటి అనేక అంశాల వల్ల ఈ జాప్యం జరుగుతోందని ప్రభుత్వం వివరించింది. తగినంత మంది న్యాయమూర్తులు, న్యాయాధికారులు, సహాయక కోర్టు సిబ్బంది, మౌలిక సదుపాయాల లభ్యతపై కూడా కేసుల సకాల పరిష్కారం ఆధారపడి ఉంటుందని పేర్కొంది. విధానపరమైన నియమాలను సరిగ్గా అమలు చేయడం, న్యాయ ప్రక్రియలో పాలుపంచుకునే భాగస్వాములందరి మధ్య సమన్వయంపై కూడా కేసుల సమర్థవంతమైన పరిష్కారం ఆధారపడి ఉంటుందని మేఘ్వాల్ అన్నారు.

హైకోర్టులు, దిగువ న్యాయవ్యవస్థలో ఖాళీలు కొనసాగుతున్నాయి:

న్యాయమూర్తులు, న్యాయాధికారులు, సహాయక సిబ్బంది లభ్యతతో సహా, తగినంత న్యాయ సిబ్బంది, మౌలిక సదుపాయాలపై కూడా కేసుల సకాల పరిష్కారం ఆధారపడి ఉంటుందని కేంద్రం పేర్కొంది. భారతీయ కోర్టులలో పెరుగుతున్న ఖాళీల కారణంగానే పెద్ద సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలుస్తోంది. సుప్రీంకోర్టు న్యాయవ్యవస్థలోని ఖాళీలను భర్తీ చేయడానికి చాలా వరకు త్వరితగతిన చర్యలు తీసుకున్నప్పటికీ, హైకోర్టులు, దిగువ న్యాయవ్యవస్థలో ఇవి కొనసాగుతూనే ఉన్నాయి.

ప్రస్తుతం 25 హైకోర్టులలో మంజూరైన 1,122 మంది న్యాయమూర్తులకు గాను 341 న్యాయమూర్తుల ఖాళీలు ఉండగా, దిగువ కోర్టులలో మంజూరైన 30,868 మంది న్యాయమూర్తులకు గాను 7,311 ఖాళీలు ఉన్నాయి. కేసుల పరిష్కార వేగం అనేక కార్యాచరణ, విధానపరమైన అంశాలచే ప్రభావితమవుతుందని, అందువల్ల పెండింగ్ అనేది కేవలం ఒకే కారణానికి ఆపాదించదగిన సమస్య కాకుండా, బహుముఖ సమస్య అని కేంద్ర న్యాయశాఖ మంత్రి నొక్కి చెప్పారు.

అమెరికా-ఇరాన్ మధ్య నేటి నుంచి చర్చలు

వాషింగ్టన్, ఆగస్టు 3: అమెరికా-ఇరాన్ మధ్య హఠాత్తుగా ఘర్షణలు ప్రారంభం అవుతుంటాయి. అవి తీవ్రరూపం దాల్చుతాయేమోనని ప్రపంచం ఆందోళనకు గురవుతున్న సమయంలో చర్చల గురించి ప్రకటన వస్తుంది. ఇప్పుడూ అదే జరిగింది. కొన్ని రోజులుగా ఇరాన్‌పై చేస్తోన్న భారీ దాడులను ప్రస్తుతానికి అమెరికా నిలిపివేసింది. సోమవారం మధ్యాహ్నం నుంచి రెండు దేశాల మధ్య చర్చలు ప్రారంభం అవుతాయని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. తాము ఇరాన్‌పై భీకర దాడులు చేపట్టాలని భావించామని, అవే జరిగి ఉంటే రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అది పెద్ద దాడిగా మిగిలి ఉండేదని వ్యాఖ్యానించారు. అయితే ఘర్షణల ఆలోచన పక్కన పెట్టి, దౌత్యంవైపే మొగ్గు చూపామని పేర్కొన్నారు. మిలిటరీ ఆపరేషన్‌ను నిలిపివేయాలని పశ్చిమాసియాలోని మిత్ర దేశాలు కోరాయని ఎయిర్‌ఫోర్స్ వన్‌లో మీడియాతో వెల్లడించారు.

'మేం వారితో సంప్రదింపులు జరుపుతున్నాం. చర్చలు సోమవారం మధ్యాహ్నం ప్రారంభం అవుతాయి. చూద్దాం ఏం జరుగుతుందో. ఘర్షణల కంటే సంప్రదింపుల ద్వారా పరిష్కారానికే నేను ప్రాధాన్యంఇస్తాను. వాటి వల్ల ఎన్నో ప్రాణాలు నిలుస్తాయి. చర్చలతో విధ్వంసాన్ని అడ్డుకోవచ్చు. వాస్తవానికి ధ్వంసమైన వాటిని నిర్మించేందుకు ఎన్నో యేళ్లు పడుతుంది' అని ట్రంప్ పేర్కొన్నారు. ఒప్పందం ఎప్పటిలోగా కుదరొచ్చని ఆయనకు ప్రశ్న ఎదురైంది. 'నేనైతే ఒప్పందం కుదుర్చుకోవడానికే ఇష్టపడతాను. ఎందుకంటే ప్రజలన చంపాలని మేం అనుకోవడంలేదు. అది మాకు ఇష్టంలేదు' అని వ్యాఖ్యానించారు. హార్ముజ్ జలసంధి ఈ చర్చల్లో కీలకాంశమంగా ఉంటుందనేది తెలిసిందే. అలాగే ఇరాన్ అణు ప్రయత్నాల అడ్డుకట్ట వేయడమనేది మరో ముఖ్యాంశం. ఇదిలా ఉంటే.. ఈ దౌత్య ప్రయ త్నాల గురించి ఇరాన్ విదేశాంగమంత్రి అరాగ్చీ సౌదీ అరేబియా విదేశాంగమంత్రి, పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ మునీర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. చర్చల ప్రకటన రాగానే ముడిచమురు ధరలు దిగొ చ్చాయి. బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్ ధర ఫ్యూచర్స్ 82 డాలర్ల వద్ద కదలాడుతోంది.

ఉప ఎన్నికలో ప్రశాంత్‌కిశోర్ విజయం

మంజల్‌పూర్‌లో బిజెపి అభ్యర్థి గెలుపు

పాట్నా, ఆగస్టు 3: బీహార్‌లో బీజేపీకి గట్టి షాక్ తగిలింది. స్వయానా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితీన్ నబీన్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన స్థానంలోనే ఆ పార్టీ పరాజయం పాలైంది. నితిన్ నబీన్ రాజీనామాతో ఖాళీ అయిన బాంకీపూర్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ పై 20వేల పైచిలుకు ఓట్లమెజార్టీతో గెలుపొందారు. ప్రశాంత్ కిషోర్ విజయంతో జన్ సురాజ్ పార్టీ కార్యాలయంలో సందడి వాతావరణం నెలకొంది. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కార్యాలయానికి చేరుకొని సంబరాలు జరుపుకున్నారు. గత ఏడాది నవంబర్‌లో జరిగిన బీహర్ అసెంబ్లీ ఎన్నికల్లో జన్ సురాజ్ పార్టీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. ప్రశాంత్ కిషోర్ విజయంతో ఆ పార్టీలో నెలకొన్న నైరాశ్యాన్ని ఈ తాజా ఫలితం పటాపంచలు చేసింది. ఉప ఎన్నికల ఫలితాలపై మాట్లాడిన ప్రశాంత్ కిషోర్ బాంకీపూర్ ప్రజలు బీజేపీ నాయకత్వానికి ఒక స్పష్టమైన సందేశాన్ని పంపారని చెప్పారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తి బీహార్‌ను పాలించడాన్ని ప్రజలు ఏమాత్రం కోరుకోవడం లేదని వెల్లడించారు. విద్యావ్యవస్థను మెరుగుపరిచి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, బిహార్ బిడ్డలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా చూసే ఒక మంచి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ప్రశాంత్ కిషోర్ వెల్లడిం చారు. తమ పోరాటం వ్యక్తులపై కాదని వ్యవస్థలపై మాత్రమే అని ప్రశాంత్ కిషోర్ స్పష్టం చేశారు. స్వతహాగా వ్యూహకర్త అయిన ప్రశాంత్ కిశోర్ తన వ్యూహాలకు మరింత పదును పెట్టారు. ప్రజలతో మమేకమవ్వడానికే అధిక ప్రాధా న్యం ఇస్తూ ముందుకు సాగారు. ఈ క్రమంలో అధికార పార్టీలో ఉన్న విభేదాలు తనకు అనుకూలంగా మార్చుకోవడంలో సఫలీకృతమైన పీకే బీజేపీ కంచుకోటలో విజయం సాధించారు. 1995 నుంచి బాంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీకి కంచుకోటగా మారింది. అక్కడ జరిగిన ఎన్నికల్లో ప్రతిసారీ బీజేపీదే పూర్తి ఆధిపత్యం. అలాంటి కమలదళం కంచుకోటను ప్రశాంత్ కిషోర్ బద్దలుకొట్టారు.

మంజల్‌పుర్‌లో బీజేపీ అభ్యర్థి విజయం మరోవైపు, గుజరాత్‌లోని మంజల్‌పుర్ శాసనసభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సతీశ్ పటేల్ విజయం సాధించారు. కాంగ్రెస్ తరఫున బరిలోకి దిగిన బికాభాయ్ రబారీపై 30 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలిచారు. బీజేపీ ఎమ్మెల్యే యోగేశ్ పటేల్ ఆకస్మిక మరణంతో ఆ స్థానం ఖాళీ కాగా తాజాగా ఉప ఎన్నిక నిర్వహించారు. 2022లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 182 స్థానాలకు గానూ 156 చోట్ల బీజేపీ విజయం సాధించింది.

మిడ్‌టర్మ్, పార్టీపై పట్టుకోసం ట్రంప్ ముందస్తు స్కెచ్

అంతర్జాతీయ న్యూస్ ఏజెన్సీ ఆక్సియోస్ విశ్లేషణ

వాషింగ్టన్,ఆగస్టు 3: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందస్తు రాజకీయ వ్యూహాలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నాయి. రాబోయే మధ్యంతర ఎన్నికల్లో హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్, సెనెట్‌పై రిపబ్లికన్ పార్టీ పట్టు సాధిస్తుందా లేదా అనే అంశంపై ట్రంప్ ఏమాత్రం ఆందోళన చెందట్లేదని ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ ఆక్సియోస్ విశ్లేషించింది. ఫలితాలు ఎలా వచ్చినా రిపబ్లికన్ పార్టీపై తన ఆధిపత్యం చెక్కుచెదరదని, పైగా మరింత బలపడుతుందని ట్రంప్ భావిస్తున్నట్లు ఆయన సలహాదారుల్ని ఉటంకిస్తూ సంస్థ నివేదిక విడుదల చేసింది. మధ్యంతర ఎన్నికల తర్వాత రిపబ్లికన్ పార్టీపై మరింత పట్టు సాధించి, 2028 అధ్యక్ష ఎన్నికల్ని ప్రభావితం చేయడమే ట్రంప్ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోందని పేర్కొంది. రిపబ్లికన్లు కాంగ్రెస్‌లో మెజార్టీని నిలుపుకుంటే ట్రంప్‌కు మరింత అనుకూల పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని వివరించింది. ట్రంప్ దృష్టి కేవలం ప్రస్తుత తన పదవీ కాలం చివరి రెండేళ్లకే కాకుండా, తర్వాతకూడా రిపబ్లికన్ పార్టీలో తన ఆధిపత్యాన్ని కొనసాగించడంపైనే ఉంది. పార్టీలో ఇప్పటికీ ట్రంప్‌కే అత్యధిక ప్రజాదరణ ఉంది. ట్రంప్ తన అధికారాన్ని లేదా వారసత్వాన్ని సులభంగా వేరొకరికి బదిలీ చేసే వ్యక్తి కాదు. తన పొలిటికల్ నెట్‌వర్క్, ఫండ్ రైజింగ్ పవర్, బలమైన ఓటు బ్యాంక్ ద్వారా తన అధ్యక్ష పదవీ కాలం పూర్తయిన తర్వాత కూడా అమెరికా రాజకీయాల్ని శాసించాలనేదే ట్రంప్ వ్యూహంగా కనిపిస్తోంది. ట్రంప్ డబ్బు అడిగితే ప్రజలు ఇప్పటికీ విరాళాలు ఇస్తున్నారు. అదే ఆయనకు రాజకీయ బలం అని ఒక సలహాదారు పేర్కొనడం గమనార్హం. మరో సలహాదారు మీ బ్యాంక్ ఖాతాను బట్టే మీ రాజకీయ భవిష్యత్తు కూడా ఆధారపడి ఉంటుందని వ్యాఖ్యానించినట్లు నివేదిక తెలిపింది. ఇందులో భాగంగా పార్టీని పూర్తి స్థాయిలో తన గుప్పిట్లోనే ఉంచుకోవడమే ఆయన నైజమని నివేదిక స్పష్టం చేసింది. అమెరికా రాజ్యాంగం ప్రకారం ట్రంప్ మరోసారి అధ్యక్ష పదవికి పోటీచేసే అవకాశం ఉందా అనే అంశంపై వివాదాలు ఉన్నప్పటికీ, ఆయన మాత్రం 2028 పోటీ అవకాశాలపై చర్చను చివరి వరకు కొనసాగించే అవకాశం ఉందని ఆక్సియోస్ పేర్కొంది. అది వాస్తవంగా పోటీ చేయడానికన్నా, పార్టీపై తనప్రభావాన్ని కొనసాగించేందుకు ఉపయోగపడే రాజకీయ వ్యూహంగా కూడా ఉండొచ్చని నివేదిక అభిప్రాయపడింది. 2028 అధ్యక్ష ఎన్నికల్లో ప్రస్తుత ఉపాధ్యక్షుడు జేడీవాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో కాంబినేషన్‌ను బరిలోకి దింపే ఆలోచనలో ట్రంప్ ఉన్నట్లు రిపోర్ట్ వెల్లడించింది.

ప్రపంచవ్యాప్తంగా 140 కోట్ల మందిపై చైనా నిఘా



వాషింగ్టన్, ఆగస్టు 3: చైనా ప్రపంచవ్యాప్తంగా 140 కోట్లకుపైగా ప్రజలపై నిఘా పెట్టినట్లు అమెరికాకు చెందిన ఓ పత్రిక సంచలన కథనాన్ని వెలువరించింది. ఆ దేశ నిఘాలోని వారిలో సొంత పౌరులు సహా సందర్శనకు వచ్చిన విదేశీయులు కూడా ఉన్నట్లు తెలిపింది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం చైనా తన సొంత ప్రజలపై ఎలా నిఘా పెడుతుందో తెలుసుకోవడానికి జనవరిలో మార్క్ హోఫర్ అనే సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు ఇంటర్నెట్‌లో వెతుకుతుండగా 'డైనమిక్ కంట్రోల్ ప్లాట్‌ఫామ్ ఫర్ ఓవర్సీస్ పర్సనల్' అనే వైబ్‌సైట్‌లో తన పేరు, ఫొటో, పాస్‌పోర్ట్ సంఖ్య, గతంలో చైనా పర్యటన సమయంలోఉపయోగించిన మొబైల్ నంబర్ సహా అన్ని వివరాలు కనిపించడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు.

ఆ వెబ్‌సైట్‌లో ముఖ్యంగా చైనాలోని జాంగ్ జియాకోవు నగరానికి వెళ్లిన విదేశీయుల వివరాలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. వారిలో భారత్, తైవాన్, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, బ్రిటన్, అమెరికా, ఈజిప్ట్, ఇరాన్, ఇజ్రాయెల్, మొరాకో, పాకిస్థాన్, సూడాన్ ప్రజ లు ఉన్నట్లు తెలుస్తోంది. జాంగ్‌జియాకోవు హెబే నార్త్ యూనివర్సిటీలో చేరిన విదేశీ విద్యార్థుల సమాచారం కూడా ఇందులో ఉంది. అయితే వారిలో భారత్, పాక్‌కు చెందిన వారే అధికం కావడం గమనార్హం. ఆ వెబ్‌సైట్‌లో వారి వ్యక్తిగత వివరాలు సహా వారు ఎక్కడెక్కడికి వెళ్తు న్నారు, ఏమి చేస్తున్నారనే సమాచారం నమోదై ఉంది. వీరందరినీ చైనా అధికారులు కెమెరాలు, ఫోన్ సిగ్నల్స్ ద్వారా ట్రాక్ చేస్తున్నారు. వారం దరూ స్వదేశాలకు వెళ్లాక కూడా ఈ నిఘా కొనసాగుతుండడం గమనార్హం.

చైనాలోని పోలీస్ విభాగాలకు రోబోటిక్స్, నిఘా పరికరాలను విక్రయించే 'ఆరిజిన్ డైనమిక్' అనే సంస్థకు కూడా ఈ వెబ్‌సైట్‌తో సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ డేటా అక్కడి పోలీసులకు అందుబాటులో ఉంది.

పార్లమెంటు ఆవరణలో విపక్షాల నిరసన

న్యూఢిల్లీ,ఆగస్టు 3: కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్ సమావేశాలకు గైర్హాజరు అవుతున్నారంటూ ప్రతిపక్ష నేతలు సోమవారం పార్లమెంట్ ఆవరణలో నిరసన చేపట్టారు. విద్యార్థులపై పోలీసు లాఠీఛార్జి, రామాలయ విరాళాల చోరీ అంశాలపై అమిత్ షా జవాబుచెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ప్రవేశ ద్వారం వద్ద కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌సహా పలువురు విపక్ష నేతలు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. "అమిత్ షా పార్లమెంట్కు ఎందుకు గైర్హాజరు అవుతున్నారు అమిత్ షా జవాబ్ దో, అమిత్ షా ఎక్కడికి వెళ్లారు లాంటి పలు ప్రశ్నలు ఉన్న బ్యానర్లను ప్రదర్శించారు. మరోవైపు అయోధ్య రామమందిర విరాళాల చోరీ అంశంపై ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకొని విపక్ష నేతలు తీవ్ర విమర్శలు చేశారు. చందా చోర్ గద్దీ చోడ్ విరాళాల దొంగ, సింహాసనం వదిలి వెళ్లు అనే నినాదం ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. పరీక్షల అక్రమాలకు వ్యతిరేకంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై జరిపిన లాఠీ ఛార్జ్, పెల్లెట్ గన్ గురిపెట్టడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్కు వచ్చి వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సోమవారం డిమాండ్ చేశారు. అలాగే ప్రధానమంత్రి పర్యవేక్షణలో ట్రస్ట్ ఉన్నప్పటికీ, శ్రీరామ మందిరానికి ఇచ్చిన విరాళాలు ఎలా చోరీకి గురయ్యాయో నరేంద్ర మోదీ చెప్పాలని అన్నారు. ఖర్గేతోపాటు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఎస్పీకి చెందిన ధర్మేంద్ర యాదవ్, టీఎంసీ నేత మహువా మొయిత్రా, సాగరిక ఘోష్, ఎన్సీపీ (ఎస్పీ)కి చెందిన సుప్రియా సూలే, శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్, అరవింద్ గాంధీ కూడా ఇదే విధమైన డిమాండ్ చేశారు నీటి ఆందోళనకారులపైలాఠీఛార్జి ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్లో సమాధానం చెప్పాలని ప్రతిపక్షం డిమాండ్ చేస్తోంది. రామ మందిర విరాళాల చోరీ ఆరో పణల వివాదాన్ని కూడా ప్రతిపక్షం లేవనెత్తుతోంది. నేరుగా ఈ విషయంపై ప్రభుత్వాన్నే విమర్శిస్తోంది. కొద్ది రోజుల క్రితం పూర్ణియా ఎంపీ పప్పూ యాదవ్ ఒక సాధువు వేషం వేసుకొని, పార్లమెంట్ ఎదుట ఒక వ్యంగ్యాత్మకమైన స్కిట్ వేశారు. అందులో రాహుల్ గాంధీ కూడా అతిథి పాత్రలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో పప్పు యాదవ్‌పై దాడి జరిగిందనే వార్తలు వచ్చాయి. ఈ తరుణంలో జరుగుతున్న పార్లమెంట్ 11వ రోజు సమావేశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.

సహజీవనంలో ఉన్న మహిళలకూ 498ఎ వర్తింపు

పరస్పర అంగీకారంతో ఉన్న వారికే ఇది పరిమితం: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 3: ఐపిసి సెక్షన్ 498ఎ కేవలం చట్టబద్ధమైన వివాహాలకే పరిమితం కాదని, వివాహ లక్షణాలు కలిగిన సహజీవన సంబంధానికి కూడా ఇది వర్తిస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంది. అయితే, ఆ సంబంధం పరస్పర అంగీకారంతో ఉన్న వయోజనుల మధ్య ఉండాలి. వివాహం చేసుకోవాలనే ఉద్దేశ్యం దానిలో అంతర్భాగంగా నిరూపించబడాలి. ఐపిసి సెక్షన్ 498ఎ, ఇతర నిబంధనల కింద ప్రారంభించిన క్రిమినల్ విచారణను కొట్టివేయడానికి కర్ణాటక హైకోర్టు నిరాకరించిన తీర్పుపై దాఖలైన అప్పీళ్లను సుప్రీంకోర్టు విచారిస్తోంది. ఈ కేసులలో, నిందితులు చెల్లుబాటు అయ్యే వివాహం ఉనికిని వివాదాస్పదం చేశారు. ఫిర్యాదుదారు చట్టబద్ధంగా వివాహం చేసుకున్న భార్య అయితే తప్ప సెక్షన్ 498ఎ వర్తించదని వాదించారు. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ నోంగ్మేకాపమ్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం దీనిపై విచారణ చేస్తూ, "వివాహం చేసుకోవాలనే ఉద్దేశం అంతర్భాగంగా ఉన్న 'వివాహ స్వభావం గల సంబంధాల్లుగా అర్హత పొందే 'సహజీవన సంబంధాలక్షు సెక్షన్ 498ఎ వర్తిస్తుంద్ణి అని స్పష్టం చేసింది. "స్పష్టత కోసం చెప్పాలంటే, సెక్షన్ 498ఎ ద్వారా రక్షి ంచబడే 'సహజీవన సంబంధాల్ను అనేవి, పరస్పర అంగీకారంతో ఉన్న ఇద్దరు వయోజన వ్యక్తుల మధ్య ఉండేవ్ణే అని పేర్కొంది. అప్పీలుదారుల తరఫున సీనియర్ న్యాయవాది ఆనంద్ సంజయ్ ఎం. నూలి హాజరు కాగా, రాష్ట్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ బ్రిజేందర్ చాహర్ హాజరై తమ వాదనలు వినిపించారు.



గాలిలోనే ఢీకొన్న సహాయక చర్యల హెలికాప్టర్లు: పైలట్లు మృతి

ఏథెన్స్,ఆగస్టు 3: గ్రీస్‌లో ఘోరం జరిగింది. అడవుల్లో చెలరేగిన కార్చిచ్చును అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్న రెండు అగ్నిమాపక హెలికాప్టర్లు గాలిలో ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘోర ప్రమాదంలో ఇద్దరు పైలటు ప్రాణాలు కోల్పోయారు. పశ్చిమ ఏథెన్స్ లోని పసాతా తీర ప్రాంతంలో ఆదివారం ఈ దుర్ఘటన జరిగింది. అటికాబొయోటియా సరిహద్దులోని అటవీ ప్రాంతంలో చెలరేగిన మంటలను ఆర్పేందుకు గ్రీస్ ఫైర్ సర్వీస్‌కు చెందిన రెండు బెల్ హెలికాప్టర్లు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి.



పార్లమెంటు ప్రాంగణంలో మళ్లీ అయోధ్య విరాళాల చోరీపై నిరసన

న్యూఢిల్లీ,ఆగస్టు 3: అయోధ్యలోని రామమందిర విరాళాల చోరీపై ప్రతిపక్ష ఎంపీలు సోమవారం కూడా నిరసన కొనసాగించారు. రామ మందిరం విరాళాల చోరీతో పాటు విద్యార్థి నిరసనకారులపై పోలీసుల బలప్రయోగంపై పార్లమెంట్ ప్రాంగణంలోని మకర ద్వారం ముందు నిరసన చేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, ఎస్పీకి చెందిన డింపుల్ యాదవ్, ధర్మేంద్ర యాదవ్, టీఎంసీకి చెందిన మహువా మోయిత్రా, జేఎంఎంకు చెందిన మహువా మాఝీ, ఆర్ఎస్పీకి చెందిన ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్ తదితర ఎంపీలు ఈ నిరసనలో పాల్గొన్నారు. కేంద్రహోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌కు ఎందుకు రావడం లేదన్న పెద్ద బ్యానర్‌ను ప్రదర్శించడంతోపాటు నినాదాలు చేశారు. రామమందిరంలో విరాళాల చోరీకి ప్రతీకగా విరాళాల పెట్టెలను పార్లమెంట్ ఆవరణలో ఉంచారు. ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వాటి చుట్టూ బారులు తీరారు. కొందరు ఎంపీలు విరాళాల పెట్టెలో నగదుకూడా వేశారు. ఆ తర్వాత విరాళాల ఆదాయం లెక్కింపు సందర్భంగా చోరీ చేయడాన్ని ప్రతీతాత్మకంగా ప్రదర్శించారు.

నా విద్య, ఆర్థిక వివరాలు ఇస్తా.. ప్రధాని మోడీ డిగ్రీని చూపించగలరా: సిజెపి చీఫ్ అభిజిత్



న్యూఢిల్లీ,ఆగస్టు 3: నీట్ అక్రమాల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోసం పట్టుబట్టి సాధించుకున్న కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కేపై ఇప్పుడు బీజేపీ శ్రేణులు తీవ్రంగా మండిపడుతున్నాయి. ఓవైపు సోషల్ మీడియాలో ఆయన్ను టార్గెట్ చేస్తూనే, మరోవైపు ఆయన విదేశీ చదువులకు డబ్బులెక్కడివో విచారణ జరిపించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ కోర్టును కూడా ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో అభిజీత్ దిప్కే ఇవాళ ఓ వీడియో విడుదల చేసి దీనిపై వివరణ ఇచ్చారు. ఓ బీజేపీ కార్యకర్త తన విద్యాభ్యాసం ఎలా పూర్తి చేశానో తెలుసుకునేందుకు పిటిషన్ దాఖలు చేశారని అభిజీత్ దిప్కే తెలిపారు. తాను తన స్కాలర్ షిప్ లేఖతో పాటు విద్య రుణం లేఖను కూడా బయటపెట్టేందుకు సిద్ధంగా ఉన్నానని, కానీ వాళ్ల అధినేత తన డిగ్రీ చూపించేందుకు సిద్ధంగా ఉన్నారా అని అభిజీత్ ప్రశ్నించారు. వాళ్ల నేత తన అసలు డిగ్రీని చూపించగలరా అని సవాల్ విసిరారు. అయినా తన విద్యాభ్యాసంతో వీళ్లకు అంత సమస్య ఏముందని అభిజీత్ ప్రశ్నించారు. ఓ సాధారణ మధ్యతరగతి విద్యార్థి బోస్టన్ యూనివర్శిటీకి వెళ్ళి చదువుకుని వస్తే వీళ్లకు అంత ఇబ్బంది ఎందుకో తెలియడం లేదని అభిజీత్ దిప్కే తెలిపారు. మీరు విద్యాభ్యాసానికి ఎందు కింత వ్యతిరేకంగా ఉన్నారని ఆయన సదరు బీజేపీ కార్యకర్తను ప్రశ్నించారు. తద్వారా తన వివరాలు అడగటం మాని, ప్రధాని మోడీ డిగ్రీని బయటపెట్టాలని దిప్కే సదరు కార్యకర్తకు సూచించారు. ఇప్పటికే ప్రధాని మోడీ విద్యార్హతల వివరాలు ఇచ్చేందుకు పలు యూనివర్సిటీలు నిరాకరించాయి. సమాచార కమిషన్ కూడా ఆ వివరాలు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో సీజేపీ ప్రధాని మోడీని డిగ్రీ బయ టపెట్టాలని అడగడం ప్రాధాన్యం సంతరించుకుంది.

సంక్షిప్త వార్తలు

రెండున్నరేళ్ల తర్వాత కనిపించిన ఆంగ్‌శాన్ సూకీ

నైపితా, ఆగస్టు 3: ఆంగ్‌శాన్‌సూకీ క్షేమంగా, ఆరోగ్యంగా ఉన్నారు. సుమారు 2.5యేళ్ల తర్వాత ఆమె తొలిసారి బయటి ప్రపంచానికి కనిపించారు. రెడ్‌క్రాస్‌కు చెందిన అంతర్జాతీయ కమిటీ సభ్యుడితో ఆమె భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఆఫొటోలను మయన్మార్ మిలిటరీ అధికారులు రిలీజ్ చేశారు. బర్మానేత ఆంగ్ శాన్‌సూకీ ఆర్మీ నిర్బంధంలో ఉన్న విషయం తెలిసిందే. ఆంగ్‌శాన్ సూకీ ఆచూకీ లేదని రెండున్నరేళ్ల క్రితం ఆమె కుమారుడు ప్రభుత్వానికి లేఖ రాసిన విషయం తెలిసిందే. మిలిటరీ సర్కారు రిలీజ్ చేసిన ఫొటోల్లో సూకీ ఆరోగ్యంగా ఉన్నట్లు కనిపించారు.

పెషావర్‌లో ఆత్మాహుతి దాడి: 17కి పెరిగిన మృతుల సంఖ్య

ఖ్వెట్టా,ఆగస్టు 3: పాకిస్థాన్ వాయువ్య ప్రాంతంలోని ఖైబర్ పఖ్తూన్ ఖ్వా ప్రావిన్స్‌లో జరిగిన ఆత్మా హుతి బాంబు దాడిలో మృతుల సంఖ్య17కు పెరిగింది. గాయపడిన మరో ముగ్గురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మరణించడంతో మృతుల సంఖ్య పెరిగినట్లు పోలీసులు వెల్లడిం చారు. స్వాత్ జిల్లాలోని కబాల్ పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఆదివారం స్వాత్ పీస్ ర్యాలీ జరుగుతున్న సమయంలో ఈ ఆత్మాహుతి దాడి జరిగింది. పేలుడు ధాటికి తొలుత ఐదుగురు భద్రతా సిబ్బందితో పాటు మొత్తం 14మంది ప్రాణాలు కోల్పోగా, డజనుకు పైగా గాయపడ్డారు. తాజాగా గాయపడిన మరో ముగ్గురు మరణించడంతో మొత్తం మృతుల సంఖ్య 17కు చేరింది.

కేన్సర్ చికిత్సకు వయాగ్రా అద్భుత ఫలితాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 2 : పురుషుల్లో అంగస్తంభన సమస్యకు వాడే సిల్డినాఫిల్ సిట్రేట్ వయాగ్రా క్యాన్సర్ కణాల వ్యాప్తిని, కణితుల పెరుగుదలను అడ్డుకుంటున్నదని ఇజ్రాయెల్ శాస్త్రవేత్తల అధ్యయనంలో తేలింది. వీజ్‌మన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ పరిశోధకుల అధ్యయనంలో వయాగ్రా క్యాన్సర్ వ్యాప్తి ని నెమ్మదింపజేయటంలో సహాయపడుతుందని చెప్పేందుకు శాస్త్రీయ ఆధారాలు లభించాయి. అయితే క్యాన్సర్‌కు చికిత్సగా సిఫార్సు చేయడానికి మరిన్ని క్లినికల్ అధ్యయనాలు అవసరమని భావిస్తున్నారు.

బాబ్రీమసీదు కమిషన్ హెడ్ జస్టిస్ లిబర్హాన్ కన్నుమూత



చండీఘడ్,ఆగస్టు 3: బాబ్రీమసీదు ఎంక్వైరీ కమిషన్‌కు హెడ్‌గా ఉన్న జస్టిస్ మన్మోహన్ సింగ్ లిబర్హాన్ సోమవారం కన్నుమూశారు. ఆయన వయసు 87 ఏళ్లు. అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేత, ఆ ఘటన జరగడానికి కారణాలు, దానితో లింకున్న అంశాలను ఆయన దర్యాప్తు చేపట్టారు. ఆగస్టు2వ తేదీ, ఆదివారం చండీఘడ్‌లో జస్టిస్ లిబర్హాన్ తుది శ్వాస విడిచినట్లు పంజాబ్, హర్యానా హైకోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రోహిత్ సూద్ తెలిపారు.

హైలాకండి జిల్లాలో బాలికపై హత్యాచారం..

గువాహతి,ఆగస్టు 3: అస్సాంలోని హైలాకండి జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. 15 ఏళ్ల బాలిక అత్యంత ఘోరమైన స్థితిలో మృతిచెందిన ఘటన తీవ్ర కలకలం రేపింది. కుటుంబ సభ్యులు సమీపంలోని బంధువుల ఇంట్లో జరిగిన విందుకు వెళ్లి తిరిగి వచ్చేసరికి బాలిక ఇంట్లో మృతదేహంగా కనిపించింది. ఈ కేసులో అత్యంత దారుణమైన పరిస్థితులు ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

అయోధ్య ట్రస్టునుంచి వైదొలిగిన ఆర్ఎస్ఎస్‌నేత భయ్యాజీ

అయోధ్య,ఆగస్టు 3: అయోధ్య రామ మందిర నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆర్ఎస్ఎస్ సీనియర్ నేత సురేశ్ భయ్యాజీ జోషి ట్రస్ట్ సంరక్షకుడి బాధ్యతల నుంచి వైదొలిగారు. రామ మందిరానికి వచ్చిన విరాళాల దుర్వినియోగం, నిధుల మళ్లింపు ఆరోపణలపై వివాదం కొనసాగుతున్న తరుణంలో ఈ మార్పు చోటుచేసు కోవడం గమనార్హం. తాను అనారోగ్య కారణాలతోనే పదవి నుంచి తప్పుకుం టున్నట్లు 78ఏళ్ల జోషి స్పష్టం చేశారు. 2026జూన్ లో వెలుగులోకి వచ్చిన విరాళాల అక్రమాల ఆరోపణలతో ట్రస్ట్ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది.

ఆధునిక పరిశోధన ఫలితాలు సమాజానికి చేరాలి

- ఎస్వీయూ విసి నర్సింగరావు
- అడ్వాన్స్ మెటీరియల్స్‌పై జాతీయ సదస్సు ప్రారంభం

తిరుపతి(విద్య), ఆగస్టు 3 ప్రభాతవార్త: నూతన సాంకేతిక పరిజ్ఞానం, అధునాతన పదార్థాల అభివృద్ధి, శాస్త్రీయ పరిశోధనల ఫలితాలను సమాజానికి చేరవేయడంలో విశ్వవిద్యాలయాలు కీలక పాత్ర పోషించాలని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్వీయూ) వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టాటా నర్సింగరావు అన్నారు. ఎస్వీయూ భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అడ్వాన్స్డ్ మెటీరియల్స్, డివైసెస్ అండ్ టెక్నాలజీస్ అంశంపై సోమవారం విశ్వవిద్యాలయం సెనేట్ హాల్లో నిర్వహించిన జాతీయ సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశాభివృద్ధికి శాస్త్రీయ పరిశోధనలు, వినూత్న ఆవిష్కరణలు అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. పరిశోధకులు ప్రయోగశాలలకే పరిమితం కాకుండా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సమాజానికి ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.డి. హుస్సేన్ శాస్త్రీయ పరిశోధనల్లో నాణ్యత, అంతర్జాతీయ ప్రమాణాల ప్రాధాన్యతను వివరించారు. హైదరాబాద్‌కు చెందిన ఎఆర్‌సిఐ శాస్త్రవేత్త డాక్టర్ బి.వి. శారద అధునాతన పదార్థాల తయారీ, వాటి పారిశ్రామిక వినియోగాలపై ప్రత్యేక ఉపన్యాసం చేశారు. ఐఐటి మద్రాస్‌కు చెందిన ప్రొఫెసర్ ఎం.ఎస్. రామచంద్రరావు ఆధునిక మెటీరియల్స్, నానో సాంకేతికత, ఎలక్ట్రానిక్ పరికరాల రంగంలో జరుగుతున్న తాజా పరిశోధనలను వివరించారు. సదస్సు లక్ష్యాలను భౌతిక శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ దేవప్రసాదరాజు, సెమినార్ కన్వీనర్ ప్రొఫెసర్ వై.అపర్ణ వివరించగా, నిర్వహణ అంశాలను ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ వెంకటరమణారెడ్డి తెలియజేశారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు సదస్సులో పాల్గొని అధునాతన మెటీరియల్స్, సెమీకండక్టర్ పరికరాలు, నానో సాంకేతికత, ఎనర్జీ మెటీరియల్స్, ఎలక్ట్రానిక్ డివైసెస్ తదితర అంశాలపై పరిశోధన పత్రాలను సమర్పించారు. పరిశోధకుల పోస్టర్ ప్రజెంటేషన్లు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఎస్వీయూ భౌతిక శాస్త్ర విభాగ మాజీ ఆచార్యులు, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.డి. హుస్సేన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, వివిధ విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ అరాచక శక్తిని వదలిపెట్టే ప్రసక్తే లేదు

- మంత్రి కొలుసు పార్థసారథి

విజయవాడ, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి: శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ ఒక్క అరాచక శక్తిని వదలిపెట్టే ప్రసక్తే లేదని ఆంధ్రప్రదేశ్ సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి హెచ్చరించారు. వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే విరూపాక్షిచేసిన ఘోరాన్ని ఖండించకపోగా జగన్ సిగ్గులేకుండా సమర్థిస్తున్నారని ధ్వజమెత్తారు. దళిత, బిసి వర్గాలకు చెందిన మహిళ దుస్తులు చింపి, దుశ్శాసనుడిలా వైసిపి ఎమ్మెల్యే ప్రవర్తించారని దుయ్యబట్టారు. సోమవారం మీడియాతో మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడారు. గొడ్డలి పార్టీ అరాచకాలను గమనిస్తున్న ప్రజలు ఆ పార్టీని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని నిర్ణయించుకున్నారని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు యువత భవిష్యత్తు కోసం శ్రమిస్తుంటే గొడ్డలి పార్టీ వారి జీవితాలను నాశనం చేస్తోందని కొలుసు పార్థసారథి ధ్వజమెత్తారు. ప్రజాసేవ కాదని, అరాచకాలు, నేరాలు చేయడమే గొడ్డలి పార్టీలో కొనసాగడానికి ముఖ్య అర్హత అని ఎద్దేవా చేశారు. ఎంత పెద్ద అరాచకాలు సృష్టిస్తే జగన్ రెడ్డి దగ్గర అంత ప్రాధాన్యం లభిస్తుందని వారి అనుయాయులు అనుకుంటున్నట్లుందని విమర్శించారు. నేరాలు చేసి దొరికిపోయాక 'రాజకీయ కక్ష సాధింపు' అంటూ సింపతీ డ్రామాలు ఆడటం వీరికి అలవాటేనని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ ఒక్క అరాచక శక్తిని వదలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. 45యేళ్లు దాటిన పేదవాడికి బతికే అర్హత లేదన్నట్లుగా జగన్ మాట్లాడారని ఆగ్రహించారు. శ్రీకాకుళంలో మహిళా పోలీసు మీద దుశ్శాసనుడి పర్వం కొనసాగించారని ధ్వజమెత్తారు. బలహీన వర్గానికి చెందిన యువకుడిని చచ్చేలా కొట్టారని కొలుసు పార్థసారథి ఫైర్ అయ్యారు. ఆడకూతురిపై రాక్షస దాడికి తెగబడిన దుశ్శాసనుడిని, బాధితుడిగా చిత్రీకరించేందుకు గొడ్డలి పార్టీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. కిడ్నాప్ చేసిన, మహిళలను, సిఎంను, హోంమంత్రిని అవమానించిన, అభ్యంతరకరంగా మాట్లాడిన గొడ్డలి పార్టీ అధినేత ఎందుకు ఖండించరని ప్రశ్నించారు. ప్రజలు వైసిపిని ఘోరంగా తిరస్కరించి గద్దె దించినా ఈ పార్టీ మూకలకు ఇంకా బుద్ధి రాలేదని హెచ్చరించారు. దళిత వర్గాలకు చెందిన మహిళల దుస్తులు చింపేంతటి నీచమైన సంస్కృతిని జగన్ రెడ్డి ఎందుకు ఖండించడం లేదు? అని మంత్రి కొలుసు పార్థసారథి ప్రశ్నించారు.

తండ్రి చేతిలో కుమారుడి దారుణ హత్య

- అడ్డుకోబోయిన భార్యపై హత్యాయత్నం.. తప్పించుకున్న మహిళ
- నంద్యాల జిల్లా యనకండ్ల గ్రామంలో విషాద ఘటన

కుమారుడు మధు కృష్ణ

తండ్రి బాల మద్దిలేటి

బనగానపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త: నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం యనకండ్ల గ్రామంలో ఆదివారం రాత్రి దారుణ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు, ఆర్థిక సమస్యల నేపథ్యంలో తండ్రి తన కుమారుడిని గొడ్డలితో దాడి చేసి హత్య చేసిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. గ్రామానికి చెందిన బాల మద్దిలేటి (56) గత కొంతకాలంగా కుటుంబంలో నెలకొన్న కలహాలు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా తన కుమారుడు మధు కృష్ణ(30)పై కక్ష పెంచుకున్నట్లు సమాచారం. ఆదివారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన బాల మద్దిలేటి, ఇంట్లో మంచంపై నిద్రిస్తున్న కుమారుడు మధు కృష్ణపై గొడ్డలితో దాడి చేశాడు. తలపై తీవ్రంగా నరకడంతో మధు కృష్ణకు తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడిని రక్షించేందుకు ప్రయత్నించిన భార్య సుబ్బమ్మ(50)పై కూడా బాల మద్దిలేటి దాడి చేసి హత్య చేసేందుకు యత్నించాడు. అయితే ఆమె చాకచక్యంగా భర్త కళ్లలో కారంపొడి చల్లి అక్కడి నుంచి తప్పించుకుని ప్రాణాలు దక్కించుకుంది.

బాల మద్దిలేటి, సుబ్బమ్మ దంపతులకు మధు కృష్ణ ఏకైక కుమారుడు. మధు కృష్ణకు ఎనిమిదేళ్ల క్రితం వివాహం కాగా, భార్య అర్చనతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బాల మద్దిలేటి మద్యానికి బానిసై డబ్బులు ఇవ్వాలంటూ భార్య, కుమారుడితో తరచూ ఘర్షణ పడుతుండేవాడని గ్రామస్తులు తెలిపారు. ఈ కుటుంబ కలహాలే ఈ దారుణ ఘటనకు దారితీసినట్లు తెలుస్తోంది.

ఘటన సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం నిందితుడు పరారవడంతో అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. భార్య అర్చన ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు బాల మద్దిలేటిపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు బనగానపల్లె సిఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

జగ్గయ్యపేట 'లైఫ్ స్కిల్స్ ఒకేషనల్' జూనియర్ కళాశాలకు అరుదైన గుర్తింపు

కళాశాల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులను అభినందిస్తున్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

జగ్గయ్యపేట, ఆగస్టు 3 ప్రభాతవార్త: ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని లైఫ్ స్కిల్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాలకు అరుదైన గుర్తింపు లభించింది. ఇది చారిత్రాత్మక విజయంగా పేర్కొంటూ సోమవారం కళాశాల ప్రాంగణంలో అభినందన సభ నిర్వహించారు. డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 2026-27 విద్యా సంవత్సరానికి కళాశాలలోని ఎంఎల్‌టి, ఎంపిహెచ్‌డబ్ల్యూ (ఎఫ్) విద్యార్థులకు జగ్గయ్యపేట ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్‌సి)లో క్లినికల్ అటాచ్‌మెంట్ నిర్వహించేందుకు అధికారిక అనుమతులు మంజూరైనట్లు యాజమాన్య ప్రతినిధులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ విద్య ద్వారా యువత ఆరోగ్య రంగంలో విశేష అవకాశాలను అందిపుచ్చుకుని సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ తక్కువ కాలంలో కళాశాల నాణ్యమైన విద్యతో ప్రత్యేక గుర్తింపు సాధించటం అభినందనీయమన్నారు. కళాశాల చైర్మన్ రంగాపురం నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ఉపాధి అవకాశాలకు అనుగుణంగా శిక్షణ అందించడం కళాశాల ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల గౌరవ చైర్మన్ రంగాపురం మల్లికార్జునరావు, కార్యదర్శి-కరస్పాండెంట్ పెనుగొండ వెంకటరాజీవ్, జాయింట్ సెక్రటరీ పెనుగొండ వెంకట సతీష్, ఉపాధ్యక్షులు రంగాపురం నాగేశ్వరరావు, కార్యదర్శి సభ్యులు వీరవల్లి కిరణ్, కుక్కపు పాండురంగారావు, కళాశాల అకడమిక్ డైరెక్టర్-ప్రిన్సిపాల్ తంగెళ్ల వెంకటేశ్వరరాజు, అధ్యాపకులు, విద్యార్థులు, పేరెంట్స్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రైతుబజార్‌లో సబ్సిడీ బియ్యం: జగ్గయ్యపేట పట్టణంలోని రైతుబజార్‌లో సోమవారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సబ్సిడీ బియ్యం అమ్మక కౌంటర్‌ను ప్రారంభించారు. మార్కెట్ ధరల కంటే తక్కువ ధరకు బియ్యం అందిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. బహిరంగ మార్కెట్ లో స్టీమ్ బియ్యం కిలో రూ.62లు ఉండగా అదే బియ్యాన్ని రాయితీ ధర రూ.52ల వంతున ఏర్పాటు చేశామన్నారు. అలాగే రా బియ్యం బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.58లు ఉండగా ఇక్కడ రూ.50లకే లభిస్తుందని తెలిపారు. కాగా ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, తహసీల్దార్ శేష, మాజీమున్సిపల్ వైస్‌చైర్మన్ నూకల కుమారరాజ, డిటి వెంకట్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి శ్రీనివాస రావు, రైతుబజార్ ఇఒ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో టిడిపి నేత పుట్టిన రోజు వేడుకలు

- సోషల్ మీడియాలో వీడియో వైరల్.. కేసు నమోదు

సత్యవేడు, ఆగస్టు 3 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా నాగలాపురంలోని టిటిడి ఆధీనంలో ఉన్న శ్రీ వేదనారాయణ స్వామి ఆలయంలో ఓ టిడిపి నేత తన పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం కలకలం రేగింది. వివరాలు.. సురుటుపల్లి పల్లికొండేశ్వర స్వామి దేవాలయ బోర్డు సభ్యుడు, టిడిపి నేత నెల్సన్ మండేలా గురువారం తన పుట్టినరోజు వేడుకలను వేదనారాయణ స్వామి ఆలయ ప్రాంగణలో నిర్వహించాడు. నెల్సన్ మండేలా అనుచరులు, స్నేహితులు అతనికి శాలువ కప్పడం, బొకేలు ఇవ్వడం, పరస్పరం ప్రమాణాలు చేసుకోవడం, ఇది కాకుండా ఆలయ నియమాలకు విరుద్ధంగా, భంగం కలిగించేలా రూ.100 నోట్లను గాల్లో చల్లుకోవడం వంటి దృశ్యాలు శనివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. టిటిడి ఆధీనంలోని ఆలయంలో ఇలాంటి కార్యలు ఆలయ ప్రాంగణంలో కరెన్సీ నోట్లను గాల్లోకి చల్లుతున్న టిడిపి నేత నెల్సన్ మండేలా, నవీణ్, సాయినితీష్, చిన్న, ప్రశాంత్ పైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మందుల కొనుగోళ్లలో భారీ అవినీతి

- టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి

తిరుపతి, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి బోర్డు సమావేశంలో 134వ తీర్మానం అవినీతికి కేరాఫ్ అని టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించారు. జులై 14న జరిగిన పాలక మండలి సమావేశంలో దుర్మార్గమైన నిర్ణయం తీసుకున్నారు. 134వ తీర్మానంతో టిటిడి పరిధిలోని బర్డ్స్, స్విమ్స్, పద్మావతి చిన్నపిల్లల ఆసుపత్రికి మందులు, ఇంజెక్షన్లు, పరికరాల కొనుగోళ్లలో కుంభకోణానికి తెర లేపారని ఆయన సోమవారం తిరుపతిలో సంచలన ఆరోపణలు చేశారు. రోగుల ప్రాణ రక్షక మందులు, ఇంజక్షన్‌లు, పరికరాల కొనుగోలు నిబంధనలను సడలించి అవినీతికి అస్కారం కలిగేలా చేశారన్నారు. మందులు, పరికరాలు సరఫరా చేసే సంస్థకు రూ.వంద కోట్ల టర్నోవర్ అర్హతను రూ.25 కోట్లకు తగ్గించడం దారుణం అని కరుణాకర్ రెడ్డి ఆరోపించారు. టిటిడి నిర్ణయం వెనుక మంత్రి లోకేష్ ఒత్తిడి ఉందన్నారు. ప్రజల ప్రాణాలపై కూటమి ప్రభుత్వం కమీషన్ల రాజకీయం చేస్తుందని మండిపడ్డారు. టిటిడి ఆస్పత్రులలో మందుల, పరికరాల నాణ్యతను కాపాడాల్సిందిపోయి నిబంధనలనే బలహీనపరిచారని మండిపడ్డారు. టిటిడి బోర్డులో కీలకమైన ఓ సభ్యురాలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించినా సరే ఖాతరు చేయలేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆరోగ్యశ్రీని బలహీనపరిచిన ప్రభుత్వం ఇప్పుడు టిటిడి వైద్య సేవలపై దాడి చేస్తుందని విమర్శించారు. 134వ తీర్మానంపై స్వతంత్ర న్యాయ విచారణ జరపాలని వైసిపి తరపున డిమాండ్ చేస్తున్నట్టు భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు.

రేపు చేనేత దినోత్సవ ముందస్తు వేడుకలు

విజయవాడ, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి: అమరావతి సమీపంలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడి) ప్రాంగణంలో 12వ జాతీయ చేనేత దినోత్సవం-2026 ప్రత్యేక ముందస్తు వేడుకలను ఈ నెల 5వ తేదీ బుధవారం సాయంత్రం 4.00 గంటల నుండి నిర్వహిస్తున్నట్లు విజయవాడ చేనేత సేవా కేంద్రం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చారిత్రాత్మకమైన 1905 స్వదేశీ ఉద్యమం స్ఫూర్తిని స్మరించుకుంటూ, భారతీయ చేనేత వారసత్వ పరిరక్షణలో చేనేత కళాకారులు అందిస్తున్న విశిష్ట సేవలను గౌరవించే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం ఆగస్టు 7వ తేదీన "జాతీయ చేనేత దినోత్సవం" నిర్వహించబడుతోందని తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 5వ తేదీ అమరావతి సమీపంలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ ప్రాంగణంలో సీనియర్ చేనేత కళాకారులచే ప్రత్యక్ష నేత ప్రదర్శనలు, జి.ఐ. గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్ చేనేత ఉత్పత్తుల ప్రత్యేక ప్రదర్శన, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేనేత సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమాలు, చేనేత కళాకారులు- ఫ్యాషన్ డిజైనర్లు- ఎన్ఐడి విద్యార్థుల మధ్య ఇంటరాక్టివ్ సెషన్, అలాగే హ్యాండ్‌లూమ్ ఫ్యాషన్ షో, సారీ డ్రేపింగ్ పోటీలు నిర్వహించబడనున్నాయని తెలిపారు.

తిరుమల సమాచారం

తిరుమలలో ఈనెలలో రెండు గరుడసేవలు

- 17న గరుడపంచమి, 28న శ్రావణ పౌర్ణమి

తిరుమల, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగవైకుంఠం తిరుమలలో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తి మలయప్ప గరుడసేవకు ఎంతో విశిష్టత ఉంది. గరుడసేవలో స్వామివారు లక్ష్మీకాసులహారం, పచ్చలహారం, మరిన్ని అమూల్యమైన ఆభరణాలు ధరించి ఆలయ మాఢవీధుల్లో భక్తులకు కటాక్షిస్తారు. ఏటా బ్రహ్మోత్సవాల్లో గరుడసేవకు లక్షలాదిమంది భక్తులు ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి భారీగా తరలిరావడం పరిపాటి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుమలలో ప్రతినెలా పౌర్ణమి రోజున గరుడసేవ నిర్వహిస్తారు. ఆగస్టు నెలలో రెండుసార్లు గరుడసేవ జరగనుంది. 108 వైష్ణవదివ్యదేశాలలో గరుడసేవకు విశిష్టత ఉంది. ఈ కారణంగా ఈనెల 17వ తేదీ సోమవారం గరుడపంచమి పర్వదినం కావడంతో ఆరోజు శేషాద్రివాసుడు గరుడవాహనంపై ఊరేగుతారు. ఆరోజు సాయంత్రం 7గంటలకు మలయప్ప వాహనంపై అధిరోహించి భక్తులకు అభయమిస్తారు. కాగా ఈనెల 28వ తేదీ శ్రావణపౌర్ణమి పర్వదినం సందర్భంగా శుక్రవారం రాత్రి గరుడసేవ జరుగుతుంది. భక్తులు ఈ విషయం తెలుసుకుని గరుడసేవ వీక్షించాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.

పుష్కరిణి మరమ్మతు పనులు షురూ!

తిరుమల, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగవైకుంఠం తిరుమలలో వేలపుణ్యతీర్థాలు కలిసే స్వామివారి పుష్కరిణి మరమ్మతులు, శుద్ధిచేసే పనులు మొదలయ్యాయి. గత రెండురోజులుగా పుష్కరిణిని పూర్తిగా మూసివేసిన టిటిడి ఇంజనీరింగ్ అధికారులు ఈ నెలరోజుల పాటు వివిధ రకాల మరమ్మతు పనులు చేయనున్నారు. ఈ నెలరోజులతోబాటు సెప్టెంబర్ 10వ తేదీ వరకు భక్తులు స్నానాలాచరించేందుకు వరాహ స్వామి ఆలయం సమీపంలో స్నాన కుళాయిలు ఏర్పాటు చేశారు. సాధారణంగా ప్రతి ఏటా ఏడుకొండల వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ముందు నెలరోజులపాటు స్వామి పుష్కరిణి మూసివేసి మరమ్మతులు చేపట్టడం పరిపాటి. ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరగనున్న వేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ముందుగానే తిరుమలలోని పవిత్ర పుష్కరిణిని మరమ్మతులు మొదలుపెట్టారు. ఇప్పటికే పుష్కరిణిలో నీటిని పూర్తిగా తొలగించారు. దీని కారణంగా నెలరోజులు పుష్కరిణి హారతి కూడా రద్దుచేశారు. స్వామిపుష్కరిణిలో నీరు నిల్వఉండే అవకాశం లేదు. పుష్కరిణిలోని నీటిని శుద్ధిచేసి తిరిగి వినియోగించేందుకు అత్యుత్తమ రీసైక్లింగ్ వ్యవస్థ అందుబాటులోఉంది. నిరంతరాయంగా కొంతశాతం నీటిని శుద్ధిచేసి తిరిగి వినియోగిస్తారు. పుష్కరిణి మరమ్మతుల్లో భాగంగా మొదటి పదిరోజులు నీటిని తొలగిస్తారు. ఆ తరువాత పదిరోజులు మరమ్మతులు ఏవైనా ఉంటే పూర్తిచేస్తారు. చివరి పదిరోజులు పుష్కరిణిలో నీటిని నింపి పూర్తిగా సిద్ధం చేస్తారు. పుష్కరిణిలోని నీటి పిహెచ్ విలువ 7ఉండేలా చేస్తారు. టిటిడి వాటర్‌వర్క్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ పనులు చేపడతారు. ప్రతిరోజూ వేకువజామున జరిగే అంగప్రదక్షణ భక్తులు స్వామివారి పుష్కరిణిలో పవిత్రస్నానాలాచరించి తడిబట్టలతో స్వామివారి ఆలయంలోనికి చేరుకుంటారు. అలాగే ఏటా మూడు సార్లు స్వామివారి చక్రత్తాళ్వార్‌కు పవిత్ర పుణ్యస్నానాలను పుష్కరిణిలో జరిపిస్తారు.

కపిలేశ్వర ఆలయంలో 7న ఆడికృత్తిక ఉత్సవం

తిరుమల, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలోని ప్రసిద్ధ శైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 7వ తేదీన ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకుని వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం శుక్రవారం 9.30 గంటల నుండి 10.30 గంటల వరకు ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. పాలు, పెరుగు, తేనె, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకం జరిపి విశేష పూజలు నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవర్లు తిరువీధి ఉత్సవం వైభవంగా జరుగుతుంది. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని టిటిడి అధికారులు కోరారు.

నేటి నుండి 14 వరకు ఆండాళ్ తిరువడిపురం ఉత్సవాలు

తిరుమల, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో నేటి నుండి 14వరకు వైష్ణవ సంప్రదాయం లో విశిష్ట స్థానం కలిగిన ఆండాళ్ అమ్మ తిరువడిపురం ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం ఆండాళ్ అమ్మకి తిరుమంజనం, సాయంత్రం ఆస్థానం నిర్వహిస్తారు. ఈ వేడుకల్లో పాల్గొనే భక్తులు అమ్మవారి దివ్య అనుగ్రహాన్ని పొందనున్నారు.

ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆగస్టు 14న ఆండాళ్ అమ్మవారి శాత్తుమొర అత్యంత వైభవంగా జరుగుతుంది. ఉదయం 9.30 నుండి 10.30 గంటల వరకు గోవిందరాజస్వామి ఆండాళ్ అమ్మ ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు గోవిందరాజస్వామి ఆండాళ్ అమ్మవారిని అలిపిరికి మహోత్సవ ఊరేగింపుగా తీసుకువెళ్లి అక్కడ ఆస్థానం నిర్వహిస్తారు.

అనంతరం ప్రత్యేక పూజల తర్వాత అలిపిరి నుండి రామనగర్ క్వార్టర్స్‌లోని గీతా మందిరం, ఆర్.ఎస్. మాడ వీధిలోని విఖనసాచార్యుల ఆలయం, చిన్నజీయర్ మఠం మీదుగా దివ్య ఊరేగింపు ఆలయానికి చేరుకుంటుంది. రాత్రి 8 గంటలకు ఆండాళ్ అమ్మ సన్నిధిలో శాత్తుమొర నిర్వహించి ఉత్సవాలకు మంగళం పలుకుతారు. ఈ దివ్యోత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొని గోవిందరాజస్వామి ఆండాళ్ అమ్మవారి అనుగ్రహాన్ని పొందాలని టిటిడి భక్తులకు విజ్ఞప్తి చేసింది.

అమరావతి అభివృద్ధి పనులకు శ్రీవారి ఆశీస్సులు వేడుకున్నా

- మాజీ ఎంపి, పద్మశ్రీ మురళీమోహన్

తిరుమల, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పనులు మరింత వేగంగా జరిగి రాజధాని నిర్మాణంలో పురోగతి ఉండాలని, ఇందుకు అవసరమైన శక్తిని సిఎం చంద్రబాబుకు ప్రసాదించాలని తిరుమల శ్రీవారిని వేడుకున్నట్లు మాజీ ఎంపి, సినీనటుడు పద్మశ్రీ మురళీమోహన్ తెలిపారు. అమరావతి నిర్మాణం త్వరగా పూర్తికావాలని ప్రజల ఆకాంక్ష అన్నారు. తనకు పద్మశ్రీ అవార్డు అందుకున్న తరువాత తిరుమలకు వచ్చి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆయన ఆశీస్సులందుకోవడం జన్మలో మరచిపోలేని సందర్భమన్నారు. తిరుమలలో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించడం, త్వరగా దర్శనాలు వంటి విధానాలు బావున్నాయని ఆయన అభినందించారు. టిటిడి బోర్డు, అధికారులు భక్తుల సౌకర్యాల కల్పనలో నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అన్నప్రసాదాల నాణ్యత, లడ్డూల నాణ్యతపై భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సోమవారం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో ఆయన ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

గరుడ నాటకోత్సవాలు ఆరంభం

తిరుమల, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో సోమవారం సాయంత్రం టిటిడి ఆధ్వర్యంలో గరుడ అవార్డు నాటకోత్సవాలు ఆరంభమయ్యాయి. టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్తు, శ్రీవేంకటేశ్వర నాట్యకళా పరిషత్తు 72వ వార్షిక జాతీయ నాటకోత్సవాలు గరుడ అవార్డు కార్యక్రమం జ్యోతిప్రజ్జ్వలన చేసి ప్రారంభించారు. మొదట శ్రీవేంకటేశ్వర వైభవం నృత్య ప్రదర్శనలు అపూర్వంగా ప్రదర్శన చేశారు. ముఖ్యఅతిథులుగా అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి డాక్టర్ మేడసాని మోహన్, కళాకారులు చిన్నంగారి రమణ, క్యాటరింగ్ అధికారి విజయభాస్కర్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మబ్బు సూర్య నారాయణ రెడ్డి, ఎఇఇ మల్లం విజయకుమార్ రెడ్డి, ప్రేక్షకులు, కళాకారులు పెద్దయెత్తున మహతి ఆడిటోరియంకు విచ్చేసి కార్యక్రమాలు చూసి తరించారు.

వచ్చేది బిసిల రాజ్యమే

- బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

పలువురు నాయకులకు నియామకపత్రాలు అందజేస్తున్న కేసన శంకరరావు

గుంటూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రవ్యాప్తంగా పలువురు రాజకీయ నాయకులు, కార్యకర్తలు, ముఖ్యంగా యువత జెన్ జి ఉద్యమ తరహాలో ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘంలో చేరేందుకు వేలాదిగా తరలి రావడమే రానున్న కాలంలో రాజ్యాధికారానికి వచ్చేది అణగారిన బిసి వర్గాలేనని రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ఉద్ఘాటించారు. మొన్న సత్యసాయి జిల్లా, నిన్న గుంటూరు జిల్లా, ఈరోజు ప్రకాశం జిల్లా నుండి దజన్ల కొద్దీ సంఘంలో చేరేందుకు రావడమే అందుకు నిదర్శనమన్నారు. సోమవారం స్థానిక మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో ప్రకాశం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తన్నీరు వెంకటేశ్వరరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా చింతగుంట్ల వెంకట రమణమ్మ పలువురు ప్రకాశం జిల్లా నాయకులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రానున్నది బిసిల రాజ్యమేనంటూ ఆశాభావం వ్యక్తం చేశారు. చట్టసభలు, స్థానిక సంస్థలలో మహిళా రిజర్వేషన్లలో బిసి మహిళలకు సబ్ కోటా రిజర్వేషన్ల కల్పించాలని, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖతోపాటు, సబ్ ప్లాన్ మేరకు బడ్జెట్లో నిధులు కేటాయించి, ప్రత్యేక నోడల్ ఏజెన్సీల పర్యవేక్షణలో పథకాలు అమలు జరపాలని కోరుతున్నామన్నారు. క్రీమీ లేయర్ ఎత్తేయాలని, ఎస్సీ, ఎస్టీలతో సమానంగా వర్తక, వాణిజ్య, పారిశ్రామిక రంగాలలో రాయితీలివ్వాలని కోరుతున్నామన్నారు. ఈ సందర్భంగా నియామక పత్రాలను స్వీకరించిన నాయకులు మాట్లాడుతూ, సంఘ ఆశయాలు, లక్ష్యాల మేరకు గ్రామ గ్రామాన బిసి జెండాలు ఎగిరేలా సంఘ నిర్మాణ విస్తృతల కోసం కృషి చేస్తామన్నారు.

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
వార్త
మంగళవారం 4, ఆగస్టు 2026

పేరు తెచ్చే ప్రాజెక్టులన్నీ మావే అంటూ క్రెడిట్ చోరీ

జగన్ పై గంటా ఫైర్

విశాఖపట్నం, ఆగస్టు 3, ప్రభాతవార్త :

ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చే ఏ కార్యక్రమాన్నైనా తమదిగా చెప్పుకునే కొత్త సంప్రదాయానికి వైసీపీ తెర తీసిందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మండిపడ్డారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ ఆఫీస్ లో సోమవారం మీడియాతో మాట్లాడుతూ గూగుల్, మిట్టల్ స్టీల్ ప్లాంట్, కడప స్టీల్ ప్లాంట్, భోగాపురం ఎయిర్ పోర్టు.. ఏ ప్రాజెక్టు తెచ్చినా దానికి కర్త, కర్మ, క్రియా తానేనని ప్రచారం చేసుకోవడం జగన్మోహన్ రెడ్డి రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని తెలిపారు. విశాఖ పెట్టుబడిదారుల సదస్సు మొదలు ప్రస్తుత భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం వరకు ప్రజల దృష్టి మళ్లించే కుట్ర చేస్తున్నారన్నారు. ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి 48 గంటల ముందు శ్రీకాకుళం జైల్లో మాజీ మంత్రి సీదరి అప్పలరాజు ములాఖాత్ కు రావడం అందులో భాగమేనని ఆరోపించారు. ముందస్తు ప్రణాళిక (తరువాయి 8వ పేజీలో)

గాజువాక రైతుబజార్‌లో
సబ్సిడీ సన్నబియ్యం పంపిణీ

పేద కుటుంబాల ఆహార భద్రతే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక,ఆగస్టు 3,ప్రభాతవార్త :

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గించి నాణ్యమైన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం సబ్సిడీ సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా గాజువాక మహిళా రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన సబ్సిడీ సన్నబియ్యం పంపిణీని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ అందుబాటు ధరలో నాణ్యమైన సన్నబియ్యాన్ని అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ విద్య, వైద్యం, మహిళా సాధికారత, వ్యవసాయ రంగాల్లో పలు (తరువాయి 8వ పేజీలో)

అనకాపల్లి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్‌పై
అవగాహన సదస్సు

నర్సీపట్నం స్టార్ హోమ్స్‌లో ఘనంగా నిర్వహణ

నర్సీపట్నం, ఆగస్టు 3, ప్రభాతవార్త :

నర్సీపట్నంలోని స్టార్ హోమ్స్‌లో అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు, గంజాయి వినియోగంపై అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ప్రముఖ సినీ నటుడు బ్రహ్మాజీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాస్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు విద్యార్థులు మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై ప్రదర్శించిన అవగాహన నృత్యాలు అందరినీ ఆలోచింపజేశాయి.

ఈ సందర్భంగా సభను ఉద్దేశించి స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణం కోసం పోలీసు శాఖ చేపట్టిన ఈ అవగాహన కార్యక్రమం ఎంతో అభినందనీయమన్నారు. అయితే కేవలం ఉపన్యాసాలు, అవగాహన సదస్సుల వల్ల సమాజంలో మార్పురాదని, గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. గంజాయి విక్రయదారులు, రవాణా చేసే మూలాలను ఉక్కుపాదంతో (తరువాయి 8వ పేజీలో)

ఇంకా దొరకని
రాము.. నీతు..

గుండెల్ని పిండేస్తున్న కుటుంబం,స్నేహితుల రోదనలు

హెలికాప్టర్లు, డ్రోన్లతో విస్తృతంగా గాలింపు

గాజువాక,ఆగస్టు 3, ప్రభాతవార్త :

ఫ్రెండ్‌షిప్‌డే వేడుకలు విషాదంగా మారిన గంగవరం బీచ్ ఘటనలో గల్లంతైన రాము, నీతుల కోసం రెండో రోజూ గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. సోమ వారం ఉదయం నుంచి పోలీసులు, కోస్ట్ గార్డ్, గజఈతగాళ్లు, ఇతర రెస్క్యూ బృందాలు డ్రోన్లు, బోట్ల సహాయంతో విస్తృతంగా గాలిస్తున్నప్పటికీ వారి ఆచూకీ ఇంకా లభించలేదు. దీంతో కుటుంబ సభ్యుల ఆందోళన మరింత పెరిగింది. పెదగంట్యాడ మండలం పరిధిలోని పాత గంగవరం బీచ్‌కు ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా ఏడుగురు స్నేహితులు సరదాగా వెళ్లారు. సమీపంలోని ఆలయాన్ని దర్శించుకున్న అనంతరం సముద్ర (తరువాయి 8వ పేజీలో)

ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి, ఆగస్టు 3, ప్రభాత వార్త:

జిల్లాలో ఆగస్టు 1 నుండి 7 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టిన వెంటనే తల్లిపాలను ప్రారంభించడం, తొలి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం, అనంతరం తగిన పోషక ఆహారంతో పాటు తల్లిపాలను కొనసాగించడం వల్ల శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదల, (తరువాయి 8వ పేజీలో)

టెట్-2026 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- అభ్యర్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి
- 100 మంది స్క్రైబ్‌లకు ప్రత్యేక ఏర్పాట్లు
- జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి

విశాఖపట్నం, ఆగస్టు 3, ప్రభాతవార్త :

ఆగస్టు 5 నుంచి 16 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో నిర్వహించనున్న టెట్ పరీక్షలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయం తో పనిచేయాలని అధికారులను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి ఆదేశిం చారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్-2026) నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లపై కలెక్టరేట్ మీటింగ్ హాలులో సోమవారం సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని 8 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 21,522 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని, పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోపాలకు తావు (తరువాయి 8వ పేజీలో)

మేధోహక్కులు, మధ్యవర్తిత్వ చట్టాలపై
గీతంలో వర్క్‌షాప్

విశాఖపట్నం, ఆగస్టు 3, ప్రభాతవార్త :

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంకు చెందిన 'గీతం స్కూల్ ఆఫ్ లా' ఆధ్వర్యంలో మేధోహక్కుల చట్టాలు, మధ్యవర్తిత్వ చట్టాలపై జాతీయస్థాయి కార్యశాల (వర్క్‌షాప్) సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి గీతం స్కూల్ ఆఫ్ లా డైరెక్టర్ డాక్టర్ మౌమితా సేన్ చక్రవర్తి అధ్యక్షత వహించారు. తరగతి గది న్యాయ విద్యకు, ప్రత్యక్ష వృత్తిపరమైన ఆచరణకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తొలగించడమే తమ సంస్థ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. నేటి ఆవిష్కరణల యుగంలో లీగల్ ఫ్రేమ్‌వర్క్ ప్రాముఖ్యతను గీతం లా స్కూల్ డీన్ ప్రొఫెసర్ రాజేంద్ర ప్రసాద్ వివరించారు. ఆధునిక బౌద్ధిక సంపత్తి మరియు ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలపై (తరువాయి 8వ పేజీలో)

మాస్కో ప్రభుత్వంతో జీవీఎంసీ
చారిత్రాత్మక ఒప్పందం

స్మార్ట్ రవాణా, డిజిటల్ ఆవిష్కరణలు, పారిశ్రామికాభివృద్ధికి అంతర్జాతీయ భాగస్వామ్యం

విశాఖపట్నం, ఆగస్టు 3 ప్రభాతవార్త:

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ), రష్యాలోని మాస్కో ప్రభుత్వం మధ్య కుదిరిన మెమోరాండం ఆఫ్ కోఆపరేషన్ (ఎంఓసీ) విశాఖపట్నాన్ని ప్రపంచస్థాయి స్మార్ట్, సుస్థిర నగరంగా తీర్చిదిద్దే దిశగా కీలక మైలురాయిగా నిలుస్తుందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు.

మాస్కోలో జరిగిన 5వ ఇంటర్నేషనల్ ట్రాన్స్‌పోర్ట్ సమ్మిట్ సందర్భంగా కమిషనర్ కేతన్ గార్గ్, మాస్కో డిప్యూటీ మేయర్ మక్సిమ్ లిక్సుటోవ్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్ పాల్గొన్నారు.

ఈ ఒప్పందం ద్వారా ఆధునిక పట్టణ రవాణా, ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్స్ (ఐటీఎస్), డిజిటల్ టికెటింగ్, కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత రవాణా నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఎనర్జీ స్టోరేజ్ రంగాల్లో పరస్పర సహకారం అందనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో కుదిరిన ఈ భాగస్వామ్యం ద్వారా విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ (వీఈఆర్) ఆర్థికాభివృద్ధి, సాంకేతిక ఆవిష్కరణలకు ప్రధాన కేంద్రంగా మరింత బలోపేతం అవుతుందని కమిషనర్ తెలిపారు. విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్, పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ ఈ ఒప్పందం విశాఖలో ప్రపంచస్థాయి రవాణా వ్యవస్థలు, డిజిటల్ పరివర్తన, సుస్థిర పట్టణాభివృద్ధికి కొత్త అవకాశాలు కల్పిస్తుందని అభిప్రాయపడ్డారు.

ఏయూలో ఎంబీఏ లాజిస్టిక్స్, సప్లై చైన్ మేనేజ్‌మెంట్ ప్రవేశాలకు
దరఖాస్తుల ఆహ్వానం

రక్షణ దళ సిబ్బందికి ప్రాధాన్యత

విశాఖపట్నం, ఆగస్టు 3, ప్రభాత వార్త :

ఆంధ్ర విశ్వవిద్యాలయం డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ఆధ్వర్యంలో 2026--27 విద్యా సంవత్సరానికి ఎంబీఏ (లాజిస్టిక్స్ అండ్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్) రెండేళ్ల కోర్సులో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ డి.ఎ. నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కోర్సును ఆంధ్ర విశ్వవిద్యాలయం నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీసీ) లాజిస్టిక్స్ కౌన్సిల్ సహకారంతో సెల్ఫ్ సపోర్టెడ్ విధానంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కోర్సు వ్యవధి రెండు సంవత్సరాలు కాగా, మొత్తం 60 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. బోధన పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరుగుతుందని, ఏదైనా డిగ్రీ లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలియజేసారు .రక్షణ దళాల సిబ్బంది, వారి కుటుంబాలకు ప్రాధాన్యత కల్పించనున్నట్లు తెలిపారు. వీరికి ఫీజు రూ.40 వేలు ఉండగా, ఇతర అభ్యర్థులకు రూ.60 వేలగా నిర్ణయించినట్లు తెలిపారు.అభ్యర్థులు దరఖాస్తు ఫారాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయం డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు సాధారణ అభ్యర్థులు రూ.1,200, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.1,000 రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజును డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో అందజేయాలని తెలిపారు. ఈ డిమాండ్ డ్రాఫ్ట్‌ను "రిజిస్ట్రార్, ఏయూ (తరువాయి 8వ పేజీలో)

ఏడు రైతు బజార్లలో బియ్యం ప్రత్యేక కౌంటర్లు

సీతమ్మధార రైతు బజార్‌లో స్థానిక ఎమ్మెల్యే తో కలసి బియ్యం కౌంటర్‌ను ప్రారంభించిన ఇంచార్జి కలెక్టర్ విద్యాధరి.

తెల్లకార్డుపై నెలకు పది కేజీలు అదనం

విశాఖపట్నం, ఆగస్టు 3 ప్రభాత వార్త :

తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రజలకు నాణ్యమైన స్టీమ్ రైస్, రా రైస్ అందించేందుకు గాను జిల్లాలో తొలి దశలో 7 రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకొని వచ్చినట్టు జిల్లా ఇంచార్జి కలెక్టర్ జి. విద్యాధరి తెలిపారు. ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులో ఉంచేందుకు సీతమ్మధార రైతు బజార్‌లో స్టీమ్ రైస్, రా రైస్ విక్రయాల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ను సోమవారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి బియ్యం విక్రయాల విధానం, ధరలు, అందుబాటు అంశాలను పరిశీలించి అధికారులకు (తరువాయి 8వ పేజీలో)

నగరంలో మిద్దె తోటల పెంపకం

- 50శాతం సబ్సిడీతో కూరగాయల కిట్లు పంపిణీ
- అర్బన్ ఫార్మింగ్ పథకం అమలుకు ఉద్యాన శాఖ శ్రీకారం
- 7 న తాడిచెట్లపాలెంలో అవగాహన సదస్సు

విశాఖపట్నం, ఆగస్టు 3 ప్రభాత వార్త :

విశాఖపట్నం నగర పరిధిలో అర్బన్ ఫార్మింగ్ పథకం కింద మిద్దెపై కూరగాయలు తోటల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ఉద్యాన వన శాఖ ముందుకు వచ్చింది. నగర వాసులకు 'ప్రతి మిద్దె పై ఆరోగ్యం-ప్రతి ఇంట్లో ఆనం దం 'అనే నినాదంతో తమ స్వంత ఇంటి మిద్దె పై ఆరోగ్య కరమైన ఆర్గానిక్ కూరగాయలను పండించుకొనే విధంగా వారిని ప్రోత్సహించేందుకు ఉద్యాన శాఖ ఈ సంవత్సరం 50 శాతం సబ్సిడీతో కూరగాయలు పెంపకంను ప్రోత్సహించనున్నట్టు జిల్లా ఇంచార్జి కలెక్టర్ జి.విద్యాధరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద తమ ఇంటి మిద్దె మీద ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు పెంపకం చేపట్టే అభిరుచి ఆసక్తి గల గృహినులకు రూ.6000 విలువ గల రూఫ్ టాప్ కిట్‌లను సరఫరా చేయనున్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కిట్ క్రింద ప్రతి లబ్దిదారు నికి పాటింగ్ మిశ్రమం, గ్రో బ్యాగ్ కవర్లు, సేంద్రియ ఎరువులు, తోట పని ముట్లు చిన్న స్ప్రేయర్, సరఫరా చేస్తారు. అర్బన్ ఫార్మింగ్ పథకం అమలులో చేరిన వెంటనే లబ్దిదారులుకు రూ. 3000 వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని అన్నారు. ఈ పథకం పై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కలిగించుట కొరకు ఈ నెల 7వ తేదీన తాడిచెట్లపాలెం జిల్లా ఉద్యాన వనశాఖ అధికారి కార్యాలయలో ఉదయం పది గంటలకు అవగాహన సదస్సును నిర్వ హిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి గల లబ్ధిదారులు వెంటనే తాడిచేట్ల పాలెం జాతీయ రహదారి. ప్రక్కనే ఉన్న జిల్లా ఉద్యానశాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

మాయదారి వ్యామోహం...
నేరాల కాసారం

క్షణికానందం కోసం తొక్కే వంకర తోవలు ఉన్మాదానికి ద్వారాలు తీస్తున్నాయి. అనుబంధాల ముసుగులో వికసిస్తున్న అక్రమ సంబంధాలు చివరకు పాశవిక హత్యలకు, శవాల దాగుడుమూతలకు దారితీస్తున్నాయి. నమ్మిన వాళ్లే కాలయముళ్లవుతూ.. మానవత్వానికే మచ్చతెచ్చేలా కఠిన నేరాలకు ఒడిగడుతుండడం ఒడల నగరంలో తీవ్ర కలకలం రేపుతోంది. పెళ్లి చేసుకోవాలని, తమ బంధానికి ఒక గుర్తింపు ఇవ్వాలని బాధితులు ఒత్తిడి తేగానే, పక్కా పథకం ప్రకారం రాక్షసంగా హతమార్చి మృతదేహాలను మాయం చేస్తున్న ఉదంతాలు సభ్యసమాజాన్ని నిర్ఘాంతపరుస్తున్నాయి.

గాజువాక, ఆగస్టు 3, ప్రభాతవార్త :

గత మార్చి 2026లో గాజువాక పోలిస్టేషన్ పరిధి జీవీఎంసీ 70వ వార్డ్ ఎల్ వి నగర్ లో వెలుగుచూసిన నేవీ ఉద్యోగి చింతాడ రవీంద్ర అరాచకం నగర వాసులను భయాందోళనలకు గురిచేసింది. తనతో వివాహేతర సంబంధంలో ఉన్న ప్రియురాలు మౌనిక.. తనను పెళ్లి చేసుకోవాలని నిలదీయడంతో రవీంద్ర లోని రాక్షసత్వం బయటపడింది. పథకం ప్రకారం ఆమెను హతమార్చి, ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని ఇంట్లోని ఫ్రిజ్‌లోనే దాచిపెట్టిన తీరు మానసిక వైపరీత్యానికి పరాకాష్టగా నిలిచింది.

సూట్‌కేసులో కుక్కి...సరిహద్దులు దాటించి!

ఈ ఘోరం నుంచి నగరవాసులు తేరుకోకముందే మరో కిరాతకం కంచరపాలెం దుర్గానగర్ లో వెలుగులోకి వచ్చింది. ఆటో డ్రైవర్ బోలిశెట్టి సురేశ్ తనతో సంబంధం ఉన్న బాలిక పెళ్లి చేసుకోవాలని (తరువాయి 8వ పేజీలో)

గాజువాక రైతుబజార్‌లో సబ్సిడీ సన్నబియ్యం పంపిణీ

(7వ పేజీ తరువాయి)
పథకాలను ప్రభుత్వం వేగవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ సుధాకర్, నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు,మహమ్మద్ రఫీ, ముర్రాజు, పౌరసరఫరాల శాఖ ఆర్ఐ బంగార్రాజు, ఎస్టేట్ ఆఫీసర్ వరలక్ష్మి, సిబ్బంది మణి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

(7వ పేజీ తరువాయి)
అభివృద్ధికి కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అలాగే జిల్లాలోని ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది , సంబంధిత శాఖల అధికారులు తల్లిపాల ప్రాముఖ్యతను ప్రతి తల్లి, కుటుంబానికి చేరవేసి ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ అచ్యుతకుమారి, జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి డా. చంద్రశేఖర్ దేవ్, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్, సూర్యలక్ష్మి , ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఐసీడీఎస్) , సీడీపీఒలు పాల్గొన్నారు.

మేధోహక్కుల చట్టాలు, మధ్యవర్తిత్వ చట్టాలపై గీతంలో వర్క్‌షాప్

(7వ పేజీ తరువాయి)
విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవంలో ఐబిటీ ఖరగ్‌పూర్ ప్రొఫెసర్ ఎం. పద్మావతితో పాటు ప్రముఖ న్యాయ నిపుణులు విశ్వంభర్ బరేజా, గరిమా జోషి, నవదీప్ సుహాగ్, శుభం బుధిరాజా, సాక్షి నిగమ్ కీనోట్ స్పీకర్లుగా హాజరయ్యారు. వారు తమ ప్రసంగాలలో 'ఇండియన్ పేటెంట్స్ యాక్ట్, 1970' చరిత్ర మరియు ప్రస్తుత కాలంలో దాని ఉపయోగాన్ని వివరించారు. కొత్త సాంకేతిక పురోగతులు, పరిశోధనలకు బౌద్ధిక సంపత్తి హక్కుల రక్షణ ఎంతో అవసరమని వారు స్పష్టం చేశారు. నేటి జ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థలో ఒక పేటెంట్‌కు ఉండే విలువ సంప్రదాయ స్థిరాస్తుల కంటే చాలా ఎక్కువ అని నిపుణులు అభిప్రాయపడ్డారు. పేటెంట్ల కోసం ముందస్తు పబ్లికేషన్ ఎంచుకోవడం వల్ల దరఖాస్తు ప్రక్రియలోనే కీలకమైన ప్రొవిజనల్ హక్కులు వేగంగా లభిస్తాయని, ఇది పరిశోధనల వాణిజ్యీకరణకు మరియు రక్షణకు దోహదపడుతుందని వివరించారు. అలాగే 'ఆర్బిట్రేషన్ అండ్ కన్సిలియేషన్ యాక్ట్, 1996' లోని కీలక సవరణలు, ఆధునిక వివాద పరిష్కార పద్ధతులపై కూడా అవగాహన కల్పించారు. ఈ బహుళ నిరంతర వర్క్‌షాప్‌లో క్లెయిమ్ డ్రాఫ్టింగ్ ఎక్సర్‌సైజులు, ఇంటరాక్టివ్ సెషన్లు మరియు ఆర్బిట్రేషన్ మోడ్యూల్స్ ద్వారా భవిష్యత్తు న్యాయవాదులను సిద్ధం చేస్తున్నామని నిర్వాహక కమిటీ తెలిపింది.

7 రైతు బజార్లలో బియ్యం ప్రత్యేక కౌంటర్లు

(7వ పేజీ తరువాయి)
అవసరమైన సూచనలు చేశారు. రైతు బజార్‌కు వచ్చే వినియోగదారులు ఈ ప్రత్యేక కౌంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే రేషన్ కార్డు కలిగిన కుటుంబానికి ఉచితంగా ఒక్కొక్కరికి 5 కేజీల చొప్పున ఇస్తున్నారు. ఇపుడు ఏర్పాటు చేస్తున్న కౌంటర్ల ద్వారా రేషన్ కార్డు కలిగిన కుటుంబానికి నెలకు అదనంగా 10 కేజీల బియ్యం మార్కెట్ ధరకన్నా తక్కువకు అందిస్తారని ఇంచార్జ్ కలెక్టర్ విద్యాధరి చెప్పారు. కార్యక్రమంలో రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా దొరకని రాము.. నీతు..

(7వ పేజీ తరువాయి)
తీరంలోని రాళ్లపైకి ఎక్కి ఫోటోలు, వీడియోలు తీసుకుంటుండగా ఒక్కసారిగా ఎగసిపడిన భారీ అల నీతును సముద్రంలోకి లాగింది. స్నేహితురాలిని కాపాడేందుకు రాము ఏమాత్రం ఆలస్యం చేయకుండా దూకారు. అయితే అలల ఉధృతి, బలమైన ప్రవాహం కారణంగా ఇద్దరూ సముద్రంలో కొట్టుకుపోయారు. మిగిలిన స్నేహితులు కేకలు విన్న స్థానికులు, మత్స్యకారులు వెంటనే స్పందించి ఇతరులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న న్యూపోర్ట్ పోలీసులు, రెస్క్యూ బృందాలు, నేవీ, కోస్ట్ గార్డ్ సిబ్బంది ఆదివారం సాయంత్రం వరకు గాలింపు చేపట్టినా ఫలితం లేకపోయింది. చీకటి కారణంగా తాత్కాలికంగా నిలిపివేసిన సెర్చ్ ఆపరేషన్ సోమవారం ఉదయం మళ్లీ ప్రారంభించి తీరం వెంబడి విస్తృతంగా గాలిస్తున్నారు.ఇప్పటికీ రాము, నీతుల ఆచూకీ లభించకపోవడంతో బీచ్ వద్దే ఉన్న వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఆనందంగా గడిపేందుకు వచ్చిన ఫ్రెండ్‌షిప్ డే వేడుక తీరని విషాదంగా మారడంతో స్థానికంగా తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనపై న్యూ పోర్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏయూలో ఎంబీఏ లాజిస్టిక్స్, సప్లై చైన్ మేనేజ్‌మెంట్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

(7వ పేజీ తరువాయి)
కామన్ ఎంట్రన్స్ టెస్ట్ అండ్ అడ్మిషన్ అకౌంట్" పేరిట, విశాఖపట్నంలో చెల్లే విధంగా ఏదైనా జాతీయ బ్యాంకులో తీసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను సంబంధిత ధ్రువపత్రాల జిరాక్స్ లను, డిమాండ్ డ్రాఫ్ట్‌తో కలిపి 2026 సెప్టెంబర్ 3 సాయంత్రం 5 గంటలలోపు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయానికి అందజేయాలని సూచించారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు అదనంగా రూ.500 కౌన్సెలింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం సెప్టెంబర్ 3 నుంచి ప్రారంభమై, సెప్టెంబర్ 3వ తేదీ ముగుస్తుందని, సెప్టెంబర్ 7న సీట్ల కేటాయింపు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కౌన్సెలింగ్‌కు ప్రత్యేక కాల్ లెటర్లు పంపబోమని, పూర్తి వివరాల కోసం ఆంధ్ర విశ్వవిద్యాలయం డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ప్రొఫెసర్ డి.ఎ. నాయుడు తెలియజేశారు.

మాయదారి వ్యామోహం.. నేరాల కాసారం..

(7వ పేజీ తరువాయి)
ఒత్తిడి చేయడంతో ఆమెను దారుణంగా హత్య చేశాడు. ఆపై నేరాన్ని కప్పిపుచ్చుకునేందుకు మృతదేహాన్ని అత్యంత పాశవికంగా సూట్‌కేస్‌లో కుక్కి, రైలులో సరిహద్దులు దాటించి ఒడిశాలోని నిర్మానుష్య ప్రాంతంలో పడేసి ఏమీ తెలియనట్లు తిరిగొచ్చాడు.

మసకబారుతున్న బంధాలు... ఛిన్నాభిన్నమవుతున్న కుటుంబాలు...

ఈ తరహా ఘాతుకాలు కేవలం చట్ట వ్యతిరేక నేరాలుగానే కాక, సమాజంలో వేగంగా క్షీణిస్తున్న నైతిక విలువలకు దర్పణం పడుతున్నాయి. క్షణిక సుఖాల కోసం మొదలయ్యే బంధాలు చివరకు ఒకరి ప్రాణాలను బలిగొనడమే కాక, రెండు కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయి. చట్టాల పట్ల శిక్షాభయం లేకపోవడం, సులభంగా నేరం చేసి తప్పించుకోవచ్చనే ధీమా నేరస్తుల్లో పెరిగిపోతోంది. సాంకేతికత, అధునికత పెరిగినప్పటికీ వ్యక్తిగత ప్రవర్తనలో నైతిక పరిపక్వత లోపించడం సమాజ ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారుతోంది.

కఠిన చర్యలే శరణ్యం!..

తప్పుదారి పట్టే సంబంధాలు చివరకు దారుణ అంతాలకే దారితీస్తాయని ఈ వరుస ఘటనలు స్పష్టం చేస్తున్నాయి. ఇటువంటి రాక్షస కృత్యాలకు పాల్పడే వారిపై ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా వేగవంతమైన విచారణ జరిపి, కఠినమైన శిక్షలు అమలు చేయాలని ప్రజలు, సామాజిక వేత్తలు డిమాండ్ చేస్తున్నారు. చట్టం కఠినంగా వ్యవహరించినప్పుడే సమాజంలో భయమూ, మార్పూ సాధ్యమవుతాయని స్పష్టం చేస్తున్నారు.

కోరమండల్ సంస్థ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉండాలి: ఏఐటీయూసీ

గాజువాక,ఆగస్టు 3,ప్రభాతవార్త :

కోరమండల్ కంపెనీలో కార్మికుల విచ్ఛిన్న చర్యలను తిప్పికొట్టి, ఐక్యతను కాపాడుకోవాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మల్కాపురం గ్రామ మండలిలో గుడాల రాంబాబు అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కాంద్రేగుల సత్యాంజనేయ, కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ.. 1986లో మానం ఆంజనేయులు, 2010లో జీవీ సత్యనారాయణమూర్తి ఎనిమిది రోజుల నిరాహార దీక్షలతో వేజ్ అగ్రిమెంట్లు సాధించారని గుర్తుచేశారు. ప్రాణ త్యాగాల పోరాటాలతో వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత సాధించిన చరిత్ర ఏఐటీయూసీదేనన్నారు. కొందరు చేస్తున్న అసత్య ప్రచారాలు కార్మిక ఐక్యతను దెబ్బతీస్తాయని, సంఘాలన్నీ కలిసొచ్చి పోరాడకపోతే కాంట్రాక్టు విధానం పెరిగి శాశ్వత ఉద్యోగాలు తగ్గుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుక్కా సత్యనారాయణ, కోలేటి శంకర్రావు, మహాలక్ష్మి ప్రకాష్ పాల్గొన్నారు.

పేరు తెచ్చే ప్రాజెక్టులన్నీ మావే అంటూ క్రెడిట్ చోరీ

(7వ పేజీ తరువాయి)
ప్రకాశమే విశాఖ నుంచి బలప్రదర్శనగా రోడ్ షో చేపట్టకుంటూ సమయం మించిపోయాక శ్రీకాకుళం చేరారని చెప్పారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో 2015లో విజయనగరం ఇంచార్జ్ మంత్రిగా తాను భోగాపురం ఎయిర్ పోర్టు కోసం 2 వేల ఎకరాల భూ సమీకరణ చేశానన్నారు. జగన్మోహన్ రెడ్డి డైరక్షన్ లో అప్పటి వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, ఆ పార్టీకి చెందిన రాయిపలన సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి, మాజీ జెడ్పీటీసీ బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రెడ్డి కంచేరు మాజీ సర్పంచ్ శీరపు గురునాథరెడ్డి, సీఈసీ సభ్యుడు కాకర్లపూడి శ్రీను రాజు, వైసీపీ ఎమ్మెల్యే విద్యపురాలు దాట్ల శ్రీదేవి తదితరులు కేసులు వేసి భూసేకరణకు ఆటంకాలు సృష్టించారని పేర్కొన్నారు.

టీడీపీ హయాంలోనే ఎయిర్ పోర్టుకు శ్రీకారం

2014 లో ఎయిర్ పోర్టు ప్రతిపాదన తెరపైకి వచ్చిందని, భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు కార్పొరేషన్ లిమిటెడ్ పేరుతో స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటైందని గంటా చెప్పారు. 2017 మార్చి, ఏప్రిల్ లలో రక్షణ శాఖ నుంచి డిఫెన్స్ సహ పర్యావరణ, అటవీ శాఖల అనుమతులు వచ్చాయని, 2019 ఫిబ్రవరి లో జరిగిన ప్రీ బిడ్డింగ్ లో జీఎంఆర్ ఆ కాంట్రాక్టు దక్కించుకుందని వివరించారు. ప్రతిపక్ష నేతగా "ఎర్ర బస్సు రాని ప్రాంతానికి ఎయిర్ బస్సు కావాలా!", "విశాఖ ఎయిర్ పోర్టు ఉండగా భోగాపురం ఎయిర్ పోర్టు అవసరమా!", "కోర్టులో కేసులు వేసైనా భూములు వెనక్కి రప్పిస్తా".. అంటూ మాట్లాడిన జగన్మోహన్ రెడ్డి భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభించే సమయానికి అంతా తన గొప్పేనని చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. చిత్తశుద్ధితో వ్యవహరించి ఉంటే జగన్ అధికారంలో ఉండగానే భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణం పూర్తయ్యేదని తెలిపారు. 2024 లో అధికారంలోకి వచ్చాక రెండేళ్ల గడువు నిర్దేశించి సీఎం చంద్రబాబు నాయుడు ఎయిర్ పోర్టు ప్రజలకు అందుబాటులోకి తెచ్చారన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద నియోజకవర్గం భీమిలి.. అభివృద్ధిలోనూ శరవేగంగా పరుగులు తీస్తోందని, రాబోయే 4-5 సంవత్సరాల్లో ఈ ప్రాంతం ఎవరు ఊహించని విధంగా మారిపోతుందని చెప్పారు.

విశాఖ బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తీసేవారి పట్ల కఠినంగా ఉండాలని సీఎంను కోరా

విశాఖ బ్రాండ్ ఇమేజ్ ను దెబ్బ తీసే వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ను స్వయంగా కలిసి కోరినట్టు గంటా తెలిపారు. భీమిలి నియోజకవర్గంలో భూములపై కొన్ని పత్రికల పతాక శీర్షికల్లో ప్రచురించిన వాస్తవ సుదూర కథనాలపై విచారణ జరిపించి, వెనుక ఏ స్థాయి వ్యక్తులున్నా చర్య తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు కూడా లేఖ రాసినట్టు ఆయన చెప్పారు. చదివిన వారు అనుమానించేలా మాజీ మంత్రి అని కథనాల్లో రాయడం బట్ట కాల్చి మొహం వేసిన చందాన ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధారాలు ఉంటే పేరు రాయవచ్చని, లేదా వివరణ తీసుకోవచ్చని.. కానీ అవేమీ చేయకుండా సచ్ఛీలంగా ఉన్న తనపై పాతకులు కన్ ఫ్యూజ్ అయ్యేలా కథనాలివ్వడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని పేర్కొన్నారు.

అనకాపల్లి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో
గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన సదస్సు

(7వ పేజీ తరువాయి)
తొక్కిపెట్టాలని, చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని సూచించారు. ముఖ్యంగా గంజాయి ముఠాలు విద్యార్థుల ను, యువతను టార్గెట్ చేస్తూ, వారిని ఆశజూపి గంజాయి సరఫరాకు వాహకాలుగా వాడుకుంటున్నారని స్పీకర్ ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు విలాసవం తమైన బైకులు, అధిక మొత్తంలో డబ్బులు ఎలా వినియోగిస్తున్నారో గమనించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. గతంలో అనకాపల్లి పరిధిలో గంజాయి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుని, వారి ఆస్తులను సైతం ప్రభుత్వం జప్తు చేసిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అదే రీతిలో ఇప్పుడు కూడా గంజాయి విక్రయదారుల ఆస్తులను జప్తు చేయాలని పోలీసులను కోరారు.

నర్సీపట్నం పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు, రాత్రివేళల్లో అక్రమ కార్యకలాపాలను అరికట్టడానికి ఎస్పీతో కలిసి 65 సీసీ కెమెరాలను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. పట్టణంలోని ప్రతి మూల పోలీసు నిఘాలో ఉంటుందని, తప్పు చేసిన వారు తప్పించుకోలేరని హెచ్చరించారు. రాజకీయాలకు అతీతంగా, ఏ పార్టీ వారైనా సరే అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని తేల్చి చెప్పారు. యువత, విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి సమాజానికి ఉపయోగపడే విధంగా ఎదగాలని, గంజాయి రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు.

టెట్-2026 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

(7వ పేజీ తరువాయి)
లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పరీక్షలు ప్రతి రోజూ రెండు సెషన్లలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, హాల్‌టికెట్‌లో పేర్కొన్న సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన అభ్యర్థుల కోసం జిల్లాలో మొత్తం 100 మంది స్క్రైబ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారికి అవసరమైన సౌకర్యాలు పరీక్షా కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. కేంద్రాల పరిసరాల్లో సెక్షన్-144 అమలు చేసి ప్రశాంత వాతావరణం కల్పించాలని సూచించారు. అభ్యర్థుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష సమయాలకు అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడపడంతో పాటు తగిన రవాణా సౌకర్యాలు కల్పించాలని ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా ఏపీఈపీడీసీఎల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి పరీక్షా కేంద్రంలో వైద్య సిబ్బంది, ప్రాథమిక చికిత్సా సామగ్రి అందుబాటులో ఉంచి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేలా వైద్య ఆరోగ్య శాఖ సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

సమావేశంలో డీఆర్వో ఎం. విశ్వేశ్వర నాయుడు, డీఈవో ఎన్. ప్రేమ్‌కుమార్, ఆర్ఐఓ మురళీధరన్, పోలీసు, ఆర్టీసీ, విద్యుత్, వైద్య ఆరోగ్య, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎగిసిపడుతున్న సముద్ర కెరటాలు

కోతకు గురువుతున్న బీచ్
బీచ్‌లోకి దిగడం ప్రమాదం అంటున్న మెరైన్ పోలీసులు

జ్ఞానాపురం, ఆగస్టు 3, ప్రభాతవార్త

విశాఖపట్నం రామకృష్ణ బీచ్ కోతకు గురవుతుంది. నగరంలో వర్షాలు కురవకపోయినా సముద్ర జలాలు పెరగడంతో బీచ్ కోత గురవుతుంది. రామకృష్ణ శ్రీ బీచ్ వద్ద సముద్ర అలల తాకిడి ఉధృతంగా పెరిగి సముద్రం నీరు ముందుకు చర్చకు వస్తుంది. గత పది సంవత్సరాలుగా బీచ్ కోతకు గురవుతున్న పూర్తిస్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించకుండా ప్రభుత్వం తాత్కాలిక ఉపశమనం చేస్తుంది. వర్షాకాలంలో భారీ వర్షాలకు సముద్రం నీరు ఒక్కసారిగా ముందుకు చొచ్చుకు వచ్చి బీచ్ కోతకు గురవుతుంది. ఈ నేపథ్యంలో జీవీఎంసీ తాత్కాలిక ఉపశమనం చేస్తున్న పూర్తిస్థాయి చర్యలు కనిపించడం లేదు. విశాఖపట్నం పోర్ట్ యధాతధంగా బీచ్ కోతపై ఎలాంటి ప్రతిపాదన చేపట్టలేదు అనే ఆరోపణలు ఉన్నాయి. సముద్ర జలాలపై పూర్తిగా పట్టు సాధించిన విశాఖపట్నం పోర్టు విశాఖపట్నం పోర్టు తన కార్యకలాపాలు నిరవధికంగా నిర్వహిస్తుంది. పోర్టు అవసరాలకు మించి సముద్ర జనాలపై కట్టడాలు నిర్వహించడంతో సముద్ర అలలు గతి తప్పి రామకృష్ణ బీచ్ వైపు వస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు. బీచ్ కోతకు గురి కాకుండా ఉండేందుకు సముద్ర జలాలపై ఒత్తిడి తగ్గించాల్సిన బాధ్యత విశాఖపట్నం పోర్టుది. ఇప్పటికే బీచ్ లోని కురుసుర ప్రాంతం చాలావరకు సముద్రం నీటిలో కలిసిపోయింది. దీనికి రక్షణగా జీవీఎంసీ రాళ్లు పేర్చా , ఇసుక ఫీలింగ్ నిర్వహిస్తున్న సముద్రపు నీటిని అడ్డుకోలేకపోతున్నారు. గత రెండు రోజులుగా సముద్రం ఐదు మీటర్లకు పైగానే పైకి లేచి సముద్ర. అలలు ఎగిసిపడుతున్నాయి. చూసేందుకు ప్రమాదబరితంగా అనిపిస్తుంది. సముద్రం ప్రమాదకరంగా ఉండటంతో మెరైన్ పోలీసులు ప్రజలు అప్రమత్తంగా ఉండి బీచ్ లోపలికి వెళ్ళవద్దని హెచ్చరిస్తున్నారు. ఇటీవల గంగవరం పోర్ట్ వద్ద ఇద్దరు మృతి చెందిన సంఘటన అందరికీ తెలిసే ఉంటుంది. అందుకే సముద్ర ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ప్రజలు సముద్రం వద్దకు వెళ్లకుండా దూరంగా ఉండటమే శ్రేయస్కరమణి సూచిస్తున్నారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏయూ ఇఇటీ -2026 మూడో విడత కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

విశాఖపట్నం, ఆగస్టు 3, ప్రభాత వార్త :

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష (ఏయూఇఇటీ – 2026) మూడో విడత సర్టిఫికెట్ ధృవీకరణ, వెబ్ ఆప్షన్లు, సీట్ల కేటాయింపు ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు ఆంధ్ర విశ్వవిద్యాలయం అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి.ఎ. నాయుడు తెలిపారు.డైరెక్టర్ ప్రొఫెసర్ డి.ఎ. నాయుడు వెల్లడించిన వివరాల ప్రకారం, ఇప్పటికే సీటు కేటాయింపై చేరకుండా ఉన్న అభ్యర్థులు, ఇప్పటివరకు సీటు పొందని కానీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న వారు, ఇప్పటివరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేయని అర్హులైన అభ్యర్థులు, ఇప్పటికే సీటులో చేరి మెరుగైన సీటు కోసం ఎదురు చూస్తున్న వారు, అలాగే కొత్తగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ కు హాజరయ్యే అభ్యర్థులు మూడో విడత కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చని తెలిపారు.మొదటి, రెండో విడతల్లో నమోదు చేసిన వెబ్ ఆప్షన్లు మూడో విడతలో పరిగణనలోకి తీసుకోబడవని, ఈ విడతలో సీటు కేటాయింపు పొందాలంటే అభ్యర్థులు తప్పనిసరిగా కొత్తగా వెబ్ ఆప్షన్లు నమోదు చేయాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.అయితే, గతంలో కేటాయించిన సీటుతో సంతృప్తిగా ఉన్న అభ్యర్థులు మళ్లీ వెబ్ ఆప్షన్లు నమోదు చేయాల్సిన అవసరం లేదన్నారు. ఒకవేళ మళ్లీ ఆప్షన్లు నమోదు చేసి కొత్త సీటు కేటాయించబడితే, పాత సీటుపై వారికి ఎలాంటి హక్కు ఉండదని, ఆ సీటు తదుపరి అర్హత కలిగిన అభ్యర్థికి కేటాయించబడుతుందని తెలిపారు.స్లైడింగ్ ప్రక్రియలో అన్ని బ్రాంచీల్లో ఖాళీలు ఏర్పడే అవకాశమున్నందున, అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న అన్ని కోర్సులకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సూచించారు.మూడో విడత షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 4 నుంచి 6 వరకు రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల అప్‌లోడ్ నిర్వహించనున్నారు. రెండో విడత అనంతర ఖాళీల వివరాలను ఆగస్టు 5న ప్రకటిస్తారు. మూడో విడత వెబ్ ఆప్షన్ల నమోదుకు ఆగస్టు 5 మరియు 8 తేదీ వరకు గడువు ఇచ్చారు. ఆగస్టు 10న సీట్ల కేటాయింపు జాబితా విడుదల చేయనున్నారు. ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లింపును ఆగస్టు 11 నుంచి 17 వరకు నిర్వహించనుండగా, సీటు పొందిన అభ్యర్థులు ఆగస్టు 10 నుంచి కళాశాలల్లో ప్రత్యక్షంగా రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని డైరెక్టర్ ప్రొఫెసర్ డి.ఎ. నాయుడు తెలిపారు.

పేదలకు కూటమి భరోసా: ఎమ్మెల్యే గణబాబు

లబ్ధిదారుడికి రూ2.17 లక్షల సీఎమ్ఆర్ఎఫ్ చెక్కు అందజేత

గాజువాక,ఆగస్టు 3,ప్రభాతవార్త :

ఆపదలో ఉన్న పేద ప్రజలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) తెలిపారు. 62వ వార్డు దుర్గానగర్‌కు చెందిన పుచ్చకాయల నాగరాజుకు మంజూరైన రూ2.17 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎమ్ఆర్ఎఫ్) చెక్కును ఎమ్మెల్యే స్వయంగా లబ్ధిదారుడి నివాసానికి వెళ్లి అందజేశారు. కష్టకాలంలో పేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి కొండంత అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో వార్డ్ టీడీపీ అధ్యక్షులు మజ్జి మాలినాయుడు, సన్నాటి లక్ష్మి, నర్సింగరావు, రాము, నీలం రాజు, అప్పలరెడ్డి, రామిరెడ్డి, సూరిబాబు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి నాధుని హుండీ ఆదాయం రెండు కోట్ల 68లక్షలు

సింహాచలం, ఆగస్టు 3, ప్రభాత వార్త :

శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి గత 26రోజులకు గాను రెండు కోట్ల 68లక్షల రూపాయలు స్వామివారికి సమకూరింది. స్వామి వారికి బంగారు రూపంలో 45 గ్రాములు, సిల్వర్ 750 గ్రాములు, విదేశీ కరెన్సీ ద్వారా యూఎస్ఏ డాలర్ 142 కెనడా 50, డాలర్లు యూఏ 230, ఇండోనేషియా 5000, వియత్నం 5000, యూరో 50, బంగ్లాదేశ్ 100, స్వామివారికి వివిధ రూపాలలో హుండీ ద్వారా ఆదాయం సమకూరింది..

శతాబ్దాల చరిత్ర కలిగిన బోడేశ్వర స్వామి ఆలయానికి రహదారి ఎప్పుడు..?

గూడెం కొత్తవీధి ఆగస్టు 3 ప్రభాతవార్త :

వందలాది ఏళ్ల ఆధ్యాత్మిక చరిత్ర, వేలాది మంది భక్తుల విశ్వాసానికి నిలయమైన శ్రీ శ్రీ శ్రీ స్వయంభూ బోడేశ్వర స్వామి (శివాలయం) ఆలయానికి నేటికీ సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.కె.వీధి మండలం పెదవలస పంచాయతీ పరిధిలో ఉన్న ఈ పుణ్యక్షేత్రానికి రహదారి నిర్మించాలని పెదవలస పంచాయతీ ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులు జాతీయ రహదారి అధికారులను కోరుతున్నారు. సుమారు 100 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన ఈ స్వయంభూ శివాలయానికి చుట్టుపక్కల ఆదివాసీ గూడాలతో పాటు మైదాన ప్రాంతాల నుంచి కూడా ప్రతిరోజూ వందలాది మంది భక్తులు దర్శనానికి వస్తుంటారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ముఖ్యంగా ప్రతి సంవత్సరం భీష్మ ఏకాదశి సందర్భంగా నిర్వహించే వార్షిక జాతర మహోత్సవానికి వేలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఇంతటి ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన ఆలయానికి కనీస రహదారి సౌకర్యం కూడా లేకపోవడంపై స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారి నుంచి ఆలయానికి నేరుగా అనుసంధానించే రహదారిని ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులు, పంచాయతీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఏకతాటిపైకి వచ్చి జాతీయ రహదారి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేసి బోడేశ్వర స్వామి భక్తుల ఇబ్బందులను తొలగించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

మహిళా భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

జీమాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్. లక్ష్మణరావు

ముంచంగి పుట్టు ఆగస్టు 3 (ప్రభాతవార్త):

మహిళా భద్రతపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జి మాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ లక్ష్మణరావు సూచించారు. సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో గల గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల వసతి గృహంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళ, బాలికలు మహిళా భద్రత, సైబర్ మోసాల పైన, ఫోక్సో చట్టాల పైన, గుడ్ టచ్, బేడ్ టచ్ వంటి ప్రదాన అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై పి నాని పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కష్టించి పనిచేశాం... కరివేపాకులయ్యాం..!

స్వపార్టీ అధిష్టాన తీరుపై టిడిపి కార్యకర్తలు, స్థానిక నేతల పెదవి విరుపు

కొయ్యూరు, ఆగస్టు 3, ప్రభాతవార్త :

పార్టీ అధికారంలో లేనప్పుడు గ్రామాలలో ఎంతో కష్టించి, పనిచేసి పార్టీ అధికారంలోనికి రావడానికి కృషిచేసిన ఎంతోమంది కార్యకర్తలు, స్థానిక నేతలంతా, ఇప్పుడు పాలనలో టిడిపి అధిష్టానతీరుతో కరివేపాకులుగా మిగిలారంటూ కొంతమంది టీడీపీ కార్యకర్తలు, స్థానిక నేతలు విచారం వ్యక్తం చేయడం కనబడుతోంది. సోమవారం మండల కేంద్ర రాజేంద్రపాలెంలో టిడిపి మండల మాజీ అధ్యక్షుడు ఖాన్ ఇంట్లో జరిగిన ఒక అశుభ కార్యక్రమానికి హాజరైన కొంతమంది టీడీపీ కార్యకర్తలు, నేతలు పిచ్చాపాటిగా మాట్లాడుకుంటూ టిడిపి అధిష్టాన పాలక విధానం పై పెదవి విరిచారు. ఎన్నికల ముందు కష్టించి పనిచేసిన కార్యకర్తలను, స్థానిక నేతలను కాదని, వారి మనోభావాలను గాలికొదిలి, కేవలం కొంతమంది ఐఏఎస్ అధికారుల సూచనలనే పట్టించుకుంటుందని, దీనితో గ్రామాలలో టిడిపి కార్యకర్తలకు, స్థానిక టిడిపి నేతలకు గుర్తింపు లేకుండా పోతుందని విచారం వ్యక్తం చేశారు. ఎప్పుడూ పార్టీ ఆదేశాల అనుగుణంగా నడుచుకునే, పార్టీ అంటే అమితంగా అభిమానించే పిఏసిఎస్ మాజీ అధ్యక్షుడు, మండల టిడిపి నేత దుచ్చరి చిట్టిబాబు, రాజవొమ్మంగి మండల టిడిపి అధ్యక్షుడు పెద్దిరాజు, మండల టిడిపి నేత, మాజీ ఎంపీటీసీ వరహాల బాబు తదితరులు ఇటువంటి చర్చ చేసుకోవడం చూపరులను కొంత ఆసక్తికి, మరికొంత విస్మయానికి గురిచేసింది. ఎన్నికలప్పుడు మాత్రమే గుర్తొచ్చే కార్యకర్తలు, పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గుర్తు రారా? అంటూ నిట్టూర్చడం కనిపించింది. టిడిపి అధిష్టాన తీరు ఇలాగే కొనసాగితే, కార్యకర్తలు, స్థానిక టిడిపి నేతలు పార్టీకి దూరమయ్యే అవకాశం ఉందని వాపోయారు.

గ్రామానికి ఇచ్చిన హామీలకు స్టాంపు పేపర్‌పై సంతకానికి నేను సిద్ధం : లాయర్ దేవవరపు రాంబాబు

నక్కపల్లి, ఆగస్టు 3, ప్రభాతవార్త :

పాయకరావుపేట మండలంలోనే పాల్తేరు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఐదేళ్ల ప్రణాళికతో సిద్ధంగా ఉన్నానని హైకోర్టు న్యాయవాది దేవవరపు రాంబాబు బలంగా ప్రకటించారు. మెరక వీధి పలకల నుయ్యి వద్ద గల దేవవరపు రంగయ్య ,సత్తిబాబు నివాసం ప్రాంగణంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలతో కలిసి రాంబాబు ప్రత్యేక సభను నిర్వహించారు. మన ఊరు- మన బాధ్యత పేరుతో రెండవ సారి ఏర్పాటుచేసిన ఈ సభకు గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది .ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే నా కాలర్ పట్టుకుని అడగవచ్చుని, అవసరమైతే రూ.100 స్టాంపు పేపర్‌పై సంతకం చేయడానికి కూడా తాను సిద్ధమని రాంబాబు స్పష్టం చేశారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలపై ఆయన గ్రామ పెద్దలు యువకులు రైతులతో కలిసి మాట్లాడుతూ రైతులకు తాండవ నీరే లక్ష్యం తాండవ నీరు మన గ్రామానికి ఎందుకు రావడం లేదని ఆయన ప్రశ్నించారు. జిల్లాలు వేరైనప్పటికీ మన పక్కనే ఉన్న గ్రామ చెరువులకు గోదావరి నీరు వస్తున్నప్పుడు మన చెరువులకు ఎందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు .మన చెరువులకు నీరు తెప్పించి రైతాంగానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ మహాత్కార్యానికి సహకరించిన నాయకులకు గ్రామంలో విగ్రహాలు పెట్టడానికి కూడా తాము సిద్ధమన్నారు. మండలంలోని అతిపెద్ద పంచాయతీలలో ఒకటయిన పాల్తేరులో నేటికీ సొంత అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడం అద్దె ఇంట్లో నడపడం అత్యంత దురదృష్టకరమన్నారు. సరైన వసతులు లేక చిన్నారులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ,దీనికి శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. చదువుకున్న యువతీ, యువకులకు లైబ్రరీ ఎంతో అవసరమన్నారు. గ్రామానికి సంబంధించిన జనన మరణాలతో పాటుగా అన్ని రకాల రికార్డులు పాస్ బుక్కులు భద్రపరిచే పంచాయతీ కార్యాలయం సుమారు 60 నుంచి 70 సంవత్సరాల క్రితం నాటిదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక వసతులతో కొత్త పంచాయతీ భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా ఉందన్నారు. కొన్ని ఏరియాల్లో రోడ్లు లేక ప్రజలు నరకం చూస్తున్నారని, వాటన్నింటినీ ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తానని భరోసా ఇచ్చారు ఐదేళ్ల ప్రణాళికపై నమ్మకం లేని వారు ఉంటే స్టాంపు పేపర్‌తో రావచ్చని తాను ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే తనపై కేసు పెట్టుకోవచ్చని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. గ్రామాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా చేతులు కలపాలని కోరారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం

ఆగస్టు 1 నుండి 7 వరకు మండలంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం -సూపర్ వైజర్ ఎస్ రాజేశ్వరి, కొండమ్మ -అంగన్వాడి సెంటర్ -1లో ఘనంగా ప్రారంభమైన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం

ముంచంగిపుట్టు, ఆగస్టు 3,ప్రభాతవార్త

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమైన ఆహారమని , మాత శిశు సంక్షేమ శాఖ సూపర్ వైజర్ లు సమరెడ్డి. రాజేశ్వరి, కొండమ్మలు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమా విజయవంతం చేసేందుకే ప్రతి ఏడాది తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని వారన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో గల అంగన్వాడి సెంటర్ -1లో అంగన్వాడి టీచర్ డి సూర్యలక్ష్మి (సుజాత) ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న సూపర్వైజర్లు రాజేశ్వరి కొండమ్మలు మాట్లాడుతూ ఈ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం మండలంలో ఆగస్టు 1 నుండి 7 వరకు మండలంలో గల అన్ని అంగన్వాడి సెంటర్లలో నిర్వహించడం జరుగుతుందన్నారు.

7, 8, 9 తేదీల్లో చట్టవిరుద్ధ సమావేశాలు, బందేలు, ర్యాలీలకు ఎటువంటి పోలీస్ అనుమతులు లేవు

అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ స్పష్టీకరణ

పాడేరు,ఆగస్టు3,ప్రభాతవార్త

ఈ నెల 7,8,9 వ తేదీల్లో కొన్ని సంఘాలు, సంస్థలు ప్రజా సమావేశాలు, బంద్‌లు, ర్యాలీలు, ధర్నాలు ఇతర కార్యక్రమాలకు పిలుపు నిచ్చినట్లు జిల్లా పోలీసు శాఖ దృష్టికి వచ్చింది. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు తెలియజేయునదిఏ మనగా అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో ఎటువంటి చట్టవిరుద్ధ సమావేశాలు, ర్యాలీలు, రహదారి దిగ్బంధనలు లేదా బందేల నిర్వహణకు పోలీసు శాఖ నుంచి ఎలాంటి అనుమతి ఇవ్వలేదని జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేసారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరించడం చట్టవిరుద్ధం అని ఎస్పీ పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు సహకరించాలని అన్ని వర్గాల ప్రజలను ఎస్పీ విజ్ఞప్తి చేసారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి

డుంబ్రిగుడ, ఆగస్టు 3 ప్రభాతవార్త

గుంటసీమ పంచాయతీ కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి గిరిజనులకు సకాలంలో మెరుగైన వైద్య సేవల అందే విధంగా చర్యలు తీసుకోవాలని రంగిలిసింగి, తూటంగి, గుంటగన్నెల పంచాయతీల గిరిజనులు డిప్యూటీ ఎంపీడీఓ నర్సింగమూర్తికు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. గుంటసీమా పంచాయతీ కేంద్రంగా సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. పలు సమస్యలపై గిరిజనులు వినతి పత్రాలను సమర్పించారు. టిడిపి పంచాయతీ అధ్యక్షుడు జక్కయ్య, అధికారులు, గిరిజనులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా ర్యాలీలు సమావేశాలు నిర్వహిస్తే చర్యలు ఎస్సై సురేష్

డుంబ్రిగుడ, ఆగస్టు 3 ప్రభాతవార్త

అనుమతులు లేకుండా ర్యాలీలు సమావేశాలు ఏర్పాటు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై సురేష్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులకు పత్రిక ప్రకటన విడుదల చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ముందస్తుగా ఎటువంటి అనుమతిలేకుండా ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై సురేష్ ప్రకటనలో తెలిపారు. ఈనెల 7, 8, 9న ప్రజా సంఘాలు సమావేశాలు, బంద్‌లు, ర్యాలీలు, ధర్నాలు ఇతర కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు పోలీసు శాఖ దృష్టికి వచ్చిందన్నా ప్రజలు ఎటువంటి వదంతులు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అవుతున్న అసత్య సమాచారాన్ని నమ్మకుండా వారి వారి కార్యక్రమాలను యథావిధిగా కొనసాగించాలని, శాంతి భద్రత పరిరక్షణకు పోలీసు శాఖకు సహకరించాలని ఎస్సై ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఆదివాసి గిరిజన హక్కులు, చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

ఆదివాసీ గిరిజన ప్రజా సంఘాల డిమాండ్ -గిరిజన చట్టాలు, హక్కులు పరిరక్షణ కోరుతూ ముంచంగిపుట్టులో పలు ఆదివాసి, గిరిజన ప్రజా సంఘాలు భారీ ర్యాలీ, ధర్నా కార్యక్రమం

ముంచంగిపుట్టు ఆగస్టు 3, ప్రభాతవార్త

గిరిజన ప్రాంతాల్లో ఆదివాసి గిరిజనుల హక్కుల, చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఆదివాసీ గిరిజన ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. జీవో నెంబర్ 3 ను చట్టబద్ధత చేయాలని అదేవిధంగా 1/70 చట్టాన్ని గిరిజన ప్రాంతంలో పటిష్టంగా అమలు చేయాలని వారు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. మండల కేంద్రంలో గిరిజన హక్కులు చట్టాలను పరిరక్షణ కోరుతూ చలో ముంచంగిపుట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భారీ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. హక్కులు చట్టాలను పరిరక్షించుకునేందుకు తలపెట్టిన ఆగస్టు 8న రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని నినదించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచింగిపుట్టు మండలంలో ఆదివాసీ గిరిజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో సభ నిర్వహించారు. ఈ సభకు ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎం ఎం శ్రీను అధ్యక్షతన జరిగింది. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పి బాలదేవ్, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ 1/70 భూ బదలాయింపు నిరోధక చట్టం వరకు ఐదో షెడ్యూల్ పరిధిలోని భూమి కేవలం ఆదివాసీలకే సొంతమని చట్టాలు చెప్తున్నాయని, కానీ అమలులో ఉన్న లొసుగుల వల్ల ఏజెన్సీలో గిరిజనేతరులు భూములను అక్రమంగా ఆక్రమించుకుంటూ వచ్చారని ప్రస్తుతం ఈ చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని కోరుతూ 1672 మంది గిరిజనేతరులు సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ 2011 జనాభా లెక్కల ప్రకారం ఏజెన్సీలో తామే మెజారిటీగా ఉన్నామని, కాబట్టి చట్టాన్ని సవరించాలని వారు వాదిస్తున్నారని ఈ పిటిషన్పై సుప్రీంకోర్టు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసి మూడేళ్లు గడుస్తున్నా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడం గిరిజన రక్షణ పట్ల వారికున్న తీవ్ర నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని జిఓ నెంబర్ 3ను చట్ట బద్ధత చేయాలని ఈ డిమాండ్స్‌పై జరుగుతున్న రాష్ట్ర వ్యాప్తంగా 8వ తేదీన బంద్‌ని జయప్రదం చేయాలనీ వారు కోరారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి కె నర్సయ్య, జిల్లా నాయకులు కె త్రినాద్ ప్రజా సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు జగబంద్, పి పద్మారావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్ ధర్మానపడల్ నాయకులు బి గంగాధర్ సునీల్, రాందాస్, ఎస్ ఈశ్వరి, విజయ, వి కొండలరావు కె శంకర్, రమేష్ స్థానిక ఎం పి పి వైస్ ఎంపీపీ లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటి) వర్క్‌షాప్‌ను ప్రారంభించిన ప్రిన్సిపాల్

పాడేరు,ఆగస్టు3,ప్రభాతవార్త:

పాడేరు ప్రభుత్వ డిగ్రీకళాశాల సోమవారం నుండి ఈనెల 8వ తేదీ వరకు ఐదు రోజులు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్....(ఐఓటి) వర్క్ షాప్ ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ సత్యనారాయణ ప్రారంభించారు. ఈ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమమును పీఎం ఉషాలో భాగంగా డేటా ప్రో గాజువాక సంస్థ వారు, ఈ శిక్షణను ఇవ్వడం జరుగుతుంది. దీనిలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ సాంకేతిక వర్క్‌షాప్‌ను విద్యార్థులు చక్కగా, వినియోగించుకోవాలని, డేటాను ట్రాన్స్ఫర్ చేయడం, కొన్ని రకాల వస్తువులు చేసే పనిని సులభతరంగా ఇంటర్నెట్ థింగ్స్ చేయడం, యువతీ యువకులు సాంకేతిక రంగంలో ముందుండాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.ఎం.శ్రీనివాస్ పాత్రుడు, కోఆర్డినేటర్ ఈ. కోటేశ్వరరావు, ప్రోగ్రాం సమన్వయకర్త ఎం.రాధాకుమారి, ఇవి.జయలక్ష్మి గౌరీ శంకర్రావు బాలరాజు ధర్మారావు, శంకర్రావు విద్యార్థులు పాల్గొన్నారు.

పెదవలస పీజీఆర్ఎస్‌లో 26 వినతులు.. ప్రజా సమస్యలపై అధికారుల దృష్టి

గూడెంకొత్తవీధి, ఆగస్టు 3 ప్రభాతవార్త

మండలంలోని పెదవలస పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి వినతిపత్రాలను స్వీకరించినట్లు ఎంపీడీఓ తెలిపారు. ప్రజలు తమ గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా మెటల్ రోడ్ల నిర్మాణం, కొత్త రహదారుల ఏర్పాటు, బొంతువలస వద్ద బ్రిడ్జి-కమ్-రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ, పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన వినతులను సంబంధిత శాఖల అధికారులకు వెంటనే పంపించి, క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మీ భూమి-మీ హక్కు' పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

గూడెంకొత్తవీధి ఆగస్టు 3 ప్రభాతవార్త

మండల పరిధిలోని పలు గ్రామాల్లో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమం కింద పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ హెచ్. అన్నాజీరావు తెలిపారు. ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈనెల 5వ తేదీన బూసులు, 6వ తేదీన కొక్కితపాడు, 7వ తేదీన సిగినాపల్లి గ్రామాల్లో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ హెచ్. అన్నాజీరావు కోరారు.

సుంకరమెట్ట పిహెచ్‌సి టాటా సంజీవని డిజిటల్ నర్స్ సెంటర్ పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక

మారుమూల గిరిజన ప్రాంతాలకు అత్యాధునిక డిజిటల్ ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యం :జిల్లా కలెక్టర్ టి.నిశాంతి

అరకు రూరల్, ఆగస్టు 3, ప్రభాతవార్త

మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసించే ప్రతి పౌరునికి నాణ్యమైన, సులభమైన, సాంకేతిక ఆధారిత ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని సుంకరమెట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని "టాటా సంజీవని డిజిటల్ నర్స్ సెంటర్" పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు జిల్లా కలెక్టర్ టి. నిశాంతి తెలిపారు. సోమవారం అరకలోయ మండలంలో సుంకరమెట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడ అమలవుతున్న సేవలను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నాలుగు గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న ప్రతి కుటుంబం, ప్రతి పౌరుని సమగ్ర ఆరోగ్య వివరాలను సంజీవని రిజిస్ట్రేషన్ ద్వారా డిజిటల్ రూపంలో నమోదు చేసి, అవసరమైన సమయంలో వెంటనే వైద్య సేవలు అందించే విధంగా వ్యవస్థను రూపొందిస్తున్నట్లు తెలిపారు. అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ బాల మురళీకృష్ణ, ఎన్‌సీడీ-ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ డి. ప్రతాప్, సంజీవని టాటా డిజిటల్ నర్స్ సెంటర్ ఇంప్లిమెంటేషన్ స్పెషలిస్ట్ గోపీచంద్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ కె. ఉపేంద్ర, డాక్టర్ కె.ఎస్. ఉదయ్ కుమార్, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. వేణుగోపాల్, డిప్యూటీ డీఎంఓ పి. సింహాచలం, డీపీహెచ్ఎన్ఓ జి. భూలోకమ్మ, అరకులోయ ఎంపీడీవో వీసం ప్రసాద్, తాసిల్దార్ రాజా శ్రీధర్, పాల్గొన్నారు.

డీఎస్సీ అక్రమాలపై బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి

అరకు ఎమ్మెల్యే - రేగం మత్స్యలింగం డిమాండ్

అరకులోయ, ఆగస్టు 3, ప్రభాతవార్త

డీఎస్సీ అక్రమాలపై బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీ నామా చేయాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్య లింగం డిమాండ్ చేశారు. సోమవారం అరకులోయలోని గిరిజన భవన్ నందు రాష్ట్రంలో విద్యార్థులు, యువత, నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన మోసపూరిత హామీల అమలు, వాటి పరిస్థితి పై చర్చించేందుకు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆధ్వర్యంలో టౌన్ హాల్ సమావేశం జరిగింది. ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ వైసీపీ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం 2024లో నిర్వహించిన డీఎస్సీలో అక్రమాలు అలాగే నీట్ ప్రశ్న పత్రాలు లీకేజ్ అంశాల మీద రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రస్తావించడం జరిగిందని అన్నారు. డీఎస్సీ 2025లో 16 వేలకు పైగా టీచర్ పోస్టుల భర్తీ చేపట్టగా స్పోర్ట్స్ కోట కింద 421 ఉపాధ్యాయ పోస్టులకు రాత పరీక్ష లేకుండా క్రీడా ప్రతిభ సర్టిఫికెట్ల ఆధారంగా ఎంపిక చేశారని, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలో రాణించిన వారికి ఉద్యోగాలు ఇవ్వకుండా జిల్లా, యూనివర్సిటీ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న వారికి పోస్టులు ఇచ్చారని ఇది దురదృష్టకరమని ఎమ్మెల్యే అన్నారు. వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేగం చాణక్య, అరకులోయ మండలం సీనియర్ నాయకులు కమ్మిడి అశోక్, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పాంగి చిన్నారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తడబారికి సురేష్ కుమార్, అరకులోయ నియోజక వర్గ మండల పార్టీ అధ్యక్షులు స్వాభి రామ్మూర్తి, పాంగి పరశురాం, కొర్రా సూర్యనారాయణ, పాంగి అనిల్ కుమార్, మజ్జి చంద్రు బాబు, పాంగి పద్మారావు, నాయకులు బత్తిరి రవి ప్రసాద్, శెట్టి అప్పాలు, చట్టారి జానకమ్మ, శెట్టి నీలవేణి, అప్పారావు, కిముడు హరి, సందడి కొండబాబు, సమిడ వెంకట పూర్ణిమ, వైస్ ఎంపీపీలు కిల్లో రామన్న, శెట్టి ఆనంద్, ఎంపిటిసి సభ్యులు దూరియా ఆనంద్, శత్రుఘ్న, మండలం ఎస్టి సెల్ అధ్యక్షుడు పాంగి నగేష్, విజయ్ కుమార్, గుడివాడ ప్రకాష్, కదలి శివ, వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధులు పాంగి నరసింహారావు, విద్యార్థులు, నిరుద్యోగులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెదగూడ సెక్టార్ పరిధిలో అంగన్వాడి సెంటర్లలో ఘనంగా తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం

బిడ్డలకు రోగనిరోధక శక్తిని పెంచే కీలకపాత్ర పోషించేది తల్లిపాలు మాత్రమే : సూపర్వైజర్ సిహెచ్. వరహాలమ్మ -ఆగష్టు 1 నుండి 7 వరకు మండలంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం

ముంచంగిపుట్టు ఆగష్టు 3, ప్రభాతవార్త

అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండల పరిధిలో గల పెదగూడ సెక్టార్ పరిధిలో గల పెదగూడ అంగన్వాడి సెంటర్లో అంగన్వాడి టీచర్ కె.పద్మలత ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. సెక్టార్ సూపర్వైజర్ సిహెచ్. వరహాలమ్మ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డలకు తల్లిపాలే రోగనిరోధక శక్తిని పెంపొందించేందుకు కీలకపాత్ర పోషిస్తాయని తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమైన ఆహారమని, మాత శిశు సంక్షేమ శాఖ సూపర్ వైజర్ సిహెచ్ వరహాలమ్మ తెలిపారు. ఈ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం మండలంలో ఆగష్టు 1 నుండి 7 వరకు మండలంలో గల అన్ని అంగన్వాడి సెంటర్లలో నిర్వహించడం జరుగుతుందన్నారు.

మారికవలస రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల 5,6,7, విద్యార్థులను యధావిధిగా స్కూల్లో కొనసాగించాలి

పాడేరు ఐటీడీఏ పీఓకి వినతి :ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ

పాడేరు,ఆగస్టు3,ప్రభాతవార్త

విశాఖపట్నం మారికవలస రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో ఐదు, ఆరు, ఏడు, తరగతులు చదువు తున్న గిరిజన విద్యార్థులను యధా విధిగా అదే స్కూల్లో కొనసాగించాలని పాడేరు ఐటిడిఏ పిఓ కలిసి వినతి పత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ మాట్లాడుతూ మారికవలస గురుకుల పాఠశాలలో సుమారుగా 300 మంది గిరిజన విద్యార్థులు చదువుతున్నారు. జీవో నెంబర్ 69ని తీసుకువచ్చి, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా పాఠశాల అప్ గ్రేడ్, పేరుతో విద్యార్థులకు తీసుకొని వెళ్ళిపోయి వేరే పాఠశాలలో జాయినింగ్ చేయమని, తల్లితండ్రులకు ఒత్తిడి చేయడం, విద్యార్థులకు ఒత్తిడి చేయటం మంచి పద్ధతి కాదు అని కాదని ఇప్పటికైనా వేధింపులు ఆపి మారికవలస పాఠశా లలోనే తమ విద్యార్థులను యధావిధిగా కొనసాగించాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని వారు అన్నారు. నిరుద్యోగుల సంఘం జిల్లా నాయకులు ఖర్జవై కుమార్, భాను సిహెచ్‌రావు, విద్యార్థుల తల్లితండ్రులు రమేష్ నాయుడు, కే రాజేష్,ఖాతారి రాజు, వెంగళరావు, శ్రీనాథ్, శ్రీలత, భారతి, కొండమ్మ పాల్గొన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి హైపవర్ కమిటీ ఏర్పాటు దిశగా చర్యలు

గిరిజన సంఘాల ప్రతినిధులతో జిల్లా స్థాయి సమావేశం

పాడేరు,ఆగస్టు3,ప్రభాతవార్త:

గతంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి గిరిజన సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు, ఐఏఎస్ అధికారులు, న్యాయ నిపుణులు, గిరిజన సంఘాల ప్రతినిధులతో కూడిన ఉన్నత స్థాయి (హైపవర్) కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. హైపవర్ కమిటీలో సభ్యులుగా ఉండే గిరిజన సంఘాల ప్రతినిధుల పేర్లను సూచించే అంశంపై సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ టి.నిశాంతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ తిరుమని శ్రీపూజ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్యవర్మ, అదనపు ఎస్పీ శృతి పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ గిరిజన ఉద్యమ సంఘాలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. హైపవర్ కమిటీలో సభ్యులుగా గిరిజన సంఘాల ప్రతినిధుల ఎంపికపై జరిగిన చర్చలో భాగంగా, గిరిజన సంఘాల నాయకులు బాబూరావు నాయుడు (రిటైర్డ్ ఐఏఎస్),కొబ్బా శ్రీనివాస్ (లీగల్ అడ్వైజర్) పేర్లను సూచించారు. మిగిలిన ముగ్గురు సభ్యుల పేర్లను పరస్పర సంప్రదింపుల అనంతరం ఏకాభిప్రాయంతో ఖరారు చేసి మంగళవారం లోగా అందజేయాలని జిల్లా కలెక్టర్ గిరిజన సంఘాల నాయకులను కోరారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన సంఘాల నాయకులు తమ వినతులు, సమస్యలను శాంతియుతంగా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా రహదారులపై ఆందోళన కార్యక్రమాలు చేపట్టకుండా సహకరించాలని కలెక్టర్ కోరారు. దీనిపై స్పందించిన గిరిజన ఉద్యమ నాయకులు తమ డిమాండ్లు, వినతులను శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వానికి తెలియజేస్తామని, ప్రభుత్వంతో సానుకూల చర్చలకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. సమావేశంలో గిరిజన సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తల్లిపాలు.. అమృతం కన్నా మేలు

అంతాడ, బంగారంపేటలో తల్లిపాల వారోత్సవాలు

కొయ్యూరు, ఆగస్టు 3, ప్రభాతవార్త

తల్లిపాలు బిడ్డకు అమృతం కంటే ఎక్కువ మేలు చేస్తాయని కొయ్యూరు ఐసిడిఎస్ సిడిపిఓ దేవమణి అన్నారు. ప్రతి ఏడాది ఆగస్టు 1 నుండి7వరకు నిర్వహించే తల్లిపాల వారోత్సవాలులో భాగంగా సోమవారం మండలంలోని అంతాడ, బంగారం పేట అంగన్వాడీ కేంద్రాలులో సిడిపిఓ దేవమణి నేతృత్వంలో వారోత్సవాలు నిర్వహించారు. సిడిపిఓ మాట్లాడుతూ ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యం తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంచడం, ప్రతి శిశువుకు తల్లిపాలు అందేలా ప్రోత్సహించడమేనన్నారు. తల్లిపాల ప్రాముఖ్యత తెలుసుకొని పుట్టిన మొదటి గంటలోపే శిశువుకు తల్లిపాలు ప్రారంభించాలన్నారు. మొదటి 6 నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. నీరు, తేనె లేదా ఇతర ఆహారం అవసరం లేదన్నారు. 6 నెలల తర్వాత అనుబంధ ఆహారం ప్రారంభించి, 2 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలు కొనసాగించాలన్నారు. తల్లి ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ కనక మహాలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్లు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సోప్ యూనిట్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్

అరకు రూరల్, ఆగస్టు 3, ప్రభాతవార్త

యూనిట్ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పిస్తూ ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమ వారం జిసిసి సోప్ యూనిట్ వర్కర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో జిసిసి జనరల్ మేనేజర్ దేవరాజ్‌ని కలిసి డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రం ను కార్మికులతో కలిసి సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, విజయనగరం జిల్లా కోశాధికారి జగన్మోహన్ అందించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా అరుకులోయ, విజయ నగరం సోప్ యూనిట్‌లో ఉన్న 38 మంది కార్మికులు గత 20 నుంచి 30 ఏళ్లగా విధులు నిర్వహిస్తున్నారని ప్రస్తుత పరిస్థితుల్లో 26 వేల రూపాయల కనీస వేతనం ఉండాలన్నారు. జూలై 22 తరువాత సమ్మెలోకి వెళ్తామని జూలై 15న ముందుగానే నోటీస్ ఇవ్వటం జరిగిందని, మాతో చర్చించి సమస్యలు పరిష్కారం చేస్తారని ఆశించామన్నారు. తక్షణమే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనియెడల సమ్మెబాట పడతామని హెచ్చరించారు. సోపు యూనిట్ వర్కర్స్ యూనియన్ నాయకులు సింహాద్రి, దాసు, ప్రభాకర్, పద్మ,శేషు, సుశీల, ఎర్రన్న పాల్గొన్నారు.

పెదగూడ పంచాయతీలో సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలి

పంచాయతీ మాజీ సర్పంచ్ మండి బాబురావు -పెద గూడ పంచాయతీ గ్రీవెన్స్ కార్యక్రమంలో అధికారులకు వినతి

ముంచంగిపుట్టు ఆగష్టు 3,ప్రభాతవార్త

అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం పెద గూడ పంచాయతీ పరిధిలో పలు సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆ పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ మండి బాబురావు అధికారులను కోరారు. సోమవారం పెద గూడ పంచాయతీ కేంద్రంలో స్థానిక ఎంపీడీవో కె.ధర్మారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమంలో పలు పంచాయతీ సమస్యలపై మాజీ పంచాయతీ సర్పంచ్ మండి బాబురావు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. పంచాయతీలో గల సిసి రోడ్లు డ్రైనేజీలకు, దొర గూడ గ్రామంలో రోడ్డు ఫార్మేషన్ కొరకు, బంధ వీధి చెరువు నిర్మాణం కొరకు చర్యలు చేపట్టాలని వినతి పత్రం సమర్పించడం జరిగిందని బాబురావు తెలిపారు. లకే బాలన్న, పాంగి బలరాం, ఎల్ రామ్మూర్తి పాల్గొన్నారు.

పాడేరు జిఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

పాడేరు,ఆగస్టు3, ప్రభాతవార్త

అల్లూరి సీతా రామరాజు జిల్లా పాడేరు జిఎంఆర్ కళాశాల నందు ఈ నెల 5 వ తేదీన బుదవారం స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఏం.హరిబాబు ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి పాస్ అయినటువంటి విద్యార్థులు, అర్హులు, స్పాట్ అడ్మిషన్కు ఆసక్తి కలిగిన విద్యార్దులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లు తో పాటు రెండు సెట్స్ జెరాక్స్ కాపీలు, ఒరిజినల్ టి.సి.ను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. స్పాట్ జాయినింగ్ అయినటువంటి విద్యార్థులకు ఎటువంటి ఫీజు రీయింబర్స్మెంట్ సదుపాయం ఉండదని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. స్పాట్‌కు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 5వ తేదీ బుదవారం ఉదయం 9గంటలకు అడ్మిషన్ ఫీజు రూ.4,,700లతో హాజరు కావలసినదిగా ప్రిన్సిపాల్ కోరారు. సివిల్ ఎస్టీకి 18 సీట్లు, ఎస్సీ9, బీసీకి 2 సీట్లు ఎలక్ట్రికల్ ఎస్టీలు 29,ఎస్సి 5,బీసీ కి 2,మెకానికల్ ఎస్టీకి 29, ఎస్సీకి 1,బిసి కి 1 సీట్లు కేటాయించటం జరిగిందని ఈ అవకాశాన్ని అభ్యర్థులు వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ ఏం.హరిబాబు కోరారు.

మోదపల్లి గ్రామంలో మీ భూమి మీ హక్కు పట్టాల పంపిణీ

పాడేరు,ఆగస్టు3,ప్రభాతవార్త:

పాడేరు మండలం మోదపల్లి పంచాయితీ మోదపల్లి గ్రామంలో మీ భూమి మీ హక్కు పట్టాల పంపిణీ కార్యక్రమంలో రైతులకు రాజముద్రతో ఉన్నటువంటి వారి ఫోటోతో ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలు అధికారులు సమక్షంలో వారి గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేసి పైసా ఖర్చు లేకుండ రైతులకు పట్టాలు సోమవారం పంపిణీ చేసారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర జిసిసి డైరెక్టర్ బొర్రా నాగరాజు, పాడేరు పిఏసిఎస్ చైర్మన్ డప్పోడి వెంకటరమణ, పిఏసిఎస్ డైరెక్ట్ డైరెక్టర్ మర్రి కొండబాబు, మాజీ సర్పంచ్ మంగమ్మ పాలిక లక్కు పదవ కో క్లస్టర్. కూడ రాజేష్. టిడిపి పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు రాజారత్నం వైస్ సర్పంచ్ కొట్టిబాబు డిప్యూటీ తాసిల్దార్ చంద్రరావు, వీఆర్వో కొండమ్మ పైసా కమిటీ అధ్యక్షులు రైతులు పాల్గొన్నారు.

గింజర్తి పాఠశాలలో 4,5 తరగతులు కొనసాగించాలి

ఎంఈఓ కార్యాలయం ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన

కొయ్యూరు, ఆగస్టు 3, ప్రభాతవార్త

తమ గ్రామంలో అధిక సంఖ్యలో ప్రాథమిక విద్యార్థులు, సువిశాలమైన ప్రాంగణము కలిగిన పాఠశాల ఉన్నప్పటికీ, మోడల్ స్కూలును చింతలపూడిలో మంజూరు చేయడం ఎంతో విచారకరమని మండలంలోని చింతలపూడి పంచాయతీ, గింజర్తి గ్రామ విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. గ్రామంలో కేవలం మూడవ తరగతి వరకు మాత్రమే విద్యాబోధన అందించి, 4,5 తరగతులను చింతలపూడి తరలించే యోచనపై ఆగ్రహానికి గురైన గ్రామ విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయ ఎదురుగా ధర్నా నిర్వహించారు. గింజర్తి గ్రామ పాఠశాలలో నాలుగైదు తరగతులను కూడా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు న్యాయం చేయాలని కోరారు. కాగా ధర్నా ప్రాంగణాన్ని సందర్శించిన మంప ఎస్సై శ్రీనివాస్, ఎటువంటి అల్లర్లు లేకుండా శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు.

నేటి నుండి నుండి 7వ తేదీ వరకు అల్లూరి జిల్లాలో ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ సొల్ల బొజ్జిరెడ్డి పర్యటన

పాడేరు,ఆగస్టు3, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) కమిషన్ చైర్మన్ (కేబినెట్ హోదా) సొల్ల బొజ్జిరెడ్డి ఆగస్టు 03వ తేదీ నుండి 7వ తేదీ వరకు అల్లూరి జిల్లాలో విస్తృతంగా పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ నిషాంతి.టి తెలిపారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధితో పాటు స్థానిక సమస్యలను నేరుగా తెలుసుకోవడమే లక్ష్యంగా ఈ పర్యటన ఖరారైందని, పర్యటన ముఖ్యంగా గిరిజనులతో ముఖాముఖి ఉంటుందని, చింతపల్లి, అరకు, పాడేరు ప్రాంతాల్లో గిరిజన నాయకులు, స్థానిక గిరిజనుల నుండి నేరుగా వినతులు స్వీకరిస్తారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాల పరామర్శ, గొందిపాకల, కమ్మయ్యపేట గ్రామాల్లో స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను కలవనున్నారు. క్షేత్రస్థాయి తనిఖీలు, జలజీవన్ మిషన్ పనులు, పీఎం జన్మన్ ఇళ్లు, కాఫీ ప్రోసెసింగ్ యూనిట్లు, ఎర్రవరం జలవిద్యుత్ ప్రాజెక్టు, డామ్‌లు, కాఫీ/చాక్లెట్ ఫ్యాక్టరీలను సందర్శిస్తారు. జిల్లాలో పలు సంక్షేమ సంస్థల పరిశీలన, కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం ఏకలవ్య మోడల్ నివాస పాఠశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రులను సందర్శించి విద్యార్థులు, ప్రజలతో మాట్లాడుతారు. సమీక్షా సమావేశం ఆగస్టు 06న పాడేరు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్, వివిధ శాఖల జిల్లా అధికారులతో గిరిజన సమస్యలపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్‌లను చైర్మన్ పర్యటనపై తగు ఆదేశాలు జారీచేసారు. చైర్మన్ పర్యటనకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని, కేబినెట్ ర్యాంక్ ప్రోటోకాల్ ప్రకారం తగిన భద్రత, రవాణా, ఇతర ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

ఆదివాసీల పవిత్ర సంప్రదాయాలను కార్పొరేట్ ప్రయోజనాల కోసం వాడొద్దు: సోమేశ్ కుమార్

గూడెంకొత్తవీధి, ఆగస్టు 3 ప్రభాతవార్త

కార్పొరేట్ శక్తుల మెప్పు కోసం కూటమి ప్రభుత్వం ఆదివాసీల పవిత్ర సాంప్రదాయ నృత్యమైన 'ధింసా'ను విద్యార్థులతో కేవలం వినోద ప్రదర్శనగా మార్చేయడం అత్యంత అవమానకరమని ఆల్ ఇండియా ఆదివాసి స్వయం పాలన సాధన సమితి (ఏఐఏఎస్ఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడపల సోమేశ్ కుమార్ మండిపడ్డారు. గిరిజనుల విశిష్ట సంస్కృతిని ప్రభుత్వం ఆటబొమ్మలా మార్చడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఆయన మాట్లాడుతూ "ధింసా మా జీవన సంస్కృతని భోగాపురంలో నూతనంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి హాజరుకానున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి స్వాగతం పలికే పేరుతో సుమారు 13 వేల మంది గిరిజన బాలికలతో ధింసా నృత్య ప్రదర్శన నిర్వహించడం గిరిజన ఆచారాలను కించపరచడమేనని ఆయన ఆరోపించారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు తగిన గౌరవం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తాళ్లపాలెం సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ హాస్టల్‌ను సందర్శించిన

రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు చైర్మెన్ పోతుల బాలకోటయ్య

కశింకోట, ఆగస్టు 3, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య ఉత్తరాంధ్ర సంక్షేమ యాత్ర అన్న కార్యక్రమంతో అనకాపల్లి జిల్లాలో అధికారిక పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం తాళ్లపాలెం సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ హాస్టల్ ను సందర్శించారు. ఆయనకు హాస్టల్ ప్రిన్సిపల్ అండ్ చైర్మన్ జి.గ్రేస్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థినులతో హాస్టల్ సౌకర్యాల కోసం మాట్లాడారు. సోషల్ వెల్ఫేర్ ఆఫీస్ డిప్యూటీ డైరెక్టర్ పి. రమానందం ఉభయ జిల్లాల డాక్టర్ అంబేద్కర్ గురుకులం డిసిఓఎన్ రామకృష్ణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్య పద్మ జిల్లాలో ఉన్న 8 రెసిడెన్షియల్ స్కూలు ప్రిన్సిపల్స్, సోషల్ వెల్ఫేర్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేష్టం

తల్లిపాలు వారోత్సవాలు

ఎలమంచిలి, ఆగస్ట్ 3, ప్రభాతవార్త

పట్టణంలోని 16వ అంగన్వాడి కేంద్రంలో ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలు సందర్భంగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఇందిరాదేవి ఆధ్వర్యంలో సూపర్వైజర్ రమ్య పర్యవేక్షణలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత, బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు ప్రారంభించడం మొదటి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ఆరు నెలలు తరువాత పరిపూర్వక ఆహారంతో పాటు రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లి పాలు కొనసాగించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు పాల్గొన్నారు.

పేట బయ్యవరం, గుండ్రబిల్లి అంగన్వాడీ కేంద్రాలలో తల్లిపాలు వారోత్సవాలు

ఎలమంచిలి, ఆగస్ట్ 03, ప్రభాతవార్త

మండలంలోని పేట బయ్యవరం, గుండ్రబిల్లి అంగన్వాడీ కేంద్రాలలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ జి.అపరంజిని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అపరంజిని మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు రెండు సంవత్సరాలు వచ్చేవరకు తల్లిపాలు ఇవ్వటం ద్వారా తల్లి, పిల్ల ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఏఎన్ఎం ఎస్ కనకదుర్గ, ఆశ వర్కర్లు మీ బేబీ రాణి, జి గోపమ్మ, సిఎల్ డబ్ల్యూ ఎస్ భవాని, అంగన్వాడి కార్యకర్తలు సిహెచ్ భార్గవి, పి లక్ష్మి పిల్లల తల్లిదండ్రులు,పిల్లలు పాల్గొన్నారు.

ఆత్మ వారి సౌజన్యంతో రామారాయుడుపాలెం గ్రామంలో వ్యవసాయ సలహా మండలి

ఎలమంచిలి, ఆగస్ట్ 03, ప్రభాతవార్త

మండలంలోని రామారాయుడుపాలెం గ్రామం లో ఆత్మ సౌజన్యంతో వ్యవసాయ సందర్శన కార్య క్రమం మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నిర్దేశించి వ్యవసాయ శాస్త్రవేత్త చాందిని మాట్లాడుతూ మండలంలో వర్షాపాతం తక్కువగా నమోదవడం కారణం చేత తేలికపాటి రకాలు అయినటువంటి వరి రకాలు ఏంటీయూ 12 24 లేదా నెల్లూరు సన్నాలు రకాలను నీరుగా విచ్చే పద్ధతి ద్వారా లేదా వెదజల్లడం ద్వారా చేసుకున్నట్లయితే రైతులు ఆహార ఉత్పత్తులను పొందగలరని అన్నారు. వ్యవసాయ సహాయ సంచాలకులు సుమంతా మాట్లాడుతూ నీటిపారుదల వ్యవస్థ బోరువెల్స్ ఉన్నచోట రైతులు ఉడుపులు సకాలంలో చేసుకున్నట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. మండల వ్యవసాయ అధికారి మోహన్‌రావు మాట్లాడుతూ రైతు సోదరులు ప్రధానమైన పంట వరి పంటకి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ఒక ఎకరానికి 42 రూపాయలు చెల్లించినట్లయితే ఇన్సూరెన్స్ పొందడానికి వీలు అవుతుందని రైతును ఉద్దేశించి ఉన్నారు. మార్కెటింగ్ వైస్ చైర్మన్ గొర్ల బాబురావు, బెజవాడ మని, మురళి, చిరంజీవి, తోట గణేష్, వ్యవసాయ సహాయకులు దీపిక, రైతులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

రూ.14లక్షల 50 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, ఆగస్ట్ 03, ప్రభాతవార్త

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఎలమంచిలి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వర రావు అధ్యక్షతన నియోజవర్గ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పప్పల చలపతిరావు పాల్గొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుపేదలకు, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని, ఆర్థిక ఇబ్బందులతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి 'ముఖ్యమంత్రి సహాయ నిధి' (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తోంది. నియోజకవర్గంలో 28 మందికి ఈ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 14 లక్షల 50 వేల రూపాయలు చెక్కులు అంద జేశారు. అచ్యుతాపురం మండల పార్టీ అధ్యక్షులు పీలా తులసిరాం, మునగపాక పార్టీ ప్రెసిడెంట్ పెంటకోట విజయ్, ఎంపీటీసీ నీరుకొండ నర్సింగరావు, జిల్లా అధికార ప్రతినిధి దాడి రమేష్, క్లస్టర్ ఇన్చార్జిలు శంకర్, కరణం రవికుమార్, సన్యాసినాయుడు, నాయకులు కార్యకర్తలు సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

వారంలోనే అంగన్‌వాడీ పోస్టుల ఎంపిక పూర్తి

బాధ్యతాయుతంగా, పారదర్శకంగా సేవలు అందించాలి :జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్

అనకాపల్లి, ఆగస్టు 3, ప్రభాతవార్త

జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకుల ఎంపిక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ తెలిపారు. కేవలం ఒకే ఒక్క వారంలోనే ఈ నియామక ప్రక్రియను పూర్తి చేసి, ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు.జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ మాట్లాడుతూ ఈ నెల 20, 23 తేదీలలో నిర్వహించిన ఇంటర్వ్యూల ఆధారంగా ఎంపిక ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు, అంగన్వాడీ సహాయకులు మొత్తం 170 మందికి నియామక పత్రాలు అంద జేశారు. వైద్య ఆరోగ్య శాఖతో సమన్వయం చేసుకుంటూ పిల్లలు, గర్భిణులకు పోలియో, ధనుర్వాతం వంటి వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో అందేలా కార్డ్ ఆధారిత రిజిస్ట్రేషన్ మానిటరింగ్ చేపట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్, సీడీపీఓలు, ఇమ్యునైజేషన్ అధికారులు, సిబ్బంది నూతనంగా ఎంపికైన అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

అస్సాంకు వరద బాధితులకు మన వంతు సాయం అందిద్దాం : జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్

అనకాపల్లి, ఆగస్టు 3, ప్రభాతవార్త



అస్సాం వరద సహాయ నిధికి సంబంధించి ఇప్పటివరకు సుమారు 6 లక్షలు వసూలయ్యాయని జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ తెలిపారు. 10 లక్షలు సేకరణ లక్ష్యంగా నిర్ణయించామని వెల్లడించారు. ఇంకా 4 లక్షల నిధులు సేకరించాల్సి ఉందని, వివిధ శాఖల భాగస్వామ్యంతో హెల్త్, హయ్యర్ ఎడ్యుకేషన్, పంచాయతీ రాజ్, రెవెన్యూ, ఐసిడిఎస్ శాఖలతో పాటు ప్రైవేట్ కళాశాలలు కూడా విరాళాలు సేకరిస్తున్నాయని తెలిపారు. విద్యుత్/విద్య శాఖలో ఉన్న సుమారు 4,000 మంది ఉద్యోగులందరికీ ఈ సందేశం సరిగ్గా చేరేలే లక్ష్యం సులభంగా పూర్తవుతుందని పేర్కొన్నారు. అన్ని ఆఫీసుల నుండి విరాళాల మెసేజ్ ఉద్యోగులకు చేరవేసి నిధులు పూర్తి చేయాలని వచ్చిన నిధులను చెక్కు ద్వారా అస్సాంలోని సంబంధిత డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్‌కి నేరుగా నిధుల ట్రాన్స్‌ఫర్ చేయడానికి సిద్ధం చేస్తామన్నారు. అనకాపల్లి జిల్లా ఉద్యోగులందరూ తమవంతుగా సహాయం అందించి ఈ మంచి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, సిపిఒ ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో తగ్గింపు ధరలకు బీపీటీ సన్న బియ్యం విక్రయాల ప్రారంభం

అనకాపల్లి, ఆగస్టు 3, ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రివ నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, సివిల్ సప్లైస్ శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు, మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ శౌర్య పటేల్ కలిసి అనకాపల్లి రింగ్ రోడ్డులోని ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ ప్రాంగణంలోని రైతు బజార్‌లో తగ్గింపు ధరలకు బియ్యం విక్రయాల కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు రాష్ట్ర రైస్ మిల్లర్ల సహకారంతో బీపీటీ స్టీమ్ సన్న బియ్యాన్ని కిలో రూ.52కే అందుబాటులోకి తీసుకువచ్చారు. అర్హ త కలిగిన ప్రతి కుటుంబానికి నెలకు 10 కిలోల బియ్యాన్ని అందజేయనున్నట్లు వెల్లడించారు. బియ్యం కొనుగోలు చేయదాని కి వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు, రేషన్ కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. ఈ కేంద్రం రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం సహకారంతో, సివిల్ సప్లైస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతోందని, ప్రజలందరూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని పిలుపు నిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, బీజేపీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, సివిల్ సప్లై అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీతపాలెం గ్రామస్తుల ఆవేదన - ఆర్అండ్ఆర్ జాబితా నుంచి 38 మంది పేర్లు తొలగింపు..

న్యాయం చేయాలని ఉప తహశీల్దార్‌కు వినతి

రాంబిల్లి, ఆగస్టు 03, ప్రభాతవార్త

మండలంలోని లాలం కోడూరు పంచాయతీ శివారు సీతపాలెం గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలు తమకు రావాల్సిన గృహ పరిహారం, పునరావాస హక్కుల ను కల్పించాలని కోరుతూ సోమవారం రాంబిల్లి ఉప తహసీల్దార్ రమేష్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో గ్రామస్తులు పేర్కొన్న వివరాల ప్రకారం, 2006 సంవత్సరంలో ఏపీఐఐసీ ద్వారా ప్రభుత్వ భూ సేకరణలో భాగంగా తమ వ్యవసాయ భూములతో పాటు నివాస గృహాలు కూడా స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. అనంతరం 2008లో జిరాయితీ భూముల్లో ఉన్న ఇళ్లకు మాత్రమే నిర్మాణ (స్ట్రక్చర్) పరిహారం చెల్లించారని, అయితే గ్రామకంఠం మరియు బంజరు భూముల్లో ఉన్న ఇళ్లకు అధికారులు స్ట్రక్చర్ విలువ నిర్ధారణ (వాల్యుయేషన్) చేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సమస్యను సానుకూలంగా పరిశీలించి, జాబితా నుంచి తొలగించిన బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని సీతపాలెం గ్రామస్తులు కోరారు.

నేవీ నిర్మాణ పనుల్లో మహిళా కార్మికురాలికి తీవ్ర గాయాలు

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సిఐటియు డిమాండ్

రాంబిల్లి, ఆగస్టు, 03 ప్రభాతవార్త

మండలంలో వాడ నరసాపురం గ్రామానికి చెందిన కోడా దేవి (38) అనే మహిళ నావికాస్త్రావరం నిర్మాణంలో అంజలి కన్స్ట్రక్షన్ సంస్థలో భవన నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు రెండో అంతస్తు నుంచి జారి కింద పడింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలు కాగా అనకాపల్లి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. బాధితురాలని సిఐటియు జిల్లా నాయకులు శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ, జి.దేవుడు నాయుడు, నారాయణరావు, పరామర్శించారు. బాధితురాలికి అంజలి కన్స్ట్రక్షన్ సంస్థ మెరుగైన వైద్యం అందించి ఆమె కోలుకునే వరకు నెలసరిజీతం కొనసాగించడంతోపాటు కుటుంబానికి పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి నేవిగేట్ ముందు ఆందోళన చేపడతామని సిఐటియు నాయకులు హెచ్చరించారు.

వెంకయ్యపాలెం గ్రామ ప్రజల వినతి

ఆట స్థలం, ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆర్‌డిఓకు విజ్ఞప్తి

రాంబిల్లి ఆగస్టు 03 ప్రభాతవార్త

మండలంలో జెడ్.చింతవా పంచాయతీ పరిధిలోని వెంకయ్యపాలెం గ్రామ ప్రజలు తమ గ్రామానికి సంబంధిం చిన ప్రభుత్వ భూములు, చెరువులు, ఆట స్థలాలు పరిశ్రమల ఆక్రమణకు గురవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 143/1లో సుమారు 46.5 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండేదని, ఇందులో చిన్న చెరువు, పెద్ద చెరువు, పశువుల మేత భూమి, గ్రామ ఆట స్థలం, గ్రామ దేవత గుడి మాన్యం వంటి ప్రజా అవసరాలకు ఉపయోగపడే స్థలాలు ఉన్నాయని తెలిపారు. ఈ చెరువుల కారణంగానే గ్రామంలోని మంచినీటి బోర్లు ఎండిపోకుండా నీటి మట్టం నిలకడగా ఉంటుందని పేర్కొన్నారు. రెన్యూ సోలార్ పరిశ్రమ ఆ భూములకు ఫెన్సింగ్ వేసి తమ ఆధీనంలోకి తీసుకోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. గ్రామ ప్రజల సంక్షేమం, యువత భవిష్యత్తు, గ్రామ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని తమ వినతిపై అధికారులు సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వెంకయ్యపాలెం గ్రామ ప్రజలు కోరారు.

తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

మాకవరపాలెం, ఆగస్టు 3, ప్రభాతవార్త

పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఎదగాలంటే తల్లిపాలే శ్రేష్ఠమని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సీనియర్ ఆరోగ్య అధికారి(సిహెచ్ఓ) రమేష్ అన్నారు. ఈమేరకు సోమ వారం మండలంలోని రాచపల్లి గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వ ర్యంలో కేంద్రాల్లో తల్లిపాల వారోత్స వాలు జరిగాయి. ఆగస్టు1 నుంచి 7తేదీ వరకు జరిగే వారోత్సవాల భాగంగా అంగనవాడి ఆరోగ్య కేంద్రం సిబ్బంది సంయుక్తంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. సిహెచ్ఓ రమేష్ మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి ప్రతి ఒక్క బాలింత తప్పనిసరిగా బిడ్డకు పాలు పట్టించాలన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ తల్లి-శిశువు ఆరోగ్య సంరక్షణపై పలు సూచనలు అందజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్ఓ లగుడు సత్తిబాబు, అంగన్వాడి, ఆరోగ్య, ఆశ, కార్యకర్తలు, పాల్గొన్నారు.

పోంత రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు

గొలుగొండ ఆగస్ట్ 2, ప్రభాతవార్త

జోగంపేట పంచాయతీల పరిధిలో పంట పొలాలకు వెళ్లే పొంత రోడ్లు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఇంజనీరింగ్ అసిస్టెంట్ రామకృష్ణ తెలిపారు. మాజీ సర్పంచ్ సుర్ల బాబ్జి ఆధ్వర్యంలో రైతులు అభిప్రాయం మేరకు వారు చూపే పొంత రోడ్లు కొలతలు నిర్వహించి జిపిఎస్ ద్వారా ట్యాగ్ చేస్తున్నామని అన్నారు. ప్రతి రోడ్డుకు 500 మీటర్లకు తక్కువ లేకుండా ఉండాలని అంతకుమించి ఐదు కిలోమీటర్ల వరకు ఉండవచ్చని పేర్కొన్నారు. అయితే రైతులు సౌకర్యార్థం ఈ రోడ్ల నిర్మాణానికి కొలతలు నిర్వహిస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంట పొలాలకు వెళ్లే పొంత గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఇంజనీరింగ్ సిబ్బంది కొలతలు నిర్వహించారు. పప్పు శెట్టి పాలెం, చోద్యం తో పాటు మరికొన్ని పంచాయతీల్లో లింక్ రోడ్ నిర్మాణానికి రైతుల ప్రతిపాదనలు మేరకు జిపిఎస్ ట్యాగ్ చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జోగంపేట మాజీ సర్పంచ్ సుర్ల సీతారామమూర్తి డిజిటల్ అసిస్టెంట్ వంశీ అప్పలనాయుడు జెఇ రామకృష్ణ రైతులు పాల్గొన్నారు.

నేడు నక్కపల్లిలో వైసీపీ విస్తృతస్థాయి సమావేశం

నక్కపల్లి, ప్రభాతవార్త

పాయకరావుపేట నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం మంగళ వారం సాయంత్రం నక్కపల్లిలో ఏర్పాటు చేయడం జరిగిందని మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గం ఇంచార్జ్ కంబాల జోగులు సోమవారం తెలిపారు. మధ్యాహ్నం 3.00 గంటలకు నక్కపల్లి సుబ్బిరామిరెడ్డి హెటిరో కళ్యాణ మండపం వద్ద జరిగే సమావేశానికి ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు డీఎస్సీలో జరిగిన అవకతవకలపై సీబీఐ ఎంక్వయిరీ జరపాలని, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి చెల్లించాలనే డిమాండ్తో ఈ సమావేశం జరగనున్నదని పేర్కొన్నారు. ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ సమావేశమునకు పాయకరావుపేట నియోజకవర్గంలో ఉన్న అనుబంధ సంఘాల తో పాటు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, యువజన విభాగ అధ్యక్షులు, సభ్యులు స్టూడెంట్ విభాగ అధ్యక్షులు సభ్యులు, సోషల్ మీడియా సభ్యులు, వివిధ విభాగాల అధ్యక్షులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పాఠశాలకు ఫర్నిచర్ అందజేసిన ఎస్ఎంసి సభ్యులు

(నక్కపల్లి, ప్రభాతవార్త)

మండలంలోని ముకుంద రాజుపేట ఎలిమెంటరీ పాఠశాలకు ఎస్ఎంసి సభ్యులు నరవ శ్రీను పాఠశాలకు అవసరమైన ఫర్నిచర్‌ను అందజేశారు. ఎస్ఎంసి చైర్మన్ హరికృష్ణ చేతుల మీదగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగబాబుకి అందజేశారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రత్యేక సమావేశం

(నక్కపల్లి, ప్రభాతవార్త)

మండలంలోని బుచ్చిరాజుపేట గ్రామంలో భవిష్యత్తులో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ సోమవారం ఉదయం వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం చర్చించారు. రాబోవు స్థానిక సంస్థల్లో బుచ్చిరాజుపేట గ్రామంతో పాటు చందనాడ సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేసేటప్పుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందరావు, గొర్ల బాబురావు భార్య గొర్ల అమ్మాజీ, మాజీ సర్పంచ్ తల్లా భార్గవ్, మంచాల శ్రీను, గొర్ల గోవిందు, యలమంచిలి మధు, కొల్లి బంగారి కొల్లి గిరి, మాజీ ఉప సర్పంచ్ కేశవ, నాగరాజు తో పాటు గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, ఆగస్ట్ 03, ప్రభాతవార్త

మున్సిపాలిటీ పరిధిలోని కొత్త ఎర్రవరం 11వ వార్డులోని ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర రోడ్డు రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఎలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ప్రకట నాగేశ్వరరావు పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సమన్వయంతో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకువెళుతుందని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ రెండు సంవత్సరాలలో రాష్ట్రంలో పరిశ్రమలతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాలు పేద బడుగు బలహీన వర్గాలకు ఎన్నో పథకాలను అందజేసిందని వాటిని పూర్తిస్థాయిలో ప్రజలకు తెలియజేసేందుకు ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని అన్నారు. పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గొర్లె నానాజీ, క్లష్టరించార్జిలు బొద్దపు శ్రీనివాసరావు, కరణం రవికుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు సేనాపతి తులసీరామ్, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దాడి రమేష్, పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు దంట్ల వెంకటస్వామి, నమ్మి రమణ, ఆడారి నాయుడు, శివశంకర్, చంద్రగిరి శ్రీరాములు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అనకాపల్లిలో తగ్గింపు ధరలకు బీపీటీ సన్న బియ్యం విక్రయాల ప్రారంభం

అనకాపల్లి, ఆగస్టు 3, ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రివ నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, సివిల్ సప్లైస్ శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు, మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ శౌర్య పటేల్ కలిసి అనకాపల్లి రింగ్ రోడ్డులోని ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ ప్రాంగణంలోని రైతు బజార్‌లో తగ్గింపు ధరలకు బియ్యం విక్రయాల కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు రాష్ట్ర రైస్ మిల్లర్ల సహకారంతో బీపీటీ స్టీమ్ సన్న బియ్యాన్ని కిలో రూ.52కే అందుబాటులోకి తీసుకువచ్చారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, బీజేపీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, సివిల్ సప్లై అధికారులు, పాల్గొన్నారు.

ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి ఆగస్టు 3, ప్రభాతవార్త

జిల్లాలో ఆగస్టు 1 నుండి 7 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టిన వెంటనే తల్లిపాలను ప్రారంభించడం, తొలి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం, అనంతరం తగిన పోషక ఆహారంతో పాటు తల్లిపాలను కొనసాగించడం వల్ల శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదల, అభివృద్ధికి కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ అచ్చుతకుమారి, జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి డా. చంద్రశేఖర్ దేవ్, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్, సూర్యలక్ష్మి, ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఐసీడీఎస్), సీడీపీఓలు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యపై వెంటనే స్పందన.. మరుగుదొడ్ల నిర్మాణానికి శ్రీకారం

బుచ్చయ్య పేట ఆగస్టు 3 ప్రభాత వార్త

వడ్డాది కోవెల అప్పన్నదొర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిపోయిన మరుగుదొడ్ల నిర్మాణాన్ని వడ్డాది పీఏసీఎస్ చైర్మన్, టీడీపీ టౌన్ అధ్యక్షుడు దొండా నరేష్ సొంత నిధులతో పూర్తి చేయడానికి సోమవారం పనులు ప్రారంభించారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి జిల్లా పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు ఆదేశాల మేరకు 'మన ఊరు-మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా ఈ పనులు చేపట్టారు. వడ్డాది కాల్వ ప్రెసిడెంట్ దాడి పెద్ద గోవిందరావు, మంచాల గోవిందరావు, ఎంపీటీసీ అప్పారావు, టి. శంకర్, కె. గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వాతావరణం మార్పుతో మృత్యువాత పడిన చేపలు

(నక్కపల్లి, ప్రభాతవార్త)

మండలంలోని ఉపమాక పెద్ద చెరువులో ఆదివారం ఉదయం వాతావరణం మార్పులు కారణంగా పెద్ద ఎత్తున చేపలు మృత్యువాత పడ్డాయి. చెరువు గట్టు మీద నుంచి వెళుతున్న ప్రజలు నీటిపై తేలి ఉన్న చేపలను గుర్తించారు. ఈ విషయం అటు ఉప్మాక ఇటు నక్కపల్లి గ్రామంలో తెలియడంతో చెరువు వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఈ విషయం రాజయ్యపేట మత్స్యకారులకు కూడా తెలియడంతో నీటిపై తేలుతున్న చేపలను బయటికి తీశారు. ఇంకా కొంత ప్రాణంతో ఉన్న చేపలను కొంతమంది తినడానికి తీసుకుపోయారు. బయటికి తీసిన చాపలను పాఠశాలలు విక్రయించారు.

అయినంపూడి కుటుంబాన్ని పరామర్శించిన పలువురు ప్రముఖులు.. ఘనంగా నివాళులు

(నక్కపల్లి, ప్రభాతవార్త)



మండలంలోని వేంపాడు మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు, జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అయినంపూడి బంగారు రాజు (మణి రాజు), జిల్లా యూత్ నాయకులు సురేష్ రాజు, వెంకటపతి రాజుల కుటుంబాలను అనకాపల్లి జిల్లాకు చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు పరామర్శించారు. సోమవారం ఉదయం వేంపాడులో ఉన్న వారి ఇంటి వద్ద జరిగిన మాజీ సర్పంచ్ అయినంపూడి చిన్న పేర్రాజు (బాబు) సంతాప సభలో పలువులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని గునుపూడి మాజీ సర్పంచ్ సీనియర్ నాయకులు అయినంపూడి చిన్న పేర్రాజు (బాబు) అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసినదే.! ముందుగా చిన్న పేర్రాజు (బాబు) చిత్రపటానికి మాజీ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు, మాజీ ఎమ్మెల్యే పాయకరావుపేట నియోజకవర్గం వైకాపా ఇన్చార్జ్ కంబాల జోగులు, దత్తుడు సీతబాబు రాజు,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి సీరం నరసింహమూర్తి, రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీపతి రాజు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సూరకాసులు గోవిందు, రాష్ట్ర నాయకులు లొడగల చంద్రరావు, మండల పరిషత్ అదనపు ఉపాధ్యక్షులు వెలగా ఈశ్వరరావు, మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందు తో పాటు జనపరెడ్డి శేషారత్నం ,తల్లా భార్గవ్, సాదిరెడ్డి శ్రీను, కోటవురట్ల రమేష్ , గంట తిరుపతిరావు లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు . ముందుగా మాజీ జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ రాష్ట్ర జనసేన పార్టీ తోట నగేష్ అయినంపూడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. బాబు తో రాజకీయంగా తనకున్న సంబంధాలను ఒకసారి గుర్తు చేసుకున్నారు. బాబు సంతాప సభ సందర్భంగా ఆయన ఈ గ్రామ అభివృద్ధి కోసం అయితే అహర్నిశలు కష్టపడ్డారు ఆ గ్రామస్తులు యువకులు మన సర్పంచ్ అంటూ హోర్డింగులు పట్టుకొని ప్రత్యేకంగా టీ షర్టు ధరించి సంతాప సభలో పాల్గొన్నారు. ముందుగా సంతాప సభ ప్రాంగణంలో సర్పంచ్ గా బాబు రాజు గ్రామానికి చేసిన సేవలుపై తన 40 ఏళ్ల రాజకీయ చరిత్రపై ఎల్ఈడి స్క్రీన్ ద్వారా ప్రదర్శించిన ప్రదర్శనను చూసిన వేలాదిమంది కన్నీరు పెట్టుకున్నారు. వారి నాయకుడు గ్రామానికి అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ ఇటువంటి నాయకుడు మళ్ళీ పుట్టడంటూ మా గ్రామ అభివృద్ధిని ఎవరు చూసుకుంటారు అంటూ పెద్ద ఎత్తున చర్చించుకున్నారు.మంచి ఉన్నతమైన భావాలు కలిగిన వ్యక్తిని కోల్పోయామని , జిల్లా స్థాయిలో మండల స్థాయిలో ఏ అధికారులు వచ్చిన ఏ ప్రజా ప్రతినిధి వచ్చిన వారిని గౌరవించి గ్రామాలకు ఏదో ఒకటి చేయండి అంటూ గునుపూడి తో పాటు వేంపాడు కోసం ఆయన పడిన తపన మరిచిపోలేనిదని ప్రముఖులు అన్నారు. వేంపాడు పిఎసిఎస్ పరిధిలో అన్నదమ్ములు ఇద్దరు అభివృద్ధి కోసం కష్టపడి పని చేశారని అన్నారు. ఉన్నతమైన భావాలతో అనుభవం కలిగిన వ్యక్తి మన మధ్యన లేకపోవడం చాలా బాధాకరమైన విషయం అని అన్నారు. ఈ మేరకు మాజీ జెడ్పిటిసి సభ్యులు కురందాసు,నూకరాజు ,కొప్పిశెట్టి కొండబాబు, మాజీ ఉప సర్పంచ్ అయినంపూడి అప్పలరాజు, కల్లేపల్లి సుబ్బరాజు, వెంకటపతి రాజు, అయినంపూడి రవిరాజు, శ్రీను రాజు,పల్లా రాంబాబు, ఎన్ సిసి సీతారామరాజు, హెటిరో సేఫ్టీ జిఎం ఎం. కుల్లయ్య రెడ్డి, తుని ప్రాంతానికి చెందిన రోటరీ క్లబ్ సభ్యులు సత్య సాయిబాబా భజన మండలి సభ్యులు ఘనంగా నివాళులర్పించారు.

తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ కవచం

ఆనందపురం, ఆగస్టు 3, ప్రభాతవార్త:

తల్లి పాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన తొలి రక్షణ కవచమని భీమిలి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో శ్రీదేవి పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా భీమిలి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని గుమ్మిడివాని పాలెం, సిర్లపాలెం అంగన్వాడీ కేంద్రాలలో సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో శ్రీదేవి గర్భిణులు, బాలింతలు, మహిళలు, అంగన్వాడీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించడం, తొలి పాలు (కొలస్ట్రం) తప్పనిసరిగా ఇవ్వడం వల్ల శిశువుకు రోగనిరోధక శక్తి పెరిగి అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని తెలిపారు. పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం పౌష్టికాహారంతో పాటు రెండు సంవత్సరాల వరకు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించడం పిల్లల శారీరక, మానసిక, మేధో వికాసానికి ఎంతో దోహదపడుతుందని వివరించారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్వైజర్ పి.వి.వి.రత్నం మాట్లాడుతూ, ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ప్రధాన లక్ష్యం తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన పెంచడం, శిశు మరణాలను తగ్గించడం, ఆరోగ్యవంతమైన ఎదుగుదలను ప్రోత్సహించడం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ రత్నం, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, పాల్గొన్నారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఈమా నూతన కార్యవర్గం

విశాఖపట్నం, ఆగస్ట్ 3, ప్రభాతవార్త :

ఈవెంట్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (ఈమా) విశాఖ శాఖ నూతన కార్యవర్గం ఎన్నికయింది. అధ్యక్షునిగా ఏ. అరుణ్ కుమార్, కార్యదర్శిగా కామేష్ పాలూరి, ఉపాధ్యక్షుడిగా జి.ఎన్.రాజు, కార్యనిర్వాహక కార్యదర్శిగా జగదీష్ బరోడా, సంయుక్త కార్యదర్శిగా గార ఆనంద్ కళ్యాణ్, కోశాధికారిగా సంతోషిని ప్రసాద్ ఎన్నికయ్యారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో భాగంగా ఈ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. దీంట్లో సభ్యులుగా ఏ.అఖిల్, ఎస్.అలేఖ్య, సునీల్ సుదర్శన్, కరుణాకర్, యు.శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు, వ్యవస్థాపక అధ్యక్షులు అయిన మీనాక్షి అనంత రామన్, దాడి రవికుమార్, కళ్యాణ్ చక్రవర్తి, సందీప్ కుమార్,షరీఫ్ ఖాన్ తదితరులు ఈ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అసోసియేషన్ అభివృద్ధికి, సభ్యుల పురోభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత నిస్తూ ఈ నూతన కమిటీ ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని అందరూ అభిలాషించారు.

వీఎంఆర్డీఏ లో ప్రజదర్బార్‌కు మూడు వినతులు

విశాఖపట్నం, ఆగస్టు 3, ప్రభాతవార్త :

వీఎంఆర్డీఏలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు పలువురు అర్జీదారులు వినతులు సమర్పించారు. సోమవారం ఉదయం వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వీఎంఆర్డీఏ కార్యదర్శి మురళీకృష్ణ గారు పాల్గొని అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను తెలుసుకుని, ఆయా వినతులను సంబంధిత అధికారులకు అందజేసి, వాటిని సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వినతుల పరిష్కార విషయంలో శాఖాపరంగా తీసుకున్న చర్యల వివరాలను నిర్దేశించిన గడువు లోగా అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కు మొత్తం 3 వినతులు రాగా, వీటిలో ఏస్టేటు విభాగానికి చెందిన వినతులు 2, పరిపాలన విభాగానికిచెందిన వినతులు 1 చొప్పున ఉన్నాయి. కార్యక్రమంలో ఓఎస్డీ కృష్ణ నాయక్, ఏస్టేటు అధికారి దయానిధి, అటవీవిభాగాధికారి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ఇంటింటికి ప్రచారం

మాధవధార, ఆగస్టు 3, ప్రభాతవార్త :

కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పై జీవీఎంసీ 54వ వార్డు నలంద నగర్ 33 వ బూత్ లో ప్రచారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ దువరపు రామా రావు పాల్గొని ప్రభుత్వ పాలనపై వివరించారు.రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు, పేద కుటుంబాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేస్తోందన్నారు. పెంటకోట స్రవంతి,జగదీష్, ఉప్పాడ శేఖర్, పీల రమణ,మాధవరావు,జె జె కుమార్,ఆదినారాయణ ఉన్నారు.

నార్త్ జోన్ పీజీఆర్ఎస్ కు 7 ఫిర్యాదులు

మాధవధార, ఆగస్టు 3, ప్రభాతవార్త :

మాధవధార ఉడా కాలనిలో గల జీవీఎంసీ నార్త్ జోన్ ఆఫీసులో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కు 7 వినతులు వచ్చాయి. ఈ వినతులను జోనల్ కమీషనర్ బొడ్డేపల్లి రాము పరిశీలించి లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకొని వినతులు స్వీకరించారు. వీటిలో యూసిడి -2, టౌన్ ప్లానింగ్ -3,రెవిన్యూ -1,పబ్లిక్ హెల్త్ -1 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పబ్లిక్ వర్క్ ఈఈ పద్మావతి,ఏపీడీ పుణ్యవతి,ఆర్ ఓ బాబూరావు, పబ్లిక్ హెల్త్ అధికారులు ఉన్నారు.

నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రవిరాజుకు అమెరికాలో ఆచార్య అవార్డు ప్రధానం

విశాఖపట్నం, ఆగస్టు 3, ప్రభాతవార్త :

ప్రముఖ నెఫ్రాలజిస్ట్, కేజీహెచ్ పూర్వ సూపరింటెండెంట్ ఎన్టీఆర్ హెల్త్ యూనివ ర్సిటీ పూర్వ ఉపకులపతి, పూర్వ డీఎంఈ డాక్టర్ టి. రవిరాజును అమెరికాలో ఘనంగా సన్మానించారు. ఈ నెల 1వ తేదీన, వాషిం గ్టన్ డీసీలోని హయత్ రీజెన్సీ హోటల్లో జరి గిన ఆమ్కానా(ఆంధ్రా మెడికల్ కాలేజీ అలుమ్ని అఫ్ నార్త్ అమెరికా) 8వ వార్షిక సమావేశంలో ఈ అవార్డుల ప్రధానోత్సవం ను ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ రవిరాజు,డాక్టర్ ఎం. దాసరాథరం స్మారకోపన్యాసం చేశారు. అనంతరం డాక్టర్ టి. రవిరాజును ఘనంగా సన్మానించి ఆచార్య అవార్డును ప్రదానం చేశారు. ఆమ్కానా అధ్యక్షులు డాక్టర్ మాణిక్యం ముత్యాల, బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఛైర్మన్ ప్రసాద్ చలసాని, కాబోయే అధ్యక్షురాలు నిర్మల పిచ్చిక, కోశాధికారి మల్లారెడ్డి మద్దుల, బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సభ్యులు నాగేంద్ర మైనేని ఈ ఆమ్కానా సమావేశాన్ని నిర్వహించారు. డాక్టర్ నిర్మల పిచ్చిక అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించారు. ముఖ్య అతిథి, మేరీల్యాండ్ లెఫ్టినెంట్ గవర్నర్ అరుణా మిల్లర్‌ను ఆమ్కానా కార్య నిర్వాహక సభ్యులు సన్మానించారు. గౌరవ అతిథి, ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం. సంధ్యా దేవి, డాక్టర్ టి.రాధకు శాలువా మరియు జ్ఞాపికను బహూకరించారు.మరో పూర్వ విద్యార్థి డాక్టర్ పి.రవీంద్రనాథ్ శర్మ మెడికల్ ఎడ్యుకేషన్ ఇన్ అమెరికా అనే అంశంపై ప్రసంగిం చారు. ఈ సమావేశానికి అమెరికా నలుమూలల నుండి సుమారు 250 మంది ఆంధ్ర వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు హాజరయ్యారు.

ఆచార్య చల్లా రామకృష్ణకు పదవీ విరమణ సన్మానం

విశాఖపట్నం, ఆగస్టు 3 ప్రభాత వార్త :

ఆంధ్రవిశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం ఆచార్యులు చల్లా రామకృష్ణ ఉద్యోగ విరమణ చేసారు. ఈ సందర్భంగా ఆయనను విభాగంలో ఘనంగా సత్కరించారు. సోమవారం ఉదయం విభాగం సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఆచార్య చల్ల రామకృష్ణను విభాగ ఆచార్యులు, ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఇంచార్జి ఉపకులపతి ఆచార్య డి.వి.ఆర్ మూర్తి, విభాగాధిపతి ఆచార్య సి.ఎం వినయ కుమార్, ఆచార్య విజయలక్ష్మిలు విద్యార్థులతో కలిసి సత్కరించారు. ఒంగోలు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్. మూర్తి మాట్లాడుతూ, ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం మరియు మాస్ కమ్యూనికేషన్ విభాగంలో ప్రొఫెసర్‌గా పదవీ విరమణ చేసిన ప్రొఫెసర్ చల్లా రామకృష్ణ బహుముఖ ప్రజ్ఞాశాలి, అనేక రంగాల్లో సమర్థవంతంగా రాణించిన బహుకార్యదక్ష వ్యక్తి అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బోధన, పరిశోధన, విద్యా పరిపాలన, జర్నలిజం, ప్రజా సంబంధాల వంటి విభిన్న రంగాల్లో ప్రొఫెసర్ రామకృష్ణ విశిష్ట సేవలు అందించారని తెలిపారు. విద్య పట్ల ఆయనకున్న అంకితభావం, బహుముఖ ప్రతిభ, ఏ బాధ్యతనైనా సమర్థంగా నిర్వహించే నాయకత్వ లక్షణాలు ఆయనకు విద్యార్థులు, సహచర అధ్యాపకులు, విద్యావేత్తల నుంచి అపారమైన గౌరవం, అభిమానాన్ని తీసుకువచ్చాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిజం మరియు మాస్ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ . సి. ఎం. వినయ్ కుమార్. బోర్డ్ ఆఫ్ స్టడీస్ అధ్యక్షురాలు డాక్టర్ టి. విజయలక్ష్మి ప్రసంగించి, ప్రొఫెసర్ చల్లా రామకృష్ణ విశ్వవిద్యాలయానికి అందించిన సేవలను ప్రశంసించారు. ఆయన పదవీ విరమణ అనంతరం కూడా విద్యా, సామాజిక రంగాల్లో మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

ఏయూ కెమికల్ ఇంజనీరింగ్ కాలేజీలో ఘనంగా మానక్ మంథన్

ఫుడ్ ప్యాకింగ్ థర్మోప్లాస్టిక్ నాణ్యత భద్రతా ప్రమాణాలపై బీఐయస్ సదస్సు

విశాఖపట్నం, ఆగస్టు 3 ప్రభాత వార్త :

భారతీయ ప్రమాణాలు నాణ్యత, భద్రత, స్థిరమైన పారిశ్రామిక అభివృద్ధికి కీలకమని కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్. ఎన్.చిట్టిబాబు పేర్కొన్నారు ప్రమాణాల రూపకల్పన, అమలులో విద్యార్థు లు, అధ్యాపకులు చురుకుగా భాగస్వా ములు కావాలని అన్నారు. ఆహార ప్యాకేజింగ్‌లో ఉపయోగించే థర్మోప్లాస్టిక్ పదార్థాల నాణ్యత, భద్రత, ప్రమాణాలపై అవగాహన కల్పించేందుకు భారతీయ ప్రమాణాల బ్యూరో (బీఐఎస్) విజయ వాడ శాఖ కార్యాలయం, ఆంధ్రా యూనివర్సిటీ కెమికల్ ఇంజినీరింగ్ విభాగం సంయుక్తంగా "మానక్ మంథన్" కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆంధ్రా యూనివర్సిటీ కెమికల్ ఇంజినీరింగ్ విభా గంలోని జరిగిన ఈ కార్యక్రమంలో 70 మంది అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి బీఐఎస్ స్టూడెంట్ చాప్టర్ మెంటర్ ప్రొఫెసర్ వి.శ్రీదేవి స్వాగతం పలికి బీఐఎస్ స్టూడెంట్ చాప్టర్ కార్యకలాపాల్లో తన అనుభవాలను పంచుకున్నారు. విద్యార్థుల్లో ప్రమాణాలపై అవగాహన పెంపొందించడంతో పాటు విద్యాసంస్థలు-బీఐఎస్ మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఆమె వివరించారు. మొదటి సాంకేతిక సమావేశంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ (ఐఐపీ) అదనపు డైరెక్టర్, ప్రాంతీయ అధికారి ప్రొఫెసర్ (డా.) బాబురావు గుడూరి ఆహార ప్యాకేజింగ్ శాస్త్రీయ సూత్రాలు, ప్యాకేజింగ్ పదార్థాల ఎంపిక, ఆహార ప్యాకేజింగ్‌లో థర్మోప్లాస్టిక్ వినియోగంపై సమగ్రంగా వివరించారు. రెండో సాంకేతిక సమావేశంలో బీఐఎస్ విజయవాడ శాఖ కార్యా లయం సైంటిస్ట్-సి/డిప్యూటీ డైరెక్టర్ డి.వివేక్ వర్ధన్ రెడ్డి 'ఐఎస్ 10171 - గైడ్ ఆన్ సూటబిలిటీ ఆఫ్ థర్మోప్లాస్టిక్స్ ఫర్ ఫుడ్ ప్యాకేజింగ్' ముసాయిదా ప్రమాణంలోని ముఖ్య అంశాలను వివరించారు.

పాలిమర్ల మౌలిక అంశాలు, ఆహార శ్రేణి థర్మోప్లాస్టిక్స్, మైగ్రేషన్ పరీక్షలు, ఆహారంతో సం బంధం ఉన్న ప్లాస్టిక్ పదార్థాలకు సంబంధించిన నియంత్రణ నిబంధనలను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నిపుణులు, అధ్యాపకులు, విద్యార్థుల తదితరులు పాల్గొన్నారు .

ఉమ్మడి ఆస్తిలో అన్యాయం

- మోసానికి పాల్పడ్డ కుటుంబ సభ్యులు
- రూ.90 లక్షల విలువైన ఆస్తి దోచుకునేందుకు ప్రయత్నం
- తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యుల డిమాండ్

విశాఖపట్నం, ఆగస్టు 3, ప్రభాతవార్త :

ఉమ్మడి ఆస్తి విషయంలో ఫోర్జరీ మోసపూరితమైన విధానాలకు పాల్పడి రూ. 90 లక్షల రూపాయల విలువైన ఆస్తులు కాజేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు నున్న దేవి, పసుమర్తి నారాయణరావు కోరారు.

తమ అనుమతి లేకుండా, తమను మోసం చేసి తమ ఆస్తిని తీసుకున్న ఇతర కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, తమకు సంబంధించిన ఆస్తిని తిరిగి ఇప్పించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

సోమవారం విశాఖ డాబా గార్డెన్స్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ చిన వాల్తేర్, జగన్నాథ స్వామి ఆలయం ఎదురుగా తుంపా వారి వీధిలో తమ ఉమ్మడి కుటుంబానికి సంబంధించి 81 గజాల స్థలం ఉందని చెప్పారు. ఇప్పుడు ఆ స్థలం మార్కెట్ విలువ రూ.90 లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. పసుమర్తి సన్యాసిరావు, మల్లికార్జునరావు, మల్లికార్జున రావు, నున్న దేవి ల ఉమ్మడి ఆస్తి అయినా ఆ స్థలాన్ని అందరికీ సమ వాటా ఇవ్వకుండా మల్లికార్జున రావు (లేట్) కుమారులు వినోద్, తేజ లు మోసానికి పాల్పడి బిల్డర్ తో మాట్లాడి ఆ స్థలంలో అపార్ట్మెంట్ కట్టడానికి నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు.

వీరిలో సన్యాసిరావు, మల్లికార్జున రావులు ఇప్పటికే పరమపదించారని చెప్పారు. ఇందులో సన్యాసిరావు కి వివాహం కాలేదన్నారు. ఆస్తి గొడవలకు కారణం మల్లికార్జున రావు (లేట్) కుమారులు వినోద్ ,తేజలు మాత్రమే అని ఆరోపించారు. తమ ఇంటి ఆడపిల్ల అయిన నున్న దేవికి కూడా అన్యాయం చేశారని అన్నారు. ఆమె వాటా ఇవ్వకుండా ఆమెను కూడా మోసం చేశారని తెలిపారు.

ఇక మరో సోదరుడు అయిన నారాయణరావును అయితే నమ్మించి మోసం చేశారని అన్నారు. ఆ స్థలంలో నిర్మించే అపార్ట్మెంట్లో ఒక ఫ్లాట్ ఇస్తానని చెప్పి మోసం చేశారని అన్నారు. బాధితులు దేవి, నారాయణరావులు మాత్రం ఈ విషయంలో తమకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సుమారు 90 లక్షల రూపాయలు విలువ గల ఉమ్మడి ఆస్తిలో ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని మోసం చేసి తీసుకోవాలని చూస్తున్నా వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఆ స్థలంలో అన్యాయంగా కొనసాగుతున్న అపార్ట్మెంట్ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

విద్యా నిధుల వినియోగంపై జోన్-1 డీడీఓలకు శిక్షణ

- ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం, సమయపాలనకు ప్రాధాన్యం
- సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు

ఆనందపురం, ఆగస్ట్ 3, ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సింగిల్ నోడల్ ఏజెన్సీ (ఎస్ ఎన్ ఏ), సంయోచిత్ ప్రణాళి ఏకీకృత్ శీఘ్ర హస్తాంతరన్ (స్పర్శ), సి ఎఫ్ ఎం ఎఎస్ ఫైనాన్సియల్ ఎగ్జిక్యూషన్ మాడ్యూల్ అమలుపై రాష్ట్రవ్యాప్తంగా డీడీఓలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. ఇందులో భాగంగా జోన్--1 పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, మన్యం, అనకాపల్లి జిల్లాలకు చెందిన 1500 మంది డీడీఓలకు విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం పెద్దిపాలెంలోని కింగ్స్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి సమగ్ర శిక్ష, ఆంధ్రప్రదేశ్ గౌరవ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.ఎం. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై శిక్షణను ప్రారంభించారు. కార్యక్రమంలో జోన్--1 రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణా కార్యక్రమానికి జోన్- 1 పరిధిలోని, 6 జిల్లాల నుండి సుమారు 1500 మంది జిల్లా విద్యాశాఖాధికారులు, అదనపు ప్రాజెక్టు సమన్వయకర్తలు, ఉప విద్యాశాఖాధికారులు, అడిషనల్ డైరెక్టర్ లు, మండల విద్యాశాఖాధికారులు, అకౌంట్స్ ఆఫీసర్ లు, సమగ్ర శిక్ష డీడీఓలు, పీఎం శ్రీ పాఠశాలల డీడీఓలు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు, టైప్--4 హాస్టళ్ల వార్డెన్లు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సెక్టోరియల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు మాటాడుతూ ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీ తనం, సమయపాలన మరియు వేగవంతమైన ఆర్థిక లావాదేవీల నిర్వహణకు పై మూడు వ్యవస్థలు అత్యంత సమర్థవంతమైన వేదికగా నిలుస్తుందని తెలిపారు. ప్రతి డీడీఓ నూతన ఆర్థిక విధానంపై పూర్తి అవగాహనతో పనిచేసి సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడం వల్ల ప్రజల్లో విశ్వాసం పెరిగి విద్యార్థుల నమోదు గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు, ప్రధానోపాధ్యాయుడు బోధనలో నాణ్యత, విలువల విద్య, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, వినూత్న బోధనా పద్ధతులు మరియు సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ప్రధానోపాధ్యా యులు సమర్థ నాయకత్వాన్ని ప్రదర్శిస్తూ పాఠశాల వనరులను పారదర్శకంగా వినియోగించడంతో పాటు ఎస్ ఎన్ ఏ, స్పర్శ విధానంలో నిధుల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థిని సొంత బిడ్డగా భావించి ప్రేమతో, బాధ్యతతో తీర్చిదిద్దాలని తెలిపారు.

అదేవిధంగా కార్డులు, గ్రంథాలయాల వినియోగం, సైన్స్ సెంటర్లు, ల్యాబ్స్, మెగా పిటిఎంలు, విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ, మెంటల్ హెల్త్ కౌన్సెలింగ్, ఎన్ ఈ పి --2020 అమలు, ఇంటర్న్‌షిప్‌లు, క్రీడలు, నైపుణ్యాధారిత విద్య, పాఠశాలల సమగ్రాభివృద్ధి వంటి అంశాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

శిక్షణలో సింగిల్ నోడల్ ఏజెన్సీ (ఎస్ ఎన్ ఏ), సంయోచిత్ ప్రణాళి ఏకీకృత్ శీఘ్ర హస్తాంతరన్ (స్పర్శ), సి ఎఫ్ ఎం ఎఎస్ ఫైనాన్సియల్ ఎగ్జిక్యూషన్ మాడ్యూల్ వినియోగం, నిధుల నిర్వహణ, బిల్లుల ఆమోదం, చెల్లింపుల ప్రక్రియ, ఆర్థిక లావాదేవీల నిర్వహణ తదితర అంశాలపై నిపుణులు సవివరంగా అవగాహన కల్పించారు. పాల్గొన్న అధికారులు అడిగిన సందేహాలకు సమాధానాలు ఇస్తూ సాఫ్ట్‌వేర్ వినియోగంపై ప్రత్యక్ష శిక్షణ అందించారు.

ముగింపులో రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ, "ప్రతి ఉపాధ్యాయుడు, ప్రతి ప్రధానోపాధ్యాయుడు, ప్రతి డీడీఓ విద్యా వ్యవస్థను తన సొంత బాధ్యతగా భావించి నాణ్యత, సమానత్వం, నవీనత, జవాబుదారీతనంతో పనిచేస్తేనే భావితరాలకు ఉత్తమ విద్యను అందించగలుగుతామని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమాలు ప్రభుత్వ నిధుల పారదర్శక వినియోగంతో పాటు పాఠశాలల సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణకు దోహదపడనున్నాయని ఆర్ జే డి , జోన్ -1 బి.విజయ భాస్కర్ తెలిపారు.

అంగన్వాడీ టీచర్లు, ఆయాల నియామకం

శ్రీమతి చింతకాయల పద్మావతి గారిని కలసిన నూతన సిబ్బంది

నర్సీపట్నం, ఆగష్టు 3, ప్రభాతవార్త :

గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలుగా ఎంపికై, ఈ రోజు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు రాష్ట్ర శాసనసభ గౌరవ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు సతీమణి చింతకాయల పద్మావతిని మర్యాదపూర్వకంగా కలిశారు. నర్సీపట్నం ప్రాజెక్టు పరిధిలో నియామక పత్రాలు పొందిన 1 టీచర్, 11 మంది ఆయాలు, అలాగే గొలుగొండ ప్రాజెక్టు పరిధిలో ఎంపికైన 4 టీచర్లు, 19 మంది ఆయాలు పద్మావతిని కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగా నియామక పత్రాలు అందుకున్న సిబ్బందికి పద్మావతి అభినందనలు తెలిపి, తమ విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎస్. రమణమ్మ, తెలుగుదేశం పార్టీ నాయకులు అప్పలనాయుడు, నందిపల్లి రమణ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ) శ్రీమతి సూర్యలక్ష్మి, నర్సీపట్నం ఐసీడీఎస్ సిడిపిఓ జి.వి. రమణిలతో పాటు గొలుగొండ ఐసీడీఎస్ సిడిపిఓ తదితరులు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థ లేని సమర్థవంతమైన పాలన:ఎమ్మెల్యే పల్లా

జీవీఎంసీ 76వ వార్డులో ఘనంగా 'ఇంటింటికి తెలుగుదేశం'

గాజువాక, ఆగష్టు 3, ప్రభాతవార్త :

కూటమి ప్రభుత్వంలో దళారీ వ్యవస్థ లేకుండా ప్రజలకు సమ ర్థవంతమైన పాలన అందిస్తు న్నామని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావు తెలిపారు. జీవీఎంసీ 76వ వార్డు స్వతంత్ర నగర్‌లో మాజీ కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక మహిళలు హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కోట్లాది రూపాయలతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, కేంద్రం సహకారంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. వార్డులో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గంధం శ్రీనివాస్ వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, పల్లా శ్రీనివాస్, అప్పలరాజు, ఉగ్రం, అప్పారావు, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాపురం ఎస్సీ కాలనీలో ఘనంగా తల్లిపాలు వారోత్సవాలు

పద్మనాభం, ఆగష్టు 3, ప్రభాతవార్త:

మండలంలో కృష్ణాపురం గ్రామ ఎస్సీ కాలనీలో భీమిలి ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సోమవారము మండల అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్లు, తల్లులు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్వైజర్లు జియో ఉన్నిసే బేగం, ఎన్ వి పార్వతి అంగన్వాడి కేంద్రంలో తల్లులు ఉద్దేశించి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన తర్వాత ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలను వారు తల్లులకు వివరించారు. అనంతరం తల్లిపాల వారోత్సవాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అంగన్వాడి కార్యకర్తలు, తల్లులు ర్యాలీ నిర్వహించారు.

సముద్ర తీరంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఆరిలోవ, ఆగష్టు 3, ప్రభాతవార్త :

తెన్నేటి పార్కు, బంగ్లాదేశ్ నౌక సమీప తీరంలో సోమవారం మధ్యాహ్నం సుమారు 30 నుండి 35 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఆరిలోవ సీఐ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఎడమ చేతిపై "సతీష్ "అని టాటూ ఉంది. కుడి చేతిపై..పులి ముఖం టాటూ ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. ఆచూకీకి సంబంధించి ఏమైనా సమాచారం తెలిసినవారు, మిస్సింగ్ కేసుల వివరాలు ఉన్నవారు వెంటనే ఆరిలోవ పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలని సీఐ కోరారు. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు 94906 17918, 94906 24817.

వివిధ గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ మోటార్ల వద్ద ప్రారంభమైన వరినాట్లు

పద్మనాభం, ఆగష్టు 3, ప్రభాతవార్త:

మండలంలో కృష్ణాపురం, మద్ది, అనంతవరం, విలాస్ ఖాన్ పాలెం, పాండ్రంగి, విజయరామ పురం, తదితర గ్రామాల్లో ఉన్న వ్యవసాయ విద్యుత్ మోటార్ల వద్ద రైతులు వారి నాట్లు వేయడం ప్రారంభించారు. గత వారం రోజుల నుంచి ఈ వరి నాట్లు రైతులు వేస్తున్నారు. అయితే వేసవి కాలాన్ని తలపిస్తున్న ఎండలు ఒకవైపు, మరోవైపు తీవ్ర వర్షా బావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ తిండి గింజలుపై ఆశలు వదులుకోలేక తర్వాత అయినా వానదేవుడు కరుణిస్తాడని పుట్టెడు ఆశతో వరి నాట్లును వేస్తున్నట్లు రైతులు తెలిపారు. ఇప్పటికే సుమారు 425 ఎకరాలలో వరి నాట్లు రైతులు వేసినట్లు వ్యవసాయ సింహాచలం చెప్పారు. వ్యవసాయ మోటార్ల లేని గ్రామాల్లో ఆరుతడి పంటలైన మినుము, పెసర, చోళ్ళు వేయాలని ఆయన రైతులకు సూచించారు.

इंडियन बैंक
ఇండియన్ బ్యాంక్

మధురవాడ బ్రాంచ్
డి.నెం.13-36, హెచ్ఐజి-9, శారద గ్రాండ్, పోతినమల్లయ్యపాలెం, మధురవాడ, విశాఖపట్నం-530041, ఫోన్: 0891-2785555

బంగారు నగల వేలము నోటీసు

ఈ దిగువ ఉదహరించిన వ్యక్తులు బంగారు నగల హామీపై మా బ్యాంకు తాలూక దిగువ దాఖలా నందు అప్పు తీసుకుని బ్యాంకు నిబంధనల ప్రకారం అప్పు తీర్చనందున, వారి బకాయి చెల్లించి వారి యొక్క నగలు విడిపించుకోవలసిందిగా కోరుచూ నోటీసు ద్వారా తెలియజేసినప్పటికినీ వారు ప్రతిస్పందించనందున, సదరు బంగారు నగలు **ది.28-08-2026, శుక్రవారం మధ్యాహ్నం గం॥ 3-30 లకు** మా బ్రాంచి ఆవరణలో బహిరంగ వేలము వేసి వారి పేరునయున్న బకాయిలకు జమకట్టుకొనబడును. వేలములో పాల్గొనదలచినవారు **ది.28-08-2026 మధ్యాహ్నం 3 గం॥లలోపు రూ.10,000/-లు** ధరావత్తుగా చెల్లించవలయును. ఎట్టికారణము చూపకనే వేలమును రద్దుచేయుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. వేలము వేసినా కూడా బకాయిలు రద్దుకాని యెడల మిగిలిన బకాయి మరియు ఇతర ఖర్చుల కొరకు వారిపై చట్టరీత్యా తగుచర్య తీసుకొని మిగిలిన బకాయిలను వసూలు చేయబడును. ఈ దిగువ పేర్కొనబడిన ఖాతాదారులలో ఎవరైనా మరణించినయెడల వారి వారసులకు ఈ వేలము నోటీసు వర్తిస్తుంది.

క్రమ సంఖ్య	ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	నిలువ తూకం మొత్తం గ్రాములలో
1.	7676221283	**కట్టా సునీత**, డి.నెం.6-113/3, దుర్గా థియేటర్ వెనుక, సంపత్ నగర్, చంద్రంపాలెం, కొమ్మాది, విశాఖపట్నం-530048	38.2

ప్రదేశం : విశాఖపట్నం
తేది : 03-08-2026

సం/- బ్రాంచ్ మేనేజర్,
ఇండియన్ బ్యాంక్, మధురవాడ శాఖ

4-8Pg7exHMNWJQE.qxd:4-8Pg7exHMNWJQE.qxd 1/1/02 6:48 AM Page 1

ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు ప్రమాదం

- తణుకు సమీపంలో తల్లీకూతుళ్ల దుర్మరణం
- భర్త పరిస్థితి విషమం, రాజమండ్రిలో చికిత్స

తణుకు, ఆగస్టు 3 ప్రభాతవార్త: తణుకు పట్టణ శివారులో ఆదివారం రాత్రి జరిగిన విషాదకర రోడ్డు ప్రమాదంలో తల్లి, రెండేళ్ల చిన్నారి కుమార్తె మృతి చెందగా, భర్త తీవ్రంగా గాయపడిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం గ్రామానికి చెందిన గంధం వంశీకృష్ణ తన భార్య లావణ్య (22), కుమార్తె కీర్తన (2)తో కలిసి ద్విచక్ర వాహనంపై తణుకు మీదుగా పాతవూరు-వీరభద్రపురం రోడ్డులో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో తణుకు శివారులోని ఓ ప్రైవేటు పాఠశాల సమీపంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద వాహనం అదుపు తప్పి కిందపడింది. ఈ ఘటనలో లావణ్య సమీపంలోని స్తంభాన్ని బలంగా ఢీకొనడంతో ముఖభాగానికి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారి కీర్తనకు తీవ్రగాయాలయ్యాయి. వంశీకృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108అంబులెన్స్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తణుకు ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రికి చేరుకునే లోపే చిన్నారి కీర్తన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. లావణ్య పరిస్థితి విషమించడంతో ఆమె కూడా మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన వంశీకృష్ణను మెరుగైన చికిత్స కోసం తణుకులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమండ్రిలోని ్రపైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతురాలు లావణ్య తన స్వగ్రామమైన గణపవరం మండలం బువ్వనపల్లికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. రెండేళ్ల చిన్నారి కీర్తన మృతి స్థానికులను సైతం కలచివేసింది. ఒకే ప్రమాదంలో తల్లి, చిన్నారి ప్రాణాలు కోల్పోవడం ఆ ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఇరువురు మృతదేహాలకు ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై అనుమానంతో దాడి.. హత్య

తిరుపతి క్రైమ్, ఆగస్టు 3 ప్రభాతవార్త: భార్యపై అనుమానంతో మద్యం సేవించి దాడి చేసి ఆపై హతమార్చిన ఘటన తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటపతి నగర్‌లో చోటుచేసుకుంది. ఈ సందర్భంగా తిరుపతి రూరల్ సీఐ మద్దయ్యాచారి సమాచారం మేరకు. తిరుపతి వెంకటపతి నగరంలో భార్య భర్తలు సురేష్, గురవమ్మ (25) ఐదు సంవత్సరాలుగా నివసిస్తున్నారు. వీరికి మూడేళ్ల పాప ఉంది. గత కొన్ని రోజులుగా భార్యపై అనుమానంతో రోజు మద్యం సేవించి దాడికి పాల్పడేవాడు. ఈ క్రమంలో సోమవారం యధావిధిగా మద్యం సేవించి భార్యపై దాడి చేశాడు. అనంతరం వంటగదిలోని సామగ్రితో తలపై దాడి చేయడంతో గురవమ్మకు తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాధితురాలని రుయా ఆసుపత్రికి తరలించారు. తర్వాత ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. అనంతరం స్థానికులు ఆగ్రహంతో హత్యకు పాల్పడిన సురేష్‌పై దాడికి పాల్పడ్డారు. అనంతరం గాయపడిన సురేష్‌ని పోలీసులు రుయా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధం

చేజర్ల (నెల్లూరు), ఆగస్టు 3, ప్రభాతవార్త: చేజర్ల మండలం పెరుమాళ్లపాడు గ్రామంలో విషాధ ఘటన చోటు చేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం రాత్రి రెండు గిరిజన కుటుంబాలకు చెందిన ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగకపోవడంతో బాధిత కుటుంబాలు ఊపిరిపీల్చుకున్నప్పటికి, ఇళ్లు, సామాగ్రి కాలిపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. గ్రామానికి చెందిన నల్లు లక్ష్మీదేవి, రాగి నరేష్ కుటుంబాలకు చెందిన ఇళ్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలకు ఆహుతయ్యాయి. కుటుంబ సభ్యులు సురక్షితంగా బయటపడడంతో ప్రాణాపాయం తప్పింది. అయితే ఇళ్లలోని వస్తువులు, గృహోపకరణాలు తదితర సామాగ్రి దగ్ధమైనట్లు బాధితులు తెలిపారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన తహసీల్దార్: ప్రమాద విషయం తెలుసుకున్న చేజర్ల తహసీల్దార్ మస్తానయ్య సోమవారం పెరుమాళ్లపాడు గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును, జరిగిన నష్టాన్ని బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరుపున తక్షణ సహాయం అందించారు. రెండు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున నగదు సహాయం, బియ్యం బస్తాలు, నిత్యవసర సరుకులను అందజేశారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయాన్ని కూడా పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బాధితులకు భరోసా ఇచ్చారు.

టిడిపి నాయకుడి ఆర్థిక సాయం: బాధిత కుటుంబాలను స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుడు, మండల ప్రధాన కార్యదర్శి తలపనేని జయంతులు నాయుడు పరామర్శించారు. తనవంతు సహాయంగా నల్లు లక్ష్మీదేవికి రూ.10వేలు, రాగి నరేష్‌కు రూ.5వేలు నగదు ఆర్థిక సహాయం అందజేశారు. ప్రమాదంతో ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని జయంతులు నాయుడు హామీ ఇచ్చారు.

డిఎస్సీలో అక్రమాల నిగ్గు తేల్చండి

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి

గూడూరు (నెల్లూరు), ఆగస్టు 3 ప్రభాతవార్త: డిఎస్సీలో జరిగిన అవకతవకలపై బాధ్యత వహిస్తూ నారా లోకేష్ రాజీనామా చేయాలని మాజీ మంత్రి, వైకాపా జిల్లా అద్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, గూడూరు వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త బూదూరు గురవయ్య డిమాండ్ చేశారు. డీఎస్సీ స్కాం బాద్యత వహిస్తూ నారా లోకేష్ రాజీనామా చేయాలంటూ గూడూరు పట్టణంలోని పీవీఆర్ కల్యాణ మండపంలో వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త బూదూరు గురవయ్య అద్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు తరలి రావడంతో పోలీసులు అడ్డుకున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందంటూ ఆంక్షలు విధించడంతో పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ గూడూరులో సభను అడ్డుకోవాలని పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని తెలుస్తోందన్నారు. జగన్ పేరు చెబితేనే వ్యవస్దలు వణికి పోతున్నాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు అవస్దలు పడుతున్నారని, ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సమన్వయకర్త బూదూరు గురవయ్య, సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు యద్దల నరేంద్ర రెడ్డి, కోడూరు కల్పలత, నాశిన నాగులు, మీరారెడ్డి, కొండూరు సునీల్ రెడ్డి, బత్తిని విజయకుమార్, బొమ్మిడి శ్రీనివాసులు, మగ్దూం మొహిద్దీన్, గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంతం కుంగుబాటు

జర్మనీ వర్సిటీ శాస్త్రవేత్తల అధ్యయన నివేదిక

న్యూఢిల్లీ, ఆగస్టు 3: తీర ప్రాంతాల్లో నేల క్రమంగా కుంగిపోవడం పర్యావరణ సమ తుల్యతకు మరో పెద్ద ముప్పుగా మారిందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ రెండు కారణాల ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నట్లు వెల్లడైంది. టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ మ్యూని, టులేన్ యూనివర్సిటీ పరిశోధకులు నిర్వహించిన అధ్యయనం నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్‌లో ప్రచురితమైంది. తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు సగటున ఏడాదికి 6 మిల్లీ మీటర్ల మేర సముద్ర మట్టం పెరుగుదల ప్రభావాన్ని ఎదుర్కొంటున్నారని పరిశోధన తెలిపింది. ఇది ప్రపంచ సగటు కంటే దాదాపు మూడు రెట్లు ఎక్కువ. ప్రపంచవ్యాప్తంగా 50 కోట్ల మందికి పైగా ప్రజలు తక్కువ ఎత్తులో ఉన్న తీర ప్రాంతాల్లో నివసిస్తున్నారు. అలాంటి ప్రాంతాల్లో సముద్ర మట్టం పెరగడమే కాదు, నేల కూడా క్రమంగా దిగజారడం పరిస్థితిని మరింత ప్రమాదకరంగా మారుస్తోందని శాస్త్రవేత్తలు వివరించారు. తీర ప్రాంతాల్లో భూగర్భ జలాలను అధికంగా తోడేయడం, చమురు, సహజవాయువు వెలికితీత, నదీ డెల్టాల్లోని మృదువైన నేల కుంగిపోవడం, భారీ భవనాల బరువు వంటి కారణాలతో భూమి దిగజారుతోందని అధ్యయనం వెల్లడించింది. దీనికి తోడు భూకంప ఫలకాల్లో కదలికలు, మంచు యుగం తర్వాత భూపొరలో జరుగుతున్న సహజ మార్పులు కూడా ప్రభావం చూపుతున్నాయని పేర్కొంది. కొన్ని దేశాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, నైజీరియా, ఈజిప్ట్, చైనా, ఇండోనేషియా తీర ప్రాంతాల్లో ఏడాదికి 7 నుంచి 10 మిల్లీమీటర్ల మేర సముద్ర మట్టం పెరుగుదల నమోదవుతోంది. అమెరికా, నెదర్లాండ్స్, ఇటలీలో ఈ పెరుగుదల 4 నుంచి 5 మిల్లీమీటర్ల మధ్య ఉంది. ఇండోనేషియా రాజధాని జకార్తా అత్యంత ప్రమాదంలో ఉన్న నగరంగా అధ్యయనం పేర్కొంది. అక్కడ సగటున ఏడాదికి 13.7 మిల్లీమీటర్ల మేర నేల కుంగిపోతోంది. కొన్ని ప్రాంతాల్లో ఈ వేగం 42 మిల్లీమీటర్ల వరకు నమోదైంది. చైనాలోని టియాంజిన్, థాయ్‌లాండ్ లోని బ్యాంకాక్, నైజీరియాలోని లాగోస్, ఈజిప్ట్‌లోని అలెగ్జాండ్రియా కూడా ప్రమాదకర జాబితాలో ఉన్నాయి. అయితే అన్ని తీర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి లేదని పరిశోధకులు తెలిపారు. స్వీడన్, ఫిన్‌లాండ్‌లోని కొన్ని ప్రాంతాల్లో భూమి పైకి లేస్తుండటంతో అక్కడ సముద్ర మట్టం ప్రభావం తక్కువగా కనిపిస్తోందని వివరించారు. భూగర్భ జలాల వినియోగాన్ని నియంత్రించడం ద్వారా నేల కుంగిపోవడాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు సూచించారు. ఒకప్పుడు ఏడాదికి 10 సెంటీమీటర్లకుపైగా కుంగిపోయిన టోక్యోలో ప్రభుత్వ చర్యలతో పరిస్థితి మెరుగుపడిందని గుర్తు చేశారు. ఇలాంటి చర్యలు ఇతర దేశాలు కూడా చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

ఉదయ్‌కృష్ణారెడ్డి కస్టడీ కోరుతూ పోలీసుల పిటిషన్

మరో ఇద్దరు బాధితుల వాంగ్మూలం

హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త: సహచర మహిళా ట్రైనీ ఐపిఎస్ అధికారిని లైంగికంగా వేధించడంతో పాటు ఆమె ప్రైవేటు వీడియోలు. ఫోటోలను భర్తకు పంపిన కేసులో అరెస్టయి చంచల్‌గూడ జైల్లో రిమాండులో వున్న ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిని వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఈ కేసును విచారిస్తున్న అత్తాపూర్ పోలీసులు సోమవారం నాడు ఉప్పర్‌పల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో పాటు ఇతనికి బెయిల్ ఇవ్వరాదని కూడా న్యాయమూర్తిని అభ్యర్థించారు. ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. నగరం లోని అశోక్‌నగర్‌లో ఉదయ్ కృష్ణారెడ్డి అద్దెకు తీసుకున్న గదిలో లాప్‌టాప్‌ను, సెల్‌ఫోన్‌ను, కత్తిని జప్తు చేసి లోతుగా ఆరా తీయగా అతను మరికొందరు మహిళలతోనూ సన్నిహిత సంబంధాలు నెరిపినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇద్దరు బాధితుల నుంచి పోలీసులు ఆదివారం వాంగ్మూలం తీసుకున్నారు. వీరిద్దరు ఎపికి చెందిన వారుగా తెలిసింది. ఈ నేపథ్యంలో ఉదయ్ కృష్ణారెడ్డిని మరింతగా విచారించేందుకు వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని అత్తాపూర్ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను కోర్టు విచారణకు స్వీకరించింది. దీంతో పాటు ఉదయ్ కృష్ణారెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేయాలని పోలీసులు కోరారు. పోలీసుల పిటిషన్‌పై మంగళవారం విచారణ జరగనుంది.

రోబోటిక్ శస్త్రచికిత్సల్లో నిమ్స్ ఘనత

హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఆ గస్టు 3, ప్రభాతవార్త: నిమ్స్ ఆసుపత్రి మరో మైలురాయిని అధిగమిం చింది. రోబోటిక్ శస్త్రచికిత్సల రంగంలో ఈ అరుదైన ఘనతను సాధిం చింది. రోబోటిక్ సర్జరీ సేవలను ప్రారంభిం చిన మూడేళ్లలోపే 1,000 విజయ వంతమైన రోబోటిక్ శస్త్రచికిత్సలు పూర్తిచేసి ప్రభుత్వ వైద్య రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ వేయి శస్త్రచికిత్సల్లో యూరాలజీ విభాగం 590, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ 248, సర్జికల్ అంకా లజీ 162 శస్త్రచికిత్సలను రోబోటిక్ ద్వారా నిర్వ హించింది. ప్రోస్టేట్, కిడ్నీ, మూత్రా శయం, కాలేయం, ప్యాంక్రియాస్, పేగులు, గర్భా శయం, అండాశ యాలకు సంబంధించిన క్లిష్టమైన కేన్సర్‌తోపాటు ఇతర శస్త్రచికిత్సలను నిమ్స్‌లో విజయ వంతంగా నిర్వహించారు. శస్త్ర చికిత్సల్లో 90 శాతానికిపైగా ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ పథకాల ద్వారా రోగులకు ఉచితంగా నిర్వహించినట్లు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ స్పష్టం చేశారు.

విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం

- పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులతో రేపు వీడియో కాన్ఫరెన్స్
- సిఎండి శివశంకర్ లోతేటి

తిరుపతి, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి: ఎస్‌పిడిసిఎల్ పరిధిలో విద్యుత్ సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. తిరుపతిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం 'డయల్ యువర్ సిఎండి' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా 57 మంది వినియోగదారులు విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని తెలియజేశారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది తగినచర్యలు చేపడుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు 1912 గానీ, 1800 425 155333కు కాల్ చేయడం, వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వాటిని పరిష్కరించుకోవచ్చన్నారు.

ఎస్‌పిడిసిఎల్‌కు కృతజ్ఞతలు: సంస్థ పరిధిలోని నెల్లూరు జిల్లా, సూళ్లూరుపేటలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులంలో సుదీర్ఘకాలంగా పెండింగులో వున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించిన ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటికి గురుకులం ప్రిన్సిపాల్ సి.రేచల్ వాణి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. గురుకులం పరిసరాల్లో పాత విద్యుత్ స్తంభాలు, లైన్లు ప్రమాదకరంగా వుండేవన్నారు. విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా వాటిని మార్చాలని ఎస్పిడిసిఎల్ అధికారులకు విన్నవించడం జరిగిందన్నారు. ఈ సమస్యపై తక్షణం స్పందించిన సిఎండి పాత విద్యుత్ స్తంభాలు, లైన్లను మార్చేందుకు చూపిన చొరవ పట్ల ఆమె ఈ కార్యక్రమం ద్వారా కృతజ్ఞతలు తెలియజేశారు. సంస్థ డైరెక్టర్లు పి.అయూబాఖాన్, కె.గురవయ్య, కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణా దేవి, ఆర్.పద్మ, యం.మురళీకుమార్, ఎన్. శోభావాలెంటీనా, సిహెచ్ రామచంద్రరావు, కె.సంపత్‌కుమార్, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు శ్రీకాంత్, చక్రపాణి, జగదీష్, భాస్కర్‌రెడ్డి, లత, పిఆర్ఓ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

రేపు వీడియో కాన్ఫరెన్స్: ఎస్పిడిసిఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని పారిశ్రామిక విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికై 5వ తేదీ బుధవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి సోమవారం పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, వ్యవస్థలో లోటుపాట్లు, ఓల్టేజ్ మార్పులు, బిల్లింగ్, సోలార్ నెట్ మీటరింగ్, ఓపెన్ యాక్సెస్‌తోపాటు విద్యుత్ భద్రతా అంశాలకు సంబంధించిన సమస్యలపై పారిశ్రామిక వినియోగదారులతో చర్చించేందుకు వీలుగా ప్రతినెలా మొదటి బుధవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనదలచిన పారిశ్రామిక వినియోగదారులు ప్రతి నెలా మొదటి బుధవారానికి 7 రోజుల ముందు నుంచి మొదటి మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు 89777 79471 ఫోన్ నంబరుకు కాల్ చేయడం ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాల్సి వుంటుందని తెలియజేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లింక్ను సంబంధిత వినియోగదారులకు పంపడం జరుగుతుందన్నారు. పారిశ్రామిక వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎస్‌కె వర్సిటీ అభివృద్ధిలో సీనియర్ ఆచార్యుల సేవలు చిరస్మరణీయం

అనంతపురం, ఆగస్టు 3 ప్రభాతవార్త బ్యూరో: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ అభివృద్ధిలో సీనియర్, విశ్రాంత ఆచార్యులు అందించిన సేవలు చిరస్మరణీయమని ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ ప్రగతికి తమ జీవితాలను అంకితం చేసిన సీనియర్ ఆచార్యులను సత్కరించడం గర్వకారణమని అన్నారు. విశ్వవిద్యాలయంలో పూలే భవన్‌లో నిర్వహించిన విశ్రాంత ఆచార్యుల జనరల్ బాడీ కార్యక్రమంలో 75 సంవత్సరాలు పైబడిన సీనియర్ ఆచార్యులు, విశ్రాంత ఆచార్యులను సన్మానించారు. తమ బోధన, పరిశోధన, మార్గదర్శకత్వం ద్వారా వేలాది మంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంతో పాటు, విశ్వవిద్యాలయ విద్యా ప్రమాణాలను పెంపొందించడంలో సీనియర్ ఆచార్యుల పాత్ర ఎంతో కీలకమని ఉపకులపతి తెలిపారు. ఈ సందర్భంగా 75 సం" పైబడిన సీనియర్ ఆచార్యులు డిఆర్‌వి ప్రసాద రావు, ఉమా మోహన్, ఆచార్య శేషశాస్త్రి, ఎల్.వేణుగోపాలరెడ్డి, ప్రొఫెసర్ కె.రవీంద్రనాథ్, ప్రొఫెసర్ టి.పుల్లయ్యలను ప్రత్యేకంగా సన్మానించారు. వారి విద్యా, పరిశోధనా సేవలు విశ్వవిద్యాలయానికి విలువైన వారసత్వంగా నిలిచాయని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.అంజనేయులు మాట్లాడుతూ.. సీనియర్ ఆచార్యులు నెలకొల్పిన విద్యా ప్రమాణాలు, పరిశోధనా సంప్రదాయాలు ప్రస్తుత తరానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. వారి అనుభవాలు, సూచనలు విశ్వవిద్యాలయ భవిష్యత్ అభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సీనియర్ ఆచార్యులు తమ అనుభవాలను పంచుకుంటూ, విశ్వవిద్యాలయం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల శ్రేయస్సు, నాణ్యమైన విద్య, పరిశోధన మరియు సమాజ సేవకు విశ్వవిద్యాలయం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యుల సంఘం సభ్యులు ఆచార్యులు టి.పుల్లయ్య, రవీంద్రారెడ్డి, ఫణీశ్వరరాజు, సియన్ కృష్ణానాయక్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని సీనియర్ ఆచార్యుల సేవలను కొనియాడారు. పూర్వ ఆచార్యుల అనుభవం, ప్రస్తుత తరానికి మార్గదర్శకత్వం, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

ఎస్కే యూనివర్సిటీలో పదవీ విరమణ పొందిన విశ్రాంత ఆచార్యులు కలుసుకున్న దృశ్యం

మూగజీవాల హింసపై జోక్యం చేసుకోండి

- డి.సిఎం పవన్‌కల్యాణ్‌కు యాంకర్ రష్మీ

విజయవాడ, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రముఖ టెలివిజన్ యాంకర్, జంతు హక్కుల కార్యకర్త రష్మీ గౌతమ్ ఆంధ్రప్రదేశ్‌లో ఎద్దుల పట్ల క్రూరంగా ప్రవర్తిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎద్దులతో బలవంతంగా భారీ బరువులు మోయిస్తున్న దృశ్యాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటూ, ఇటువంటి అమానవీయ చర్యలను అరికట్టాలని ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఎక్స్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు పోలీస్, పశుసంవర్ధక, పర్యావరణ శాఖలను ట్యాగ్ చేస్తూ ఆమె ఒక పోస్ట్ చేశారు. "పోటీల్లో పాల్గొనేందుకు ఎద్దులకు శిక్షణ ఇవ్వాలని చాలామంది చెబుతుంటారు. అయితే శిక్షణ ఇచ్చే పద్ధతి ఇదేనా? ఇందులో క్రూరత్వం మీకు కనిపించడం లేదా? అవి కూడా ప్రాణం ఉన్న జీవులే కదా?" అని రష్మీ నిలదీశారు. ఈ ఘటనకు బాధ్యులైన వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని ఆమె అధికారులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఉద్దేశిస్తూ ఆమె మరో పోస్ట్ చేశారు. "జంతువులపై జరుగుతున్న ఈ హింసను అరికట్టడంలో మీ సహకారం అత్యవసరం. అనేక సందర్భాల్లో ఇలాంటి ఘటనల వెనుక ప్రభావశీలురు ఉండటంతో మూగజీవాలకు న్యాయం జరగడం కష్టమవుతోంది. ఆలయాల్లో నందులను పూజిస్తూ, బయట వాటిపై ఇలాంటి పాశవిక చర్యలకు పాల్పడటం సరికాదు. ఇది సహాయం కోసం చేస్తున్న ఆర్తనాదం" అని ఆమె పేర్కొన్నారు. రష్మీ పంచుకున్న వీడియోలలో, గ్రామీణ ప్రాంతాల్లో కొందరు వ్యక్తులు తెల్ల ఎద్దులతో భారీ పైపులు, సిమెంట్ దిమ్మెలను లాగిస్తున్న దృశ్యాలు ఉన్నాయి. ఆ భారమైన బరువును మోయలేక ఆ మూగజీవాలు తీవ్రంగా అవస్థలు పడుతున్నట్లు వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. దేశంలో జంతువుల పట్ల హింసను నిరోధించేందుకు జంతు హింస నిరోధక చట్టాన్ని రూపొందించారు.

విజయవాడలో ఫొటోగ్రఫీ పోటీలు

విజయవాడ, ఆగస్టు 3 ప్రభాతవార్త: ఈనెల 19వతేదీ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహించనున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు. మూడువిభాగాల్లో జరిగే ఈపోటీలలో మొదటి విభాగంలో జిల్లాకు సంబందించి ఆంధ్రప్రదేశ్ వారసత్వం, పర్యాటకం, సంస్కృతి అంశాల్లో ఫోటో ఎంట్రీలు పంపించవచ్చన్నారు. రెండోవిభాగంలో యువత, పి4, ఆర్థికాభివృద్ధి-సంక్షేమం, ముడో విభాగంలో అత్యుత్తమ న్యూస్ ఫోటో పోటీ ఉంటుందన్నారు. ప్రతి విభాగంలో మొదటి మూడుస్థానాలు సాధించిన వారికి వరుసగా రూ.10వేలు, రూ.7వేలు, రూ.4వేలు నగదు పురస్కారం ఇస్తామన్నారు. వీరితోపాటు మరో ఆరుగురికి రూ.2వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఒక్కో ఫోటోగ్రాఫర్ ఒక్కో విభాగానికి 3ఫోటోలు చొప్పున మూడు విభాగాలకు 9ఫోటోలు పంపించివచ్చని వివరించారు. 2025 జూన్ 12 నుండి 2026 జులై 31మధ్య తీసిన ఫోటోలు మాత్రమే పంపించాలన్నారు. ఔత్సాహికులు తమ ఎంట్రీలను ఈనెల 5వతేదీ సాయంత్రం 6గంటలలోపు డిపిఆర్‌వో కార్యాలయం, స్టేట్ గెస్ట్‌హౌస్, విజయవాడ-520002 చిరునామాకు నేరుగా లేదా పోస్టు ద్వారా పంపించాలన్నారు. ఇతర వివరాలకు 901015 6550లో సంప్రదించాలని కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా సూచించారు.

కాకాని జయంతి సందర్భంగా కుర్చీలు వితరణ

విజయవాడ, ఆగస్టు 3 ప్రభాతవార్త: ఉక్కు మనిషి మాజీ మంత్రి కాకాని వెంకటరత్నం జయంతి సందర్భంగా ఆయన మనుమడు కాకాని తరుణ్ విజయవాడలోని ఠాగూర్ గ్రంధాలయానికి సోమవారం నాలుగు కుర్చీలను బహుకరించారు. ఈకార్యక్రమానికి హాజరైన పాతూరి నాగభూషణం కాకాని వెంకటరత్నం సేవలను పలువురు కొనియాడారు. గ్రంధాలయానికి అవసరమైన మౌలికవసతులు కల్పనకు చేయూతనిస్తానని కాకాని తరుణ్ హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంధాలయసంస్థ అధ్యక్షులు యంయస్ బేగ్, గ్రంధాలయ అధికారిణి కె.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దసరా నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

దుర్గగుడిలో చేపట్టాల్సిన భద్రతా చర్యలపై సూచనలిస్తున్న కమీషనర్

విజయవాడ, ఆగస్టు 3 ప్రభాతవార్త: విజయవాలో వెలసిన కనకదుర్గమ్మవారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయనున్నట్లు విజయవాడ కమీషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆలయ పరిసరాల్లో పర్యటించి భద్రతా ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. సెప్టెంబర్ 20వతేదీ దసరా పండుగ సందర్భంగా పండుగ ముందు తొమ్మిదిరోజులపాటు నిర్వహించే నవరాత్రి ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. ఈనేపధ్యంలో ముందస్తు ఏర్పాట్లపై కమీషనర్ ఆలయ ప్రాంగణంలో పర్యటించి ఘాట్‌రోడ్‌లో వాహనాల రాకపోకల నియంత్రణ, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు, హోల్డింగ్ ఏరియాలు, బారికేడింగ్, ప్రసాదం కౌంటర్లు, క్యూలైన్‌లు, స్నానఘాట్లు తదితర ఏర్పాట్లపై అధికారులకు సూచనలిచ్చారు. ఇప్పటి నుండి ఏర్పాట్లపై దృష్టి సారించాలని, భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఈఓ శీనానాయక్, డిసిపి జయకృష్ణ, ఏసిపి దుర్గారావు, గుణరాం తదితరులు పాల్గొన్నారు.

15, 16, 17 తేదీల్లో శ్రీశ్రీశ్రీ ధర్మరాజ స్వామి ఆలయ రాజ గోపుర శిఖర ప్రతిష్టా కార్యక్రమం

గూడూరు (నెల్లూరు), ఆగస్టు 3 ప్రభాతవార్త: గూడూరు పట్టణంలోని శ్రీ కృష్ణ ద్రౌపతి సమేత ధర్మ రాజ స్వామి ఆలయంలో జరిగే నూతన రాజగోపుర శిఖర ప్రతిష్టా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆలయ చైర్మన్ వాటంబేడు శివ కుమార్ పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని శ్రీ ధర్మరాజుల స్వామి దేవస్థానంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15, 16, 17 తేదీల్లో శ్రీశ్రీశ్రీ ధర్మరాజ స్వామి ఆలయ రాజ గోపుర శిఖర ప్రతిష్టా కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం దేవ స్థాన పరిధిలో ఉండే అంగళ్ల బడుగలను సకాలంలో చెల్లించాలన్నారు. పాత బకాయిలును చెల్లించి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం ఆలయ ఈవో రవికృష్ణ మాట్లాడుతూ ఆలయ రాజ గోపుర శిఖర ప్రతిష్టా కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. అదేవిధంగా అంగళ్ల పాత బకాయిలను చెల్లించాలన్నారు. లేని ఎడల నోటీసులను జారీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కాలనీ 9లో దాహం కేకలు

టెక్కలి, ఆగస్టు 3 ప్రభాతవార్త

టెక్కలిలోని ఎన్టీఆర్ కాలనీ 9లో త్రాగునీరు కోసం స్థానిక వీధి ప్రజలు దాహం కేకలు వేస్తున్నారు. నేటికీ రెండు నెలలు అవుతుంది టెక్కలి ఎన్టీఆర్ కాలనీ 9లో తాగునీరు అందడం లేదు. సంబంధిత అధికారులలో చలనం లేదు. దీనికి కారణం నిర్లక్ష్యం. కొంతమంది నాయకులమని చెప్పుకుంటున్న వారు వీళ్ళకి సరైన సమయంలో సరిగా పని చేయకుండా వెన్నుదన్నుగా ఉండడమే ప్రథమ కారణం. ప్రజల నీటి కష్టాలు వాళ్లకి పట్టవు కనిపించడం లేదు. అసలు త్రాగునీరు అందనివ్వకుండా చేస్తున్నది ఎవరు? గత రెండు సంవత్సరాల కిందట పైపు మరమ్మత్తులు పరిష్కారం చేయవలసింది. అంత మొక్కుబడిగా పని చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. అధికారులు. ఎందుకో నిర్లక్ష్యం..! ఇప్పటికైనా జిల్లా పై స్థాయి అధికారులు తక్షణమే స్పందించి టెక్కలి ఎన్టీఆర్ కాలనీ9వ లైన్‌లో త్రాగునీరు వెంటనే అందించి దాహం కేకలు నుండి ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పిస్తారని విన్నపం.

రావివలసలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

సంతబొమ్మాళి, ఆగస్టు 3, ప్రభాతవార్త

మండలంలోని నౌపడ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో రావివలస శ్రీఎండల మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జర్జాన ప్రవీణ్ కుమార్ సంతబొమ్మాళి మాజీ జడ్పీటీసీ సభ్యులు ఎల్ఎల్ నాయుడు, లక్ష్మిలకు, ఆలయ కార్యానిర్వాహణాధికారి గురునాథ్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే మరో 75 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఇందులో భాగంగా వెన్ను, మోకాళ్ళు నొప్పులు, డయాబెటిస్, శ్వాస సమస్యలు, చర్మరోగాలు, ఇతర దీర్ఘకాలిక సమస్యలకు మందుల పంపిణీ చేశారు. యోగ విశిష్టత, జీవన శైలి మార్పుల వల్ల కలిగే ఉపయోగాలు తెలుపుతూ ఆసుపత్రిలోని ఆయుర్వేద వైద్య సేవలు, ఉచిత యోగ శిక్షణ వంటి సేవలు ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. వైద్యులతో పాటు యోగ గురువులు చంద్రశేఖర్, సిబ్బంది పద్మ, పాల్గొన్నారు.

డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ : ప్రభుత్వ విప్ అశోక్

కవిటి, ఆగస్టు 3 ప్రభాతవార్త

డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు భవిష్యత్తులో వారి అభివృద్ధికి సహకారం అందిస్తానని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అశోక్ అన్నారు. సోమవారం ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ సంక్షేమ సంఘం 27వ వార్షికోత్సవ ఎన్నికల్లో విజయం సాధించిన చౌదరి మాధవరావును రాష్ట్ర బీసీ రెడ్డిక మరియు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కొండ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో రామయ్యపుట్టుగలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ డాక్టర్ అశోక్‌ను ఘనంగా సన్మానించే కార్యక్రమం చేపట్టారు. అశోక్ మాట్లాడుతూ డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తాను ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటారని హామీ ఇచ్చారు. అలానే నూతన అధ్యక్షులు చౌదరి మాధవరావు మాట్లాడుతూ డ్రైవర్లకు వెన్నుదన్నుగా నిలిచి వారి సమస్యలు పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆటో ఓనర్స్ మరియు డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆంధ్ర రాష్ట్ర క్యారమ్స్ ర్యాంకింగ్ విజేత హరిప్రియ

కవిటి, ఆగస్టు 3 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్యారమ్స్ ర్యాంకింగ్ ప్రథమ విజేతగా కవిటి మండలం జగతి గ్రామానికి చెందిన లమ్మత హరిప్రియ విజేతగా నిలిచి రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచారు. నెల్లూరు జిల్లా క్యారం సంఘం ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర క్యారం సంఘం పర్యవేక్షణలో మూడు రోజుల పాటు జరిగిన క్యారమ్స్ ర్యాంకింగ్‌లో పురుషుల విభాగంలో హరిప్రియ ప్రథమ విజేతగా నిలిచారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు, అధికారులు, క్రీడా ప్రముఖులు క్యారమ్స్ అభిమానులు మధ్య జరిగిన ఈ పోటీల్లో హరిప్రియ విజయం సాధించడం విశేషం. విజేతలకు టోర్నమెంట్ కో ఛైర్మన్ మాజీ రంజీ క్రీడాకారుడు మలిరెడ్డి కోటారెడ్డి ఏపీ ట్రాన్స్‌కో మాజీ ఇంజనీర్ శేషారెడ్డి, అపోలో ఆసుపత్రి సీఈవో విశ్వేశ్వర్ రెడ్డి, ఆంధ్ర రాష్ట్ర క్యారం సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్, నెల్లూరు జిల్లా క్యారం సంఘం అధ్యక్షులు శ్రీమన్నారాయణ కార్యదర్శి పి.శ్రీనివాసులు పాల్గొని విజేతలకు బహుమతులు అందించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మలిరెడ్డి కోటారెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో శిఖరాగ్ర విజయాలు సాధించాలంటే క్రమశిక్షణ, అంకితభావం నిరంతర సాధన ఎంతో అవసరమని తెలిపారు. హరిప్రియ విజయం పట్ల జిల్లా క్యారమ్స్ సంఘం కార్యదర్శి పూడి నేతాజీతో పాటు జగతి సర్పంచ్ వరప్రసాద్, గ్రామ పెద్దలు కవిటి మండలానికి చెందిన పలువురు ప్రముఖులు ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

జీవో నెంబర్ 3కు చట్టబద్ధ రక్షణ కల్పించాలి

సీతంపేట, ఆగస్టు 3, ప్రభాతవార్త

షెడ్యూల్ ప్రాంతాల్లో స్థానిక ఆదివాసీల హక్కులను పరిరక్షించేందుకు ఏర్పాటు చేసిన జీవో నెంబర్ 3కు చట్టబద్ధ రక్షణ కల్పించాలి డిమాండ్ చేస్తూ ఆదివాసి జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం సీతంపేటలో పెద్ద ఎత్తున శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అడవి తల్లి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి ఐటీడీఏ పీవో పవర్ స్వప్నల్ జగన్నాథ్‌కు వినతి పత్రం అందజేశారు. వారపు సంత నుండి ఐటీడీఏ కార్యాలయం వరకు భారీ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసి జేఏసీ అధ్యక్షులు బిడ్డిక శ్రీనివాసరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పుతో జి.ఓ.ఎం.ఎస్. నెం.3/2000 అమలుపై ఏర్పడిన పరిస్థితుల వల్ల షెడ్యూల్ ప్రాంతాల్లోని స్థానిక ఆదివాసీ యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవడం దీని మూలంగా నిరుద్యోగం పెరుగుతుందని అన్నారు. షెడ్యూల్ ప్రాంతాల ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక రిజర్వేషన్ చట్టాన్ని రూపొందించాలని కోరారు. అలాగే గిరిజనుల భూహక్కులకు రక్షణగా ఉన్న 1/70 చట్టాన్ని యథావిధిగా కొనసాగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాలకొండ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు విశ్వాసరాయి కళావతి. జై భీమ్ రాష్ట్ర అధ్యక్షులు మాజీ హైకోర్టు న్యాయమూర్తి జడ శ్రావణ్ కుమార్, మన్యం జిల్లా జేఏసీ అధ్యక్షులు కొండగొర్రి ధర్మారావు, హైకోర్టు అడ్వకేట్ యూకే రవి, నిమ్మక జయరాజు, వాబాయోగి, సవర జగన్ నాయకులు, బిడ్డిక ఉమామహేశ్వరరావు. రామ్మోహన్ రావు, ఆల్ ఇండియా ఆదివాసి టీచర్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, పలువురు ఆదివాసి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ శాంతియుత ర్యాలీలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా సీతంపేట ఎస్సై వై.ఆమన్నరావు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

అర్హులైన రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు

ఎమ్మెల్యే, రాష్ట్ర పియుసి కమిటీ ఛైర్మన్ కూన

ఆముదాలవలస, ఆగస్టు 3, ప్రభాతవార్త

అర్హులైన రైతులందరికీ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే, పియుసి కమిటీ ఛైర్మన్ కూన రవికుమార్ అన్నారు. అక్కులపేట గ్రామంలో ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ అర్హులైన రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో రెవెన్యూ వ్యవస్థలో ఎన్నో తప్పులు జరిగాయని, రైతుల పాస్ పుస్తకాలపై జగన్మోహన్ రెడ్డి బొమ్మలు వేయడం రైతులు అభద్రత భావానికి లోనయ్యారని తెలిపారు. అందుకే కూటమి ప్రభుత్వం వచ్చిన మరుక్షణమే తప్పులు సరిదిద్దామని ప్రభుత్వ రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు రైతుల పేరుతో తయారుచేసి ఇవ్వడం జరుగుతుందని, రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతుల భూములకు శాశ్వత గుర్తింపు కల్పించడంతో పాటు భూ యాజమాన్య హక్కులకు మరింత భద్రత కల్పించేందుకు ప్రభుత్వం రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తోందన్నారు. ఈ పాస్ పుస్తకాలు రైతులకు చట్టపరంగా మరింత బలాన్ని ఇవ్వడమే కాకుండా భూములకు సంబంధించిన అన్ని ప్రభుత్వ సేవలను సులభంగా పొందేందుకు ఉపయోగపడతాయని వివరించారు. రైతులకు అవసరమైన ప్రతి ప్రభుత్వ సేవ గ్రామస్థాయిలోనే అందుబాటులోకి తీసుకురావాలన్నదే కూటమి ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మినేని సుజాత, తమ్మినేని అమర్నాథ్, నాని, వండాన ఉదయ్ కుమార్, ఎంపిటిసి ప్రతినిధి బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి, అన్నెపు భాస్కరరావు, నేతింటి జ్యోతీశ్వరరావు, హనుమంతు బాలకృష్ణ, తహసిల్దార్ సత్యనారాయణ, సర్వేయర్ బొడ్డేపల్లి గోపి, సచివాలయం సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాజీ సైనికోద్యోగికి ఘన స్వాగతం

కవిటి, ఆగస్ట్ 3 ప్రభాతవార్త

కవిటి మండలం జి.కరాపాడుకి చెందిన గవ్వల జగదీష్ దాదాపు 24 ఏళ్ళు దేశ సైనిక రంగంలో సేవలు అందించి పదవీ విరమణ చేసి స్వగ్రామం నకు తిరిగి వచ్చిన సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికారు. లెఫ్టినెంట్ కల్నల్ హోదాలో ఇచ్ఛాపురం చేరుకున్న జగదీష్‌కి రైల్వే స్టేషన్‌లో గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. స్టేషన్ నుండి గ్రామం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎస్ బి ఐ ఉద్యోగి నర్తు సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. క్లాస్‌మెట్‌లు గంగరాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి : జూనియర్ సివిల్ జడ్జి రోషిణి

కోటబొమ్మాళి, ఆగస్టు 3, ప్రభాతవార్త

స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో సెప్టెంబర్ 9వతేదీన జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి తెలిపారు. సోమవారం ఆమె చాంబర్‌లో మాట్లాడుతూ వచ్చే నెల 9వ తేదీన జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో కక్షిదారులు, న్యాయవాధులు, పోలీసులు క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, బ్యాంకు కేసులు, ప్రీలిటిగేషన్ కేసులు గుర్తించి ఇరు పార్టీల అంగీకారంతో రాజీ మార్గం కేసులను పరిష్కరం అయ్యే విధంగా చూడాలని ఆమె సూచించారు. రాజీ మార్గమే రాచమార్గమని, రాజీకి వీలైనన్ని ఎక్కువ కేసులను గుర్తించి జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని తెలిపారు. అలాగే లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు కూడా వాపసు ఇవ్వబడుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని అమె తెలియజేశారు.

తక్కువ ధరలకే నాణ్యమైన బియ్యం పంపిణీ : జాయింట్ కలెక్టర్ ఆర్.వైశాలి

వీరఘట్టం, ఆగస్టు 3, ప్రభాతవార్త

ప్రభుత్వ ఆదేశాల మేరకు సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కలిగించేలా తక్కువ ధరలకే నాణ్యమైన బియ్యాన్ని సబ్సిడీపై పంపిణీ చేస్తున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.వైశాలి తెలిపారు. రైతు బజార్లు మరియు రైస్ మిల్లుల అవుట్‌లెట్ స్టోర్లలో రైస్ మిల్లర్ల సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ బియ్యం విక్రయ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ ఆర్.వైశాలి, జిల్లా పౌర సరఫరాల అధికారి అశోక్‌తో కలసి పరిశీలించి, లబ్ధిదారులకు బియ్యం సంచులను అందజేశారు. స్టీమ్ బియ్యం (బి.పి.టి) బహిరంగ మార్కెట్ ధర రూ.62.00 ఉండగా, ప్రభుత్వం ప్రత్యేక కౌంటర్ల ద్వారా రూ.52.00 లకే అందిస్తోంది. రా బియ్యం (బి.పి.టి) బహిరంగ మార్కెట్ కంటే తగ్గించి, ప్రత్యేక సబ్సిడీ ధర రూ.50.00లకే విక్రయిస్తున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ 'మాటల్లోనే కాదు.. చేతల్లో సంక్షేమం' అనే ధ్యేయంతో ప్రజలపై ఆర్థిక భారం పడకుండా రైస్ మిల్లర్ల భాగస్వామ్యంతో ఈ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మార్కెట్లో ధరలను నియంత్రించడంతో పాటు, ప్రజలందరికీ నాణ్యమైన బియ్యం అందుబాటులో ఉంచడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ అధికారులు, సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

యువత సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలి

రణస్థలం, ఆగస్టు 3, ప్రభాతవార్త

యువత సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలని వైసీపీ శ్రీకాకుళం నియోజకవర్గ పరిశీలకులు సాయికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం ఆపార్టీ యువ నాయకుడు ముద్దాడ రాజశేఖర్ జన్మ దిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సమాజానికి ఉపయోగకరమైన రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా రాజశేఖర్ సమాజానికి ఉపయోగపడే మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు. సామాజిక బాధ్యతతో చేపట్టిన ఈ రక్తదాన శిబిరంలో 25మంది యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ శిబిరంలో సేకరించి యూనిట్ల రక్తాన్ని రెడ్ క్రాస్ సిబ్బంది కి అందిజేశారు. వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, చేతి వృత్తుల విభాగం అధ్యక్షుడు టేకు బ్రహ్మాజీ, జెఆర్ పురం2 ఎంపీటీసీ పచ్చిగుళ్ల సాయిరాం, మాజీ ఎంపీటీసీ ప్రతినిధి ఇదదాసుల తిరుపతిరాజు, రాయపురెడ్డి శ్రీను, దుక్క మధు, సప్ప కనకరాజు, యువకులు సంఖ్యలో పాల్గొన్నారు.

ఏపీ 23వ కరాటే చాంపియన్‌షిప్‌లో కోటబొమ్మాళి విద్యార్థికి కాంస్య పతకం

కోటబొమ్మాళి, ఆగస్టు 3, ప్రభాతవార్త

ఆగస్టు 2వ తేదీన విజయవాడ మారిసెల్లా ఇండోర్ స్టేడియం లో కె10 (కరాటే ఇండియా ఆర్గనైజేషన్) నిర్వహించిన రాష్ట్ర స్థాయి 23వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ కరాటే చాంపియన్‌షిప్ 2026 పోటీలలో మండలం ఉప్పరపేట గ్రామానికి చెందిన చెన్నంశెట్టి శివబాలాజీ బిలో 55 కేజీ విభాగంలో జూనియర్ కేటగిరిలో కాంస్య పతకాన్ని గెలుపొందాడు. శివబాలాజీకి ఇంటియన్ స్టైల్ చీఫ్ (విఎస్కెఏఐ) విక్టరీ షోటోకాన్ కరాటే అసోషియేషన్ అఫ్ ఇండియా ఫౌండర్ ఆర్.మల్లికార్జున్ గౌడ్, వింగ్స్ సోటోకాన్ కరాటే చాంపియన్స్ అకాడమీ పౌండర్ టి.సాయికుమార్‌లు కాంస్య పతకాన్ని అందజేశారు. శివబాలజీ శ్రీకాకుళంలో గౌతమ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. కాంస్య పతకం సాధించిన శివబాలజీకి, కోచ్ సామ గౌతమ్ కుమార్‌కు గ్రామపెద్దలు బోయిన గోవిందరాజులు, బోయిన రమేష్ తదితరులు అభినందనలు తెలిపారు.

కలెక్టర్‌కి శ్యాంప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు

ఇచ్ఛాపురం, ఆగస్టు 3 ప్రభాతవార్త

స్థానిక దానంపేటకి చెందిన దివంగత నిరంజన్ మహారణ కుమారుడు శుభం మహారణ అనే దివ్యంగ బాబు సదరం సర్టిఫికెట్‌లో ఒక అక్షరం తప్పుగా ప్రింట్ అవ్వడం వలన అతను పెన్షన్ పొందలేకపోతున్నారని జిల్లా కలెక్టర్ దృష్టికి వైస్సార్సీపీ నియోజకవర్గ సుమనవ్య కర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి తీసుకుని వెళ్ళారు. వెంటనే స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులను ఆ బాబు ఇంటికి పంపంచి పరిస్థితిని పరిశీలించి నివేదిక తయారు చేసి అందజేశారు. రిమ్స్ ఆసుపత్రికి బాబును తీసుకొని వెళ్లేందుకు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్‌కి ఆ బాబు కుటుంబం తరుపున ధన్యవాదములు తెలియజేశారు.

అభివృద్ధి చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపణలు

పట్టణ పార్టీ అధ్యక్షులు సంపదరావు మురళి

ఆమదాలవలస, ఆగస్టు 3, ప్రభాతవార్త

నియోజవర్గ అభివృద్ధిని చూసి ఓర్వలేక టిడిపిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని పట్టణ పార్టీ అధ్యక్షులు సంపదరావు మురళి అన్నారు. సోమవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత నెల 30వ తేదీన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పరామర్శించడానికి మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వచ్చిన సందర్భంగా వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చింతాడ రవికుమార్ అతని అనుచరులు కొత్త రోడ్డు వద్ద మహిళ ఎస్సై ప్రవళికపై ఒక ఉన్మాదిలా అసభ్యంగా ప్రవర్తించడం దుర్మార్గమని అన్నారు. మహిళా ఎస్సైను వేధించిన ఘటనలో ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని అన్నారు. మహిళా ఎస్సైపై అసభ్యంగా ప్రవర్తించి తన తోబుట్టువు లాంటిదని మాట్లాడుతున్నారని తోబుట్టువులు ఇంట్లో ఆడపడుచులతో ఇలాగే అమర్యాదగా ప్రవర్తిస్తారా అని ప్రశ్నించారు. సాక్షాత్తు నారా భువనేశ్వరిపై అసెంబ్లీ సాక్షిగా దుర్భాషలాడిన నీచ సంస్కృతి చరిత్ర వైసిపి పార్టీదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2029 ఎన్నికల్లో మహిళలే వైసిపి పార్టీని బంగాళాఖాతంలో కలిపేస్తారని అన్నారు. నోటికి వచ్చినట్లు అవాకులు చవాకులు పేలడం ఇకనైనా మానుకోవాలని హెచ్చరించారు. మండల పార్టీ అధ్యక్షులు నూకరాజు, ఎంపీటీసీ అన్నెపు భాస్కరరావు నియోజకవర్గ యాదవ సంఘం నాయకుడు నాగళ్ళ మురళీధర్ యాదవ్ టీడీపీ నాయకులు ధవళ అప్పలనాయుడు, పాతిన రమణమూర్తి, ఎండ భీష్మ, గురుగుబెల్లి నాగేశ్వరావు, కింజరాపు శివ, శిల్లా గురునాధరావు, పాతిన రమణ, తంగి గురయ్య, పాల్గొన్నారు.

సౌత్ జోన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలకు జ్ఞానభారతి విద్యార్థులు

ఇచ్ఛాపురం, ఆగస్టు 3 ప్రభాతవార్త:

సిబిఎస్ఇ సౌత్ జోన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలకు జ్ఞానభారతి పాఠశాల విద్యార్థులు తరలి వెళ్లారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ప్రేమ కుమారి, లావణ్య భగత్ ఏడవ తరగతి విద్యార్థి కబీ అనురాగ్, ఆరవ తరగతి విద్యార్థి యశ్వత వివిధ విభాగాలలో పోటీ పడుతున్నారు. ఈ పోటీలు హైదరాబాదులో పటాన్ చెరువు ఆరిజిన్ స్కూల్‌లో 4 నుండి 8వరకు జరగనున్నాయి. ఈ పోటీలలో పాల్గొనడానికి వెళ్తున్న విద్యార్థులను పాఠశాల కార్యదర్శి ముఖ్య కార్యనిర్వహణ అధికారి జోహార్ ఖాన్, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐబి పండా, ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు కైలాస్ పండా, రామచంద్రారెడ్డి, విక్రమ్ అభినందనలు తెలియజేశారు. క్రీడలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

దొంగలించబడ్డ చరవాణిలను అప్పగించిన పోలీసులు

రాజాం, ఆగస్టు 3, ప్రభాతవార్త

రాజాం పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో గల బి.హేమలత, పల్ల అప్పలనాయుడు, కొయ్యను వెంకట్రావు, టంకాల అప్పలనాయుడు, పొన్నాడ సన్యాసి నాయుడులు వివిధ గ్రామాలకు చెందినవారు. గతంలో పోగొట్టుకున్న ఐదుగురు సెల్‌ఫోన్‌లు పోయినట్లు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వాటిని సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్ ద్వారా స్వాధీనం చేసుకుని ఎస్పీ దామోదర్ సూచనల మేరకు అలాగే రాజాం పట్టణ సిఐ డి.నవీన్ కుమార్ చరవాణిలను పోగొట్టుకున్నటువంటి చరవాణి యజమానులకి అప్పగించడం జరిగినది. ఈ సందర్భంగా బాధితులు పోలీస్ సిబ్బందిపై హర్షం వ్యక్తం చేశారు.

శ్రీకాకుళం వార్త

డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల

ఆమదాలవలస, ఆగస్టు 3, ప్రభాతవార్త

ఆమదాలవలస అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో భాగంగా డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ప్రచురించారు. నియోజకవర్గంలో మొత్తం 1,93,043 మంది ఓటర్లు ఉండగా, క్షేత్రస్థాయి పరిశీలన, ఇంటింటి సర్వే, డేటా విశ్లేషణ ఆధారంగా 15,173 మంది ఓటర్ల పేర్ల తొలగింపునకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తహసిల్దార్ జి.సత్యం, ఎలక్షన్ డి టి దువ్వాడ అమర్నాథ్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలగింపునకు ప్రతిపాదించిన వారిలో డబుల్ ఎంట్రీలు కలిగిన ఓటర్లు, మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. బూత్ లెవల్ అధికారులు నిర్వహించిన ఇంటింటి సర్వే ద్వారా ఈ వివరాలను ధృవీకరించినట్లు తెలిపారు. అదేవిధంగా, ఓటర్ల జాబితాలో 8,921 మంది ఓటర్ల వివరాల్లో పేర్లు, చిరునామాలు లేదా ఇతర సమాచారంలో తప్పులు ఉన్నట్లు గుర్తించామని, వీరందరికీ నోటీసులు జారీ చేసి సరైన సమాచారాన్ని సేకరించే ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. ధృవీకరణ అనంతరం సంబంధిత వివరాలను సవరించి తుది జాబితాలో పొందుపరుస్తామని పేర్కొన్నారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు మరియు దరఖాస్తుల స్వీకరణ 31-07-2026 నుండి 30-08-2026 వరకు కొనసాగుతుందని తెలిపారు. పై తేదీలలో కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారు ఫారం6, నియోజకవర్గం లేదా పోలింగ్ కేంద్రం మార్పు (షిఫ్టింగ్) కోసం ఫారం 8, ఓటరు పేర్ల తొలగింపు కోసం ఫారం7 ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

రైతులు నీటి ఎద్దడి తట్టుకునే పంటలను సాగు చేసుకోవాలి

అమదాలవలస సస్య రక్షణ శాస్త్రవేత్త డా.అనూష

కోటబొమ్మాళి, ఆగస్టు 3, ప్రభాతవార్త

రైతులు ఈ ఏడాది నీటి ఎద్దడిని తట్టుకునే పంటలు, స్వల్పకాలిక రకాలను ఎంచుకొని పంటలను సాగు చేసుకోవాలని కెవికె అముదాలవలస సస్య రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ అనూష అన్నారు. ఆమె సోమవారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మండలం కురుడు, చౌదరి కొత్తూరు గ్రామ రైతులకు రైతుశిక్షణ కార్యక్రమం నిర్వహించి అనంతరం కూరగాయల సాగులను పరిశీలించారు. ఉద్యానశాఖ, మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ అఫ్ హార్టికల్చర్ సౌజన్యంలో ఎల్సీని ప్రభావం తగ్గించుటకై ఉద్యాన పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలు, కూరగాయలలో సస్య రక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో కూరగాయల పంటలలో రసం పీల్చే పురుగుల ఉధృతి పెరుగుతుందని, దానికి ముందస్తు జాగ్రత్తగా పసుపు, నీలరంగు అట్టలను అమర్చుకోవడం వలన తెగులు నివారించడానికి దోహదపడతాయని, అలాగే విత్తన శుద్ధి చేసుకోవడం వలన తెగుళ్లను, పురుగులను కూడా నివరించడానికి ముందస్తుగా దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి కె.సునీత, శాంతి అయిల్పామ్ మేనేజర్ కె.శ్రీనివాసరావు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, టీడీపీ నాయకులు బోర నాగభూషణరావు, తెలుగుదేశం పార్టీ కురుడు పంచాయతీ ఉపాధ్యక్షులు గంగు సుదర్శనరావు, టీ ఎన్ టి యు సి టెక్కలి నియోజకవర్గం అధ్యక్షుడు జి.నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల ఉదారత చాటిన చింతామణి ట్రస్ట్

కవిటి, ఆగస్టు 3 ప్రభాతవార్త

కవిటి పంచాయతీ పరిధిలోగల పేద ఉత్తమ విద్యార్థులకు ఉన్నత చదువుల నిమిత్తమై శ్రీ చింతామణి ట్రస్ట్ హైదరాబాద్ వారు ఇందిరా దేవి కుమారుడు మణికుమార్ 2 లక్షల రూపాయలు అందించే కార్యక్రమం సోమవారం చేపట్టారు. కవిటి పంచాయతీ పరిధిలో గల పేద ఉత్తమ విద్యార్థులు (బీటెక్, పాలిటెక్నిక్, ఇతరత్రా)కు శ్రీ చింతామణి ట్రస్ట్ హైదరాబాద్ వారు ప్రతి ఏటా ఆర్థికంగా ఆదుకుంటుంటారు. అందులో భాగంగా సోమవారం 9 మంది ఉత్తమ విద్యార్థులకు రెండు లక్షల రూపాయలు ఆర్థిక సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి బి.రమేష్, మాజీ సర్పంచులు పూడి లక్ష్మణరావు, పాండవ చంద్రశేఖర్, ఆరంగి మధు, బి.వెంకటేశ్వంరావు ఉషోదయ సంఘం ప్రతినిధులు ఆరంగి త్రివిక్రమరావు, పోల్లాయి లక్షణమూర్తి, మొగిలిపురి కృష్ణారావు, మొగిలిపురి సీతారాం, వజ్జా రంగారావు, బెందాళం రంగారావు, కవిటి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సింహాచలం నాయుడు, హెచ్ఎం నెయ్యిల విశ్వనాథం, ఉపాధ్యాయులు బాలక శ్రీనివాస్, పి.వాసుదేవరావు, తెప్పల మోహన్‌రావు, గోరకల రామారావులతో పాటు పలువురు పాల్గొన్నారు.

దొంగిలించిన బంగారం ఆభరణాలను అప్పగించిన పోలీసులు

రాజాం, ఆగస్టు 3, ప్రభాతవార్త

మరిచర్ల భాగ్యలక్ష్మి, సూర్యనారాయణ, సతివాడ గ్రామం, తెర్లాం మండలం, సతివాడ గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి ఆమె భర్త సూర్యనారాయణ వీరిద్దరూ కలిసి సికింద్రాబాద్ నుండి రాజాం మీదుగా సత్తివాడు వెళుచుండగా, చీపురుపల్లి రైల్వే స్టేషన్‌లో ట్రైన్ దిగి, అక్కడ ఆటో ఎక్కి రాజాంలో దిగి వారి బ్యాగ్ చూసుకొనగా బ్యాగులో ఉన్న బంగారం 6 తులాలు కనిపించకపోవడంతో రాజాం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ దొంగలించిన బంగారు ఆభరణాలపై రాజాం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తులో భాగంగా సీసీటీవీ ఫుటేజ్ మరియు సాంకేతికత ఆధారంగా నేరం చేసిన వారు ఉత్తరప్రదేశ్ చెందిన గ్యాంగ్‌గా గుర్తించారు. దొంగిలించిన వారికోసం ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాలు మేరకు రాజాం ఎస్ఐ మహమ్మద్ సల్మాన్ బేగ్, విజయనగరం సిసిఎస్ బృందం మరియు రాజాం పోలీస్ సిబ్బంది ఉత్తరప్రదేశ్ వెళ్లి, దొంగిలించిన వారి వద్ద నుండి అభరణాలను స్వాధీన పరుచుకున్నారు. సోమవారం కోర్టు ఉత్తర్వులు మేరకు రాజాం పట్టణ సిఐ డి.నవీన్ కుమార్ బంగారం పోగొట్టుకున్న బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా బాధితులు సూర్యనారాయణ దంపతులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తూ ఎస్పీ దామోదర్, సిఐ నవీన్ కుమార్, మిగతా పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం

కొత్తూరు, ఆగస్టు 3, ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆదేశాల మేరకు, కురుగాం పి.హెచ్.సి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ పి.ప్రసన్న సహకారంతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పుష్పలత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకిరామయ్య విద్యార్థులకు కంటి పరీక్షలు పూర్తి చేశారు. ఈ శిబిరంలో మొత్తం 392 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 31 మంది విద్యార్థులకు దృష్టి లోపం ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. దృష్టి లోపంతో బాధపడుతున్న ఈ విద్యార్థులందరికీ అతి త్వరలోనే ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు కంటికి సంబంధించిన వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కురుగాం పి.హెచ్.సి వైద్య సిబ్బంది, ఏ ఎన్ ఎం విజయలక్ష్మి, ఆశా వర్కర్ గౌరిలతో పాటు కళాశాల లెక్చరర్లు కె.గోవిందరావు, రామరాజు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

కొత్తూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త :



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. దళితుల న్యాయమైన కోరికలు తీర్చాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. సిర్ల ప్రసాద్ మాట్లాడుతూ దళితులు నేటికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక వివక్షలతో పాటు స్మశాన వాటికలు, నివాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, సామాజిక భవనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ హక్కుల సాధన కోసం దళితులందరూ ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జస్టిస్ పున్నయ్య కమిటీ, కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను తక్షణమే అమలు చేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘం నాయకులు జి.రామారావు, వి.శంకర్, పి.రమేష్,సూర్యనారాయణ, రాజారావు, లక్ష్మీనారాయణ, వసంతరావు, రాజు పాల్గొన్నారు.

లిచీ.. లిచీ..

ఈ పేరెప్పుడైనా విన్నారా; అదో ఎర్రెర్రటి పండు తెలుపు మేళవింపుతో జెల్లీలా కనిపిస్తూ తెగ నోరూరిస్తాయి. ఎందుకంటే.. ఈపండ్లు మనకి బోలెడు ఆరోగ్య ప్రయోజనాలని అందిస్తాయి.

❖ చినుకులు మొదలయ్యాయి. వాటితోపాటే బోలెడు ఇన్‌ఫెక్షన్లూ పలకరిస్తాయి. వాటి బారిన పడొద్దంటే రోగనిరోధకత పెంచుకోవాల్సిందే. లిచీలో విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది. ఇది ఇమ్యూనిటీని పెంచడంలో సాయపడుతుంది. ❖ బి విటమిన్లు, ఫ్లావనాయిడ్లు సమృద్ధిగా ఉంటాయి. రక్తకణాల ఉత్పత్తికి ఇవి సాయపడతాయి. అందుకే నెలసరి మొదలైన అమ్మాయిలకు వీటిని తప్పక ఇవ్వమంటారు. ఇంకా మాంగనీస్, మెగ్నీషియం, కాపర్, ఐరన్, ఫోలేట్ వంటి ఖనిజలవణాలకు ఇది మంచి వనరు. పైగా రుచీ బాగుంటుంది. అందుకే ప్రెగ్నెన్సీ సమయంలో తప్పక ఇవ్వాల్సిన పండ్లలో వీటినీ ఒకటిగా చెబుతారు.

❖ వీటిల్లోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మంలోని ఫ్రీరాడి కల్స్‌తో పోరాడి, వృద్ధాప్య ఛాయలు త్వరగా దరిచేరకుండా కాపాడ తాయి

❖ విటమిన్-సి నల్లమచ్చలు, హైపర్ పిగ్మెంటేషన్‌ని తగ్గిస్తుంది. అందుకే స్కిన్‌కేర్ ఉత్పత్తుల్లోనూ దీనికి చోటిస్తారు. పైపూతల కంటే నేరుగా తీసుకోవడం మరింత మేలు కదా! అందుకే తరచూ ఆహారంలో చేర్చుకోండి. పైగా ఈ పండు బరువు తగ్గించడంలోనూ సాయపడుతుంది.

❖ ఇది మనసుకి చేసే మేలూ ఎంతో! దీని తీయనైన సువాసన అరోమా థెరపీలా పనిచేస్తుందట. విశ్రాంతి భావన కలిగించి, ఒత్తిడిని దూరం చేస్తుందట. అంటే వీటిని తినడం ద్వారా శరీరానికే కాదు.. మనసుకీ మేలు జరిగేలా చేయొచ్చన్న మాట. అయితే ఎంత నచ్చినా వీటినీ పరిమితంగానే తీసుకోవాలి. రోజుకి 7కి మించకుండా తినాలి. □

ధింతక...ధింతక.. 'ధింసా'!

భారతీయ గిరిజన నృత్య సంప్రదాయానికి నీరాజనం అందిన వేళ. ఒక పక్క గిన్నీస్ ఆఫ్ రికార్డు స్వయంగా ఆస్వాదించి అభినందించగా , మరో పక్క సాక్షాత్తు భారతీయ సాహితీ వికాసానికి , జానపద సంప్రదాయాలను విశ్వవ్యాప్తికి పెద్దపీట వేసే భారత ప్రధానినరేంద్ర మోడీ ఆశీస్సులు లభించాయి. మొన్న భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ఉత్తరాంధ్రకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి 13 వేల మందికి పైగా గిరిజన మహిళలు, విద్యార్థినులంతా ఒకే రంగు చీరలు ధరించి, గిరిజన వస్త్రధారణ, ఆహార్యంతో లయబద్ధంగా 'ధింసా' నృత్యం చేస్తూ ఘనస్వాగతం పలికారు. టెర్మినల్ భవనం నుంచి సభావేదిక వద్దకు ప్రజలకు అభినందనలు తెలుపుతూ జీపులో వెళుతున్న ప్రధాని ఈ ప్రదర్శనను ఎంతో ఆసక్తికరంగా తిలకించారు.

చప్పట్లు కొడుతూ వారిని అభినందించారు. 'ధింసా నృత్యాన్ని రికార్డు స్థాయిలో ప్రదర్శించడం వెనుక ఎందరో కళామతల్లుల అంకితభావం నిండి ఉంది. ఈ నృత్యంలో పాల్గొన్న 13 వేల మందినీ గుర్తించా కనే రికార్డు సాధించినట్టు 'గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్' ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవానికి, భారతీయ గిరిజన సమాజాల, సమూహాల, నృత్య సంప్రదాయాలకు ఈ సందర్భం అద్భుత ప్రదర్శనగా ఆవిష్కరించబడింది. □

మూడు తరాల కాన్పుల 'హస్తవాసి'

విజయవంతంగా చేసే మహిళా డాక్టర్లకైనా మంత్రసానులకయినా రాణింపు కలిగిందంటే వారి 'హస్తవాసి' మంచిదని చెప్పుకోవడం పరిపాటి. ఒకనాటి అమ్మమ్మల కాలంలో మంత్రసానులే ప్రసవాలు చేయించేవారు. ప్రస్తుత కాలంలో మహిళా డాక్టర్ల కోసం వెదికే వారంతా అనుభశాలురైన మహిళా డాక్టర్ల కోసం వెదికే వారంతా అనుభవ శాలు లైన మహిళా డాక్టర్ల కోసం అన్వేషణ ప్రారంభిస్తున్నారు. ఆధునిక కాలంలోనైతే గర్భిణుల నిరంతర ఆరోగ్య పర్యవేక్షణ ఔషధ యాజమాన్యం డాక్టర్ల చేతిలో ఉంటే ప్రత్యేక ప్రసవాలు కొత్తపుంతలు తొక్కుతున్నాయి. డాక్టర్లు, నర్సుల బృందాలు సైతం అప్రమత్తంగా ఉండాల్సి వస్తోంది. ఆడపిల్లల చదువుకు అంతగా ప్రాధాన్యతలేని రోజుల్లో ఓ మధ్యతరగతి కుటుంబంలోని ఆడకూతురు వైద్య వృత్తినభ్యసించాలని నడుంకట్టింది. అది 1950వ దశకంలోని మాట. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సూరి శ్రీమతి ఆమె 1958లో ఉస్మానియ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేశారు. ఆపై గైనకాలజీలో స్పెషలైజేషన్ చేసారు. ప్రస్తుత ఆమెకు 92 ఏళ్లు మూడు తరాల మహిళలకు ప్రసూతి సేవలందిం చారు. తన గుమ్మం వద్దకు కాన్పుల కోసమో వైద్య సేవలకొచ్చిన వారిని కుదరదని వెళ్లగొట్టే మనస్తత్వం కాదామెది. భగవంతుడు ఓపిక ఇచ్చిన లక్ష్యం నెరవేరాలిగా అంటుందామె. ఆమె వివాహం చేసుకోలేదు. సోదరుడి ఇంట్లోనే ఉంటారు. శేష జీవితం కూడా మహిళలకు ప్రసూతి సేవలు అందిస్తూనే ఉంటానని ఎంతో ధీమాగా చెప్పారు శ్రీమతి. తనను కోరి వచ్చిన గర్భిణులను పరీక్షించి ఆరోగ్య పరిస్థితులను విశ్లేషించి వైద్య సలహా చెప్పకుండా కాదనలేనని. ఇప్పటికీ యోగా చేయడమే తన ఆరోగ్య రహస్యమని శ్రీమతి వివరిస్తుంటారు. □

అధరాల కోసం.. స్క్రబ్స్ !

చర్మం తేమను కోలోనవవడం వల్ల ఆ ప్రభావం పెదాలపై కూడా పడుతుంది. తద్వారా పెదాలు పొడిబారిపోయి నిర్జీవమైపోతాయి. అలాంట ప్పుడు ఈ న్యాచురల్ లిప్ స్క్రబ్స్‌ని ఉపయోగిస్తే పెదాలు తిరిగి మెరుపును సంతరించుకుంటాయి.

ౣ అర టీస్పూన్ చొప్పున దాల్చిన చెక్క పొడి, తేనె, ఆలివ్ నూనె తీసుకొని బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని పెదాలపై రాసి మునివేళ్లతో మృదువుగా మర్దన చేయాలి. కాసేపటి తర్వాత గోరువెచ్చటి నీళ్లతో కడిగేసుకొని లిప్ బామ్ రాసుకుంటే సరిపోతుంది. ౣ రెండు టేబుల్‌స్పూన్ల చొప్పున కమలాఫలం తొక్కల పొడి, బ్రౌన్ షుగర్ తీసుకొని అందులో కొన్ని చుక్కల బాదం నూనె వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమంతో 30 సెకన్ల పాటు పెదాలపై మర్దన చేసుకొని కడిగేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే సరిపోతుంది. తేనె, బ్రౌన్ షుగర్.. వీటిని టేబుల్‌స్పూన్ చొప్పున తీసుకోవాలి. ఇందులో కొన్ని చుక్కల లావెండర్ నూనె కలిపి పెదాలపై రాసుకోవాలి. రెండు నిమిషాల పాటు నెమ్మదిగా మర్దన చేసి ఆపై కడిగేసుకుంటే పెదాలు మృదువుగా మారతాయి. బరకగా ఉన్న కాఫీ పొడి, తేనె.. ఈ రెండింటినీ టేబుల్‌స్పూన్ చొప్పున తీసుకొని బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమంతో పెదాలపై నెమ్మదిగా మర్దన చేసుకొని రెండు నిమిషాల తర్వాత కడిగేసుకుంటే పొడిబారిన పెదాలు మెరుపును సంతరాంచుకుంటాయి. కొన్ని గులాబీ రేకల్లో పచ్చి పాలు పోస్తూ పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ మిశ్ర మంతో పెదాలపై కాసేపు మృదువుగా రుద్దుకొని కడిగేసుకుంటే ఇటు పెదాలు తేమను తిరిగి పొందడంతో పాటు అటు మంచి రంగులోకి వస్తాయి. □

'సుందర కాండ'

జీవితంలో ముందుకు వెళ్లాలంటే తలపెట్టిన కార్యాలు ఎన్నో సఫలీకృతం కావాలి. ఎన్నో కష్టాలుపడి పూనుకున్న కార్యాలు సఫలీకృతం కావాలంటే, అందుకు భగవంతుడి అనుగ్రహం కావాలి. భగవంతుడి అనుగ్రహంతోనే 'కల' నిజమవుతుంది .. ఆశ నెరవేరుతుంది .. నిరీక్షణ ఫలిస్తుంది. ఒక్కోసారి తలపెట్టిన కార్యాలకి అనేక రకాల అవరోధాలు ఎదురవుతూ ఉంటాయి. ఆ ఆటంకాలను .. అవరోధాలను దాటుకుని ముందుకు వెళ్లడం చాలా కష్టమవుతుంటుంది.ఆ కార్యాన్ని మధ్యలో వదిలేయడం వలన వచ్చే నష్టం ఎక్కువగా ఉం టుంది. పూర్తి చేయడా నికి అవసరమైన వనరులు అందుబాటు లోకి రాక నిరాశ నిస్పృహలకు లోనవడం జరుగుతూ ఉంటుంది. అలాంటి పరిస్థితు ల్లోనే 'సుందర కాండ' పారాయణం చేయాలనేది మహర్షుల మాట. శ్రీరామ చంద్రుడు తనకి అప్పగించిన కార్యాన్ని ఎన్ని ఆటంకాలు ఎదురైనా లెక్కచేయక హనుమంతుడు సాధించుకు వచ్చాడు. అలాంటి హనుమంతుడిని అంకిత భావంతో పూజిస్తూ .. సేవిస్తూ 'సుందరకాండ'’సుందరకాండ' పారాయణం చేయడం వలన ఆయన ప్రీతి చెందుతాడు. ఫలితంగా అడ్డంకులు తొలగి పోయి కార్యసిద్ధి కలుగుతుందని ఆధ్యాత్మిక గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి □

చిలగడ దుంప సగ్గుబియ్యం అప్పాలు

కావల్సినవి: చిలగడదుంపలు: నాలుగుసగ్గుబియ్యం: కప్పుఅల్లం: మీడియం సైజ్ ముక్కపచ్చిమిరప కాయలు: నాలుగు కొత్తిమీర తరుగు: అరకప్పుకరివేపాకు: గుప్పెడుబియ్యప్పిండి: టేబుల్ స్పూన్‌నూనె: రెండు టేబుల్ స్పూన్లుఉప్పు: తగినంత

తయారీ: చిలగడ దుంపలను శుభ్రంగా కడిగి ముక్కలు చేసి, కుక్కర్లో ఉడకబెట్టుకోవాలి. తర్వాత చెక్కు తీసి పక్కకు పెట్టుకోవాలి. మరోపక్క సగ్గుబియ్యాన్ని నీళ్లలో ఒక గంట సేపు నానబెట్టుకోవాలి. ఇప్పుడు నీళ్లను ఒంపేసి, ఆ సగ్గుబియ్యంలో ఇందాక ఉడకబెట్టుకున్న చిలగడ దుంపల ముక్కలను మెత్తగా మెదిపి వేయాలి. అల్లం పచ్చి మిరపకాయలు ముద్ద చేసి పెట్టుకోవాలి. కరివేపాకును కడిగి సన్నగా తరగాలి. కొత్తిమీరను కూడా సన్నగా తరిగి పక్కకు పెట్టుకోవాలి. ఇప్పుడు సగ్గుబియ్యం మిశ్రమంలో వీటి తరుగు, అల్లం పచ్చిమిర్చి ముద్ద, బియ్యప్పిండి, ఉప్పు వేసి గట్టిగా కలుపుకోవాలి. అవసరం అనుకుంటే కొద్దిగా నీళ్లు చిలకరించుకుంటే సరి. ఇప్పుడు గుంత పొంగణాలు చేసే మూకుడును తీసుకొని ఆ గుంటల్లో కొద్దిగా నూనె రాసి ఈ మిశ్రమాన్ని నింపాలి. ఒకవైపు కాలాక మరోవైపు తిప్పుకొని మళ్లీ నూనె వేసి కాల్చుకోవాలి. బంగారు వన్నెలో వేగితే రుచికి బాగుంటాయి. వీటిని కొత్తిమీర కారం, టమాట సాస్‌లతో నంజుకుని తినొచ్చు! □

తెర

'చెన్నై లవ్ స్టోరీ' ప్రశంసలే అసలైన విజయం: దర్శకుడు రవి నంబూరి సత్తా

ప్రేక్షకుల ఆదరణే అసలైన విజయం.. ఒక మంచి సినిమాను ప్రేక్షకులకు సరైన రీతిలో అందించగలిగాననే నమ్మకం ఈ విజయం కలిగించిందని రవి నంబూరి తెలిపారు. బాక్సాఫీస్ వసూళ్ల కంటే ప్రేక్షకుల ప్రశంసలు, భావోద్వేగ అనుబంధమే తనకు మరింత సంతృప్తినిచ్చిందన్నారు.

సాయి రాజేష్ ఇచ్చిన అవకాశమే జీవితాన్ని మార్చింది..
ఈ కథను సాయి రాజేష్ స్వయంగా తనకు చెప్పారని, కథలోని భావోద్వేగాలు, సవాలు తనను బాగా ఆకట్టుకోవడంతో వెంటనే దర్శకత్వ బాధ్యతలు స్వీకరించినట్లు వెల్లడించారు.

డైలాగ్ రైటర్‌గా వచ్చిన ప్రశంసలు ప్రత్యేకం..
ఈ సినిమాకు డైలాగ్స్‌కు వస్తున్న ప్రశంసలు తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చాయని చెప్పారు.

కిరణ్ అబ్బవరం పూర్తి నమ్మకం ఇచ్చారు..హీరో కిరణ్ అబ్బవరం ఈ చిత్రంలోని స్టీవెన్ శంకర్ పాత్రకు పూర్తి న్యాయం చేశారని ప్రశంసించారు.

.మణిశర్మ సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది..మెలోడీ బ్రహ్మ మణిశర్మ ఈ సినిమాకు అతిపెద్ద బలమని రవి నంబూరి అన్నారు. ప్రతి సన్నివేశాన్ని తన రీ రికార్డింగ్‌తో మరో స్థాయికి తీసుకెళ్లారని చెప్పారు.

.పాండిచ్చేరి షెడ్యూల్ పెద్ద సవాల్..ఇంటర్వెల్ యాక్సిడెంట్ సీన్‌ను పాండిచ్చేరిలోని ఒరిజినల్ రోడ్లపై చిత్రీకరించడం, క్లైమాక్స్ లో డాగ్ సీక్వెన్స్‌ను సహజంగా తెరకెక్కించడం చిత్రబృందానికి అతిపెద్ద సవాల్‌గా నిలిచిందన్నారు.

ప్రేక్షకులే సమాధానం చెప్పారు..
విడుదలైన తొలి రోజు సెకండ్ హాఫ్‌పై కొంతమంది అభిప్రాయా లు వ్యక్తం చేసినప్పటికీ, తర్వాత కథలోని ట్విస్ట్‌ను అర్థం చేసుకుని వచ్చిన ప్రేక్షకులు అదే భాగాన్ని మరింతగా ఆస్వాదించారని రవి నంబూరి తెలిపారు.

ఇండస్ట్రీ నుంచి ప్రశంసల వెల్లువ..
సినిమా చూసిన తర్వాత హీరో సంతోష్ శోభన్, దర్శకుడు శైలేష్ కొలను సహ పలువురు సినీ ప్రముఖులు ఫోన్ చేసి అభినందించడం తనకు ఎంతో ప్రోత్సాహాన్నిచ్చిందన్నారు.

తదుపరి చిత్రం కూడా ఎస్‌కేఎన్‌తోనే..
తనకు తొలి అవకాశాన్ని ఇచ్చిన ఎస్‌కేఎన్‌పై ప్రత్యేక కృతజ్ఞత ఉందని, అందుకే తదుపరి చిత్రాన్ని కూడా ఆయన నిర్మాణంలోనే తెరకెక్కించనున్నట్లు వెల్లడించారు.

'అగధ' ట్రైలర్ లాంచ్

నా శ్వాస ఉన్నంత వరకు సినిమాలు తీస్తూనే ఉంటాను 'అగధ'ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఎం.ఎస్. రాజు...'అగధ'లో అద్భుతమైన కథతో పాటు స్క్రీన్ ప్లే కొత్తగా ఉంటుంది ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఎం.ఎస్. రాజు.. శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద అజయ్ కేఆర్ సమర్పణలో కాశీ విశాలాక్షి బలుసు నిర్మాణంలో ఎం.ఎస్.రాజు తెరకెక్కించిన చిత్రం అగధ. ఈ మూవీలో కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్‌కుమార్, భాను చందర్, షిజు, వనిత విజయ్‌కుమార్, రోషన్ బషీర్, శ్రేయా రాణి రెడ్డి, వివా రాఘవ, రాబర్ట్ మాస్టర్, ఆర్నా ములేర్, కనకవ్వ ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సినిమాని ఆగస్ట్ 14న భారీ ఎత్తున విడుదల చేబోతున్నారు. ఈ క్రమంలో సోమవారం నాడు ట్రైలర్‌ను గ్రాండ్‌గా రిలీజ్ చేశారు. ఎం.ఎస్. రాజు మాట్లాడుతూ..'అగధ' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ట్రైలర్ అందరికీ నచ్చే ఉంటుందని భావిస్తున్నాను. అజయ్, కాశీ విశాలాక్షి ఈ ప్రయాణంలో నాకెంతో సపోర్ట్ చేశారు. 'ఆరిజిన్ ఆఫ్ అగధ' కూడా చాలా వైరల్ అయింది. ముమ్ముందు ఈవెంట్లలో టీం అందరికీ గురించి చెబుతాను. ఆగస్ట్ 14న 'అగధ'రిలీజ్ కాబోతోంది. కామాక్షి భాస్కర్ల మాట్లాడుతూ.. డిఫరెంట్ కారెక్టర్స్‌ను పోషించాలని ప్రతీ నటికి ఉంటుంది. 'పొలిమేర' తర్వాత మళ్లీ ఆ స్థాయి పాత్ర నాకు లభించలేదు. కానీ రాజు గారు ఈ 'అగధ' కథ, అందులో నా పాత్రను చెప్పిన తర్వాత ఆశ్చర్యపోయాను. నటిగా మళ్లీ నన్ను నేను ప్రూవ్ చేసుకోవడానికి చక్కటి అవకాశం లభించింది. శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ.. 'అగధ'జర్నీ నాకెంతో ప్రత్యేకం. నేను ఎప్పుడూ సింపుల్ సినిమాల్ని చేయలేదు. రాజుమీద నాకు నమ్మకం ఉంది. ఆయనున్నుంచి మేం ఎంతో నేర్చుకున్నాం. 'డర్టీ హరి' తర్వాత 'అగధ'లో నాకు మంచి పాత్రను ఇచ్చారు. కాశీ విశాలాక్షి మాట్లాడుతూ.. అగధ చిత్రీకరణ సమయంలో నేను కూడా సెట్‌కి వెళ్లాను. ప్రతీ ఒక్కరూ అద్భుతంగా నటించారు. ..ఉల్కా గుప్తా మాట్లాడుతూ.. రాజు గారు చెప్పిన 'అగధ' కథ నాకు ఎంతో నచ్చింది. పదేళ్ల తర్వాత మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తుండటం ఆనందంగా ఉంది. జోవికా విజయ్ కుమార్ మాట్లాడుతూ.. మాకు రాజు ఫ్యామిలీ మెంబర్‌లా ఉంటారు.

'దొంగ నా కొడుకు' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల

ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ పెద్ద స్టార్ హీరోలతో గ్రాండ్ ఎంటర్‌టైనర్స్ చేస్తూనే, మరోవైపు కొత్త టాలెంట్‌తో కంటెంట్ బేస్డ్ సినిమాలను నిర్మిస్తోంది. తాజాగా మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌ను ప్రకటించింది. 'లిటిల్ హార్ట్స్' చిత్రంతో ప్రశంసలు అందుకున్న మౌళి తనూజ్ ప్రసాంత్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీను కంబాల దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. తాజాగా మేకర్స్ ఈ సినిమా 'దొంగ నా కొడుకు' అనే క్రేజీ టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. 'దొంగ నా కొడుకు' అనే టైటిల్ వినగానే అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. వినూత్నంగా డిజైన్ చేసిన లోగో సినిమా ఫన్, ఎంటర్‌టైనింగ్ టోన్‌ను పరిచయం చేస్తోంది. ఇక ఫస్ట్ లుక్ పోస్టర్‌లో భారీ జాక్ ప్లేయింగ్ కార్డ్ నుంచి చిరునవ్వుతో స్టైలిష్‌గా ఎంట్రీ ఇస్తున్న మౌళి లుక్ ఆకట్టుకుంటోంది. ఆయన బాడీ లాంగ్వేజ్ చూస్తుంటే... సరదా మనస్తత్వం ఉన్న యువకుడు వరుసగా జరిగే కామెడీ, దొంగతనాల నేపథ్యంలో సాగే థ్రిల్లింగ్ సంఘటనల్లో చిక్కుకోబోతున్నాడనే ఆసక్తిని కలిగిస్తోంది. ప్లేయింగ్ కార్డ్ కాన్సెప్ట్ సినిమాకు యూనిక్ విజువల్ ఐడెంటిటీని తీసుకొచ్చింది. పోస్టర్‌లో కనిపించే బ్లాక్ బ్యాక్‌ప్యాక్, చెల్లాచెదురుగా పడిన బంగారు నగలు, గాలిలో ఎగురుతున్న కాగితాల ముక్కలు వంటి విజువల్ ఎలిమెంట్స్ కథలోని దొంగతనం కాన్సెప్ట్‌ను ఆసక్తికరంగా సూచిస్తున్నాయి. ఈ క్రియేటివ్ పోస్టర్ సినిమాపై మరింత క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ చిత్రాన్ని నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తుండగా, అనిల్ ఎర్నేని సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో సుష్మిత శెట్టి, అలీ, రాజిత, రఘుబాబు, ప్రియ, గుండు సుధర్శన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

'ఇరుముడి' సాంగ్ 'యాలాలో యాలాలో' రిలీజ్

మాస్ మహారాజా మోస్ట్ ఎవైటెడ్ కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'ఇరుముడి' ప్రమోషన్స్ తో ఉత్సాహాన్ని పెంచుతోంది. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం, తన భక్తి గీతమైన మొదటి పాట 'ఇరుముడి కట్టు'తో ఇప్పటికే ప్రేక్షకులను ఆకట్టుకుంది. అదే జోరును కొనసాగిస్తూ, కుటుంబ బంధాలలోని ఆప్యాయతను అందంగా చాటిచెప్పే రెండవ పాట 'యాలాలో యాలాలో'ను చిత్ర బృందం విడుదల చేసింది. జీవీ ప్రకాష్ కుమార్ స్వరపరిచిన ఈ పాటకు ఆయన అందించిన సాఫ్ట్ మెలోడీ, ఆర్కెస్ట్రేషన్ ప్రత్యేక ఆకర్షణ గా నిలిచాయి. అనంత శ్రీరామ్ రాసిన సాహిత్యం మధ్యతరగతి కుటుంబంలోని ప్రేమ, అనుబంధాలు, ఆప్యాయతలే అసలైన సంపద అనే భావాన్ని హృదయానికి హత్తుకునేలా చెబుతుంది. హెషామ్ అబ్దుల్ వహాబ్, సాధికా కెఆర్ ఆలపించిన తీరు పాటకు మరింత భావోద్వేగాన్ని జోడించింది. ఈ పాట ద్వారా సినిమా ఎమోషనల్ కోర్‌ను కూడా మేకర్స్ చూపించారు. రవితేజ కుటుంబాన్ని ప్రాణంగా ప్రేమించే ఓ ఆటో డ్రైవర్‌గా కనిపిస్తారు. మద్యానికి బానిసైనప్పటికీ కుటుంబం కోసం తపించే తండ్రి పాత్రలో ఆయన సహజమైన నటన ఆకట్టుకుంటోంది. ప్రియ భవాని శంకర్ కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకునే భార్య పాత్రలో మెప్పించగా, బేబీ నక్షత్ర తండ్రితో విడదీయలేని అనుబంధం ఉన్న కూతురిగా మనసుని తాకింది. పాటలోని ప్రతి విజువల్, ప్రతి ఎమోషన్ సాహిత్యానికి అద్భుతంగా తోడై కుటుంబ బంధాలను ఎంతో సహజంగా చూపించింది. ఈ పాట విడుదలైన వెంటనే ప్రేక్షకులకి ఫేవరేట్‌గా మారింది

50 రోజుల విజయోత్సవాన్ని జరుపుకున్న 'ఎల్‌జీబీటీ - ఏ లీగల్ బ్యాటిల్' చిత్ర బృందం

ఎల్‌జీబీటీ పార్ట్2కు తెలంగాణ ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తాం - మంత్రి అడ్లూరి లక్ష్మణ్..సామాజిక అంశాన్ని హృదయానికి హత్తుకునేలా ఆవిష్కరించి ప్రేక్షకుల ప్రశం సలు అందుకున్న 'ఎల్‌జీబీటీ - ఏ లీగల్ బ్యాటిల్' చిత్రం విజయవంతంగా 50 రోజుల ప్రదర్శన పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్ర యూనిట్ ఘనంగా విజయోత్సవ సమావేశాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి చిత్ర నటీనటులు, సాంకేతిక నిపుణులతో పాటు పలువురు ప్రముఖులు హాజరై చిత్ర బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ... ఈ సమాజంలో ట్రాన్స్‌జెండర్స్‌కు కూడా గౌరవప్రదమైన జీవితం ఉండాలనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిఆలోచన అని అన్నారు. అందులో భాగంగానే తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కొన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో ట్రాన్స్‌జెండర్స్‌కు ప్రాధాన్యం కల్పిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా దర్శకుడు పి. సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... ప్రేక్షకులు తమ చిత్రాన్ని విశేషంగా ఆదరించి 50 రోజుల విజయాన్ని అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ చిత్రం ద్వారా ప్రతి మనిషిని గౌరవించే భావన సమాజంలో పెరగాలని తాము కోరుకున్నామని, ప్రేక్షకులు ఆ సందేశాన్ని ఆదరించినందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రిన్స్ పిక్చర్స్ కొత్త సినిమా

ప్రిన్స్ పిక్చర్స్ మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించింది. హీరో కార్తీ, ప్రముఖ దర్శకుడు మోహన్ రాజా కాంబినేషన్‌లో కొత్త సినిమా అనౌన్స్ చేసింది. ఎస్. లక్ష్మణ్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రం కుటుంబ భావోద్వేగాలతో పాటు హీరోయిజాన్ని అద్భుతంగా మేళవించిన ఎంటర్‌టైనర్‌గా రూపొందనుంది. కార్తీ, మోహన్ రాజా కలిసి పనిచేయడం ఇదే తొలిసారి. ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌లో కార్తీకి ఇది వరుసగా నాలుగో చిత్రం. ఇంతకుముందు 'దేవ్', 'సర్దార్', 'సర్దార్ 2' చిత్రాల తర్వాత మరోసారి ఈ బ్యానర్‌తో ఆయన చేతులు కలపడం విశేషం. ముఖ్యంగా 'సర్దార్ 2' విడుదలకంటే ముందే ఈ కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించడం కార్తీ, ప్రిన్స్ పిక్చర్స్ మధ్య ఉన్న బలమైన అనుబంధానికి నిదర్శనం. ఈ సినిమాపై కేవలం ప్రకటనతోనే సినీ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. బలమైన భావోద్వేగాలు, కమర్షియల్ ఎలిమెంట్స్‌ను మేళవిస్తూ మంచి సినిమాలు తెరకెక్కించే దర్శకుడిగా పేరు తెచ్చుకున్న మోహన్ రాజా, ఈ చిత్రంలో కార్తీని మరో కొత్త, పవర్‌ఫుల్ అవతార్‌లో చూపించబోతున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక బృందం, రెగ్యులర్ షూటింగ్ తదితర వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు.

భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు: ఎమ్మెల్యే శ్రీమతి లోకం మాధవి

భోగాపురం,ఆగస్ట్ 3 ప్రభాతవార్త

భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని ఘన విజయవంతం చేసిన నెల్లిమర్ల నియోజకవర్గ ప్రజలకు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, ప్రభుత్వ యంత్రాంగం, మీడియా ప్రతినిధులు, స్వచ్ఛంద సేవకులు, అలాగే ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ నెల్లిమర్ల శాసనసభ్యురాలు లోకం మాధవి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ మహత్తర కార్యక్రమాన్ని చారిత్రాత్మక విజయంగా నిలిపిన ఘనత ప్రజలదేనని పేర్కొన్నారు. ప్రజలు చూపిన విశేష ఆదరణ, అంకితభావం, క్రమశిక్షణ, సమన్వయం, సహకారం కార్యక్రమ విజయానికి ప్రధాన కారణమని అన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి శ్రమించిన ప్రతి ఒక్కరి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. నియోజకవర్గ ప్రజలు తనపై ఉంచిన విశ్వాసం, చూపుతున్న ప్రేమాభిమానాలు తనకు మరింత బాధ్యతను పెంచాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని మరింత అంకితభావంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం ఉత్తరాంధ్ర అభివృద్ధి చరిత్రలో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ విమానాశ్రయం ద్వారా పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాలతో పాటు ఉపాధి అవకాశాలు విస్తరించి, ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. చివరిగా, ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ మరోసారి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ, ప్రజల ఆశీర్వాదం, సహకారంతో నెల్లిమర్ల నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యేలోకం మాధవి పేర్కొన్నారు.

గురుకుల విద్యార్థి రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలు ఎంపిక

బొబ్బిలి, ఆగస్టు 3 ప్రభాతవార్త:

జిల్లా అథ్లెటిక్ పోటీలలో బొబ్బిలి గురుకుల బాలుర పాఠశాలకు చెందిన ఐదు మంది విద్యార్థులు వివిధ అంశాల్లో రాష్ట్రస్థాయి పోటీలు ఎంపిక కాపడ్డారని కళాశాల ప్రిన్సిపాల్ శంకర్రావు తెలియజేశారు. ఈ పోటీలకు 8 9 10 వ తరగతి విద్యార్థులు 16 మంది పాల్గొనగా ఐదుగురు విద్యార్థులు వివిధ అంశాల్లో అథ్లెటిక్స్ పోటీల్లో ఎంపికయి రాష్ట్రస్థాయి పోటీలకు వెళుతున్నారని అన్నారు. సందీప్ 600 మీటర్లు 60 మీటర్లు లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం పొందారని అన్నారు. టి థామస్ షార్ట్ బుక్ ప్రథమ స్థానం పొందారని అన్నారు. మున్నా షాట్ పుట్ ద్వితీయ స్థానం పొందారు. జస్వినీత్ కుమార్ షాట్ పుట్ ద్వితీయ స్థానం వరుణ్ తేజ హైజం మూడో స్థానం పొందాడని మీరంతా రాష్ట్రస్థాయికి ఎంపిక కాబడం మా పిఈటి కృషికి అభినందనీయమని అన్నారు. 12 13 తేదీల్లో తిరుపతిలో రాష్ట్రస్థాయి పోటీలు ఎంపికలు నిర్వహిస్తారని డి.ఎస్.బి శంకర్రావు. తెలియజేశారు

డీఎస్సీ-2025 అవకతవకలపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం

సమగ్ర విచారణ జరిపి అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ -వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చిన్న శ్రీను

విజయనగరం, ఆగస్టు 3 ప్రభాతవార్త

డీఎస్సీ–2025 ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో చోటుచేసుకున్న అవకతవకలు, పరీక్ష నిర్వహణలో జరిగిన లోపాలు, అభ్యర్థులకు జరిగిన అన్యాయంపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతూ విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాజీ ఎమ్మెల్యే సంభంగి చిన్నప్పల నాయుడు బొత్స అప్పలనరసయ్య బడుకొండ అప్పలనాయుడు కడుబండి శ్రీనివాసరావు రాజాం నియోజకవర్గ సమన్వయకర్త తలై రాజేష్, నియోజకవర్గ పరిశీలకులు స్వాతిరాణి నాయుడు బాబు కె.వి. సూర్యనారాయణ రాజు జగన్మోహన్ రావు తదితర ముఖ్య నాయకులతో కలిసి ఈరోజు విజయనగరం జిల్లా కలెక్టర్ వినతిపత్రం అందజేశారు. చిన్న శ్రీను మాట్లాడుతూ, డీఎస్సీ–2025 నియామక ప్రక్రియలో పారదర్శకత పూర్తిగా లోపించిందని, వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. పరీక్ష నిర్వహణ నుంచి ఫలితాల విడుదల వరకు అనేక సందేహాలు, అభ్యంతరాలు వ్యక్తమవుతున్నప్పటికీ ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదన్నారు. వినతిపత్రంలో డీఎస్సీ–2025 పరీక్షల్లో చోటు చేసుకున్న అక్రమాలు, అభ్యర్థులు నుంచి వచ్చిన అభ్యంతరాలు, ఫలితాల్లో నెలకొన్న అనుమానాలు, పరీక్ష నిర్వహణలో ఏర్పడిన సాంకేతిక లోపాలు, నియామక ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం, మెరిట్ జాబితా రూపకల్పనలో వచ్చిన అభ్యంతరాలు వంటి అంశాలను సమగ్రంగా వివరించినట్లు తెలిపారు. అలాగే టీచర్ పోస్టుల భర్తీలో అభ్యర్థులకు జరిగిన అన్యాయంపై హైకోర్టు పర్యవేక్షణలో లేదా స్వతంత్ర ఉన్నతస్థాయి కమిటీతో సమగ్ర విచారణ జరిపించాలని, విచారణ పూర్తయ్యే వరకు వివాదాస్పద నియామక ప్రక్రియపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ పరీక్ష నిర్వహణలో లోపాలకు కారణమైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అభ్యర్థుల ఫిర్యాదులను అధికారికంగా స్వీకరించి వాటిపై నిష్పాక్షిక విచారణ చేపట్టాలని వినతిపత్రంలో కోరారు.అదేవిధంగా మెరిట్, అర్హత ఆధారంగానే నియామకాలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటాన్ని కొనసాగిస్తుందని చిన్న శ్రీను స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన, విద్యార్థి విభాగాల నాయకులు, పాల్గొన్నారు.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య

గరివిడి, ఆగస్టు 3,ప్రభాతవార్త

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వెదుళ్లవలస గ్రామంలో చోటుచేసుకుంది. వెదుళ్లవలసకి చెందిన మన్నెపురి పైడి నాయుడు(60) అనే వ్యక్తి నిత్యం మద్యం సేవిస్తూ ఉండేవాడు.ఆరోగ్యం సరిగా లేదు, మద్య సేవనం వలన అనారోగ్యంతో బాధపడుతున్నారు. పని చేయవు అంటూ ఆయన భార్య మన్నెపురి లక్ష్మి మందలించింది. భార్య మందలించిందని మనస్తాపానికి గురైన పైడి నాయుడు ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అపస్మారక స్థితిలో వెళ్లిన ఆయనను తొలుత చీపురుపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అనంతరం విజయనగరం కేంద్ర ఆసుపత్రికి మెరుగైన చికిత్సకు తరలించిన నప్పటికీ చికిత్స పొందుతూ సోమవారం పైడి నాయుడు తెల్లవారుజామున మృతి చెందారు. గరివిడి ఎస్ఐ ఎంవి రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తగ్గుతున్న జలాశయం నీటిమట్టం..

ప్రస్తుతం184అడుగులు -ఆందోళనలో రైతులు

శృంగవరపుకోట, ఆగస్టు3, ప్రభాతవార్త

మండల పరిధి సమీపంలో ఉన్న తాటిపూడి జలాశయం నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 297అడుగులు కాగా ప్రస్తుతం 184అడుగులు ఉంది.గత ఏడాది ఇదే సమయంలో సుమారు 292అడుగులు నీటిమట్టం ఉందని తెలుస్తుంది. ఈఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో పడవకపోవడంతో నీటిమట్టం పెరుగుదలపై ప్రభావం ఏర్పడే అవకాశం ఉంది.ప్రస్తుతం జలాశయంలోకి ఇన్ ఫ్లో ఐదు సెక్యుల నీరు వస్తుందని అలాగే అవుట్ ఫ్లో 205 క్యూసెక్కుల నీరును విడుదల చేస్తున్నట్లు తాటిపూడి జలాశయం ఏఈ కె.శంకర్ తెలిపారు. జలాశయం దిగువన సుమారు 15వేల ఎకరాలకు సాగునీరు అలాగే విశాఖ,విజయనగరం జిల్లాలకు సంభందించి తాగునీటిని అందించాల్సి ఉంది. ప్రస్తుతం వర్షాలు కురవకపోవడం జలాశయంలో ఇన్ ఫ్లో తగ్గడంతో ఇటు సాగునీరు, అటు తాగునీరుకు ఇటు రైతులు అటు ప్రజలు రానురాను ఇబ్బందులు ఎదుర్కొంటునే అవకాశం ఉందని తెలుస్తుంది.

ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ తప్పనిసరి : జిల్లా కలెక్టర్

పార్వతీపురం, జూలై 04, ప్రభాతవార్త

ప్రభుత్వ ఉద్యోగులు మారుతున్న కాలానికి అనుగుణంగా తమ నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని, ప్రభుత్వం నిర్దేశించిన ఆన్‌లైన్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోర్సులను తప్పనిసరిగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. వివిధ శాఖల్లో ఇప్పటికీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోని ఉద్యోగుల వివరాలను పరిశీలించిన కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యాశాఖ పంచాయతీ ఇంజనీరింగ్ మెడికల్ అండ్ హెల్త్ తదితర శాఖల ఉద్యోగులు వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని, వచ్చే సోమవారం నాటికి 100% రిజిస్ట్రేషన్లు సాధించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. జులై ఆఖరు నాటికి ఉద్యోగులందరూ కనీసం 54 ఆన్‌లైన్ కోర్సులను పూర్తి చేసి ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ?అలాగే పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, సెకండరీ హెల్త్, యానిమల్ హస్బెండ్రీ, అగ్రికల్చర్, ఎక్సైజ్ శాఖల అధికారులు కూడా తమ పరిధిలోని సిబ్బంది చేత నిర్దేశిత కోర్సులను పూర్తి చేయించాలని సూచించారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సంబంధిత ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోనాల్సి వస్తుందని అన్నారు. ప్రతి నెలా అన్ని శాఖల అధికారులతో ఈ కోర్సుల ప్రగతిపై ప్రత్యేకంగా రివ్యూ నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

గెడ్డను కప్పేస్తున్న అక్రమార్కులపై చర్యలు చేపట్టాలి

టిడిపి నాయకుడు చక్రధర్ డిమాండ్

నెల్లిమర్ల, ఆగస్టు 3, ప్రభాతవార్త

మండలంలోని కొత్తపేట గ్రామ చెరువులో మట్టిని అక్రమంగా తవ్వడంతోపాటు, ఆ మట్టితో వేలాది ఎకరాలకు సాగునీరు అందిస్తున్న కొండవాగు గెడ్డను కప్పి వేస్తున్న వైసీపీ నాయకుడుపైన, అతని అనుచరులపై రెవెన్యూ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని టిడిపి మండల కమిటీ ప్రధాన కార్యదర్శి గురాన చక్రధర్ డిమాండ్ చేశారు. సాగునీటిని గెడ్డను అక్రమంగా కప్పివేత జరుగుతున్న ప్రాంతాన్ని ఆయన పలువురు రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. దశాబ్దాలు కాలం నుంచి ఈ గెడ్డ ద్వారా వెదుళ్ల చెరువు, మొగలు చెరువు, ఎర్ర చెరువు, బంధల ద్వారా సుమారు 2000 ఎకరాలకు సాగునీరు అందుతుందని, అక్రమార్కులు తమ సొంత లేఔట్ కోసం ఈ గెడ్డను కప్పివేస్తు న్నారని చక్రధర్ ఆరోపించారు. సుమారు 30 అడుగుల వెడల్పుకు పైగా ఉన్న ఈ గెడ్డను ఇప్పటికే మట్టితో సుమారు పది అడుగుల వరకు కప్పేసారని ఫలితంగా రైతుల లబోదిబోమంటున్నారని ఆయన ఆరోపించారు. కొండవాగు గెడ్డను అత్యంత దారుణమని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని చక్రధర్ అన్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లామని ఆయన వివరించారు. నిందితులపై అధికారులు చర్యలు తీసుకోకపోతే ఉద్యమానికి సైతం వెనుకాడబోనని చక్రధర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సువ్వాడ రమణ,పలువురు యువకులు రైతులు పాల్గొన్నారు.

సంక్షేమం అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం : చింతల రామకృష్ణ

రామభద్రపురం, ఆగష్టు3,ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర అభివృద్ధితో పాటు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పరిపాలన కొనసాగిస్తున్నారని, అభివృద్ధి, పథకాల అమలు గురించి ప్రతీ ఒక్కరికీ తెలియాలని, మరలా రాష్ట్రం ఆర్థికంగా, ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాలు అమలు కావాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని, అందుకు అందరూ సహకరించాలని తెలుగుదేశం పార్టీ మాజీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామక్రిష్ణ అన్నారు.తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రామభద్రపురం పూడివీధి,పోలవీదిలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పెద్దగెడ్డ నీటి సంఘం ఛైర్మన్ పూడి రామినాయుడు, బొబ్బిలి ఏయమ్సీ డైరెక్టర్ మూడడ్ల క్రిష్ణ,గ్రామ తెదేపా అధ్యక్షుడు కనిమెరక వెంకటి,నల్ల భాస్కరరావు,చింతల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేదవానికి ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యం

కొమరాడ ఆగస్టు 3 ప్రభాతవార్త

ప్రతి పేదవానికి ప్రభుత్వ పథకాలు అందిం చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే టీ జగదీశ్వరి అన్నారు. సోమవారం గుమడ ,సీతమాంబ పురం గ్రామాలలో రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం పై డోర్ టు డోర్ కార్యక్రమా న్ని తెలుగుదేశం మండల పార్టీ కన్వీనర్ ఉదయ శేఖర్ పాత్రుడు అధ్యక్షతన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సామాజిక పించనులను పెంచడంతోపాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రైతులకు అన్నదాత సుఖీభవ పథకం తల్లికి వందనం వంటి పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేశారని అన్నారు.కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించడమే ధ్యేయంగా సీఎం , డిప్యూటీ సీఎం పనిచేస్తున్నారని అన్నారు. అంతేకాకుండా గ్రామాలలో సిసి రోడ్లు కాలువలు తోపాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు. ఇందులో భాగంగానే గత రెండేళ్లలో గుమడ పంచాయతీలోరూ 60 లక్షలకు పైగా నిధులతో సిసి రోడ్లు కాల్వలను నిర్మించడం జరిగిందన్నారు. తెల్లారా రానున్న స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. అనంతరం గుమడ సీతమాంబ పురం గ్రామంలో నిర్మించిన సిసి రోడ్లను ఆమె ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు వెంకటేష్ తోపాటు తెదేపా నాయకులు డి వెంకట నాయుడు మధుసూదన్ రావు పి వెంకట్ నాయుడు సుదర్శన్ రావు భాను, రాఘవేంద్రరావు, కృష్ణం నాయుడు, తమ్మయ్య ,నూకరాజు బురిడీ కాళిదాస్, శ్రీనివాస్, హరి ప్రసాద్ సిహెచ్ అప్పలనాయుడు గాంధీ తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్ దళితులకు కనీససౌకర్యాలు కల్పించాలి

సాలూరు ఆగష్టు3 ప్రభాతవార్త

సాలూరు పట్టణ 7 ఇంకా 8 వార్డుల్లో నివాస ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలని సామాజిక శంఖారావం లో భాగంగా కెవిపిఎస్,డివైఎఫ్ఐ అలాగే సిఐటియు నాయకులు డిమాండ్ చేసారు. ఈ మేరకు ఆ వార్డుల సమస్యలు పరిశీలించి వారు మాట్లాడుతు ఇక్కడ సుమారు150 దళిత కుటుంబాలు మున్సిపల్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు.అలాగే వారికి సంబందించిన స్మశాన వాటిక పిచ్చిమొక్కలు, తుప్పలతో నిండి ఉందని కనీస అవసరాల కోసం ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీ సప్లై నిధులు కేటాయించాలని కోరారు. అంతేకాకుండా కార్మికులు ఉంటున్న కాలనీలో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అలాగే కమ్యూనిటీ భవనం మధ్యలోనే నిలిచి పోయిందని తెలిపారు.కాబట్టి రెండు వార్డుల్లో సమస్యలు తక్షణమే పరిష్కారించాలని డిమాండ్ చేశారు.లీడర్లు టి.వాసు, జి.శంకర్, ఎన్.వై.నాయుడు టి.రాముడు, వెంకటరావు, శంకరరావు,రవి,శ్రీను మధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మరణించిన.. జీవించండి : డాక్టర్ మిర్యాల కృష్ణారావు

చీపురుపల్లి ఆగస్టు 3 ప్రభాత వార్త

మరణించిన ప్రతి ఒక్కరూ మరొకరికి జీవితాన్ని అందించగలరని అఖిల భారత అవయవ శరీర దాతల సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సైకాలజిస్ట్ డాక్టర్ మిరియాల కృష్ణారావు అన్నారు.జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా సోమవారం నాడు చీపురుపల్లి పట్టణ పరిధిలోని శ్రీనివాస కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణించిన జీవించండిలి " అనే నినాదంతో.. రక్తదానంతో ప్రాణాలను కాపాడండి, బ్రెయిన్ డెడ్ అయినప్పుడు అవయవ దానముతో అభాగ్యులను ఆదు కోండి, అని పిలుపునిచ్చారు.. మరణించిన పిదప నేత్రదానముతో అంధులకు చూపునివ్వండి,శరీర దానంతో వైద్య విద్యార్థులకు జ్ఞాన సమపార్చనకు సహకరించండి అని కోరారు. అనంతరం కళాశాలలోని విద్యార్థులతో చర్చించి పలు అంశాల పట్ల అవగాహన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఏ .డి .ఎస్ .వి .ప్రసాద్. మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అవయవదానంపై అవగాహన ఏర్పరచుకొని అందరికీ తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్‌పిఓలు కళాశాల విద్యార్థులు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు పుట్టిన బిడ్డలకు ఎంతో శ్రేయస్కరము

పాచిపెంట ఆగస్టు 3 ప్రభాతవార్త

తల్లి పాల పుట్టిన పిల్లలకు ఎంతో శ్రేయస్కరమని పాచిపెంట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని బొత్స అనంతలక్ష్మి అన్నారు. మండలంలో తల్లిపాలు వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా పాచిపెంట మండలం లో మడవలస,, తేట్టెడువలస, రాయిగూడ్డి వలస, పణుకువలస అంగన్వాడీల పరిధి లో తల్లి పాలు వారోత్సవాలు కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ, ఆశా వర్కర్లతో కలిసి అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పి.ఓ మాట్లాడుతూతల్లిపాలు ప్రాము ఖ్యతను పిల్లల తలలకు వివరించారు. పుట్టిన గంటలోపల ప్రతి బిడ్డకు వెం టనే ముర్రుపాలు అందించడం వల్ల రోగనిరోధక శక్తి, సంపూర్ణ పోషణ లభిస్తుందన్నారు. పిల్ల లకు తల్లిపాలు అమృతంతో సమానమని ఆమె అన్నారు . ఆరు నెలలు వరకు నవజాత శిశువుకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. దీంతో బిడ్డకు పోషకాహారం, మానసిక వికాసం, ఊబ కాయం, డయాబెటీస్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. అదనపు ఆహారంతో పాటుగా 2 ఏళ్ల వరకు తల్లిపాలు పిల్లలకు ఇవ్వడం అవసరమన్నారు. ఇది తల్లికి బ్రెస్ట్ కాన్సర్ రాకుండా, కుటుంబ నియంత్రణ సాధనంగా ఉపయోగపడుతుంది. విధులకు వెళ్లే వారు 6 గంటల పాటు తల్లి పాలు తీసుకుని పెట్టవచ్చున్నారు. ఆధునిక ఫ్యాషన్లతో తల్లిపా లకు పిల్లలను దూరం చేయొద్దన్నారు.ఈ కార్యక్రమం లో పాచిపెంట ప్రాజెక్ట్ ఐసిడిస్ సీడీపీఓ బి.అనంతలక్ష్మి పి.పార్వతి, సిహెచ్. అరుణ కుమారి, ఆర్ .ఇందిరా, ఏ. జ్యోతి , పాచిపెంట టాటా ట్రస్ట్ ప్రోగ్రాం అసోసియేట్ ఎం.విజయ్ కుమార్, అంగన్వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణీలు, కమ్యూనిటీ సభ్యులు, తల్లులు, ప్రీ స్కూల్ తల్లులు హాజరయ్యారు.

విజయనగరం
పార్వతీపురం మన్యం
వార్త 25

వర్షపునీరు సంరక్షణపై అవగాహన

కురుపాం ఆగస్టు2ప్రభాతవార్త

వర్షపు నీరు సంరక్షణపై విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కుమారస్వామి తెలిపారు. సోమవారం కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. కుమారస్వామి ఆధ్వర్యంలో వర్షపు నీరు సంరక్షణ ,నీటి వనరులసంరక్షణ, భూ గర్భ జలాల అభివృద్ధి, ఇంకుడు గుంతలు ఆవశ్యకత పచ్చదనం పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలు పై అవగాహన కల్పిస్తూ పుర వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం లో భాగంగా మొక్కలు నాటి వాటి సంరక్షణ కు అవసరం అయిన చర్యలు చేపట్టారు కార్యక్రమం లో ప్రిన్సిపాల్ తో పాటు ఎన్. ఎస్. ఎస్ 1,2 యూనిట్ల ప్రోగ్రాం అధికారులు ఏ. రామమోహన్ రావు, ఎం. రమేష్ కుమార్, ఆధ్యాపకులు మురళీకృష్ణ, ఎల్లం నాయుడు, లక్ష్మణరావు, స్వప్న, నిర్మలజ్యోతి, సతీష్ చంద్ర,తారక్, రామరాజు, రామకృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో వర్షపు నీరు ఒడిసి పట్టండి పై అవగాహన ర్యాలీ

బలిజిపేట ఆగస్టు 3 ప్రభాతవార్త

బలిజిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం బలిజిపేట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రభుత్వ జూనియర్ కళాశాల సుమారు 220 మంది విద్యార్థులు తో ఎన్ ఎస్ ఎస్ యూనిట్ వన్ పిఓ బి మురళీధర్ రావు మరియు ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 పిఓ పి వాసు బాబు ఆధ్వర్యంలో వర్షపు నీరు ఒడిసి పట్టండి అనే అవగాహన ర్యాలీ నిర్వహించారు మరియు మానవహారాన్ని చేపట్టారు ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ టి మాధవి లత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతి నీటి బొట్టు ను శుభ్రపరచాలని వాడుకోవాలని మరియు భద్రపరచాలని తెలిపారు వృధా చేయవద్దని ప్రజలకు తెలిపారు ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పివి గోపికృష్ణ మరియు అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నష్టపరిహారం కోసం పరిశీలన

మెరకముడిదాం, ఆగస్టు 3, ప్రభాత వార్త

మండలంలో ఇటీవల ఏనుగుల సంచారంతో పంటను నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించేందుకు అధికారులు సర్వే మొదలు పెట్టారు. సోమవారం మండలంలో రామయ్య వలస రెవెన్యూ పరిధిలో అటవీ శాఖ అధికారులతో రెవెన్యూ సిబ్బంది పంట నష్టాన్ని పరిశీలించారు. రామయ్య వలస కు చెందిన దండు కృష్ణవేణి కొబ్బరి తోటలో సుమారుగా 60 కొబ్బరి మొక్కలు ఏనుగులు ధ్వంసం చేసి దవ్వను తినడం జరిగింది. పంట నష్ట పరిహారంపై సర్వే మొదలెట్టడంతో నష్టపోయిన రైతులు ప్రభుత్వం నుండి నష్టపరిహారం వస్తుందని ఆశాభావంతో ఉన్నారు. ఈ పరిశ్రమలో వీఆర్వో ఆదినారాయణ, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలు ఆరోగ్యానికి తల్లిపాలు అవసరం

దత్తి రాజేరు ఆగస్టు 3 ప్రభాతవార్త

పిల్లలు ఆరోగ్యానికి ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో అవసరమని అంగన్వాడి సూపర్వైజర్ ఇంద్ర భవాని తెలిపారు చిన్నకాద గుచ్చిమి గ్రామాల్లో తల్లిపాలు వారోత్సవాలను అంగన్వాడి కేంద్రాల్లో సోమవారం ఘనంగా చేశారు గర్భిణీ బాలింతలకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డలకు ఆరు నెలల వరకు కచ్చితంగా ఇవ్వాలన్నారు తల్లిపాలు వల్ల రోగనిరోధక శక్తి పెరిగి తల్లి పిల్లలకు అనుబంధాన్ని బలపరుస్తాయి అన్నారు మురుపాలు ఇవ్వడం వల్ల తల్లి పిల్ల ఆరోగ్యం ఉంటారని తెలిపారు తల్లిపాలు వల్ల పిల్లలకు సులభంగా జీర్ణ హై కడుపు నొప్పి విరోచనాలు సమస్యలు రాకుండా ఉంటాయన్నారు శరీరం దృఢత్వంగా మృదువుగా ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు జ్యోతి ఏఎన్ఎం సింహాచలం ఆశా కార్యకర్తలు గర్భిణీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉల్లివలస వాసి దుర్మరణం

గరివిడి, ఆగస్టు 3, ప్రభాత వార్త

గరివిడి ప్రధాన రహదారి, ఆదర్శ డిగ్రీ కళాశాల వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో జి.సిగడాం మండలం ఉల్లి వలస గ్రామానికి చెందిన బెల్లాన నరసింహ మూర్తి అనే వ్యక్తి దుర్మరణం చెందారు. ఉల్లివలస నుండి చీపురుపల్లి మీదుగా గరివిడి బైకు పై వెళుతున్న నరసింహ మూర్తి తన బైకు అదుపు తప్పి రోడ్డు పై పడటంతో ఆయన తలకు బలమైన గాయమైంది. గాయపడ్డ ఆయనకు తొలుత చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించినప్పటికి పరిస్థితి మెరుగవ్వని స్థితిలో విజయనగరం కేంద్ర ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో సోమవారం మృత్యువాత పడ్డారు. గరివిడి ఏ ఎస్ ఐ ఎం వి రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మౌలిక వసతులపైన దృష్టి సారించండి : డిడిఓకే హేమ సుందర్

చీపురుపల్లి ఆగస్టు 3. ప్రభాతవార్త

ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల పైన పంచాయతీల వారీగా అధికారులు దృష్టి సారించాలని చీపురుపల్లి డి డి ఓ కే హేమ సుందర్ అధికారులకు సూచించారు. సోమవారం నాడు తన కార్యాలయంలో పంచాయతీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేకించి గ్రామాలలో త్రాగునీరు, వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్యం, తదితర అంశాల పట్ల పంచాయతీ అధికారుల దృష్టి సారించాలని కోరారు. అదే విధముగా గ్రామ పంచాయతీ పరిపాలన అంశములు మరియు మౌలిక వసతులైన త్రాగునీరు, పారిశుద్ధ్యం వీధి దీపాల నిర్వహణ లోపాలు సవరించుటకు సూచనలు ఇవ్వడం జరిగినది. అలాగే రికార్డు లు మరియు రిజిస్టర్ల నిర్వహణ , నిధులు మరియు బిల్లుల కేటాయింపు లు, చెత్త నుండి సంపద కేంద్రం వద్ద 45 రోజుల యాక్షన్ ప్లాన్ కొరకు సూచనలను ఇచ్చారు. ఈ సమావేశం లో డిప్యూటీ ఎంపిడిఓ అప్పలనాయుడు, చీపురుపల్లి మండలము పంచాయతీ అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

"పార్టీలు చూడకుండా కష్టంలో ఉన్నవారికి సహాయం చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యం: ఎమ్మెల్యే బేబీనాయన"

బొబ్బిలి ,ఆగస్టు3, ప్రభాతవార్త;

బొబ్బిలి నియోజకవర్గ ప్రజలకు అన్నివేళలో అండగా ఉంటూ, కొందరు పౌరుల ఆరోగ్య సమస్యలు ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 57 మంది లబ్ధిదారులకు రూ.40,42,368 ఆర్థిక సహాయం అందేలా కృషి చేసి, సీఎం సహాయ నిధి చెక్కులను శాసనసభ్యులు ఆర్.వీ.ఎస్.కే.కే. రంగారావు (బేబీ నాయన) బుడా చైర్మన్ మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు బొబ్బిలి కోటలో అందజేశారు.ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి పెద్ద కొడుకు అని మరొకమారు నిరూపించుకున్నారు.. సీఎం సాయనిధి ద్వారా మన నియోజకవర్గానికి రూ.40,42,368లను మంజూరు చేసి మన నియోజక వర్గంపై వారికి ఉన్నఅభిమానాన్ని చూపించారన్నారు. సీఎం సహాయనిధిని విషయంలో పార్టీలు చూడకుండా, కేవలం వారికి వచ్చిన కష్టాన్ని మాత్రమే చూస్తూ ఆసుపత్రుల ద్వారా చేయదగిన సహాయం చేస్తున్నామని అలాగే, సీఎం సహాయనిధి ద్వారా కూడా సహకారం అందిస్తున్నామన్నారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి మన నియోజకవర్గం తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. బుడా చైర్మన్, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు మాట్లాడుతూ, 2014–19 మధ్యలో జిల్లాలో అత్యధికంగా సీఎం సహాయనిధి ఎస్.కోటకు వచ్చిందని, ఇప్పుడు మళ్లీ మన నియోజక వర్గానికే ఎక్కువ నిధులు వస్తున్నాయని అందుకు కారణం ఎమ్మెల్యే బేబీనాయన అని కొనియాడారు.. అమరావతి వెళ్ళినప్పుడల్లా ప్రతి ఫైలును వారితో తీసుకెళ్లి సీఎంతో సంతకం చేయించుకుంటున్నారని ప్రజాసేవలో ఆయనకి అలసట లేకుండా పనిచేస్తున్నారని ముఖ్యమంత్రి కూడా బేబీనాయన అన్ని విధాల సహకరిస్తున్నారని, అందువలనే ఎటువంటి జాప్యం జరగకుండా సీఎం సహాయనిధి నిధులు మంజూరు అవుతున్నాయన్నారు.. పార్టీలను చూడకుండా కింద స్థాయి నాయకులు కూడా ప్రతిఒక్కరికీ సహకరించాలని క్యాడర్‌కి సూచించారు

04-08pg10.qxd:04-08pg10.qxd 1/1/02 6:20 AM Page 1

ఆట

టీమిండియాకు గాయాల షాక్

విజయవకాశాలపై తీవ్ర ప్రభావం.. మెడికల్ టీంపై బిసిసిఐ వేటు

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టును వరుస గాయాలు తీవ్రంగా వేధిస్తున్నాయి. జట్టుకు అవసరమైన సమయంలో కీలక ఆటగాళ్లంతా జట్టుకు దూరమవుతున్నారు. ఈ గాయాలు భారత విజయవకాశాలను తీవ్ర ప్రభావితం చేస్తున్నాయి. లంక పర్యటనకు ముందు స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాతో పాటు, నితీష్ కుమార్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్ గాయాలతో జట్టుకు దూరమయ్యారు. ఐపీఎల్ 2026 సీజన్ తర్వాత హార్దిక్ పాండ్యా ఇప్పటి వరకు ఒక్క అంతర్జాతీయ మ్యాచ్ ఆడలేదు. యువ పేసర్ ప్రిన్స్ యాదవ్ ఇటీవలే గాయపడ్డాడు. ఇలా ఆటగాళ్లు తరుచూ గాయాలతో దూరమవుతుండటంపై బిసిసిఐ అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా టీమ్ ఫిజియో బృందంపై ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. టీమ్ వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఆటగాళ్లు తరుచూ గాయపడుతున్నారని, వారి ఇంజ్యూరీ మేనేజ్‌మెంట్ సరిగ్గా లేదనే యోచనలో ఉంది.

ఈ క్రమంలోనే శ్రీలంక పర్యటన తర్వాత హెడ్ ఫిజియోథెరపిస్ట్ కమలేశ్ జైన్, టీమ్ డాక్టర్ రిజ్వాన్ ఖాన్‌లపై వేటు వేసేందుకు బీసీసీఐ సిద్ధమైంది. ఆటగాళ్లు తరుచూ గాయాల బారిన పడటం వల్ల కెప్టెన్ శుభ్‌మన్ గిల్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సరైన కాంబినేషన్‌ను ఎంచుకోవడంలో ఇబ్బంది పడుతున్నారు. 15 మంది సభ్యులు ఉన్నప్పటికీ సరైన కూర్పు చేయలేకపోతున్నారు. గాయాల విషయంలో ఫిజియోలు, డైరెక్టర్లకు పూర్తి అవగాహనతో పాటు స్పష్టతతో ఉండాలి. ఆటగాళ్లను తిరిగి మైదానంలోకి పంపేందుకు పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తేనే క్లియరెన్స్ ఇవ్వాలి. హడావుడిగా ఆడించడం వల్ల పరిస్థితి మళ్లీ మొదటికే వస్తుంది. నితీష్, హర్షిత్ రాణాలా విషయంలో ఇదే జరిగింది. ఇలాంటి తప్పిదాలు జట్టు విజయవకాశాలను దెబ్బతీస్తాయి. అందుకు టీమ్ మెడికల్ టీమ్ జవాబుదారీగా ఉండాల్సిందే. వారి నుంచి సరైన వివరణ లభించకపోతే, వారితో పాటు, ఫిట్‌నెస్ కోచ్‌పై కూడా వేటు పడే అవకాశాలు కన్పిస్తున్నాయి.

పాకిస్థాన్‌పై భారత్ ఘన విజయం

న్యూఢిల్లీ: జాంబియా వేదికగా జరుగుతున్న ఏషియన్ లీజెండ్స్ లీగ్‌లో ఇండియన్ రాయల్స్ జట్టు అద్భుత

విజయాన్ని నమోదు చేసింది. ఉత్కంఠభరితంగా సాగిన పోరులో పాకిస్థాన్ ప్యాంథర్స్ జట్టును 2 వికెట్ల తేడాతో భారత్ ఓడించింది. ఈ మ్యాచ్లో మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ లీజెండ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసి, భారత్ ముందు 168 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. పాకిస్థాన్ తరఫున ఇమ్రాన్ నజీర్ 29 బంతుల్లో 47 పరుగులతో రాణించగా, భారత బౌలర్లు చివరి ఓవర్లలో కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి వారిని తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. అనంతరం 168 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇండియన్ రాయల్స్ ఆరంభంలోనే ఓపెనర్లు నమన్ ఓజా, అభిషేక్ల వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే, ఆ తర్వాత వచ్చిన రిషి ధావన్ (33 బంతుల్లో 50 పరుగులు), సారుల్ (29 బంతుల్లో 46 పరుగులు) బాధ్యతాయుతంగా ఆడి ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. వీరిద్దరూ అవుటైన తర్వాత భారత జట్టు వరుసగా వికెట్లు కోల్పోయి మళ్లీ ఒత్తిడిలో పడినప్పటికీ, ఆఖరి వరుస బ్యాటర్లు బాధ్యతాయుతంగా ఆడి మరో 14 బంతులు మిగిలి ఉండగానే 17.4 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించారు. ఈ విజయంతో టోర్నీలో ఇండియన్ రాయల్స్ వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. కాగా అంతకుముందు జరిగిన తొలి మ్యాచ్‌లో భారత జట్టు బంగ్లాదేశ్ టైగర్స్ పై 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. జూలై 30న ప్రారంభమైన ఈ ఏషియన్ లీజెండ్స్ లీగ్ రెండవ సీజన్ ఫైనల్ మ్యాచ్ ఈ నెల 10న జరగనుంది. భారత్ జట్టులో శిఖర్ ధావన్, సురేష్ రైనా, హర్భజన్ సింగ్, దినేష్ కార్తీక్, అంబటి రాయుడు వంటి పలువురు దిగ్గజ ఆటగాళ్లు భాగస్వాములుగా ఉన్నారు.



క్రిస్టినాకు మెంఫిస్ టైటిల్

న్యూఢిల్లీ: రష్యాకు చెందిన 16 ఏళ్ల క్రిస్టినా లియుటోవా దార్జా విద్మానోవాను 1-6, 6-1, 6-3 తేడాతో ఓడించి, తన తొలి మెయిన్‌డ్రా ప్రదర్శనలోనే డబ్ల్యూటీఏ మెంఫిస్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. 2019లో లింజ్‌లో 15 ఏళ్ల కోకో గాఫ్ విజయం సాధించిన తర్వాత, డబ్ల్యూటిఏ టైటిల్ గెలిచిన అతి పిన్న వయస్కురాలైన క్రీడాకారిణిగా లియుటోవా నిలిచింది. ఆరంభంలో ఉన్న ఆందోళనను అధిగమించి రెండవ సెట్‌లో దూసుకుపోయిన ఆమె, మూడవ సెట్‌లో 4-0 ఆధిక్యంలో నిలిచింది. ఆ తర్వాత విద్మనోవా తన సర్వ్‌ను నిలబెట్టుకుని 4-1తో ఆధిక్యంలోకి వచ్చి, చివరకు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి 4-2తో ఆధిక్యంలోకి వెళ్ళింది. లియుటోవా వెంటనే బ్రేక్ బ్యాక్ చేసినప్పటికీ, తన సొంత సర్వ్‌పై లభించిన మూడు మ్యాచ్ పాయింట్లను కూడా గెలుచుకోలేకపోయింది. చివరకు చెక్ క్రీడాకారిణి సర్వ్‌ను బ్రేక్ చేసి విజయాన్ని ఖాయం చేసుకుంది. 250-స్థాయి ఈవెంట్‌లో లియుటోవా టైటిల్ గెలుచుకునే క్రమంలో, ఆమె టాప్‌సీడెడ్ ఎకటెరినా అలెక్సాండ్రోవా మరియు ఆరవ సీడెడ్ క్యాటీ మెక్‌నల్లీలపై విజయాలు సాధించింది. ప్రపంచ ర్యాంకింగ్‌లో 229వ స్థానంలో ఉన్న లియుటోవా, క్వాలిఫైయింగ్ రౌండ్ల ద్వారా డ్రాలో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. అలాగే ప్రపంచ ర్యాంకింగ్‌లో 714వ స్థానంతో సంవత్సరాన్ని ప్రారంభించిన లియుటోవా, ఇప్పుడు 126వ స్థానానికి చేరుకుంటుందని అంచనా.

మహిళా రెజ్లర్ల లైంగిక వేధింపుల కేసులో..

బ్రిజ్ భూషణ్‌కు క్లీన్‌చిట్

న్యూఢిల్లీ: మహిళా రెజ్లర్ల లైంగిక వేధింపుల కేసులో భారత రెజ్లింగ్ ఫెడరేషన్ మాజీ చీఫ్ బ్రిజ్ భూషణ్‌కు కోర్టు క్లీన్‌చిట్ ఇచ్చింది. ఫెడరేషన్‌కు చీఫ్‌గా పనిచేస్తున్న సమయంలో 2023 ఏప్రిల్‌లో ఆరుగురు మహిళా రెజ్లర్లు బ్రిజ్ భూషణ్ తమను లైంగికంగా వేధించాడని కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంతేకాదు జంతర్ మంతర్ వద్ద నిరసనలు చేపట్టారు. ఏప్రిల్ 28న అతడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో అతడిపై రెండు కేసులు నమోదయ్యాయి. ఒకటి లైంగిక వేధింపులు, పరువుకు భంగం కలిగించడం, వెంటపడటంపై ఫిర్యాదు కాగా. రెండోది మైనర్ రెజ్లర్ ఫిర్యాదు ద్వారా పోక్సో కేసు నమోదయ్యాయి. దీంతో అతడితో పాటు డబ్ల్యూఎఫ్ఐ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌లపై కేసు నమోదు చేశారు. ఈ కేసు అప్పట్లో సంచలనాన్ని సృష్టించింది. 32 మంది సాక్షుల వివరణ, నిందితుల వాంగ్మూలాలపై విచారణ చేపట్టింది కోర్టు. ఈ కేసులో బ్రిజ్ భూషణ్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు అడిషనల్ చీఫ్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ అశ్విని పన్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. 2025లో మైనర్ ఫిర్యాదుదారకు సంబంధించిన పోక్సో కేసులో ఢిల్లీ పోలీసులు సమర్పించిన క్లోజర్ రిపోర్ట్ (కేసును మూసివేసే నివేదిక)ను కూడా కోర్టు ఆమోదించింది. భారత క్రీడా రంగంలో అత్యంత ప్రముఖమైన కేసుల్లో ఒకటి అయిన ఈ కేసుకు ముగింపు పలికారు. కాగా మహిళా రెజ్లర్లు దీనిపై పై కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు.

హైదరాబాద్ క్రికెటర్ అఖిలేష్‌పై 8 యేళ్ల నిషేధం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ క్రికెట్‌లో మరోసారి మ్యాచ్ ఫిక్సింగ్ వ్యవహారం కలకలం రేపింది. భారత సంతతి, అమెరికా యువ క్రికెటర్ బొడుగుం అఖిలేష్ రెడ్డిపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఎనిమిదేళ్ల నిషేధం విధించింది. ఐసీసీ యాంటీ కరప్షన్ కోడ్‌లోని మూడు కీలక నిబంధనలను ఉల్లంఘించినట్లు యాంటీ కరప్షన్ ట్రిబ్యునల్ నిర్ధారించడంతో బోర్డు నిర్ణయం తీసుకుంది. 2025లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో జరిగిన అబుదాబి టీ10 టోర్నమెంట్‌లో మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడిన నేపథ్యంలో అఖిలేష్ రెడ్డిపై ఐసీసీ కఠిన చర్యలు తీసుకుంది. అఖిలేష్ శిక్షను 2025 నవంబర్ 21 నుంచే అమల్లోకి వచ్చినట్లుగా ఐసీసీ వెల్లడించింది. అదే రోజున అతడిని క్రికెట్ నుంచి తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. యూఏఈ క్రికెట్ బోర్డు తరఫున అబుదాబి టీ10 లీగ్‌కు డిజిగ్నేటెడ్ యాంటీ కరప్షన్ అధికారిగా ఐసీసీ వ్యవహరించింది. మ్యాచ్ ఫలితం, మ్యాచ్ తీరును అలేష్ ప్రభావితం చేసే ప్రయత్నం చేశాడని విచారణ అనంతరం ట్రిబ్యునల్ తేల్చింది.

అలాగే మరో ఆటగాడిని కూడా ఫిక్సింగ్‌కు ప్రేరేపించే ప్రయత్నం చేసినట్లు గుర్తించింది. ఈ కేసులో అత్యంత కీలకమైన ఘటన 2025 నవంబర్ 19న అబుదాబిలోని ఓ హోటల్‌లో చోటుచేసుకుంది. ఆస్పిన్ స్టాలియన్స్ జట్టు తొలి మ్యాచ్‌కు ముందు అఖిలేష్ తన సహచర ఆటగాడితో మాట్లాడాడని, బౌలింగ్ సమయంలో ఉద్దేశపూర్వకంగా ఎక్కువ పరుగులు ఇవ్వాలని కోరినట్లు విచారణలో వెల్లడైంది. జట్టు యాజమాన్యం సూచనల మేరకే ఈ ప్రతిపాదన చేశాడని కూడా ట్రిబ్యునల్ పేర్కొంది. అయితే సదరు ఆటగాడు ఫిక్సింగ్ ప్రతిపాదనను తిరస్కరించి వెంటనే ఐసీసీ యాంటీ కరప్షన్ యూనిట్‌కు ఫిర్యాదు చేశాడు. అనంతరం అఖిలేష్ ని మ్యాచ్‌కు ముందు తుది జట్టు నుంచి తప్పించారు. దర్యాప్తు సమయంలో అఖిలేష్ రెడ్డి తన మొబైల్ ఫోన్‌లోని వాట్సాప్ మెసేజెస్, కాల్ లిస్టును తొలగించిన విషయం కూడా వెలుగులోకి వచ్చింది. దర్యాప్తుకు సంబంధించిన కీలక ఆధారాలను ఉద్దేశపూర్వకంగానే తొలగించాడని తేల్చింది.

వాణిజ్యం

చైనా నుంచి 1 కోటి ఎఫ్‌డీఐ ప్రతిపాదనకు ఆమోదం

న్యూఢిల్లీ, ఆగస్టు 3: కేంద్రం ఈ ఆర్థిక సంవత్సరంలో చైనా నుంచి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ) ప్రతిపాదనల్లో కేవలం ఒకదానికి మాత్రమే ఆమోదం తెలిపింది. ఆ ప్రతిపాదన విలువ రూ.1 కోటి మాత్రమే. అదే సమయంలో హాంకాంగ్ నుంచి వచ్చిన 13 ఎఫ్‌డీఐ ప్రతిపాదనలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వీటి మొత్తం పెట్టుబడి విలువ రూ.610.42 కోట్లు అని డిపిఐఐటి డేటా వెల్లడించింది. భారతదేశంతో సరిహా

ద్దు పంచుకునే దేశాల నుంచి వచ్చే పెట్టుబడులకు ప్రభుత్వ ముందస్తు అనుమతి తప్పనిసరి అనే నిబంధనను కరోనా మహమ్మారి సమయంలో ప్రవేశపెట్టారు. భారతీయ కంపెనీలపై అవకాశవాద స్వాధీనాలు, కొనుగోళ్లను నిరోధించడమే ఈ విధానం ప్రధాన ఉద్దేశం.2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు మొత్తం 63 ఎఫ్‌డీఐ ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వీటి మొత్తం పెట్టుబడి విలువ రూ.10,292.67 కోట్లుగా నమోదైంది. ఆమోదం పొందిన పెట్టుబడుల విలువ పరంగా సింగపూర్ తొలి స్థానంలో నిలిచింది. ఆ దేశం నుంచి వచ్చిన ఐదు ప్రతిపాదనలకు రూ.3,259.88 కోట్ల పెట్టుబడులకు అనుమతి లభించింది. అనంతరం యునైటెడ్ కింగ్‌డమ్ నుంచి వచ్చిన ఐదు ప్రతిపాదనలకు రూ.2,477.67 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించగా, థాయ్‌లాండ్ నుంచి వచ్చిన రెండు ప్రతిపాదనలకు రూ.1,600 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ లభించింది. పాతికేళ్లలో చైనా నుంచి భారత్‌లోకి మొత్తం రూ.16,162.25 కోట్లు మాత్రమే పెట్టుబడులు వచ్చాయి. ఇది దేశంలో నమోదైన మొత్తం ఎఫ్‌డీఐ ఈక్విటీ ప్రవాహాల్లో కేవలం 0.32 శాతం మాత్రమే కాగా, పెట్టుబడులు పెట్టిన దేశాల్లో చైనా 23వ స్థానంలో ఉంది.

ముత్తూట్ మైక్రోఫిన్ ప్రమోటర్ పునర్వ్యవస్థీకరణకు సెబీ గ్రీన్‌సిగ్నల్

ముంబయి,ఆగస్టు3: ముత్తూట్ మైక్రోఫిన్‌లో ప్రమోటర్ పునర్వ్యవస్థీకరణకు సెబీ అనుమతి ఇచ్చింది. ఈ ప్రక్రియలో తప్పనిసరిగా చేపట్టాల్సిన ఓపెన్ ఆఫర్ నిబంధన నుంచి మినహాయింపు నిచ్చి వారసత్వ ప్రణాళిక అమలుకు బాటలువేసింది.సెబీ అనుమతి మేరకు ముత్తూట్ కుటుంబానికి చెందిన ఆరు ట్రస్టులు, ముత్తూట్ మైక్రోఫిన్ ప్రమోటర్ సంస్థ అయిన ముత్తూట్ ఫిన్‌కార్ప్లో పరోక్షంగా వాటాలను సొంతం చేసుకోనున్నాయి. ఈ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆరు కుటుంబ ట్రస్టులు ముత్తూట్ ఫిన్‌కార్ప్‌లో 63.35 శాతం వాటాను పొందనున్నాయి. ముత్తూట్ ఫిన్‌కార్ప్ లిస్టెడ్ సంస్థ అయిన ముత్తూట్ మైక్రోఫిన్‌లో 50.21 శాతం వాటాను కలిగి ఉంది.ఈ లావాదేవీ వల్ల ముత్తూట్ మైక్రోఫిన్‌పై నియంత్రణలో ఎలాంటి మార్పు ఉండదని సెబీ స్పష్టం చేసింది. అందువల్ల ప్రజా వాటాదారులకు తప్పనిసరిగా ఓపెన్ ఆఫర్ ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొంది. పునర్వ్యవస్థీకరణ అనంతరం ముత్తూట్ మైక్రోఫిన్‌లో ప్రమోటర్ల వాటా, ప్రజా వాటాదారుల వాటా యథాతథంగానే కొనసాగుతాయని తెలిపింది.సెబీ ప్రకారం, ఈ సవరించిన ప్రమోటర్ పునర్వ్యవస్థీకరణను ముత్తూట్ ఫిన్‌కార్ప్ ప్రతిపాదిత ఐపీఓకు అనుగుణంగా రూపొందించారు. ఇది పూర్తిగా కుటుంబ సభ్యుల మధ్య బహుమతి రూపంలో షేర్ల బదిలీ ద్వారా జరిగే అంతర్గత కుటుంబ వారసత్వ ప్రక్రియ మాత్రమేనని వివరించింది.

పేటీఎంలో రూ.2,000 కోట్ల బ్లాక్ డీల్

ముంబయి,ఆగస్టు 3: పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ షేర్లు మంగళవారం మార్కెట్లో పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షించే అవకాశముంది. సంస్థలో తొలి పెట్టుబడిదారులైన సైఫ్ పార్టనర్స్ మరియు ఎలివేషన్ క్యాపిటల్ తమ వాటాలో కొంత భాగాన్ని బ్లాక్ డీల్ ద్వారా విక్రయించాలని నిర్ణయించాయి. ఈ రెండు సంస్థలు కలిసి 1.49 కోట్ల షేర్లను మంగళవారం బ్లాక్ డీల్ ద్వారా విక్రయించనున్నాయి. ఈ లావాదేవీ విలువ సుమారు రూ.2,002 కోట్లుగా అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది పేటీఎం షేర్లలో జరిగే అతిపెద్ద సెకండరీ షేర్ విక్రయాల్లో ఇది ఒకటిగా నిలవనుంది.ఈ బ్లాక్ డీల్‌కు మోర్గాన్ స్టాన్లీ బ్యాంకర్‌గా వ్యవహరిస్తోంది. జూన్ త్రైమాసికం ముగిసే నాటికి సైఫ్ పార్ట్నర్స్ వద్ద పేటీఎంలో 3.63 శాతం వాటా ఉండగా, ఎలివేషన్ మారిషస్ కంపెనీ వద్ద 8.55 శాతం వాటా ఉంది. ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో పేటీఎం ఆర్థిక ఫలితాలు మెరుగ్గా నమోదయ్యాయి. కంపెనీ సమీకృత ఆదాయం (కన్సాలిడేటెడ్ రెవెన్యూ) గత త్రైమాసికంలోని రూ.2,264 కోట్ల నుంచి 8.1 శాతం పెరిగి రూ.2,448 కోట్లకు చేరింది.అదే సమయంలో కంపెనీ నికర లాభం 20 శాతం పెరిగి రూ.184 కోట్ల నుంచి రూ.220 కోట్లకు పెరిగింది. నిర్వహణ లాభం రూ.132 కోట్ల నుంచి 54 శాతం పెరిగి రూ.203 కోట్లకు చేరింది. దీంతో ఎబిడిటా మార్జిన్ 5.8 శాతం నుంచి 8.3 శాతానికి మెరుగుపడింది.

డిజిటల్ చెల్లింపులు తయారీ రంగానికి ఊతం

పన్ను చట్టాల్లో కేంద్రం కీలక మార్పులు

న్యూఢిల్లీ,ఆగస్టు 3: దేశంలో పెట్టుబడులు, తయారీ రంగం, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం విస్తృత స్థాయిలో పన్ను, నియంత్రణ సంబంధిత సంస్కరణలను తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదిత చట్టం ద్వారా ఆదాయపు పన్ను ఆర్డినెన్స్-2026 స్థానంలో కొత్త చట్టపరమైన నిబంధనలు అమల్లోకి రానున్నాయి.ప్రధాన ప్రతిపాదనల్లో భాగంగా డిజిటల్ చెల్లింపులపై విధించే ఛార్జీలకు సంబంధించిన చట్టపరమైన వ్యవస్థను పూర్తిగా పునర్వ్యవస్థీకరించాలని కేంద్రం భావిస్తోంది. ఇకపై ఏయే ఎలక్ట్రానిక్ చెల్లింపు విధానాలపై బ్యాంకులు, పేమెంట్ సిస్టమ్ ప్రొవైడర్లు ఎలాంటి ఛార్జీలు విధించకూడదో కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసే అధికారం కలిగి ఉంటుంది. ప్రస్తుతం ఆదాయపు పన్ను చట్టానికి అనుసంధానంగా ఉన్న విధానానికి బదులుగా ఈ కొత్త వ్యవస్థ అమల్లోకి రానుంది. ముఖ్యంగా డిజిటల్ లావాదేవీలపై వర్తించే మర్చంట్ డిస్కౌంట్ రేట్ విషయంలో చాలా కాలంగా ఉన్న అనిశ్చితికి ఈ చర్యతో స్పష్టత లభించే అవకాశం ఉంది.విదేశీ పెట్టుబడులను ఆకర్షించే దిశగా కూడా కీలక ప్రతిపాదనలు తీసుకొచ్చారు. నిర్దిష్ట షరతులకు లోబడి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు మరియు బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్ ప్రభుత్వ సెక్యూరిటీలలో పెట్టుబడుల ద్వారా పొందే వడ్డీ ఆదాయం, మూలధన లాభాలపై పన్ను మినహాయింపు కల్పించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది.తయారీ రంగానికి ఊతమివ్వడానికి, ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్ రంగంలో పెట్టుబడులను పెంచేందుకు, ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థలకు వ క్యాపిటల్ గూడ్స్ సరఫరా చేసే విదేశీ కంపెనీలకు ప్రస్తుతం ఉన్న పన్ను రాయితీలను 2040-41 ఆర్థిక సంవత్సరం వరకు పొడిగించాలని కేంద్రం యోచిస్తోంది.అదేవిధంగా, భారతదేశంలో కాంట్రాక్ట్ తయారీ కోసం కస్టమ్స్ బాండెడ్ గిడ్డంగుల్లో విడిభాగాలను నిల్వ చేసే విదేశీ కంపెనీలకు కూడా 2040-41 వరకు పన్ను మినహాయింపు ఇవ్వాలని ప్రతిపాదించింది. నోటిఫై చేసిన ప్రత్యేక జోన్ల ద్వారా ముడి వజ్రాలను విక్రయించే విదేశీ డైమండ్ మైనింగ్ కంపెనీలు మరియు అనుబంధ సంస్థలకు కూడా 2040-41 వరకు పన్ను మినహాయింపు కల్పించనున్నారు. కొత్త పన్ను విధానాన్ని ఎంచుకునే స్పెషల్ పర్పస్ వెహికిల్స్‌పై ప్రస్తుతం ఉన్నదానికంటే అధికంగా 25 శాతం సర్‌చార్జ్ విధించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది.

ఆర్బీఐ ఎంపిసి సమీక్ష!

5న ద్రవ్య విధాన నిర్ణయాలు వెల్లడి

ముంబయి,ఆగస్టు 3: ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ మూడు రోజుల సమావేశం సోమవారం ప్రారంభమైంది. సమావేశం ముగిసిన అనంతరం ఆగస్టు 5న ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ద్రవ్య పరపతి విధాన నిర్ణయాలను ప్రకటించనున్నారు. అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితులు ఉన్నప్పటికీ, ఈ సమావేశంలో రెపో రేటును ప్రస్తుత 5.25 శాతంవద్దే కొనసాగించే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు.ద్రవ్యోల్బణం ఇటీవలి నెలల్లో కొంత పెరుగుతున్నప్పటికీ, అది ఇప్పటికీ ఆర్‌బీఐ నిర్దేశించిన భద్రతా పరిమితులలోనే కొనసాగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సగటు ద్రవ్యోల్బణం 5.1 శాతంగా ఉంటుందని ఆర్‌బీఐ ఇప్పటికే అంచనా వేసింది. ఈ అంచనాలో కూడా పెద్దగా మార్పులు ఉండే అవకాశాలు కనిపించడం లేదు.ఈ సమావేశంలో రెపో రేటును యథాతథంగా కొనసాగిస్తే, గృహ రుణాల ఈఎంఐలు, బ్యాంకుల రుణ వడ్డీ రేట్లు, డిపాజిట్ వడ్డీ రేట్లలో తక్షణ మార్పులు ఉండే అవకాశం లేదు.జూన్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.38 శాతానికి చేరుకుంది. గత 17 నెలల్లో తొలిసారిగా ఇది ఆర్‌బీఐ లక్ష్యమైన 4 శాతాన్ని అధిగమించినప్పటికీ, కేంద్ర బ్యాంక్ నిర్దేశించిన 2-6 శాతం సహన పరిమితిలోనే కొనసాగుతోంది. ఇదే సమయంలో కోర్ ఇన్‌ఫ్లేషన్ కూడా సుమారు 4 శాతం వద్ద స్థిరంగా ఉంది.మరోవైపు, మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న భౌగోళిక ఉద్రిక్తతలు కూడా ఆర్‌బీఐ దృష్టిలో కీలక అంశంగా మారాయి. ప్రభుత్వ బాండ్ మార్కెట్‌లో కూడా ప్రస్తుతం సమృద్ధిగా ఉన్న ద్రవ్య లభ్యత కారణంగా రాబడులు స్థిరంగా కొనసాగే అవకాశముందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఆర్‌బీఐ విదేశీ డిపాజిట్లను ఆకర్షించేందుకు తీసుకున్న చర్యల వల్ల రూపాయి లిక్విడిటీ పెరుగుతోందని, దీనివల్ల బాండ్ మార్కెట్‌కు మద్దతు లభించే అవకాశముందని ఆయన అభిప్రాయపడ్డారు. ఐదో తేదీ వరకు జరిగే ఎంపీసీ సమావేశం అనంతరం ఆగస్టు 5 ఉదయం సుమారు 10 గంటలకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా విధాన నిర్ణయాలను ప్రకటిస్తారు. 2026లో ఆర్థిక వృద్ధికి ఊతమివ్వాలనే ఉద్దేశంతో ఆర్‌బీఐ మొత్తం 100 బేసిస్ పాయింట్లు రెపో రేటును తగ్గించింది. ప్రస్తుతం రెపో రేటు 5.25 శాతంగా కొనసాగుతోంది. వాణిజ్య బ్యాంకులకు స్వల్పకాలిక నిధులను ఆర్‌బీఐ అందించే వడ్డీ రేటునే రెపో రేటుగా పరిగణిస్తారు. ఇందులో మార్పులు చోటుచేసుకుంటే రుణాల వడ్డీ రేట్లు, గృహ రుణ ఈఎంఐలు, డిపాజిట్ రాబడులు, అలాగే ఆర్థిక వ్యవస్థలో లిక్విడిటీపై ప్రత్యక్ష ప్రభావం ఉంటుంది.

స్టాక్ మార్కెట్లకు నాలుగో రోజు జోష్

ముంబయి,ఆగస్టు 3: దేశీయ ఈక్విటీ మార్కెట్లు సోమవారం వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ లాభాలతో ముగిశాయి. మధ్యప్రాచ్యంలో భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో బ్రెంట్ క్రూడ్ చమురు ధరలు గణనీయంగా పడిపోవడం మార్కెట్లకు ప్రధాన ఊతమిచ్చింది. గత కొన్ని రోజులుగా విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు వరుసగా నిధులు పెట్టుబడి పెట్టడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది. విస్తృత స్థాయిలో కొనుగోళ్లు జరగడంతో దాదాపు అన్ని రంగాల సూచీలు లాభాల్లో ముగియగా, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా పాజిటివ్‌లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 544.39 పాయింట్లు ఎగిసి 78,639.03 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ50 సూచీ 390.70 పాయింట్లు పెరిగి 24,774.30 వద్ద స్థిరపడింది. గత నాలుగు వరుస సెషన్లలో సెన్సెక్స్ 2.44 శాతం, నిఫ్టీ 3.29 శాతం చొప్పున లాభపడ్డాయి. నిఫ్టీ పెరుగుదలకు ముఖ్యంగా ఇన్ఫోసిస్ 4.42, యాక్సిస్ బ్యాంక్ 3.46 , ఐసీఐసీఐ బ్యాంక్ 2.57షేర్లు గణనీయమైన మద్దతు అందించాయి. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.73 శాతం, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 1.32 శాతం చొప్పున లాభపడ్డాయి. ఎన్ఎస్ఈలో మొత్తం 2,358 షేర్లు పెరగగా, 1,027 షేర్లు తగ్గాయి. మరో 120 షేర్లు ఎలాంటి మార్పు లేకుండా ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో సెప్టెంబర్ 2026 డెలివరీకి బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 4.17 డాలర్లు తగ్గి 83.80 డాలర్లకు చేరుకుంది. మరోవైపు డాలర్‌తో పోలిస్తే రూపాయి బలపడింది. పాక్షిక మారకపు రూపాయి విలువ 95.4350 నుంచి 95.3100కు చేరింది. ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5, 2026 డెలివరీకి పసిడి ఫ్యూచర్స్ ధర 0.18 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,43,633 వద్ద ట్రేడైంది. ఇక ఐపిఒల పరంగా ఎంవీ ఎలక్ట్రోసిస్టమ్స్ ఐపీఓకు ఇన్వెస్టర్లు ఆసక్తిపెరిగింది. 39,87,491 షేర్లకు గాను 75,12,95,688 షేర్లకు బిడ్లు వచ్చాయి. దీంతో ఈ ఇష్యూ 188.41 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942-271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.